

ఈనాడు



విజయవాడ 17-2-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 188

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఛాంపియన్



సూపర్-8లో భారత్ ఇలా..
- ఫిబ్రవరి 22న దక్షిణాఫ్రికాతో (అహ్మదాబాద్)
- 26న జింబాబ్వే/ఆస్ట్రేలియా/ఐర్లాండ్‌తో (చెన్నై)
- మార్చి 1న వెస్టిండీస్‌తో (కోల్‌కతాలో)

కంగారూలు మళ్లీ పడ్డారు

- నిశాంక అజేయ శతకం
- సూపర్-8లో శ్రీలంక



100 నిశాంక స్కోరు. టీ20ల్లో అతడికిదే తొలి శతకం. ఈ ప్రపంచకప్‌లోనూ ఇదే మొదటి సెంచరీ.

పల్లెకెలె

లంకేయులు అదరహో.. కంగారూలకు మళ్లీ షాక్! శ్రీలంక వరుసగా మూడో విజయంతో టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8కు దూసుకెళ్లింది. జింబాబ్వే చేతిలో షాక్ తిన్న ఆస్ట్రేలియా.. లంక చేతిలోనూ ఓటమి పాలైంది. ఓపెనర్ నిశాంక (100 నాటౌట్; 52 బంతుల్లో 10×4, 5×6) అద్భుత శతకం సాధించిన వేళ.. గ్రూప్-బి మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుగా ఓడించింది. సోమవారం మొదట ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (54; 27 బంతుల్లో 8×4, 2×6), ట్రావిస్ హెడ్ (56; 29 బంతుల్లో 7×4, 3×6) చెలరేగారు. కంగారూలు చాలా పెద్ద స్కోరు చేయాల్సింది. కానీ శ్రీలంక బౌలర్లు అద్భుతంగా పుంజుకుని ఆ జట్టును కట్టడి చేశారు. హేమంత (3/37), చమీర (2/36), వెల్లలాగె (1/33) ఆసీస్‌ను దెబ్బతీశారు. నిశాంకతో పాటు కుశాల్ మెండిస్ (51; 38 బంతుల్లో 6×4, 1×6), రత్నాయకే (28 నాటౌట్; 15 బంతుల్లో 6×4) చెలరేగడంతో లక్ష్యాన్ని లంక 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆసీస్ బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. నిశాంకకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియాకు ఇది రెండో ఓటమి. గత మ్యాచ్‌లో ఆ జట్టుకు జింబాబ్వే షాకిచ్చిన సంగతి తెలిసిందే. తాజా ఓటమితో ఆసీస్ సూపర్ 8 అవకాశాలు చాలా సంక్లిష్టమయ్యాయి. ఇప్పటికీ అవకాశాలు ఉన్నాయి. కానీ ఆ జట్టుకు సమీకరణాలు చాలా కలిసి రావాలి. ముందైతే మంగళవారం జరిగే మ్యాచ్‌లో ఐర్లాండ్ చేతిలో జింబాబ్వే ఓడిపోవాలి. ఆ మ్యాచ్‌లో జింబాబ్వే నెగ్గితే మాత్రం ఈ ప్రపంచకప్‌లో ఆసీస్ కథ ముగుస్తుంది. జింబాబ్వే ముందంజ వేస్తుంది.

దంచేశారు..: శ్రీలంక ఛేదనలో ఓపెనర్ నిశాంకే హీరో. అతడు ఒంటి చేత్తో తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. విధ్వంసక విన్యాసాలతో లంక అభిమానులను ఉర్రూతలూగించాడు. రెండో ఓవర్లోనే మరో ఓపెనర్ కుశాల్ పెరీరా (1)ను వెనక్కి పంపినా.. ఆసీస్‌కు ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. నిశాంక విరుచుకుపడ్డాడు. చకచకా బౌండరీలు బాదేశాడు. కుశాల్ మెండిస్ కూడా చెలరేగడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కుశాల్ 35 బంతుల్లో, నిశాంక 32 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. అయితే 13వ ఓవర్లో కుశాల్ నిష్క్రమించడంతో 97 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. అప్పటికి లంక స్కోరు 105. అక్కడి నుంచి నిశాంక మరింత రెచ్చిపోయాడు. రత్నాయకే కూడా అలవోకగా బ్యాట్ ఝుళిపించడంతో లంక వడివడిగా లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. బౌండరీల వరద పారుతుంటే ఆసీస్ బౌలర్లు నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఎలిస్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదిన నిశాంక.. వెంటనే జంపా బౌలింగ్‌లో రెండు ఫోర్లు బాదేశాడు. ఓ సింగిల్‌తో శతకం పూర్తి చేశాడు. అర్ధశతకం నుంచి సెంచరీకి చేరుకోవడానికి అతడు 20 బంతులే ఆడడం విశేషం. రత్నాయకే బౌండరీతో శ్రీలంక లక్ష్యాన్ని అందుకుంది.

హెడ్, మార్ష్ మెరిసినా..: అంతకుముందు ఓ అద్భుత ఆరంభాన్ని ఆస్ట్రేలియా వృథా చేసుకుంది. భారీ స్కోరు చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 8.2 ఓవర్లలోనే 104/0తో కొండంత స్కోరు చేసేలా కనిపించిన ఆసీస్.. చివరికి 181తో సరిపెట్టుకోవడం ఏమాత్రం ఊహించనిదే. ఆస్ట్రేలియా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. ఓపెనర్లు మార్ష్, ట్రావిస్ హెడ్‌లు లంక బౌలింగ్‌ను ఉతికేశారు. పోటీపడి బౌండరీలు బాదేస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కళ్లు చెదిరే సిక్స్‌లూ దంచారు. మార్ష్ రెండు ఫోర్లు, హెడ్ ఓ సిక్స్ కొట్టడంతో ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే చమీర 16 పరుగులు సమర్పించుకున్నాడు. తీక్షణ ఓవర్లో మార్ష్ వరుసగా 4, 4, 4, 4, 4 దంచేయడం విశేషం. హేమంత ఓవర్లో హెడ్ వరుసగా 6, 4 సాధించాడు. 8 ఓవర్లకే ఆసీస్ స్కోరు 97/0. ఓపెనర్ల జోరు చూస్తుంటే ఆస్ట్రేలియా చాలా పెద్ద స్కోరే చేసేలా కనిపించింది. కానీ 9వ ఓవర్లో హెడ్‌ను హేమంత ఔట్ చేయడంతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. అక్కడి నుంచి శ్రీలంక బౌలర్లు పట్టుబిగించారు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా.. పరుగుల కోసం చెమటోడ్చింది. గ్రీన్ (3)ను వెల్లలాగే.. మార్ష్‌ను హేమంత వెనక్కి పంపారు. టిమ్ డేవిడ్ (6) ఇలా వచ్చి అలా వెళ్లాడు. అయితే ఇంగ్లిస్ (27; 22 బంతుల్లో 3×4), మ్యాక్స్‌వెల్ (22; 15 బంతుల్లో 1×4, 1×6) నిలబడడంతో 16 ఓవర్లలో 160/4తో ఆసీస్ ఇన్నింగ్స్ కుదుటపడింది. కానీ 21 పరుగులకే ఆఖరి ఆరు వికెట్లు కోల్పోయిన ఆసీస్ అనుకున్న దాని కన్నా తక్కువ స్కోరే చేసింది.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ ఎల్బీ (బి) హేమంత 54; ట్రావిస్ హెడ్ (సి) కమిందు (బి) హేమంత 56; గ్రీన్ (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) వెల్లలాగె 3; టిమ్ డేవిడ్(సి) హేమంత (బి) కమిందు 6; ఇంగ్లిస్ (సి) వెల్లలాగె (బి) చమీర 27; మ్యాక్స్‌వెల్ (సి) నిశాంక (బి) హేమంత 22; స్టాయినిస్ (సి) తీక్షణ (బి) చమీర 4; కనోలీ (సి) పెరీరా (బి) తీక్షణ 3; బార్ట్‌లెట్ రనౌట్ 0; ఎలిస్ నాటౌట్ 0; జంపా రనౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో ఆలౌట్) **181; వికెట్ల పతనం:** 1-104, 2-110, 3-116, 4-130, 5-160, 6-174, 7-177, 8-180, 8-180, 9-180; **బౌలింగ్:** చమీర 4-0-36-2; తీక్షణ 4-0-37-1; పతిరన 0.4-0-3-0; శానక 1.2-0-16-0; హేమంత 4-0-37-3; వెల్లలాగె 4-0-33-1; కమిందు 2-0-19-1

శ్రీలంక ఇన్నింగ్స్: నిశాంక నాటౌట్ 100; కుశాల్ పెరీరా (సి) ఎలిస్ (బి) స్టాయినిస్ 1; కుశాల్ మెండిస్ (సి) కనోలీ (బి) స్టాయినిస్ 51; రత్నాయకే నాటౌట్ 28; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (18 ఓవర్లలో రెండు వికెట్లకు) **184; వికెట్ల పతనం:** 1-8, 2-105; **బౌలింగ్:** బార్ట్‌లెట్ 2-0-22-0; స్టాయినిస్ 4-0-46-2; ఎలిస్ 3-0-32-0; కనోలీ 3-0-27-0; జంపా 4-0-41-0; మ్యాక్స్‌వెల్ 2-0-16-0

పెళ్లి పీటలెక్కనున్న ఇషాన్!



పట్నా: భారత స్టార్ ఆటగాడు ఇషాన్ కిషన్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నాడా? అంటే అవుననే అంటున్నాడు అతని తాత రామ్ అనుగ్రహ పాండే. మోడల్ అదితి హుండియాతో ఇషాన్ వివాహం జరగొచ్చని పాండే సూత్రప్రాయంగా చెప్పాడు. జైపుర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె అదితి. 2019 నుంచి ఇషాన్, అదితిల స్నేహం గురించి కథనాలు వస్తున్నాయి. ఐపీఎల్‌తో పాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ ఆమె ఇషాన్‌ను ప్రోత్సహిస్తూ స్టేడియంలో తరచూ కనిపిస్తుంటుంది. "తనకు ఇష్టమైన అమ్మాయిని ఇషాన్ పెళ్లి చేసుకోవచ్చు. మాకెలాంటి అభ్యంతరం లేదు. అదితి జైపుర్‌కు చెందిన మోడల్. మిస్ ఇండియా పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది" అని పాండే తెలిపాడు. బిహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా దౌద్‌నగర్ బ్లాక్ పరిధిలోని గోడిహా గ్రామం ఇషాన్ కుటుంబం స్వస్థలం. ప్రస్తుతం ఇషాన్ కుటుంబం రాంచిలో స్థిరపడినా.. అతని తాత పాండే మాత్రం ఇప్పటికీ సొంత గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇషాన్ తన వ్యక్తిగత విషయాలు, కెరీర్ గురించి చర్చిస్తుంటాడని పాండే చెప్పాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ముందు మనవడితో మాట్లాడినట్లు పాండే పేర్కొన్నాడు. అయితే ప్రస్తుతానికి ఇషాన్ వివాహం గురించి చర్చలేమీ లేవని అతని తల్లి సుచిత్ర సింగ్ పేర్కొనడం గమనార్హం.

కోపం వదిలెయ్ సోదరా!



కొలంబో: పాకిస్థాన్‌తో ఆదివారం మ్యాచ్ అనంతరం భారత స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ చాలా కోపంగా కనిపించడం చర్చనీయాంశమైన సంగతి తెలిందే. హార్దిక్ బౌలింగ్‌లో క్యాచ్ వదిలేసినందుకు అతడితో పాటు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా కుల్‌దీప్‌పై అసహనం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం ఆటగాళ్లు పరస్పరం అభినందనలు తెలుపుకొనే సమయంలో సూర్య చేయి కలపబోగా, కుల్‌దీప్ విసురుగా వెళ్లిపోయాడు. దీంతో వారి మధ్య ముమ్ముందు సంబంధాలు ఎలా ఉంటాయో అని భారత అభిమానులు కంగారు పడ్డారు. అయితే మ్యాచ్‌లో జరిగిన విషయాలను మరిచిపోయి ఇద్దరూ కలిసిపోయారని అ రోజు సూర్య పంచుకున్న వీడియోతో స్పష్టమైంది. నిన్నటి దృశ్యాన్ని తలపించేలా కుల్‌దీప్‌తో కలిసి ఒక రీల్ చేశాడు సూర్య. మ్యాచ్‌లో లాగే సూర్య కౌగిలించుకోబోతే.. కుల్‌దీప్ విసురుగా వెళ్లిపోయాడు. ఈ వీడియోకు 'కోపం తగ్గించుకో భాయ్' అనే వ్యాఖ్యను జోడించి సూర్య ఎక్స్ ఖాతాలో పోస్టు చేశాడు.

అక్కడ మెరుపుల్లేవ్

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

న్యూజిలాండ్ × కెనడా	వేదిక: చెన్నై, ఉ॥ 11.00
ఐర్లాండ్ × జింబాబ్వే	వేదిక: పల్లెకెలె, మ॥ 3.00
స్కాట్లాండ్ × నేపాల్	వేదిక: ముంబయి, రా॥ 7.00

ఈనాడు క్రీడావిభాగం

టీ20 అనగానే గుర్తొచ్చేది సిక్సర్లు, ఫోర్లే! ఎంత బాదితే అభిమానులకు అంత ఆనందం. ఈసారి టీ20 ప్రపంచకప్‌లో చాలా మ్యాచ్‌ల్లో బ్యాటర్లు అదరగొడుతున్నారు. సిక్సర్లతో హోరెత్తిస్తున్నారు. కానీ ఆ మైదానానికి వస్తే బ్యాట్‌లు మూగబోతున్నాయి. బంతులు గర్జిస్తున్నాయి. ఆ మైదానమే.. ప్రేమదాస. కొలంబోలోని ఈ వేదిక ఇప్పుడు బ్యాటర్లకు సవాల్ విసురుతోంది. తాజాగా భారత్-పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచే ఇందుకు ఉదాహరణ. పాక్ జట్టు ఆరుగురు స్పిన్నర్లను దింపితే.. భారత్ అయిదుగురితో వేయించింది. మొత్తంగా భారత్ ఇన్నింగ్స్‌లో పాక్ 18 ఓవర్లు స్లో బౌలర్లతోనే బౌలింగ్ చేయించింది.

ఉపఖండం అంటేనే బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లు గుర్తుకొస్తాయి. మ్యాచ్ గడుస్తున్న కొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపిస్తారు. కానీ తొలి ఓవర్ నుంచే స్లో బౌలర్లు రంగంలోకి దిగుతున్నారంటేనే ప్రేమదాస పిచ్‌పై బంతి ఎలా నాట్యం చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. బంతి బ్యాట్ మీదకు రాదు.. స్లాట్‌లో పడదు. భారీ షాట్లకు దొరకదు. సాంకేతికంగా బలంగా ఉండే బ్యాటర్లే ఇక్కడ నిలవగలుగుతారు. ఇప్పటిదాకా ఈ స్టేడియంలో నాలుగు మ్యాచ్‌లు జరిగితే ఒక్కసారి మాత్రమే స్కోరు 180 పరుగులు దాటింది. అది కూడా ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా కొట్టింది. అదే ఆస్ట్రేలియా.. జింబాబ్వే చేతిలో కంగుతిన్న మైదానం కూడా ఇదే. 170 ఛేదించలేక కంగారూ జట్టు 146 పరుగులకే చేతులెత్తేసింది. ఐర్లాండ్ కూడా శ్రీలంకకు గట్టిపోటీ ఇచ్చింది. ఒత్తిడికి తలొగ్గి ఓడిపోయింది. ఇక భారత్-పాకిస్థాన్‌తో మ్యాచ్ గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. బంతి ఎలా పడి ఎలా తిరుగుందో అర్థం కాని పరిస్థితుల్లో బ్యాటర్లు అయోమయానికి గురయ్యారు. తొలి ఓవర్లోనే భారత్ అభిషేక్ శర్మ వికెట్ కోల్పోయి ఆత్మరక్షణలో పడింది. కానీ ఇషాన్ కిషన్ రూపంలో తెగించి భిన్నమైన షాట్లు ఆడే బ్యాటర్ ఉండడంతో టీమ్‌ఇండియాకు కలిసొచ్చింది. ఇషాన్ ఔటయ్యాక.. మిగిలిన భారత బ్యాటర్లు చాలా కష్టపడ్డారు. సూర్య, శివమ్ దూబె లాంటి దూకుడుగా ఆడే బ్యాటర్లు క్రీజులో ఉన్నా.. ఇషాన్ మాదిరిగా బ్యాట్ ఝుళిపించలేకపోయారు. బంతిని వీలైనంత నెమ్మదిగా వదులుతూ పాక్ బౌలర్లు.. భారత బ్యాటర్లకు కళ్లెం వేశారు. ఆ తర్వాత పాక్‌ను భారత బౌలర్లు క్రీజులో నాట్యం ఆడించారు. ఏమాత్రం కుదురుకోనీయని విధంగా బంతులు వేశారు. ఫుల్ లెంగ్త్‌లో కాకుండా.. బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బంతులతో పాక్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. బంతి పడకుండానే షాట్లు ఆడేందుకు ప్రయత్నించిన ప్రత్యర్థి బ్యాటర్లు పెవిలియన్ చేరక తప్పలేదు. ఇక్కడ జరిగిన గత నాలుగు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టే విజయాన్ని సాధించింది. టీ20ల్లో 160లోపు స్కోర్లు సాధించినా.. కాపాడుకోగలగడం మామూలు విషయం కాదు. కానీ ప్రేమదాస పిచ్‌పై ఇలాంటి స్కోర్లే పెద్ద స్కోర్లని చెప్పడానికి ఇప్పటిదాకా జరిగిన మ్యాచ్‌లే నిదర్శనం. ఇకపై ప్రేమదాస స్టేడియంలో జరిగే మ్యాచ్‌లు ఎలా సాగుతాయోనన్న ఆసక్తి రేగుతోంది. గురువారం శ్రీలంక-జింబాబ్వే లీగ్ మ్యాచ్‌తో పాటు మూడు సూపర్-8 సమరాలకు ప్రేమదాస ఆతిథ్యం ఇవ్వనుంది.



అజ్మతుల్లా ఆల్‌రౌండ్ ప్రదర్శన

యూఏఈపై అఫ్గాన్ గెలుపు




దిల్లీ: చిన్న జట్లలోకెల్లా బలమైన జట్టే అయినా, అదృష్టం కలిసిరాక తొలి రెండు మ్యాచ్‌ల్లో బోణీ కొట్టలేకపోయిన అఫ్గానిస్థాన్.. టీ20 ప్రపంచకప్‌లో తొలి విజయాన్ని సాధించింది. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయడంతో సోమవారం గ్రూప్-డి మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో యూఏఈని ఓడించింది. మొదట యూఏఈ 9 వికెట్లకు 160 పరుగులు చేసింది. సోహైబ్ ఖాన్ (68; 48 బంతుల్లో 6×4, 4×6), అలీషన్ షరాఫు (40; 31 బంతుల్లో 3×4, 2×6) రాణించారు. అఫ్గాన్ బౌలర్లలో అజ్మతుల్లా (4/15) అదరగొట్టాడు. ముజీబ్ రెహ్మాన్ (2/31), రషీద్ ఖాన్ (1/24) కూడా రాణించారు. ఇబ్రహీం జద్రాన్ (53; 41 బంతుల్లో 6×4, 1×6), అజ్మతుల్లా (40 నాటౌట్; 21 బంతుల్లో 2×4, 3×6) మెరుపులతో అఫ్గాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ గెలుపుతో అఫ్గాన్ సూపర్-8 చేరే అవకాశాలను అఫ్గాన్ (2 పాయింట్లు) సజీవంగా ఉంచుకుంది. అయినా ఆ జట్టు ముందంజ వేయడం కష్టమే. అఫ్గాన్ సూపర్-8కు చేరాలంటే ఆ జట్టు కెనడాపై ఘనంగా నెగ్గడమే కాక.. కెనడా చేతిలో న్యూజిలాండ్ (4 పాయింట్లు) ఓడిపోవాలి. ఈ గ్రూప్ నుంచి దక్షిణాఫ్రికా (6 పాయింట్లు) సూపర్-8కు అర్హత సాధించింది.

ఇబ్రహీం, అజ్మతుల్లా మెరుపులు: ఛేదనలో అఫ్గాన్‌కు శుభారంభం దక్కలేదు. దక్షిణాఫ్రికాపై అదరగొట్టిన రహ్మనుల్లా గుర్బాజ్ (0) ఇన్నింగ్స్ రెండో బంతికే ఔటైపోయాడు. ఈ స్థితిలో ఇబ్రహీం జద్రాన్ నిలిచాడు. హైదర్ అలీ వేసిన నాలుగో ఓవర్లో ఇబ్రహీం 3 ఫోర్లు, ఓ సిక్స్ కొట్టడంతో 18 పరుగులు లభించాయి. దీంతో అఫ్గాన్ 5 ఓవర్లకు 39/1తో నిలిచింది. గుల్బదిన్ నైబ్ (13), సెదికుల్లా (16) స్వల్ప వ్యవధిలో ఔట్ కావడంతో అఫ్గాన్ ఒత్తిడిలో పడింది. ఈ స్థితిలో దార్విష్ రసూలి (33; 23 బంతుల్లో 3×4, 1×6) అండతో ఇబ్రహీం స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అతడు 37 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. 42 బంతుల్లో 64 పరుగులు చేయాల్సిన స్థితిలో ఇబ్రహీం ఔటైనా.. రసూలి, అజ్మతుల్లా ధాటిగా ఆడారు. ముఖ్యంగా అజ్మతుల్లా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. చివరి 3 ఓవర్లలో 28 పరుగులు అవసరం కాగా.. రసూలి ఔట్ కావడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. కానీ అజ్మతుల్లా ఎదురుదాడిని ఆపలేదు. 19వ ఓవర్ చివరి రెండు బంతులకు 6, 4 కొట్టి అఫ్గాన్‌ను విజయానికి చేరువ చేసిన అతడు.. తర్వాతి ఓవర్లో మరో బౌండరీతో జట్టును గెలిపించాడు. అంతకుముందు సోహైబ్ ఖాన్ సత్తా చాటడంతో యూఏఈ పోరాడే స్కోరు చేయగలిగింది. 13 పరుగులకే రెండు వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టును సోహైబ్, అలీషన్ షరాఫు ఆదుకున్నారు. ఒక దశలో 11.1 ఓవర్లకు 97/2తో యూఏఈ మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే 24 పరుగుల తేడాతో 4 వికెట్లు చేజార్చుకున్న ఆ జట్టు భారీ స్కోరు చేసే అవకాశాలను కోల్పోయింది. సయ్యద్ హైదర్ (13), హైదర్ అలీ (13) కొన్ని షాట్లు ఆడడంతో స్కోరు 160కి చేరుకుంది.

సంక్షిప్త స్కోర్లు... యూఏఈ: 160/9 (సోహైబ్ ఖాన్ 68, అలీషన్ షరాఫు 40, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 4/15, ముజీబ్ 2/31, రషీద్ 1/24); **అఫ్గానిస్థాన్:** 19.2 ఓవర్లలో 162/5 (ఇబ్రహీం జద్రాన్ 53, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 40 నాటౌట్, రసూలి 33)

ఇంగ్లాండ్ సూపర్-8కు



- ఇటలీపై విజయం

కోల్‌కతా: టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ సూపర్-8కు అర్హత సాధించింది. సోమవారం గ్రూప్-సి పోరులో ఆ జట్టు ఇటలీపై 24 పరుగుల తేడాతో గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విల్ జాక్స్ (53 నాటౌట్; 22 బంతుల్లో 3×4, 4×6), టామ్ బాంటన్ (30; 21 బంతుల్లో 3×4, 1×6), ఫిల్ సాల్ట్ (28; 15 బంతుల్లో 2×4, 2×6) మెరుపులతో మొదట ఇంగ్లిష్ జట్టు 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టివార్ట్, క్రిషన్ కలుగమగె చెరో రెండు వికెట్లు తీశారు. భారీ ఛేదనలో ఇటలీ పోరాడి ఓడింది. ఆ జట్టు 20 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. బెన్ మానెంటి (60; 25 బంతుల్లో 4×4, 6×6), గ్రాంట్ స్టివార్ట్ (45; 23 బంతుల్లో 2×4, 5×6) పోరాడారు. జేమీ ఒవర్టన్ (3/18), సామ్ కరన్ (3/22) ప్రత్యర్థిని కట్టడి చేశారు. విండీస్ చేతిలో ఓడిన ఇంగ్లాండ్.. మిగతా మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి ముందంజ వేసింది.

ఆ ఇద్దరూ పోరాడినా..: మొదట ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో జోస్ బట్లర్ (3) మరోసారి నిరాశ పరిచినా.. మరో ఓపెనర్ సాల్ట్ జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. తర్వాత బెతెల్ (23), బాంటన్, కరన్ (25) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. విల్ జాక్స్ ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునిచ్చాడు. అతను చివరి ఓవర్లలో ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడడంతో స్కోరు 200 దాటింది. భారీ ఛేదనను ఇటలీ పేలవంగా ఆరంభించింది. 22 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కానీ జస్టిన్ మోస్కా (43; 34 బంతుల్లో 7×4), మానెంటి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. కుదురుకున్నాక ఇద్దరూ బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. బెన్, మోస్కా నాలుగో వికెట్‌కు 92 పరుగులు జోడించడంతో ఆ జట్టు రేసులోకొచ్చింది. విల్ జాక్స్ వేసిన 12వ ఓవర్లో వరుసగా 4, 6, 6, 4 బాదిన బెన్.. అదే ఓవర్ చివరి బంతికి మరో భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. ఆ తర్వాత వరుసగా వికెట్లు పడడంతో ఇటలీ బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. స్టివార్ట్ పోరాడినా ఫలితం లేకపోయింది. జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు పడగొట్టాడు. గ్రూప్-సిలో విండీస్, ఇంగ్లాండ్ తొలి రెండు స్థానాలతో సూపర్-8కు చేరుకోగా.. స్కాట్లాండ్, ఇటలీ, నేపాల్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి.

సంక్షిప్త స్కోర్లు... ఇంగ్లాండ్: 202/7 (జాక్స్ 53 నాటౌట్, బాంటన్ 30, స్టివార్ట్ 2/51, కలుగమగె 2/41); **ఇటలీ:** 178 ఆలౌట్ (జస్టిన్ మోస్కా 43, బెన్ మానెంటి 60, స్టివార్ట్ 45, ఒవర్టన్ 3/18, సామ్ కరన్ 3/22, ఆర్చర్ 2/35)

పది పరీక్షలకు వైభవ్ దూరం

దిల్లీ: భారత అండర్-19 ప్రపంచకప్ స్టార్.. రాజస్థాన్ రాయల్స్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఈ ఏడాది సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలకు దూరంగా ఉండనున్నాడు. క్రికెట్ శిక్షణ, రాబోయే టోర్నీలపై పూర్తిగా దృష్టిసారించాలని భావిస్తున్న వైభవ్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వైభవ్ పరీక్షలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పాఠశాల యాజమాన్యం ధ్రువీకరించింది. "ప్రస్తుతం వైభవ్ దృష్టంతా క్రికెట్‌పైనే ఉంది. అందుకే ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అతను హాజరవడం లేదు. వచ్చే ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తాడు" అని వైభవ్ తండ్రి సంజీవ్ సూర్యవంశీ తెలిపాడు. తండ్రితో చర్చించిన తర్వాతే పరీక్షలకు దూరమవ్వాలని వైభవ్ నిర్ణయించుకున్నాడని తాజ్‌పూర్‌లోని మోడెస్టరీ స్కూల్ డైరెక్టర్ ఎ.కె.పింటూ చెప్పాడు.



టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై విజయానంతరం కొలంబోలో బీసీసీఐ ఏర్పాటు చేసిన పార్టీలో టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య, ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండీశ్వరీనాథ్

అతడో అసమర్థుడు



దిల్లీ: టీ20 ప్రపంచకప్ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఛైర్మన్ నఖ్వీ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. పాక్ మంత్రి కూడా అయిన అతడు.. తన ఇష్టానుసారంగా బోర్డును నడిపించాడు. ప్రపంచకప్‌లో ఆడమని ఓసారి, భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని ఓసారి అన్నాడు. భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూ వార్తల్లో నిలిచాడు. ఇంత నాటకం జరిగాక చివరికి భారత్‌తో ఆడాలని నిర్ణయించింది పాకిస్థాన్. కానీ మ్యాచ్‌లో ఎప్పటిలాగే టీమ్‌ఇండియా చేతిలో చిత్తయింది. టీ20 ప్రపంచకప్పుల్లో పాక్‌పై గెలుపోటముల రికార్డును భారత్ 8-1కి మెరుగుపర్చుకుంది. ఈ నేపథ్యంలో నఖ్వీ స్వదేశంలోనే తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాడు. నఖ్వీ అసమర్థుడని, నిరక్షరాస్యుడని పాక్ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ మండిపడ్డాడు. "మ్యాచ్‌లో మా జట్టు అసలు పోటీలోనే లేదు. షహీన్ 125 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. ఆధునిక క్రికెట్లో ఇది సరిపోదు. ఈ ఆటగాళ్లు ఒత్తిడిని ఎదుర్కోలేరు. గత 15-20 ఏళ్లలో ఆటగాళ్లలో నైపుణ్యాలను పెంచడానికి పాకిస్థాన్ ఎలాంటి పెట్టుబడి పెట్టలేదు. విచారకర విషయమేంటంటే.. ఇప్పుడు భారత్‌ను ఓడించినట్లు కల కూడా కనలేం" అని అన్నాడు. "ఎలాంటి జ్ఞానం లేని ఓ వ్యక్తి పీసీబీ ఛైర్మన్ (నఖ్వీ) అయ్యాడు. అలాంటి వ్యక్తి ఏం చేస్తాడు? జట్టును ఎలా నడిపిస్తాడు? జట్టులో ఓ సూపర్‌స్టార్ (బాబర్ అజామ్)ను తయారు చేశారు. అతడు మ్యాచ్‌ను గెలిపించలేడు. అసమర్థులకు బాధ్యతలు అప్పగించడం ప్రపంచంలోనే అతి పెద్ద నేరం" అక్తర్ చెప్పాడు. చేతకాని నఖ్వీకి పీసీబీ ఛైర్మన్‌గా ఉండే అర్హత లేదని అక్తర్ అన్నాడు. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ రెండేళ్లుగా హవా సాగిస్తున్నాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ హోదాలో ఉన్న అతడి నుంచి ట్రోఫీ నిరుడు ఆసియాకప్ అందుకోవడానికి టీమ్‌ఇండియా తిరస్కరించగా.. అతడు ట్రోఫీని పట్టుకుపోయాడు.

స్నేహిత్ @ 82



ఈనాడు, హైదరాబాద్: అంతర్జాయ టేబుల్ టెన్నిస్‌లో అదరగొడుతున్న తెలంగాణ కుర్రాడు స్నేహిత్ సూరావజ్జుల.. ర్యాంకుల్లోనూ దూసుకెళ్తున్నాడు. అతడు కెరీర్ ఉత్తమ ర్యాంకును సాధించాడు. తాజా జాబితాలో స్నేహిత్ 18 స్థానాలు మెరుగుపరుచుకుని 82వ స్థానంలో నిలిచాడు. పురుషుల విభాగంలో టాప్ 100లోపు ర్యాంకు దక్కించుకున్న తొలి తెలుగు ఆటగాడిగా స్నేహిత్ ఘనత సాధించాడు. ఇటీవల చెన్నైలో జరిగిన డబ్ల్యూటీటీ స్టార్ కంటెండర్ టోర్నీ తొలి రౌండ్లో ప్రపంచ 13వ ర్యాంకర్ మిజుకి ఒయ్‌కావా (జపాన్)ను స్నేహిత్ కంగుతినిపించాడు. గత ఏడాది ఏప్రిల్‌లో స్నేహిత్ తొలి సారి టాప్-100లోకి వచ్చాడు. అప్పుడు అతడు 89వ ర్యాంకు సాధించాడు.

పడిక్కల్ ద్విశతకం

- కర్ణాటక 689/6
- ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీస్

లఖ్‌నవూ: ఉత్తరాఖండ్‌తో రంజీ సెమీస్‌లో కర్ణాటక చెలరేగింది. భారీ స్కోరు సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. 355/2తో సోమవారం రెండో రోజు కర్ణాటక తొలి ఇన్నింగ్స్ కొనసాగించగా.. దేవ్‌దత్ పడిక్కల్ (232; 330 బంతుల్లో 29×4, 3×6) ద్విశతకం సాధించాడు. రవిచంద్రన్ స్మరణ్ (121 నాటౌట్) సెంచరీ కొట్టాడు. కరుణ్ నాయర్ (60) కూడా రాణించాడు. ఆట చివరికి ఆ జట్టు 689/6తో నిలిచింది. స్మరణ్‌కు తోడు విద్యాధర్ (35) క్రీజులో ఉన్నాడు. ఉత్తరాఖండ్ బౌలర్లలో ఆదిత్య రావత్ 3 వికెట్లు తీశాడు.

జమ్ముకశ్మీర్ 198/5: మరో సెమీ ఫైనల్లో జమ్ము కశ్మీర్ నిలకడగా ఆడుతోంది. రెండో రోజు ఆట ముగిసేసరికి 198/5తో నిలిచిన.. ఆ జట్టు మరో 130 పరుగులు వెనుకబడి ఉంది. అబ్దుల్ సమద్ (82), పరాస్ డోగ్రా (58) అర్ధసెంచరీలతో రాణించారు. ముస్తాక్ (26), వధవాన్ (10) క్రీజులో ఉన్నారు. బెంగాల్ బౌలర్లలో మహ్మద్ షమి మూడు, ముకేశ్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు 249/5తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బెంగాల్.. 328 పరుగులకు ఆలౌటైంది. సుదీప్ ఘరామి (146) ఓవర్‌నైట్ స్కోరుకు మరో పది పరుగులు జోడించి వెనుదిరిగాడు. అకిబ్ నబి అయిదు, సునీల్ కుమార్ మూడు వికెట్లు తీశారు.

ఈనాడు

విజయవాడ 17-2-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 188

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



▲ ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో పంటలను పరిశీలిస్తున్న బిల్‌గేట్స్, ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏపీ మీట్స్.. బిల్‌గేట్స్

రాష్ట్రానికి వచ్చిన గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్

- సాగులో ఏఐ వినియోగంపై ప్రత్యక్ష పరిశీలన
- అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇంత అద్భుతంగా లేదని ప్రశంస
- డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలకపాత్ర
- విపత్తుల నిర్వహణలో టెక్నాలజీ వినియోగం భేషన్న గేట్స్
- ఏపీ డిజిటల్ ప్రయాణాన్ని వివరించిన సీఎం చంద్రబాబు

8లో

"డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయి. ఈ విషయంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. చంద్రబాబును మొదటిసారి కలిసినప్పుడే ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని గ్రహించా. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఆశయంతో గేట్స్ ఫౌండేషన్ కార్యక్రమాల్లో ఈ రంగానికి చెందిన ప్రాజెక్టులే ఎక్కువగా పెట్టాం. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉంది.

– సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశంలో బిల్‌గేట్స్

"బిల్‌గేట్స్‌ను 1997లో మొదటి సారి కలిసి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించా. మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగంలో హైదరాబాద్ మేటిగా నిలిచింది. రాష్ట్రంలో వనరులకు లోటు లేదు. సంపద సృష్టి జరగాలి. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్ని నంబర్ వన్ చేస్తాం.

– సీఎం చంద్రబాబు



సచివాలయానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై ప్రజంటేషన్ ఇస్తూ వివరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, సీఎస్ విజయానంద్, గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అంకుర్ వోరా, అర్చనా వ్యాస్

హలో బాగున్నారా... అంటూ ఆత్మీయ పలకరింపులు.. ఏఐ వినియోగం బాగు.. అంటూ కితాబులు.. బిల్‌గేట్స్ పర్యటన వివరాలు .. 8లో



ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను ప్రారంభించి, ప్రదర్శనలో వివరాలు తెలుసుకుంటున్న ప్రధాని మోదీ

ఏఐ ప్రయాణంలో ముందున్నాం

- ఆ సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తాం
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఏఐ ఎక్స్‌పో, సమిట్‌లకు శ్రీకారం
- 20 వరకూ కొనసాగనున్న అంతర్జాతీయ సదస్సు
- హాజరుకానున్న 20 దేశాల అధినేతలు
- ప్రముఖ కంపెనీల సీఈవోలూ..
- ఎక్స్‌పోలోకి ప్రవేశం ఉచితమే

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించేందుకు భారత్ ఆతిథ్యమిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్' సోమవారం దిల్లీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 20 వరకూ భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్, అంబేడ్కర్ సెంటర్ వేదికలుగా జరగనున్న ఈ ఎక్స్‌పో, సమిట్‌లను సోమవారం ప్రధాన మంత్రి (మిగతా 3లో)

జేఈఈలో మనోళ్లు మెరిశారు

- రాష్ట్రం నుంచి ఇద్దరికి తెలంగాణ నుంచి ఒకరికి 100 పర్సంటైల్
- జమ్మలమడుగుకు చెందిన మోహిత్‌కు 300కి 300 మార్కులు
- తొలి విడత ఫలితాల విడుదల
- దేశవ్యాప్తంగా 12 మందికి సంపూర్ణ స్కోర్



పసల మోహిత్



నరేంద్రబాబుగారి మహిత్



ఎం. వివాన్ శరత్

ఈనాడు, అమరావతి, హైదరాబాద్

జేఈఈ మెయిన్-2026 తొలి విడత ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు మెరిశారు. దేశవ్యాప్తంగా 12 మంది 100 పర్సంటైల్ స్కోర్ సాధించగా, వారిలో ముగ్గురు తెలుగు రాష్ట్రాల వారే కావడం విశేషం. రాష్ట్రం నుంచి పసల మోహిత్, నరేంద్రబాబుగారి మహిత్, తెలంగాణ నుంచి ఎం. వివాన్ శరత్‌లు 100 పర్సంటైల్ సాధించిన వారిలో ఉన్నారు. విజయవాడ శ్రీచైతన్య క్యాంపస్‌లో చదువుతున్న వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన పసల మోహిత్ 300/300 మార్కులు సాధించి అబ్బురపరిచాడు. 300/300 మార్కులు సాధించిన నేపథ్యంలో రెండో విడత పరీక్ష తర్వాత విడుదలయ్యే తుది ర్యాంకుల్లో మోహిత్ ఉత్తమ ర్యాంకును సొంతం చేసుకుంటాడని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలలో 2026-27 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో ప్రవేశాల కోసం జనవరి 21-28 తేదీల మధ్య జేఈఈ మెయిన్-2026 తొలి విడత పేపర్-1 పరీక్షలు జరిగాయి. మొత్తం 13.55 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 13.04 లక్షల మంది పరీక్షలు రాశారు. (మిగతా 3లో)

తొమ్మిది ప్రశ్నల తొలగింపు

మరో ఆరు ప్రశ్నలకు జవాబుల మార్పు

జేఈఈ మెయిన్‌లో ఏటా ఇదే తంతు

3లో

డ్వాక్రా మహిళలకు తీపికబురు

మార్చి 8న ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాలకు శ్రీకారం

యానిమేటర్లు, సీసీలకు ఉచితంగా సెల్‌ఫోన్లు

ఇప్పటికే సీఎం చంద్రబాబు ఆమోదముద్ర

498 కేసులో లుకౌట్ నోటీసా?

యాంత్రిక ధోరణిలో జారీ చేసేస్తున్న పోలీసులు

హైకోర్టు ఆక్షేపణ.. ఎల్వోసీ కొట్టివేత

బీసీ కోటా ఖరారుకు నేడో రేపో డెడికేటెడ్ కమిషన్!

ఏకసభ్య కమిషన్‌ను నియమించే అవకాశం

సీఎం చంద్రబాబు ఆమోదముద్ర

కమిషన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా వైపు మొగ్గు

2లో

ఇదీ సంగతి!



ఏఐ దుర్వినియోగం, కట్టడిపై సలహాలిద్దామని వచ్చా... వదలండి!!

త్యాగనిరతికి నిలువెత్తు ఆకృతి

శరవేగంగా పొట్టిశ్రీరాములు విగ్రహ నిర్మాణం

- రాజధానిలోని శాఖమూరు వద్ద 6.8 ఎకరాల్లో స్మృతివనం
- 58 రోజుల దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం
- రూ.150 కోట్లతో అభివృద్ధి.. మార్చి 16న ఆవిష్కరణ

3లో



బీసీ కోటా ఖరారుకు డెడికేటెడ్ కమిషన్!

ఈనాడు, అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలుకు వీలుగా రాష్ట్రంలో బీసీల జనాభా అధ్యయనానికి డెడికేటెడ్ కమిషన్‌ను నియమించనుంది. మంగళవారం లేదా బుధవారం దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల కానున్నాయి. ఏకసభ్య కమిషన్‌ను నియమించేందుకు సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆమోదముద్ర వేశారు. ఎస్సీ వర్గీకరణలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా నిర్దేశిత సమయంలో పకడ్బందీగా పూర్తిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రానే.. డెడికేటెడ్ కమిషన్‌గా నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి అధ్యయనానికి 30 నుంచి 45 రోజులు గడువు ఇవ్వనున్నారు. ఈ కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా బీసీల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయనుంది. దీన్ని నిర్ధారించేందుకు ప్రామాణిక డేటా కోసం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల సిబ్బంది చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే(యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే)ను ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు తెలిసింది.

జోడు రథాలపై ఆది దంపతుల ఊరేగింపు



జోడు రథాలపై ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పిస్తున్న సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జోడు రథాలు.. మిన్నంటిన శివనామస్మరణలు.. కిక్కిరిసిన వీధులతో శ్రీకాళహస్తిలో రథోత్సవం ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం జోడు రథాలపై ఆది దంపతుల వైభవాన్ని చూసి భక్తకోటి పరవశించిపోయింది. విశేషోత్సవాన్ని పురస్కరించుకుని సోమస్కందమూర్తి, జ్ఞానాంబిక ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలోని అలంకార మండపం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి భిక్షాల గాలి గోపురం వద్ద ఉన్న నెప్పల మండపంలో సంకల్ప పూజలు నిర్వహించారు. ముందు సర్వేశ్వరుని రథం.. వెనుక సర్వేశ్వరి రథాల ఊరేగింపు వైభవంగా జరిగింది.

వైభవంగా శ్రీశైల మల్లన్న రథోత్సవం



అశేష భక్తజనం మధ్య సాగుతున్న రథోత్సవం. అంతరచిత్రంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల తొమ్మిదో రోజు సోమవారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లు ఆలయ పురవీధుల్లో రథంపై విహరించి భక్తులను కటాక్షించారు. రథోత్సవంలో కళాకారులు చేసిన నృత్యాలు, డోలు, ఢమరుక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 8 గంటలకు ఆలయ పుష్కరిణిలో ఆది దంపతులైన శ్రీస్వామిఅమ్మవార్లకు చూడముచ్చటగా తెప్పోత్సవం నిర్వహించారు.

దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం ఉదయం అల్పపీడనం ఏర్పడినట్లు భారత వాతావరణ విభాగం పేర్కొంది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ బుధవారం నాటికి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి, తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. రాష్ట్రంపై దీని ప్రభావం ఉండబోదని, శ్రీలంక, తమిళనాడులో మాత్రం వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

డ్వాక్రా మహిళలకు తీపికబురు

- మార్చి 8న ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాలకు శ్రీకారం

ఈనాడు, అమరావతి: మహిళా దినోత్సవాన్ని (మార్చి 8) పురస్కరించుకొని డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం తీపికబురు అందించనుంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో డ్వాక్రా మహిళలకు వెన్నుదన్నుగా నిలిచే రెండు కీలక పథకాలతో పాటు మరిన్ని వరాలను ప్రకటించనున్నారు. వీటికి ఇప్పటికే ఆయన ఆమోదముద్ర వేశారు. డ్వాక్రా మహిళల కుటుంబాల్లో చదువుకు, వివాహాలకు చేయూతనిచ్చేలా 'ఎన్టీఆర్ విద్యాలక్ష్మి' 'ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి' పథకాలను సెర్ప్ అధికారులు రూపొందించారు. ఈ పథకాల కింద స్త్రీనిధి బ్యాంకు (సెర్ప్ పరిధి) ద్వారా గరిష్ఠంగా రూ.లక్ష వరకు పావలా వడ్డీకి రుణం అందిస్తారు. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఖరారు చేశారు. గతేడాది అక్టోబరులోనే వీటిని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించినా.. సీఎం ఆదేశాల మేరకు పథకాల అమలులో లోపాలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు అధికారులు మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. తాజాగా మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చేతుల మీదుగా ఈ పథకాలను ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డ్వాక్రా సంఘంలో నమోదై.. కనీసం ఆరు నెలలు, అంతకంటే ఎక్కువ కాలం ఉన్న సభ్యులకు ఈ పథకాలు వర్తింపజేయనున్నారు. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి, ఇతర మార్గాల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించే వారికి చేయూత అందజేస్తారు. లబ్ధిదారు బయోమెట్రిక్ నమోదు ఆధారంగా పథకాలు అమలు చేస్తారు.

ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకం

• పాఠశాలలు, కళాశాలల్లో పిల్లలకు చెల్లించాల్సిన ఫీజుకు అనుగుణంగా అవసరమైన మొత్తాన్ని తీసుకోవచ్చు • గరిష్ఠంగా ఇద్దరు పిల్లల చదువుకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు (గరిష్ఠంగా) రుణసాయం • 4% వడ్డీ (పావలా వడ్డీ)కి ఇస్తారు • తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి • అడ్మిషన్ లెటర్, ఫీజు చెల్లింపు విధానం, ఇనిస్టిట్యూట్ వివరాలు, రసీదులు సమర్పించాలి • దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తారు.

ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి..

సభ్యురాలి కుమార్తె వివాహానికి ఈ పథకం వర్తిస్తుంది • అవసరానికి అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు (గరిష్ఠంగా) రుణంగా తీసుకునే వెసులుబాటు ఉంది • 4% వడ్డీ (పావలా వడ్డీ)కి ఇస్తారు • తీసుకున్న మొత్తానికి అనుగుణంగా చెల్లింపు వాయిదాల సంఖ్య ఉంటుంది. గరిష్ఠంగా 48 వాయిదాల్లో చెల్లించాలి • లగ్నపత్రిక, శుభకార్యం నిర్వహణకు సంబంధించిన పత్రం, పెళ్లి ఖర్చు అంచనా సమర్పించాలి. పరిశీలన అనంతరం నేరుగా సభ్యురాలి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తారు.

ఏడాదికి రూ.2,000 కోట్ల వ్యయం

ఒక్కో పథకానికి ఏడాదికి రూ.1,000 కోట్ల చొప్పున రెండింటికి రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పథకాల అమలు ద్వారా పావలా వడ్డీ కింద సమకూరే ఆదాయంలో 50 శాతాన్ని తిరిగి డ్వాక్రా సంఘాలకు అనుబంధంగా ఉన్న మండల సమాఖ్యలు, గ్రామ సమాఖ్యల బలోపేతానికి వినియోగించనున్నారు. మిగతా 50 శాతం స్త్రీనిధి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రయోజనాలకు ఉపయోగించనున్నారు. ఈ పథకం కింద రుణసాయం పొందిన తర్వాత సదరు లబ్ధిదారు ప్రమాదంలో చనిపోతే ఆ రుణ మొత్తాన్ని మాఫీ చేయనున్నారు.

యానిమేటర్లకు ఉచితంగా సెల్‌ఫోన్లు

రాష్ట్ర వ్యాప్తంగా 27,500 మంది యానిమేటర్లు, 5 వేల మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లు విధులు నిర్వర్తిస్తుండగా.. వీరికి రూ.15 వేలు విలువ చేసే సెల్‌ఫోన్లు ఉచితంగా ఇవ్వనున్నారు. 600 మంది ఏపీఎంలకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో వీరికి సెల్‌ఫోన్లు ఇవ్వగా.. చాలా వరకు అవి పాడైపోయాయి.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు..

మే నెల కోటా విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల మే నెల కోటాను ఈనెల 18న ఉదయం పది గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవలకే లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎంపికైనవారు 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించి లక్కీడిప్ టికెట్లు పొందాల్సి ఉంటుంది.

• ఈ నెల 21న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవాటికెట్లు ఉదయం పది గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటా మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. • ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్లు విడుదల చేస్తారు.

• ఈనెల 24న ఉదయం పది గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లు, మధ్యాహ్నం 3గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదల చేస్తారు.

• ఈ నెల 27న ఏప్రిల్‌కు సంబంధించి శ్రీవారి సేవ, పరకామణి సేవల కోటాను మధ్యాహ్నం మూడింటికి విడుదల చేస్తారు. భక్తులు ఈ విషయాలను గమనించి https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో టికెట్లను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

మే 1 నుంచి గృహ గణన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మే 1 నుంచి 30 వరకు గృహ గణన చేపట్టనున్నారు. 2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల సేకరణకు ముందుగా ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గృహ గణన చేపడుతున్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక నెల పాటు ఈ ప్రక్రియ జరుగుతుంది. దానిలో భాగంగా రాష్ట్రంలో మే 1 నుంచి 30 వరకు గృహ గణన చేపడతామని ఏపీ ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసింది. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్‌కు అవకాశం ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరు మేయర్, ఏలూరు డిప్యూటీ మేయర్ స్థానాలకు 26న ఎన్నికలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో ఖాళీ అయిన మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలకు ఈ నెల 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పాలకవర్గ సభ్యులకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు ఈ నెల 20లోగా సమాచారం అందజేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సోమవారం వేర్వేరుగా జారీ చేసిన నోటిఫికేషన్లలో రెండు జిల్లాల కలెక్టర్లు, ఆయా నగరపాలక సంస్థల కమిషనర్లను ఆదేశించారు. 26న ఉదయం 11 గంటలకు ఎన్నికల నిర్వహణకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ కారణాలతో సమావేశం నిర్వహించలేని పరిస్థితి తలెత్తితే మరుసటి రోజు (27న) విధిగా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

498 కేసులో లుకౌట్ నోటీసా?

- యాంత్రిక ధోరణిలో జారీ చేసేస్తున్న పోలీసులు
- హైకోర్టు ఆక్షేపణ.. ఎల్వోసీ కొట్టివేత

ఈనాడు, అమరావతి: పోలీసులు యాంత్రిక ధోరణిలో లుకౌట్ సర్క్యులర్ (ఎల్వోసీ) జారీ చేసేస్తున్నారని హైకోర్టు ఆక్షేపించింది. నిందితులు దర్యాప్తునకు సహకరిస్తున్నారా? లేదా? అరెస్టు నుంచి తప్పించుకోవాలనుకుంటున్నారా? లేదా? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎల్వోసీ జారీ చేస్తున్నారని తప్పుపట్టింది. వ్యక్తులు స్వేచ్ఛగా సంచరించే ప్రాథమిక హక్కును ఎల్వోసీ హరిస్తుందని తెలిపింది. ఐపీసీ సెక్షన్ 498-ఏ (భార్యపై భర్త, అతని బంధువులు క్రూరత్వానికి పాల్పడటం) కేసులో నిందితుడిపై ఎల్వోసీ జారీ చేయడాన్ని తప్పుపట్టింది. పిటిషనర్ దర్యాప్తునకు సహకరిస్తున్నా ఎల్వోసీ జారీ చేశారని ఆక్షేపిస్తూ దాన్ని కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

విశాఖపట్నం మహిళ అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గతేడాది తనపై నమోదు చేసిన బీఎన్ఎస్ సెక్షన్ 85 (ఐపీసీ సెక్షన్ 498-ఏ), వరకట్న వేధింపుల కేసులో పోలీసులు ఎల్వోసీ జారీచేశారని, దానిని కొట్టేయాలని కోరుతూ విశాఖపట్నానికి చెందిన ఎల్.వెంకట అరుణ్‌కిరణ్ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. కేసుల విచారణ నిమిత్తం దుబాయ్ నుంచి విశాఖ వచ్చిన తనకు ఎల్వోసీ గురించి తెలిసిందన్నారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తనను విశాఖ నుంచి దుబాయ్‌కు వెళ్లేందుకు అనుమతించాలని విన్నవించారు. సకాలంలో దుబాయ్ వెళ్లకపోతే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఎల్వోసీని రద్దు చేస్తే విశాఖపట్నం కోర్టులో జరిగే విచారణకు అరుణ్ గైర్హాజరయ్యే ప్రమాదం ఉందని పోలీసుల తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ) వాదించారు. వ్యాజ్యాన్ని కొట్టేయాలని కోరారు.

విచారణకు సహకరిస్తున్నా ఎల్వోసీ ఇవ్వడమేంటి?

వాదనలు విన్న న్యాయమూర్తి.. 'పిటిషనర్ క్రమం తప్పకుండా దిగువ కోర్టు విచారణకు హాజరవుతున్నారు. దర్యాప్తు సంస్థకు పూర్తిగా సహకరిస్తున్నారు. ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎల్వోసీ జారీ చేయడం చట్టవిరుద్ధం. 498-ఏ కేసులో ఆరోపణలు తీవ్రమైనవి కాదు. తీవ్ర నేరాలకు పాల్పడిన నిందితులను నిర్బంధించడం లేదా విచారణకు సహకరించేలా చూడటానికి మాత్రమే పోలీసులు ఎల్వోసీ జారీ చేయాలని కేంద్ర హోం శాఖ స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది' అని పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

17-2-2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర ఋతువు, మాఘ మాసం, బహుళ పక్షం
అమావాస్య: సా. 5-41 తదుపరి ఫాల్గుణ శుక్ల పక్ష పాడ్యమి
ధనిష్ఠ: రా.9-44 తదుపరి శతభిష
వర్జ్యం: తె. 5-01 నుంచి
అమృత ఘడియలు: ఉ. 11-00 నుంచి 12-39 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-47 నుంచి 9-33 వరకు తిరిగి రా. 10-58 నుంచి 11-48 వరకు
రాహుకాలం: మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.31; సూర్యాస్తమయం: సా.5.57

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	15.2	33.0
అనంతపురం	17.9	35.5
తిరుపతి	18.0	33.7
హైదరాబాద్	18.4	31.7
రాజమహేంద్రవరం	19.0	36.0
శ్రీకాకుళం	20.0	29.0
విశాఖపట్నం	20.4	31.0
విజయవాడ	20.4	32.3
నెల్లూరు	22.4	32.6


ఉద్యోగ అవకాశాలు



త్యాగనిరతికి నిలువెత్తు ఆకృతి

- శరవేగంగా పొట్టిశ్రీరాములు విగ్రహ నిర్మాణం
- రాజధానిలోని శాఖమూరు వద్ద 6.8 ఎకరాల్లో స్మృతివనం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన ఆ మహనీయుడి త్యాగనిరతిని భావితరాలకు తెలియజేసేందుకు శాఖమూరు వద్ద 'స్టాచ్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో ఆయన విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మిస్తోంది. పొట్టిశ్రీరాములు 125వ జయంత్యుత్సవాల ముగింపు సందర్భంగా వచ్చేనెల 16న దీన్ని ఆవిష్కరించనున్నారు. ఆయన 58 రోజులపాటు నిరాహార దీక్ష చేసినందుకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహం రూపుదిద్దుకుంటోంది. మార్చి 16న పొట్టి శ్రీరాములు జయంతిని, డిసెంబరు 15న ఆత్మార్పణ దినాన్ని ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్ర కార్యక్రమాలుగా ప్రకటించింది.


ప్రాజెక్టు నమూనా

ట్రస్టు ఆధ్వర్యంలో పనులు

పొట్టిశ్రీరాములు విగ్రహం, స్మృతివనం నిర్మాణానికి ప్రభుత్వం రాజధానిలో 6.8 ఎకరాల భూమి కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు రూ.150 కోట్లు వ్యయమవుతుండగా.. అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ భరిస్తోంది. ఇ-9, ఎన్-15 రహదారుల పక్కన పశ్చిమాభిముఖంగా ప్రతిష్ఠించే ఈ విగ్రహ నిర్మాణానికి మంత్రి లోకేశ్ 2025 సెప్టెంబరు 3న శంకుస్థాపన చేశారు. అక్టోబరులో పనులు ప్రారంభించారు. కృష్ణా జిల్లా బొమ్ములూరుకు చెందిన కళాకారులు అక్కడే విగ్రహ భాగాలకు ఆకృతినిస్తూ, దశల వారీగా రాజధానికి తరలిస్తున్నారు. ఇప్పటికే రెండు భాగాలు చేరుకున్నాయి.

మొత్తం 110 అడుగుల ఎత్తు


సిద్ధమైన విగ్రహ భాగం

- రెండంతస్తుల వేదికపై విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. వేదిక, విగ్రహం కలిపి మొత్తం ఎత్తు 110 అడుగులు. వేదిక నిర్మిత ప్రాంతం 17 వేల చదరపు అడుగులు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 100 మంది కూర్చునేలా మినీ థియేటర్, మ్యూజియం, లైబ్రరీ ఉంటాయి.
- మినీ థియేటర్‌లో పొట్టిశ్రీరాములు జీవిత విశేషాలతో కూడిన 15 నిమిషాల వీడియోను సందర్శకులకు ప్రదర్శిస్తారు.
- ఆయన వాడిన వస్తువులు, ప్రముఖులకు రాసిన లేఖలను మ్యూజియంలో ఉంచుతారు.
- మొదటి అంతస్తులో ధ్యాన మందిరం ఉంటుంది. 9 అడుగుల ఎత్తైన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అక్కడ ఆసీనులైన భంగిమలో నిర్మిస్తున్నారు.
- ధ్యానమందిరంపై కమలం ఆకారంలో పీఠం నిర్మించి, దానిపై విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. పైనుంచి చూస్తే కమలం మధ్యలో మనిషి నిలబడ్డట్టుగా కనిపిస్తుంది.
- ఎనిమిది కమలం రేకులు (పెటల్స్) అమరుస్తున్నారు. ఒక్కో రేకు ఎత్తు 22.50 అడుగులు. వాటిని ముంబయిలో తయారు చేయించారు.


నిర్మాణంలో ఉన్న వేదిక

- మొత్తం బరువు 100 టన్నులు కాగా, విగ్రహాన్ని 30 టన్నుల కంచుతో తయారు చేస్తున్నారు. పీఠంపై విగ్రహాన్ని నిలబెట్టేందుకు లోపల 70 టన్నుల బరువైన ఇనుప గడ్డర్లు వాడుతున్నారు.
- మొదటి దశలో భాగంగా మార్చి 16 నాటికి రెండంతస్తుల వేదిక, విగ్రహం సిద్ధం చేసి, విగ్రహావిష్కరణ చేస్తారు.
- రెండో దశలో మరో 2,000 సీటింగ్ సామర్థ్యంతో ఆడిటోరియం, పార్క్ అభివృద్ధి చేస్తారు. దీనికి ఏడాది సమయం పడుతుంది.

ఏటా వెయ్యి మందికి సహాయం



పొట్టిశ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ కేవలం ఆయన విగ్రహ ఏర్పాటు, నిర్వహణకే పరిమితం కాకుండా.. పలు సేవా కార్యక్రమాలూ నిర్వహిస్తుందని మేనేజింగ్ ట్రస్టీ దూండీ రాకేశ్ తెలిపారు. ప్రాథమికంగా ప్రతి సంవత్సరం వెయ్యి మందికి విద్య, వైద్య సహాయం, పేదరికంలో ఉన్నవారికి చేయూత వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఆ సంఖ్య పెంచుతామన్నారు. 20 కోర్సులతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి, పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని, భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు జీఎంఆర్ సంస్థ ఆసక్తిగా ఉందని రాకేశ్ పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా పేదలకు ట్రస్ట్ తరఫున సాయమందిస్తామని, పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని నందన వనంలా తీర్చిదిద్దుతామని తెలిపారు.



గడ్డి మేటు అడ్డం రాకుండా!

చేపా చేపా ఎందుకు ఎండలేదు అని అడిగితే గడ్డి మేటు అడ్డం వచ్చిందని చెప్పిందట! చిన్నప్పటి నుంచి అందరూ విన్న కథలోని భాగం ఇది. ఇక అలా సాకులు చెప్పే వీలు లేకుండా విశాఖలోని సాగర తీరాన రామానాయుడు స్టూడియో ఎదురుగా ఉన్న రోడ్డుపై చేపలను 200 మీటర్ల మేర ఇలా ఎండబెట్టారు. మధ్యాహ్నం వేళ ఎండపడి వెండి తునకల్లా మెరిసిపోతుండటంతో అటుగా వెళ్లేవారు ఆసక్తిగా తిలకించారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (మధురవాడ)

సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు

- ఏపీఎస్ఎస్‌డీసీ

ఈనాడు, అమరావతి: సౌదీ అరేబియాలో ఉద్యోగాల కోసం ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(ఓమ్‌క్యాప్), 2కామ్స్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ భాగస్వామ్యంతో ఎల్ అండ్ టీ నియామక డ్రైవ్‌కు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) తెలిపింది. ఈనెల 18న విజయవాడలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఈ నియామక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ఈ డ్రైవ్ ద్వారా సౌదీ అరేబియాలోని రియాద్‌లో కేబుల్ స్ప్లైసర్, కేబుల్ జాయింటర్, టెస్టింగ్, కమిషనింగ్ టెక్నీషియన్, మెకానికల్ టెక్నీషియన్, ప్లంబర్, స్కాఫోల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. ఐటీఐ, డిప్లొమా అర్హతతో పాటు సంబంధిత విభాగాల్లో 3-5 ఏళ్ల అనుభవం ఉండాలని, హిందీ, ఆంగ్ల భాషలపై అవగాహన తప్పనిసరని వెల్లడించారు. పోస్టు ఆధారంగా నెలకు రూ.28,800 నుంచి రూ.72వేల వరకు జీతం ఉంటుందని తెలిపింది.

జేఈఈలో మనోళ్లు మెరిశారు

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1.60 లక్షల మంది పరీక్ష రాసి ఉంటారని అంచనా. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తుది 'కీ'ని విడుదల చేసిన ఎన్‌టీఏ, సాయంత్రం 6.30 గంటలకు ఫలితాలను వెల్లడించడం గమనార్హం.

తెలుగు రాష్ట్రాల నుంచి 100 పర్సంటైల్ సాధించిన విద్యార్థులు

విద్యార్థి పేరు	రాష్ట్రం/సొంతూరు
పసల మోహిత్	జమ్మలమడుగు, ఏపీ
నరేంద్రబాబుగారి మహిత్	తిరుపతి, ఏపీ
ఎం. వివాన్ శరత్	హైదరాబాద్, తెలంగాణ

తెలుగు రాష్ట్రాల నుంచి కేటగిరీల వారీగా టాపర్లు

కేటగిరీ	విద్యార్థి	రాష్ట్రం
ఓబీసీ (నాన్ క్రీమీలేయర్)	నరేంద్రబాబుగారి మహిత్	ఏపీ
ఎస్సీ	దేవ శ్రీవేద్	ఏపీ

తుది విడత పరీక్షల తర్వాతే ర్యాంకులు....

ఏప్రిల్ 2-9 తేదీల మధ్య జేఈఈ మెయిన్ తుది విడత ఆన్‌లైన్ పరీక్షలు జరగనున్నాయి. తొలి విడత రాసిన విద్యార్థులు.. రెండో విడతలోనూ పరీక్షకు హాజరుకావొచ్చు. రెండింటిలో ఉత్తమ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) అఖిల భారత ర్యాంకులను, కేటగిరీల వారీగా కటాఫ్ స్కోర్‌ను నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం 2.50 లక్షల మంది అర్హులను ప్రకటిస్తుంది. వారు మాత్రమే మే నెల 17వ తేదీన జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హులు.

కేటగిరీల వారీగా పరీక్ష రాసిన విద్యార్థుల వివరాలిలా..

జనరల్	4,52,825
ఈడబ్ల్యూఎస్	1,60,958
ఎస్సీ	1,29,902
ఎస్టీ	43,632
ఓబీసీ	5,17,336

లక్ష్యంపై స్పష్టమైన గురితోనే విజయం: మోహిత్, జమ్మలమడుగు, వైఎస్సార్ కడప జిల్లా

లక్ష్యంపై స్పష్టమైన గురితో చదవడం వల్లనే విజయం సాధించగలిగానని జేఈఈ మెయిన్స్‌లో 300/300 మార్కులు సాధించిన పసల మోహిత్ తెలిపాడు. విజయవాడ శ్రీచైతన్య క్యాంపస్‌లో చదువుకున్న విద్యార్థి తన విజయ రహస్యాలను, భవిష్యత్తు లక్ష్యాలను సోమవారం 'ఈనాడు-ఈటీవీ'తో పంచుకున్నాడు. వేల సంఖ్యలో ప్రశ్నలను సాధన చేయడం కంటే కాన్సెప్ట్‌పై స్పష్టమైన అవగాహనతో చదవడం వల్లనే విజయం సాధ్యమైందని తెలిపాడు. 'కాన్సెప్ట్‌పై స్పష్టత లేకపోతే పరీక్ష రాసేటప్పుడు అనవసర సందేహాలు తలెత్తి సమయం వృథా అవుతుంది. జేఈఈ మెయిన్స్ పరీక్షను గణితంతో ప్రారంభించాలి. ప్రశ్న చదవగానే సమాధానం మొత్తం గుర్తుకొచ్చే స్థాయిలో సన్నద్ధం కావాలి. ఒక ప్రశ్నకు సమాధానం రాయడం పూర్తికాగానే దాని గురించి మళ్లీ ఆలోచించకూడదు. దృష్టి మొత్తం తర్వాత ప్రశ్నపై కేంద్రీకరించాలి. నెగిటివ్ మార్కుల గురించి భయపడడం కంటే.. ప్రశ్నలను ఎలా సాధన చేయాలనే అంశంపై దృష్టిపెట్టడం ఉత్తమ మార్గం.

మాక్ టెస్టులు ఉపయోగపడ్డాయి

నా విజయంలో మాక్ టెస్టులు బాగా ఉపయోగపడ్డాయి. చేసిన తప్పులను విశ్లేషించుకుంటూ.. తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడేవాణ్ని. ప్రతి మాక్ టెస్ట్ తర్వాత చేసిన తప్పులను ఓ పుస్తకంలో రాసుకునేవాణ్ని. తుది పరీక్ష సమయానికి పూర్తిగా తప్పులు లేకుండా సన్నద్ధమయ్యా. అమ్మానాన్నలు ఇద్దరూ వైద్యులే అయినప్పటికీ..నాకు గణితంపై ఆసక్తి ఉండడంతో ఇంజినీరింగ్ వైపు ప్రోత్సహించారు. ఐఐటీ బాంబేలో బీటెక్ పూర్తిచేసి, ఎంబీఏలో ఎంటెక్ చేయాలన్నదే నా లక్ష్యం. -విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఐఐటీ బాంబేలో చదవాలన్నది మోహిత్ కల

– తల్లిదండ్రులు డా.సబిత, డా.పి.కిరణ్‌కుమార్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ సత్తా చాటి.. ఐఐటీ బాంబేలో సీటు సాధించాలని మోహిత్ కలలు కన్నాడని జమ్మలమడుగు.. రామిరెడ్డిపల్లె కాలనీలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు డా.సబిత, డా.పి.కిరణ్‌కుమార్ తెలిపారు. కుమారుడు అత్యుత్తమ మార్కులు సాధించడంపై వారిరువురూ 'ఈనాడు-ఈటీవీ'తో మాట్లాడుతూ సంతోషం వ్యక్తంచేశారు. సబిత జమ్మలమడుగు ప్రాంతీయ వైద్యశాలలో డెంటిస్టుగా, పి.కిరణ్‌కుమార్ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నారు.


తల్లిదండ్రులు, సోదరితో మోహిత్

కలెక్టర్ కావడం లక్ష్యం



–శ్రీవేద్, సొంపల్లి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

జేఈఈ మెయిన్స్‌లో 99.999 పర్సంటైల్ సాధించి ఎస్సీ కేటగిరీలో ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచాడు దేవ శ్రీవేద్. రాజమహేంద్రవరంలోని తిరుమల కళాశాలలో చదువుతున్న విద్యార్థి తండ్రి సూరిబాబు, తల్లి ఇంజేటి లక్ష్మీసురేఖ ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఐఏఎస్ చదివి కలెక్టర్ కావడమే తన లక్ష్యమని శ్రీవేద్ తెలిపాడు.

ప్రతిష్ఠాత్మక ఐఐటీలో చదివి..దేశానికి సేవ చేస్తా

– వివాన్ శరత్, హైదరాబాద్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ ఉత్తమ ర్యాంకు సాధిస్తాననే నమ్మకం ఉంది. విదేశాల్లో బ్యాచులర్ డిగ్రీ చదివించే స్తోమత నా తల్లిదండ్రులకు ఉంది. అయినా ప్రతిష్ఠాత్మక ఐఐటీలో చదివి దేశానికి సేవ చేస్తా. మాది మహారాష్ట్ర. 25 సంవత్సరాలుగా మా కుటుంబం హైదరాబాద్‌లోనే స్థిరపడింది.

రోజుకు 15 గంటల కఠోర శ్రమతో

– నరేంద్రబాబుగారి మహిత్, తిరుపతి

తిరుపతి నారాయణ విద్యాసంస్థల్లో చదువుతున్నా. మాది అనంతపురం జిల్లా. మా నాన్న నరేంద్రబాబు అధ్యాపకుడు. నా చదువు కోసమే నాన్న కుటుంబాన్ని తిరుపతికి మార్చారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, రోజుకు 15 గంటల కఠోరశ్రమతో విజయం సాధ్యమైంది. ఐఐటీ బాంబేలో సీటు సాధించడమే లక్ష్యం.

– ఈనాడు, హైదరాబాద్, కడప: జమ్మలమడుగు, రాజోలు, న్యూస్‌టుడే: ఈనాడు డిజిటల్, తిరుపతి

9 ప్రశ్నల తొలగింపు

- మరో ఆరు ప్రశ్నలకు జవాబుల మార్పు
- జేఈఈ మెయిన్‌లో ఏటా ఇదే తంతు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించే జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) విద్యార్థులను ముప్పుతిప్పలు పెడుతోంది. భిన్నంగా..కఠినంగా ప్రశ్నలు ఇవ్వాలనే ప్రయత్నంలో తప్పులు చేస్తూపోతోంది. చివరికి ఎన్ని ప్రశ్నలను తొలగిస్తుందో, ఏ ప్రశ్నకు జవాబు మారుస్తుందో తెలియని పరిస్థితి ఏటా నెలకొంటోంది. జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలకు సంబంధించి.. ఈసారి మూడు విడతల ప్రశ్నపత్రాల నుంచి ఏకంగా తొమ్మిది ప్రశ్నలను తొలగించింది. అందులో అధిక శాతం భౌతికశాస్త్రంలోనివే కావడం గమనార్హం. మరో ఆరింటికి జవాబులను మార్చింది. ఈ నెల 4వ తేదీన ప్రాథమిక 'కీ' వెల్లడించినప్పుడు... జనవరి 22వ తేదీ ఉదయం విడత, 23వ తేదీ ఉదయం విడత పరీక్షకు సంబంధించి భౌతికశాస్త్రంలో ఒక్కో ప్రశ్నను తొలగించినట్లు ఎన్‌టీఏ ప్రకటించింది. 23వ తేదీ మధ్యాహ్నం విడత జరిగిన పరీక్షలో భౌతికశాస్త్రంలో ఒక ప్రశ్నకు మూడు సరైన జవాబులు గుర్తించినట్లు ప్రకటించి, మార్కులు ఇస్తామని పేర్కొంది. ఫైనల్ 'కీ' వచ్చేసరికి ప్రాథమిక 'కీ'కి అదనంగా మరో ఏడు ప్రశ్నలను తొలగించడంతోపాటు మరో ఐదు జవాబులను మార్చింది. దీన్నిబట్టి మొత్తంగా 15 ప్రశ్నలు/ జవాబుల్లో తప్పులున్నట్లు లెక్క. 'ఇలా ప్రశ్నలను తప్పుగా ఇవ్వడం, ప్రాథమిక 'కీ', తుది 'కీ'లో మార్పులు చేయడం ఏటా తంతుగా మారుతోందని' శ్రీచైతన్య ఐఐటీ జాతీయ సమన్వయకర్త ఎం.ఉమాశంకర్ ఆవేదన వ్యక్తంచేశారు.

జేఈఈ మెయిన్ 2026 సెషన్-1 ఫలితాల్లో శ్రీ చైతన్య ప్రభంజనం

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్ 2026 సెషన్-1 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రభంజనం సృష్టించాయి. శ్రీ చైతన్య విద్యార్థి పసల మోహిత్ 300/300 మార్కులతో 100 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రతిభ కనబర్చాడు. 290, 285, 280 మార్కులతోపాటు సబ్జెక్టులవారీగానూ అత్యధిక సంఖ్యలో విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోర్లు సాధించి శ్రీ చైతన్య విజయకేతనాన్ని రెపరెపలాడించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయంపై శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కఠోర శ్రమ, శ్రీ చైతన్య రూపొందించిన అకడమిక్ ప్రోగ్రామ్స్, ఇన్ఫినిటీ లెర్న్ యాప్, అత్యుత్తమ అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతోనే తాము ఈ విజయం సాధించామని ఆమె పేర్కొన్నారు.

చరిత్ర సృష్టించిన 'నారాయణ'

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ 2026 సెషన్-1 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు చరిత్ర సృష్టించాయి. ఏ ఇతర విద్యాసంస్థ సాధించని అరుదైన ఘనతను నారాయణ సొంతం చేసుకున్నట్లు నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డా.పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలియజేశారు. ముగ్గురు నారాయణ విద్యార్థులు వివన్ శరత్ మహేశ్వరి, మాధవ్ విరాడియా, నరేంద్రబాబు గారి మహిత్‌లు 100 పర్సంటైల్ సాధించి దేశంలోనే టాపర్లుగా నిలిచారని తెలిపారు. వీరితోపాటు కర్ణాటకకు చెందిన విష్ణుసాయితేజ 99.999 పర్సంటైల్‌తో, గోవాకు చెందిన తనయ్ అజిత్ ప్రభు 99.825 పర్సంటైల్‌తో ఆయా రాష్ట్రాల్లో అగ్రస్థానాల్లో నిలిచినట్లు వెల్లడించారు. అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌లు, పటిష్ఠ ప్రణాళిక, అధ్యాపక బృందం అంకితభావం, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఈ విజయం సాధ్యమైందని డైరెక్టర్లు పేర్కొన్నారు.

రిజోనెన్స్ హైదరాబాద్ విద్యార్థుల ప్రతిభ

ఈనాడు, అమరావతి: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో రిజోనెన్స్ హైదరాబాద్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని ఆ విద్యాసంస్థ యాజమాన్యం పేర్కొంది. తమ విద్యార్థులైన సమృద్ధ్ భట్టాచార్య 99.988, రేవంత్ వంగల 99.982, సాకేత్ రెడ్డి బొమ్మిడి 99.932, బూనేటి ఆదిత్య రెడ్డి 99.918, సెట్టిపల్లి అన్విత రెడ్డి 99.915 పర్సంటైల్‌తో వరుసగా టాప్-5లో నిలిచారని తెలిపింది. అలాగే 55 మందికి పైగా విద్యార్థులకు 99 పర్సంటైల్ పైగా స్కోర్ వచ్చిందని చెప్పింది.

భాష్యం సత్తా

జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో భాష్యం ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. తమ విద్యార్థి నూతలపాటి యోగశివసాయి శ్రీరామ్ 99.99 పర్సంటైల్‌తో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో టాపర్‌గా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులను భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, ఎండీ భాష్యం సాకేత్‌రామ్‌లు అభినందించారు.

డా.కె.కె.ఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థి విజయభేరి

జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో డా.కె.కె.ఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థి పి.మోహిత్ 300 మార్కులకు 300 మార్కులు సాధించి 100 పర్సంటైల్‌తో రికార్డు సృష్టించాడని స్కూల్ యాజమాన్యం తెలిపింది. ఇంతటి విజయం సాధించడం తమకు గర్వకారణంగా ఉందని పేర్కొంది.

తిరుమల విద్యార్థుల జయకేతనం

కాతేరు, రాజమహేంద్రవరం: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి డి.శ్రీవేద్ 99.999 పర్సంటైల్‌తో ఎస్సీ కేటగిరీలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. అలాగే ఎం.కృష్ణ శరవణ సాకేత్‌కు 99.99, గన్నమనీడి వాత్సల్యకు 99.98, ఆర్.చరణ్ తేజకు 99.98, జి.ప్రభవ్ తేజకు 99.97 పర్సంటైల్ వచ్చిందని చెప్పారు. అలాగే సుమారు 1,000 మంది పైన విద్యార్థులు తమ పర్సంటైల్ స్కోర్‌తో ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు పొందగలరని పేర్కొన్నారు.

శశి వైజాగ్ విజయఢంకా

ఈనాడు, అమరావతి: జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో శశి వైజాగ్, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యాసంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ తెలిపారు. వి.భరత్ గోపాలస్వామి 99.95, శీలం శ్రీరామ్ భవదీప్ 99.83, కె.జి.వి.ఉదయతేజా రెడ్డి 99.77, కె.సాయిదుర్గా సుభాష్ 99.76, వై.తపన్ సాయి లక్ష్మణ్ 99.71, ఓ.హర్ష సాయిరామ్ 99.65, బి.సాయి వంశీ 99.52, ఎస్.సాయిరామ్ 99.45, జి.భరత్‌కుమార్ 99.39, కె.ధనుష్‌నాయుడు 99.27, జి.చరణ్ 99.06 పర్సంటైల్ సాధించారని చెప్పారు.

నిధుల వ్యయంపై ఆంక్షలు ఎత్తివేయాలి

- ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం వినతి

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీలు 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి ఆంక్షలూ లేకుండా ఖర్చు చేసుకునేలా ఆదేశాలివ్వాలని ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ముఖ్యసలహాదారు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

ఏఐ ప్రయాణంలో ముందున్నాం


ఏఐ ఇంపాక్ట్ సమిట్ జరుగుతున్న దిల్లీలోని భారత్ మండపం

(మొదటి పేజీ తరువాయి)

నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఈ సందర్భంగా ఎక్స్‌లో ఆయన ప్రకటించారు.

ప్రపంచాన్ని దగ్గరకు చేర్చాం

ఏఐపై చర్చించడానికి ప్రపంచాన్ని ఒక దగ్గరకు చేర్చామని ప్రధాని పేర్కొన్నారు. 'ప్రపంచ దేశాల నేతలను, పారిశ్రామిక దిగ్గజాలను, ఆవిష్కర్తలను, విధాన నిర్ణేతలను, పరిశోధకులను, టెక్నాలజీ ఔత్సాహికులను ఈ సదస్సు కోసం ఘనంగా స్వాగతిస్తున్నాం. ఈ సమిట్ థీమ్‌గా సర్వజన హితాయ.. సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం) ఉంది. మానవాభివృద్ధి కేంద్రంగా ఏఐని తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నాం. ప్రస్తుతం ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, వ్యాపారం వంటి పలు రంగాలను ఏఐ ప్రభావితం చేస్తోంది. ఆవిష్కరణ, భాగస్వామ్యంతోపాటు బాధ్యతగా వ్యవహరించడంలో దానిని సమర్థంగా వినియోగించేందుకు ఈ సదస్సు దోహదం చేయనుంది. సదస్సు ఫలితాలు భవిష్యత్తు అభివృద్ధి, ఆవిష్కరణ, అవకాశాలకు ఓ రూపు తెస్తాయని నమ్ముతున్నా. ఏఐ ప్రయాణంలో ముందున్నందుకు సహకరించిన 140 కోట్ల మంది భారతీయులకు ధన్యవాదాలు' అని ప్రధాని పేర్కొన్నారు.

వివిధ దేశాల నేతలు..

ఏఐ సమిట్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్, అబుదాబి క్రౌన్ ప్రిన్స్, ఇంకా శ్రీలంక, భూటాన్, నెదర్లాండ్స్, గ్రీస్, ఫిన్లాండ్ తదితర 20 దేశాల నేతలు హాజరుకానున్నారు. ఐక్య రాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌సహా దేశ విదేశాలకు చెందిన 40 ప్రముఖ కంపెనీల సీఈవోలూ పాల్గొంటున్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. హ్యూమన్ సెంట్రిక్‌గా, సమ్మిళితంగా ఏఐ ఉండాలని, ఈ వనరులు అందరికీ అందుబాటులో ఉండాలనే సందేశాన్ని ప్రపంచానికి ఈ ఎక్స్‌పో, సమిట్ ద్వారా భారత్ ఇవ్వబోతోందని కేంద్ర ఐటీశాఖ కార్యదర్శి తెలిపారు.

- సదస్సులో భాగంగా 3,250 మంది అతిథులు వివిధ వేదికలపై మాట్లాడనున్నారు. 500 సెషన్లు జరుగుతాయి.
- ఏఐ ఎక్స్‌పోను ప్రారంభించిన అనంతరం ప్రధాని.. స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో మాట్లాడారు. పలు స్టాళ్లను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు.
- ఏఐ యుగంలో ఉపాధి అవకాశాలు, నైపుణ్యం, సురక్షిత, నమ్మకమైన ఏఐ, ఏఐ గవర్నెన్స్, మౌలిక వసతులు, జనరేటివ్ ఏఐ డిప్లాయ్‌మెంట్, ప్రభుత్వ రంగంలో వినియోగం వంటి అంశాలపై చర్చలు సాగుతాయి.
- ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఏఐ ఎక్స్‌పో, సమిట్‌కు సోమవారం పలువురు పోటెత్తారు. టెక్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, టెక్నాలజిస్టులు భారీగా హాజరయ్యారు. ఉదయం 9.30 గంటలకు ముందే భారత్ మండపం ఎదుట క్యూలు కనిపించాయి.

ఈ ఎక్స్‌పోకు ఎవరైనా హాజరు కావొచ్చని ప్రభుత్వం ప్రకటించింది. 5 రోజుల్లో మొత్తం 2 లక్షల మంది కిపైగా హాజరవుతారనే అంచనాలు న్నాయి. సందర్శకులు డిజి యాత్ర, ఏఐ సదస్సు యాప్‌లలో రిజిస్టరు చేసుకోవాల్సి ఉంటుంది.

- ఎక్స్‌పోలో గూగుల్, ఎన్‌విడియా, అమెజాన్, మెటా, ఓపెన్‌ఏఐతో పాటు స్థానిక ఏఐ సంస్థలు పాల్గొని నూతన ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్నాయి. 600 స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలతో వచ్చాయి. వివిధ కంపెనీల తరఫున 300 స్టాళ్లు ఏర్పాటయ్యాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఎస్తోనియా, తజికిస్థాన్, ఆఫ్రికా దేశాల పెవిలియన్లు కొలువుదీరాయి. కేంద్ర మంత్రిత్వశాఖలు, రాష్ట్రాలు తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి.


ఏఐ సదస్సులో ఓ రోబోను పరిశీలిస్తున్న సందర్శకులు

దక్షిణార్ధ గోళంలో తొలి ఎక్స్‌పో

ఈ ఎక్స్‌పో, సమిట్‌లను కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. దక్షిణార్ధ గోళ దేశాల్లో నిర్వహిస్తున్న మొట్టమొదటి అంతర్జాతీయ స్థాయి ఏఐ ఎక్స్‌పో, సమిట్ ఇవే కావడం గమనార్హం. కృత్రిమ మేధ వల్ల ప్రయోజనాలు, సవాళ్లపై ఇందులో చర్చలు జరగనున్నాయి.


సదస్సులో ఆకట్టుకున్న రోబోటిక్ సర్జికల్ వ్యవస్థ


ఏఐ గ్లోబల్ సదస్సులో సందర్శకుల సందడి

కట్టుదిట్టమైన భద్రత

ఏఐ ఎక్స్‌పో, సమిట్‌కు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. 10,000 మంది బలగాలను మోహరించింది. ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తోంది. ట్రాఫిక్ నియంత్రణకు 5,000 మంది పోలీసులను నియమించింది. ఈ నెల 17వ తేదీ నుంచి సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోనున్నారు.


ఈనాడు

'రెరా' ఉండీ ఉపయోగమేంటి?

స్థిరాస్తి రంగంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచి మోసాలకు అడ్డుకట్ట వేసే సత్సంకల్పంతో దశాబ్దం కిందట కేంద్రం రియల్ ఎస్టేట్ నియంత్రణ, అభివృద్ధి చట్టం(రెరా) పురుడుపోసుకుంది. కానీ, చాలా రాష్ట్రాల్లో దాని అమలు తీరు నిరాశాజనకంగానే ఉండటమన్నది చేదు నిజం. ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల సొంతింటి కలలనే పెట్టుబడిగా మార్చుకుని కొన్ని నిర్మాణ సంస్థలు నయవంచనలకు పాల్పడుతున్నాయి. నిర్దిష్ట సమయానికి ఇళ్లను అందించకుండా, లేదా మధ్యలోనే చేతులెత్తేసి అవి కొనుగోలుదారులను మానసిక వేదనకు గురిచేస్తున్నాయి. వసూలు చేసిన అడ్వాన్సులను దారి మళ్లించడమే కాకుండా, రిఫండ్ విషయంలోనూ తాత్సారం చేస్తున్నాయి. అసలు స్థలమే లేకున్నా ప్రీలాంచింగ్ ఆఫర్ల పేరుతో వందల కోట్ల రూపాయలు దండుకుంటున్నాయి. ఏటా తమ నివేదికల్లో ఈ వివరాలన్నింటినీ వెల్లడిస్తూ జనాన్ని అప్రమత్తం చేయాల్సిన రాష్ట్ర స్థిరాస్తి ప్రాధికార సంస్థలు దారుణ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇటీవలి పరిశీలనల ప్రకారం ఏపీ, కర్ణాటక, తమిళనాడు వంటి ఆరు రాష్ట్రాల్లో అవి ఇప్పటిదాకా వార్షిక నివేదికలే వెలువరించలేదు. తెలంగాణ, మహారాష్ట్ర, యూపీ తదితర తొమ్మిది చోట్ల ఆ క్రతువు అర్ధాంతరంగా ఆగిపోయింది. వ్యవస్థాగతమైన బాధ్యతారాహిత్యం రియల్ దగాకోరులకు మరింత బలాన్నిచ్చి సామాన్య జనానికి నష్టంచేస్తుంది!

భారత జీడీపీలో ఎనిమిది శాతం వాటా కలిగిన స్థిరాస్తి రంగం దేశీయంగా ఎంతోమందికి అన్నం పెడుతోంది. 'రెరా' రాకతో అది మరింత ఆరోగ్యకర వృద్ధిని నమోదుచేస్తుందని, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణలో విప్లవాత్మక మార్పులు సిద్ధిస్తాయన్న ఆశలు అడియాసలుగానే మిగిలాయి. క్షేత్రస్థాయిలో రెరా కాగితం పులిలా మిగిలిపోవడం వల్ల సాధారణ ప్రజల సొంతింటి కష్టాలు రెట్టింపయ్యాయి. ఈ దౌర్భాగ్య స్థితిపై గతంలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన సుప్రీంకోర్టు- తాజాగా మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసింది. డిఫాల్టర్లయిన బిల్డర్లకు సాయపడటం తప్ప రెరాలతో ఒరుగుతున్నదేమీ లేదని, వాటిని రద్దుచేసినా అభ్యంతరం చెప్పబోమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ అధికారుల పునరావాస కేంద్రాలుగా స్థిరాస్తి ప్రాధికార సంస్థలు భ్రష్టుపట్టడాన్నీ తప్పుపట్టింది. పేరుకు రెరా చట్టం పటిష్ఠంగా ఉన్నా నిబంధనలు ఉత్తర్వుల అమలు కోసం పోలీసులు, కలెక్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. దీని వల్ల బాధితులకు సత్వర న్యాయం అందకుండాపోతోంది. రెరా అమలులో రాష్ట్రాల నడుమ ఏకరూపత కొరవడటమూ చట్ట స్ఫూర్తిని నీరుగారుస్తోంది!

వేగవంతమైన పట్టణీకరణ, మౌలిక వసతుల విస్తరణ, జనాభా మార్పుల వల్ల 2047 నాటికి దేశీయంగా ఏటా 10లక్షల కొత్త ఇళ్లకు గిరాకీ ఏర్పడుతుందని 'క్రెడాయ్' అంచనా వేసింది. ప్రస్తుతం 30 వేల కోట్ల డాలర్లుగా ఉన్న భారతీయ స్థిరాస్తి విపణి విలువ అప్పటికి ఏడు లక్షల కోట్ల డాలర్లకు చేరే అవకాశముంది. నూతన అవకాశాలకు ద్వారాలు తెరుస్తున్న స్థిరాస్తి రంగంలోకి గడిచిన పదిహేనేళ్లలో ఎనిమిది వేల కోట్ల డాలర్ల సంస్థాగత పెట్టుబడులు తరలివచ్చాయి. అదే సమయంలో, 2025 చివరినాటికి దేశీయంగా రూ.11లక్షల కోట్ల విలువైన గృహ నిర్మాణ ప్రాజెక్టులు మధ్యలోనే నిలిచిపోయినట్లు పరిశీలనలు చెబుతున్నాయి. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే రియల్ మోసాల విలువ రూ.20వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా! ఇలాంటి దగాపర్వాల మూలంగా సర్వం ఊడ్చి, అప్పులు తెచ్చి మరీ బిల్డర్ల చేతిలో పోస్తున్న వారి జీవితాలు నలిగిపోతున్నాయి. స్థిరాస్తి ప్రాధికార సంస్థలను బలోపేతం చేసి రియల్‌ఎస్టేట్ మాయగాళ్లను కట్టడిచేయడంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించనంత కాలం ప్రజాప్రయోజనాలు దెబ్బతింటూనే ఉంటాయి!



సైంటిస్టులు ఎక్కడో అద్దాల భవనంలో కూర్చుని తమ లోకంలో తాముంటారనీ, వారికి సాధారణ ప్రజల కష్టాలు పట్టవనీ ఒక దురభిప్రాయం ఉంది. కానీ మనం అనుభవిస్తున్న ఎన్నో సౌకర్యాలకు ఆ శాస్త్రవేత్తల పరిశోధనలే కారణమన్నది మరచిపోకూడదు.

– మేఘనాథ్ సాహా, ఆస్ట్రోఫిజిసిస్ట్

యాదగిరీశా నమోస్తుతే!

బ్రహ్మ, విష్ణు, రుద్ర సమన్వయ శక్తులతో సృష్టి, స్థితి, లయాత్మకమైన చైతన్య స్వరూపమే నృసింహాకృతి! శ్రీహరి దశావతారాల్లో నరసింహ రూపం విశేషమైనది. నృసింహావతారం ఎంత ప్రచండమో, అంత ప్రహ్లాదం. ఎంత ప్రళయత్వమో అంత ప్రసన్నం. హిరణ్యం అంటే బంగారం, కశిపమంటే భోగలాలసత. ఈ రెండింటి సమ్మేళనం హిరణ్యకశిపుడు. లౌకిక సౌఖ్యాలు, సంపదలు, అంతులేని కోరికలనే విషవలయంలో చిక్కుకుని హృదయంలో వెలిగే పరంజ్యోతిని హిరణ్యకశిపుడు దర్శించలేకపోయాడు. అజ్ఞానాంధకారంలో ఉన్న అతని హృదయాన్ని నరసింహుడు తన వాడి గోళ్లతో చీల్చి, అందులోని దివ్యజ్ఞాన జ్యోతిని దర్శింపజేసి, ఆ అసురుడికి ముక్తిని ప్రసాదించాడు.

హిరణ్యకశిపుడి వధ తరవాత తన ఉగ్రరూపాన్ని ఉపసంహరించి, ప్రహ్లాదుడి ముంగిట నృసింహుడు ప్రేమాస్పద సౌజన్యమూర్తిగా సాకారమయ్యాడు. అలా నరహరి భక్తాభీష్ట వరదాయకమూర్తిగా తేజరిల్లిన క్షేత్రమే యాదగిరిగుట్ట! ఈ క్షేత్రంలో ఏటా ఫాల్గుణ మాసంలో 11 రోజులపాటు బ్రహ్మోత్సవ సంరంభం కొనసాగుతుంది. నవ్య శిల్పకళా యశస్సుతో, భవ్య ఆధ్యాత్మిక ఉషస్సుతో తేజరిల్లుతోన్న యాదగిరీశుడి సన్నిధి... భక్తుల పాలిటి దివ్య పెన్నిధి!



అంతర్యామి

ఈ క్షేత్ర పురాణం ప్రకారం, విభాండక మహర్షి మనవడు, ఋష్యశృంగుడి పుత్రుడైన యాదుడు విష్ణుభక్తుడు. నృసింహుణ్ని దర్శించాలనే అభీష్టంతో ఓ కొండ గుహలో తపస్సు చేశాడు. ఆంజనేయుడు ఉపదేశించిన సుదర్శన నృసింహ మహామంత్ర సాధనతో, యాదర్షి నరసింహుణ్ని ఉగ్ర, గండభేరుండ, జ్వాల, యోగానంద, లక్ష్మీనరసింహ... అనే అయిదు రూపాల్లో ప్రత్యక్షంగా దర్శించాడంటారు. ఆయన కోరిక మేరకే అయిదు రూపాలలో స్వామి కొండపై కొలువుదీరాడంటారు. 13వ శతాబ్దం నుంచి ఈ క్షేత్రం వైభవంగా విలసిల్లుతోంది. శ్రీకృష్ణదేవరాయలు ఈ క్షేత్రాన్ని దర్శించాడు. కీసరగుట్టను రాజధానిగా చేసుకుని పాలించిన తూర్పు చాళుక్యరాజు త్రిభువనమల్లుడు ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశాడని చరిత్ర చెబుతోంది.

సముద్రుణ్ని యాదఃపతిగా అభివర్ణిస్తారు. విశేషమైన జలసిరి ఉన్న ప్రదేశంపై విస్తరించిన భారీ ఏకశిలా గిరి- యాదాద్రి! జలం జీవశక్తికి, సంపదకు చిహ్నం. సకల జీవులకు చైతన్యదాయక శక్తిగా, తేజోమయస్ఫూర్తిగా నారసింహుడు ఇక్కడ ఆవిష్కారమయ్యాడు. అందుకే జగద్గురువు ఆదిశంకరులు నారసింహుణ్ని జీవకోటికి ప్రాణదీప్తిగా అభివర్ణించారు. యోగశాస్త్ర రీత్యా పరిశీలిస్తే, శరీరంలో నాభి జలస్థానం. దీనిపై సమున్నతంగా ఉండే గిరి.. మన శిరస్సు. అందులో సహస్రార చక్రం ఉంటుంది. ఆ సహస్రార కమలంలో నారాయణ పరబ్రహ్మాన్ని ప్రతిష్ఠించుకోవడమే యాదగిరిపై నెలకొన్న నృసింహుణ్ని దర్శించడం!


రేపు ఆరంభం కానున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో యాదగిరీశుడు వివిధ అలంకారాలతో, పలు వాహనాలపై దర్శనమిస్తాడు. ఈ ఉత్సవాలలో ప్రధానమైన తిరుకల్యాణం నేత్రపర్వంగా సాగుతుంది. ప్రహ్లాదుణ్ని అనుగ్రహించిన ప్రసన్నగిరిగా, మహర్షుల తపోస్థలి వేదగిరిగా, దేవతల ఆరాధన స్థలి దేవగిరిగా, భక్తుల అభీష్టాలు నెరవేర్చే దివ్యగిరిగా... యాదగిరి ఖ్యాతిగాంచింది!

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్

ఏఐ లక్ష్యం ప్రజాహితం కావాలి!

ఏఐతో సృష్టించిన చిత్రాలు, శబ్దాలు, సమాచారానికీ, వాస్తవ కంటెంట్‌కూ మధ్య తేడా తగ్గిపోవడం పలు సమస్యలకు కారణమవుతోంది. అందుకని కంటెంట్ సృష్టి, పంపిణీలో పౌరులు, కంపెనీలు బాధ్యతగా ప్రవర్తించేలా చూడటానికి కేంద్రం ఐటీ నిబంధనలకు సవరణలు చేసింది. ఈ నియమావళి వచ్చే శుక్రవారం నుంచి అమల్లోకి రానుంది. ఏఐ ప్రభావంపై అంతర్జాతీయ శిఖరాగ్ర సభకు భారత్ ఆతిథ్యమిస్తున్న వేళ ఏఐ దుర్వినియోగాన్ని కట్టడిచేసే కొత్త నియమాలు అమల్లోకి వస్తుండటం విశేషం.

ప్రజల నమ్మకం, ఆదరణలను చూరగొంటూ, బాధ్యతగా ఏఐని ఉపయోగించాలని భారత్ ఆశిస్తోంది. తాను నిర్వహిస్తున్న ఏఐ శిఖరాగ్ర సభకు తదనుగుణమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించింది. ఏఐ ప్రభావ సభలో చర్చిస్తున్న సూత్రాల్లో 'ప్రజాహితం' ఒకటి. ఏఐని మానవ ప్రగతి కోసమే ఉపయోగించాలని ఆ సూత్రం నిర్దేశిస్తోంది. ప్రజల గౌరవ మర్యాదలకు భంగం కలగకుండా ఏఐని మానవాళి ఉమ్మడి ప్రయోజనాల కోసం భద్రంగా, విశ్వసనీయంగా ఉపయోగించాలని పేర్కొంటోంది. ఏఐ పర్యవేక్షణలో అన్ని దేశాలూ పాలుపంచుకోవాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఏఐ శిఖరాగ్ర సభ కార్యాచరణ సూత్రాలు నిర్దేశిస్తున్నాయి. ఏఐని సృజనాత్మక కార్యకలాపాలకు, ఉత్పాదకత వృద్ధికి కాకుండా ద్వేషానికి, సమాజానికి హాని కలిగించేలా వాడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతోంది. ఏఐని ఇలా ద్వంద్వ ప్రయోజనాలకు వాడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. తదనుగుణంగా కార్యాచరణ మొదలుపెట్టిన చాలా కొద్ది దేశాల్లో భారత్ కూడా ఉంది.




నవీకరణ సాధనంగా...

ఏఐ వల్ల లాభనష్టాలనేవి వినియోగించే సందర్భంపై ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు ఉత్పాదకత విషయంలో ఏఐ వాడకం ఎంతో ప్రయోజనాలను అందించినా- సమాచార సాధనాలు, విద్య, వైద్యం, పోలీసు విభాగాల్లో సమస్యాత్మకంగా పరిణమించవచ్చు. భారత ప్రభుత్వం ఏఐని ఆధునిక సాధనంగా ఉపయోగిస్తూనే, పౌరుల హక్కులకు భంగం కలగని రీతిలో దాన్ని వినియోగించడానికి నిబంధనలను తీసుకొస్తోంది. నకిలీలను, అసలైనవాటి మధ్య తేడాను గుర్తుపట్టలేనంతగా ఏఐతో కృత్రిమంగా తయారు చేసిన కంటెంట్, డీప్‌ఫేక్ ఆడియో, వీడియోలు నేడు విరివిగా పంపిణీ అవుతున్నాయి. దీన్ని కట్టడి చేయడానికి ఐటీ (మధ్యవర్తులకు మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక ప్రమాణాల కోడ్) నియమావళిని ఇటీవలే భారీగా సవరించింది. 2021నాటి నిబంధనలకు తగిన సవరణలు చేసి అమలులోకి తెస్తున్న ఈ నియమావళి 'కృత్రిమంగా ఉత్పన్నం చేసిన సమాచారం(ఎస్‌జీఐ)' అంటే ఏంటో స్పష్టంగా నిర్వచించింది. సాధారణ డిజిటల్ ఎడిటింగ్, సృజనాత్మక అభివ్యక్తికి కంటెంట్ తయారు చేయడం వంటివి ఎస్‌జీఐ పరిధిలోకి రావు. విద్యాబోధన కోసం ఆడియో, వీడియోలతో తయారు చేసే కంటెంట్, రోజువారీ వృత్తి వ్యాసంగాల్లో భాగంగా చేసే డిజిటల్ ఎడిటింగ్, పత్రాలకు మెరుగులు దిద్దడానికి చేసే ఎడిటింగ్ వంటివీ ఎస్‌జీఐ కిందకు రావు. దురుద్దేశంతో ఏఐని ఉపయోగించి చేసే కంటెంట్ సృష్టి, ఎడిటింగ్‌లను మాత్రమే ఎస్‌జీఐగా పరిగణిస్తారు.

ఫలానా కంటెంట్‌ను, ఏఐని ఉపయోగించి తయారు చేసినట్లు డిజిటల్ వేదికలు స్పష్టంగా ప్రకటించాలని కొత్త నియమావళి నిర్దేశిస్తోంది. అలాగే కంటెంట్ ఆన్‌లైన్‌లో పంపిణీ అవుతున్నప్పుడు అది ఏఐతో ఎలా ఏర్పడిందనేది గుర్తించడానికీ, దాని మూలాన్ని తెలుసుకోవడానికీ మెటాడేటా, వాటర్ మార్కింగ్ సాంకేతికతలను ఉపయోగించాలని కూడా ఈ నిబంధనావళి పేర్కొంటోంది. ఇలా జనరేటివ్ ఏఐకి పారదర్శకతను తీసుకురావడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఫలానా కంటెంట్ ఏఐతో రూపొందించినదని తెలిస్తే వినియోగదారులు జాగ్రత్తపడతారు. ఏఐ సాయంతో సృష్టించిన కంటెంట్‌ను అప్‌లోడ్ చేసేవారు అది కృత్రిమమని ప్రకటించాలి. డిజిటల్ వేదికలు తాము పంపిణీ చేయబోయే కంటెంట్ అసలుదా, నకిలీయా అనేది తనిఖీ చేసుకుని, ఆ సంగతిని బహిరంగంగా ప్రకటించాలి. ఇలా వ్యక్తులు, సంస్థలూ జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిన తరుణం ఆసన్నమైంది. వినోదం, వ్యంగ్యం లేదా సృజనాత్మక అభివ్యక్తికి ఏఐ సాధనాలతో ప్రయోగాలు చేసేవారు తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తే చట్టం శిక్షిస్తుందని గ్రహించాలి. అలాగే కంటెంట్ సృష్టికర్తకూ వినియోగదారులకూ మధ్యవర్తులైన డిజిటల్ వేదికలు అవాంఛనీయ కంటెంట్ వ్యాపించకుండా తగిన సాంకేతిక జాగ్రత్తలు తీసుకోవాలి. హానికరమైన కృత్రిమ కంటెంట్‌ను; అశ్లీల వీడియోలు, చిత్రాలను, బాలలపై లైంగిక అకృత్యాలు, డీప్‌ఫేక్‌ల పంపిణీని ముందే అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలి. ఏఐని ఇలాంటి అవాంఛనీయ కార్యకలాపాలకు వినియోగిస్తే చట్టపరమైన చిక్కులు తప్పవని యూజర్లను తరచూ హెచ్చరించాలని కూడా తాజా మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఇలాంటి కంటెంట్‌ను తొలగించాలని అధికారులు కోరితే సత్వరమే స్పందించాలి.

వ్యవస్థాగత నియంత్రణ దిశగా...

కృత్రిమ కంటెంట్‌పై ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని సవరించిన ఐటీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అవాంఛనీయ కంటెంట్‌ను పసిగట్టి తొలగించిన సందర్భాల్లో ఆయా డిజిటల్ వేదికలు చట్టపరంగా బాధ్యులు కాబోవని కూడా కొత్త నిబంధనలు భరోసా ఇస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ దిగ్గజాలు... డాల్ ఇ, గ్రోక్ వంటి ఏఐ జనరేటివ్ సాధనాలపై ఈ సవరించిన ఐటీ నిబంధనల ప్రభావం ఎక్కువగా ఉండనుంది. వినియోగదారులు, కంటెంట్ సృష్టికర్తల మధ్య తేడా చెరిగిపోతున్న ఈ రోజుల్లో నైతిక ప్రమాణాలను పాటించడం తప్పనిసరి అని ఐటీ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఇక ఏఐ నియంత్రణకు స్వతంత్ర సంస్థ ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలి. ఐరోపా సమాఖ్య(ఈయూ) ఏఐ చట్టం ఇలాంటి సంస్థ ఏర్పాటును నిర్దేశిస్తోంది. పౌరుల భద్రత, హుందాతనం, విశ్వసనీయతలకు భంగం కలగని రీతిలో కృత్రిమ మేధను ప్రోత్సహించాలి. ఈ దిశగా చర్యలు తీసుకోవడంపై ఏఐ అంతర్జాతీయ శిఖరాగ్ర సభ దృష్టిపెట్టాలి.



ఈదర రవికిరణ్

ఐఆర్ఎస్ అధికారి,

మీడియా, టెక్నాలజీ చట్టాల పరిశోధకులు

(అభిప్రాయాలు వ్యక్తిగతం)



కల... కన్నీటిలో కరిగిపోకుండా...

బాగా సంపాదించాలనీ భార్యాబిడ్డల్ని సుఖపెట్టాలనీ అందరూ కలలు కంటారు. అయితే అందుకు ఎలాంటి తోవను ఎంచుకుంటున్నామన్నదే ముఖ్యం. ఈమధ్య కాలంలో కొందరు త్వరగా డబ్బు సంపాదించే మార్గంగా షేర్ మార్కెట్‌ను చూస్తున్నారు. అది అవగాహనారాహిత్యమే తప్ప నిజం కాదు. ఫలితంగా షేర్ మార్కెట్ ఒక 'అవకాశం'గా కాకుండా, వ్యసనంగా మారుతోంది. పరిస్థితి విషమించి ప్రాణనష్టానికి దారితీస్తున్న సంఘటనలూ చూస్తున్నాం.

షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడం తప్పు కాదు. కాకపోతే ఎంతో అధ్యయనం తర్వాత ఆ పని చేయాలి. నిపుణుల సలహా తీసుకుని కొంత మొత్తం పెట్టుబడిగా పెట్టుకోవాలి. అంతేకానీ అత్యాశకు పోయి దాచుకున్న డబ్బంతా పెట్టడం, అప్పులు చేయడం... లాభాలు వస్తాయని ఆశపడి కొంటూ, అమ్ముతూ అదే లోకంగా బతకడం మంచిది కాదు. రోజంతా మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల గురించే ఆలోచించడం, నష్టాలను దాచిపెట్టడం, విపరీతంగా అప్పులు చేయడం, కుటుంబ అవసరాలను పక్కన పెట్టడం, 'మార్కెట్ పెరిగితే డబ్బంతా ఒక్కరోజులో తిరిగొస్తుంది' అనే భ్రమలో ఉండటం... ఇవన్నీ కలిసి 'ఇంపల్స్ కంట్రోల్ డిజార్డర్'లా మారుతున్నాయి. అంటే జూదంలాంటి వ్యసనం అన్నమాటే. ఇలాంటి వ్యక్తుల్లో మానసికంగా మూడు దశలు కనిపిస్తాయి. లాభాలు వస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నా అంతటివాడు లేడన్నట్లు ఉంటారు. అదే నష్టాలు వస్తే ఆ వాస్తవాన్ని అంగీకరించలేక మరింత రిస్క్ తీసుకుంటారు. ఇంకా ఇంకా మార్కెట్‌లో పెడుతూనే ఉంటారు. చివరిది నిరాశ దశ- అప్పులు మిగులుతాయి. భయం, తప్పు చేశామన్న ఆలోచన, ఒంటరితనం... ఆవహిస్తాయి. ఈ దశలోనే ఆందోళన మొదలై డిప్రెషన్‌కి దారితీస్తుంది, ఆత్మహత్య ఆలోచనలు పుట్టుకొస్తాయి.


షేర్ మార్కెట్ వ్యసనం వ్యక్తిని మాత్రమే కాదు, మొత్తంగా కుటుంబాన్ని అతలాకుతలం చేస్తుంది. భాగస్వాముల మధ్య నమ్మకం పోయి విభేదాలు పొడసూపుతాయి. ఆర్థిక ఇబ్బందులు పెరిగి తరచూ గొడవలు పడుతుండటంతో ఇంట్లో తీవ్ర అశాంతి నెలకొంటుంది. పిల్లల చదువులు దెబ్బతింటాయి. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది. చాలాసార్లు కుటుంబ సభ్యులు ఇది కేవలం డబ్బు సమస్య అనుకుంటారు కానీ, నిజానికి ఇదొక మానసిక సమస్య. ఆ పరిస్థితిలో ఉన్న వ్యక్తిని నిందించడం వల్ల ప్రయోజనం ఉండకపోగా సమస్య మరింత తీవ్రమవుతుంది. సహానుభూతితో అర్థం చేసుకుని ప్రశాంతంగా కూర్చుని మాట్లాడాలి. ఆర్థిక నష్టాలకన్నా మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి. ట్రేడింగ్‌కు కచ్చితమైన హద్దులు పెట్టుకోవాలి. అవసరమైతే మానసిక వైద్యనిపుణుల సాయం తీసుకోవాలి. డబ్బు పోతే మళ్లీ సంపాదించవచ్చు కానీ ప్రాణం పోతే తిరిగి రాదు. షేర్ మార్కెట్‌లో నష్టపోయిన వ్యక్తికి కావాల్సింది సాంత్వన... దానినుంచి బయటపడటానికి అవసరమైన ధైర్యం, సహకారం. వ్యసనం దాకా వెళ్లకుండా చూసుకోవడమూ, వెళ్తే తిరిగి బయటపడేందుకు సహకరించడమూ... కుటుంబసభ్యుల చేతిలోనే ఉంది.

– చంద్రకళ వడ్లమూడి, కౌన్సెలింగ్ సైకాలజిస్టు

ఆ రకంగా కలిసొచ్చింది!



కొవిడ్ విజృంభణ పర్యాటకం, ఆతిథ్యం, రవాణా వంటి రంగాలను తీవ్రంగా దెబ్బతీసింది. అదే సమయంలో డిజిటల్ సేవలందించే ఐటీ, ఆర్థిక, ప్రొఫెషనల్ రంగాలు వేగంగా విస్తరించడానికి దోహదపడింది. ఇవన్నీ కలిసి సర్వీస్ సెక్టార్ నిర్మాణం, వృద్ధిలో కొత్త మార్పులకు కారణమయ్యాయి. ఐటీ సేవలు వంటివి అధిక విలువ కలిగినవి కాబట్టి కరోనా మహమ్మారి పీడ తొలిగిపోయిన తరవాత ప్రపంచ జీడీపీలో సేవా రంగ వాటా 65.1 శాతం నుంచి 66.3 శాతానికి పెరిగింది. కొవిడ్‌కు ముందు, ఆ తర్వాత వివిధ దేశాల జీడీపీలో సర్వీస్ సెక్టార్ వాటాలు (శాతాల్లో)...



(ఆధారం: ప్రపంచ బ్యాంక్ ప్రగతి సూచికలు)

హరి హరీ... కల్తీ నెయ్యి!

'ఏంట్రా ఆ మొహం అలా పెట్టావ్? ఉదయం కాలకృత్యాలు కష్టమైనట్లు! పొట్ట పాడైందా ఏంటి?'

'బుర్రపాడైంది గురువుగారు...'

'అంత ఆలోచన ఏం చేస్తున్నావ్? చేతిలో ఆ డబ్బా ఏమిటి?'

'నేతి డబ్బా గురువుగారు... ఉదయమే దోశ మీద గట్టిగా దట్టిస్తే, కమ్మటి నేతి వాసన బదులు, ఫ్యాక్టరీ గొట్టం నుంచి వచ్చే పొగ వాసన వచ్చింది'

'డబ్బా మారిపోయిందేమోరా...'

'కాదండీ. అందులో నెయ్యి మారిపోయింది. ఇందాకే వార్తలు చూశా, పేపర్ చదివా... అసలు విషయం అర్థమైంది'

'కాస్త వివరంగా చెప్పి తగలడు'

'ఆవులు, గేదెలు లేకుండా... అసలు పాలే లేకుండా పాపాల నెయ్యి తయారు చేశారట గురువుగారు'

'పిండి లేకుండా రొట్టె వస్తుందట్రా? పాలు లేకుండా నెయ్యి ఏంటోయ్! అదేదో ఫేక్ న్యూస్ అయ్యి ఉంటుంది'

'ఫేక్ న్యూస్ కాదండీ. ఫేక్ నెయ్యి... ఏళ్లపాటు ఏడుకొండల స్వామి నైవేద్యంలో వాడేసి కోట్లు కొల్లగొట్టేశారట'

'హరి హరీ... కల్తీ నెయ్యితో కలియుగ వైకుంఠవాసుడికి నైవేద్యమా? కలికాలం... అపచారం... అపచారం'

'మహాపచారం అనండి. తిరుమల శ్రీనివాసుడికే కాదు, శ్రీశైలం మల్లన్నకీ సమర్పించారట. దేవుళ్లకే దిక్కు లేదు. ఇక సామాన్యులం మన సంగతేమిటా అని?'

'మనకేమైందిరా...'


'లక్షల కిలోల నెయ్యి దేవుడికే పెట్టిన వాళ్లు, మార్కెట్లకు, షాపులకు పంపేసి మనకూ అమ్మేశారేమో... అని అనుమానం గురువుగారు'

'నీ అనుమానం తగలెట్టా... యద్భావం తద్భవతి అన్నట్లు అందుకే నీకు దోశ అలా పొగ వాసన వచ్చిందేమో. అలాంటిదేదీ ఇంకా తేల లేదు కదరా, కంగారు పడకు'

'తేలలేదనుకోండి. తర్వాత తేలుతుందేమో... అప్పుడు తెలిసినా చేసేదేముంటుందండీ'

'ప్రభుత్వానికి కూడా ఇంకా రాని డౌట్ నీకెందుకొచ్చిందిరా? కంగారుతో నాకూ కడుపులో కలకలం మొదలై కకావికలం అయ్యేట్లుంది'

'అయిదేళ్ల అరాచక కాలంలో బటన్ల నొక్కుడే మాయ అనుకుంటే, నెయ్యి కూడా నకిలీయేనా... దేవుడి ప్రసాదం తింటే పాపాలు పోతాయనుకుంటే, కల్తీ నేతి లడ్డుల్లో కలిసిన పదార్థాల గురించి వింటుంటే ఇప్పటి ప్రసాదం తిని ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సి వచ్చేట్లుంది గురువుగారు'



'కల్తీ నెయ్యి మనకు పంచేసి, క్యాసినోల్లో వాళ్లు చిందులేసుకున్నారు. అయినా... ఇప్పుడు నీ గోలేమిట్రా? సిట్ వాళ్లేదో దర్యాప్తు చేస్తున్నారుగా'

'అంత తేలిగ్గా తీసుకుంటారేంటి గురువుగారు? తిన్నది మనం, అరిగించుకున్నది మనం, అనర్థం కూడా మనకే కదా? ఏవో జంతు లక్షణాలు నాలో మొదలైనట్లు కంపరంగా ఉంది'

'దేవుడి ప్రసాదాన్ని కూడా కల్తీ చేసే పాపాత్ములుంటారని ఊహించలేదు కానీ, మనం ఎప్పటి నుంచో కల్తీలోనే బతుకుతున్నాం రా. పీల్చే గాలి కల్తీ, తాగే నీళ్లు కల్తీ, పసివాళ్లకు పట్టే పాలు కల్తీ, తినే ఉప్పూ పప్పూ అన్నీ కల్తీనే. వేసుకునే మందులూ కల్తీ, తిరుమలలో మహాపాతకానికి పాల్పడ్డారే వారి పాలన అంతా కల్తీ, ఆ పార్టీ నాయకుల వాగ్దానాలు కల్తీ...'

'మరి ధర్మం మాటేమిటి గురువుగారు?'

'ఇప్పుడు రాజకీయ నాయకుడు చెప్పిందే ధర్మం, చేసిందే ధర్మం... దేవుడి సాక్షిగా అని ప్రమాణం చేస్తాడు. ఆ దేవుడికే నామం పెడతాడు. దోశ తిరగేసినంత తేలికగా పార్టీలు మార్చేస్తాడు. పవర్ ఉంటే అలీబాబాలాగా దోచుకుంటాడు. లేకపోతే బోలేబాబాలాగా భజన చేస్తూ పక్క పార్టీలోకి వెళ్లిపోతాడు. డబ్బులు తీసుకుని కులమతాలు చూసుకుని ఓట్లు వేయడానికి అలవాటుపడిన జనం ఆ నేతల కుంభకోణాల గురించి వార్తల్లో వచ్చినంత కాలమే వర్రీ అవుతారు. ఆ తర్వాత అంతా వదిలేస్తారు'

'మరి వీళ్లకి శిక్షలు లేవా? దేవుడి ప్రసాదాలను కల్తీ చేసిన వారిని శిక్షించడానికి గరుడ పురాణంలో ఏమైనా ప్రత్యేక సెక్షన్లు ఉన్నాయా గురువుగారు?'

'ఉన్నాయిరా! దైవద్రోహానికి పాల్పడిన వాళ్లకి, భక్తుల నమ్మకాన్ని వంచించిన వారికి కుంభీపాకం అనే శిక్ష ఉంది. అంటే మరుగుతున్న నూనెలో వేయిస్తారు. ప్రసాదంలో రసాయనాలు కలిపినందుకు రౌరవ నరకంలో ప్రత్యేక శిక్షలకు ఏర్పాట్లు ఉన్నాయి'

'యమధర్మరాజుకు తెలియకుండా వేడెక్కకుండా ఆ నూనెనీ కల్తీ చేసేస్తారండీ ఈ ముదురు మహానేతలు'

'అంతటి వాళ్లేరా వీళ్లు..!'

– ఎమ్మెస్

ఈత కొలనులో దూసుకెళ్తోంది..!

ఊపిరి నియంత్రించుకోవాలి.. వేగంగా కాళ్లుచేతులు ఆడిస్తూ నీళ్లలో దూసుకుపోవాలి. ఇదంతా దేని గురించి అనుకుంటున్నారా? అదే నేస్తాలూ స్విమింగ్ గురించి.. నీళ్లలోకి దిగి స్విమ్ చేయాలంటే ఎంత సాధన చేయాలి.. ఎంతటి ధైర్యం కావాలి కదా! కానీ ఓ నేస్తం అందులో రికార్డులు సాధిస్తోంది..!

హైదరాబాద్‌కు చెందిన క్రరా శివానికి పద్నాలుగేళ్లు. తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆరేళ్ల వయసు నుంచే తనకు స్విమింగ్ అంటే చాలా ఇష్టమట. అందుకే అమ్మానాన్నలు స్వర్ణలత తేజ, రామ్‌లాల్ శిక్షణలో చేర్పించారు. తక్కువ సమయంలోనే తను పోటీల్లో పాల్గొంటూ పతకాలూ, బహుమతులూ అందుకుంది. 2021లో మొదటిసారి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచింది. అప్పటి నుంచి స్విమింగ్ మీద మరింత ఆసక్తి పెంచుకుని ఎలాగైనా మొదటి స్థానంలో నిలవాలని నిర్ణయించుకుంది. దాని కోసం మరింత ప్రాక్టీస్ చేసింది. స్విమింగ్‌లో రాటుదేలింది. ప్రాంతీయ, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో 1.5 కి.మీ., 200, 100 మీటర్లు.. ఇలా రకరకాల విభాగాల్లో పాల్గొంటూ ఇప్పటి వరకు 101 పతకాలు సొంతం చేసుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో పాల్గొంది శివాని. అందులో 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ రేసు టార్గెట్‌ను కేవలం 2.29.30 సెకన్లలో పూర్తిచేసి మొదటి స్థానంలో నిలిచింది. ఆరేళ్లుగా కర్ణాటకకు చెందిన రిధిమ పేరున ఉన్న రికార్డును బద్దలుకొట్టింది. స్విమింగ్ చేయాలంటే శారీరకంగా చాలా దృఢంగా ఉండాలి కదా! అందుకే తను రోజూ ఉదయాన్నే కచ్చితంగా వ్యాయామం చేస్తుందట. ఐస్‌క్రీమ్స్, చాక్లెట్స్ లాంటివి అస్సలు తినదు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో భారత్ తరఫున పాల్గొని బంగారు పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది శివాని. మరి మనమూ తనకు ఆల్ ది బెస్ట్ చెబుదామా!



– సీహెచ్.రామాంజనేయులు

హాయ్! బుజ్జీ!!

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. సరైన వాటిని కలిపి రాయండి చూద్దాం.


రంగు	బొమ్మ	పటం	జీవి
పువ్వు	లడ్డు	పాలు	రాయి
శాల	దానం	గాలి	పసుపు
రక్త	కొబ్బరి	పావు	కుంకుమ
కీలు	ఆవు	వింత	నక్షత్ర

అబ్బురం.. అభినందనీయం

- ఉండవల్లి రైతులను మెచ్చుకున్న బిల్‌గేట్స్
- సాగులో సాంకేతికత వినియోగంపై ప్రశంసలు

ఈనాడు – అమరావతి

సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో రైతుల చొరవకు గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అబ్బురపడ్డారు. సాగు విధానాల్లో ఇక్కడి రైతులు ముందంజలో ఉన్నారని ప్రశంసల వర్షం కురిపించారు. అత్యాధునిక వసతులు లేకపోయినా.. భద్రత ఆంక్షలు దాటుకుని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడితో కలిసి రాజధాని గ్రామం ఉండవల్లిలోని పొలంలో కలియ తిరుగుతూ రైతులతో ముచ్చటించి వారు చెప్పిన విషయాలు విన్నారు. రైతులు ఇచ్చిన వంటకాలు రుచి చూసి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక సేవలు ఎలా దరి చేరాయో రైతులే స్వయంగా ఆయనకు వివరించారు. డ్రోన్ సేవలను ఎలా వినియోగించుకుంటున్నదీ చూపించారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ప్రజెంటేషన్ చూసిన ఆయన.. స్వయంగా పొలంలోకి వెళ్లి యాప్ పనితీరు పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి అరగంట సేపు రైతులతో మమేకం కావడం. . వారిద్దరూ కొంతదూరం కాలినడకన తిరగడం... పలు అంశాలపై రైతులను అడిగి తెలుసుకోవడంతో స్థానికులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. బిల్‌గేట్స్ వంటి అంతర్జాతీయ స్థాయి వ్యక్తిని చూడడమే గగనమని, అలాంటిది ఆయనే స్వయంగా గ్రామానికి వచ్చి మాతో మాట్లాడడం ఎంతో ఆనందంగా ఉందని రైతులు ఉప్పొంగిపోయారు.


బిల్‌గేట్స్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్


అన్నదాతలతో బిల్‌గేట్స్, ముఖ్యమంత్రి చంద్రబాబు

రైతులతో లోకేశ్ కరచాలనం

ఉండవల్లిలో కార్యక్రమం ముగియగానే బిల్‌గేట్స్, సీఎం చంద్రబాబు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు రైతులున్న శిబిరం వద్దకు వచ్చి వారితో కరచాలనం చేసి.. ప్రతి ఒక్కరినీ పలకరించారు. దీంతో రైతులు ఉత్సాహంగా లోకేశ్‌తో మాటలు కలిపారు. ఆదివారం రాత్రి కొలంబోలో జరిగిన భారత్-పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ గురించి అడగ్గా బాగా ఎంజాయ్ చేశామని లోకేశ్ సరదాగా చెప్పారు. రాత్రి కొలంబోలో ఉన్న ఆయన ఉదయాన్నే అమరావతిలో బిల్‌గేట్స్‌కు స్వాగతం పలకడాన్ని రైతులు ప్రస్తావించగా.. లోకేశ్ నవ్వుతూ ప్రతిస్పందించారు. అనంతరం పొలంలోకి వెళ్లి అక్కడి రైతులు, గేట్స్ ఫౌండేషన్ యంత్రాంగం, సాంకేతిక సిబ్బందితో ఫొటోలు దిగారు. అక్కడే పనుల్లో ఉన్న మహిళా రైతులతో మాట్లాడారు. కొంత మంది రైతులు వినతులు ఇవ్వగా... తన సిబ్బందికి చెప్పి నమోదు చేయించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారిణి పద్మావతి, ఏడీఏ శ్రీనివాసరావు, ఉద్యానశాఖ డీడీ రవీంద్రబాబు పాల్గొన్నారు.


విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మంత్రులు సత్యకుమార్, అనిత, అచ్చెన్నాయుడు

యాప్ పనితీరు ప్రత్యక్షంగా పరిశీలించారు

ఏపీఏఐఎంఎస్ 2.0 యాప్ పొలంలో ఎలా పని చేస్తోందో బిల్‌గేట్స్‌కు ప్రత్యక్షంగా చూపించాం. రైతులు యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక వారికి అందుతున్న సేవలు, డ్రోన్‌లను బుక్ చేసుకోవడం, అవి మందులు, రసాయనాలు చల్లే విధానాలను ఆయన స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో రైతుల కోసం అమల్లోకి తీసుకొచ్చిన ఈ యాప్ గురించి ఆయన తెలుసుకున్నారు. రైతులు - బిల్‌గేట్స్ మధ్య ముఖాముఖిని అనువాదం చేసి వినిపించా.

– ఆలమూరు సౌమ్య, ఎథినా ఇన్ఫోనామిక్స్ సంస్థ ప్రతినిధి, గేట్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు

2,028 టన్నుల యూరియా నిల్వలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ పంటల సాగు నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి రానున్న నాలుగు రోజులకు 788 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 2,028 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డీఎంఎఫ్ విజయకుమారి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఆమె వివరించారు.

పెండింగ్ అర్జీలపై సమీక్షించుకోండి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజలు అందజేసిన అర్జీల్లో ప్రతి సమస్య నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ.. జిల్లా అధికారులను ఆదేశించారు. పెండింగ్ అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహించారు. మొత్తం 145 అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో రెవెన్యూ క్లినిక్‌కు 62, పీజీఆర్ఎస్‌కు 83 వినతులు వచ్చినట్లు వివరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన వాటిలో పురపాలక శాఖకు 24, పోలీస్‌కు 18, డీఆర్డీఏకు 7, గృహ నిర్మాణానికి ఆరు, పీఆర్‌కు 4, వ్యవసాయ, ఆరోగ్య శాఖలకు మూడేసి చొప్పున అందాయి. విద్య, మార్కెటింగ్, విభిన్న ప్రతిభావంతులు, ఆర్ఐవో, రహదారులు.. భవనాల శాఖకు రెండేసి, విద్యుత్తు, ఆర్టీసీ, దేవాదాయ, పశు సంవర్ధక, డ్వామా, అటవీ, గ్రామీణ నీటి సరఫరా, నైపుణ్యాభివృద్ధి తదితర విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

వినమ్రులై.. విజేఈఈలై

మెయిన్ ఫలితాల్లో మనోళ్ల మెరుపులు



కానూరు, పోరంకి, విజయవాడ సిటీ, నందిగామ, న్యూస్‌టుడే: ఐఐటీ, ఎన్ఐటీలలో చదవాలనేది వారి ఆకాంక్ష.. కల సాకారానికి సంకల్ప సిద్ధితో అడుగులేశారు.. చక్కటి ప్రణాళిక.. నిరంతర కార్యాచరణతో దూసుకెళ్లారు. పాఠ్యాంశాలపై పట్టుతో నైపుణ్యాలు ఒడిసిపట్టారు. జేఈఈ మెయిన్ మొదటి విడత ఫలితాలలో నగరంలో శిక్షణ తీసుకున్న, నగరానికి చెందిన పలువురు విద్యార్థులు కూడా మంచి పర్సంటైల్‌తో మెరిశారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 37,200 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ మొదటి విడత రాశారు. సోమవారం ఎన్‌టీఏ ప్రకటించిన జేఈఈ మెయిన్ 2026 ఫలితాలలో నగరంలోని కడప విద్యార్థి పి.మోహిత్ 100 పర్సంటైల్‌తో జాతీయస్థాయిలో సత్తా చాటాడు. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 1,000 మందికి పైగా విద్యార్థులు 90 పర్సంటైల్ పైన సాధించారు. ఎక్కువ మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందే పర్సంటైల్ సాధించారు.

కె.హిమకర్

- 99.99 | విజయనగరం
- వెంకటరత్నం, సతీశ్ గోపాల్
- అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా విన్నా. తర్వాత వాటిని సాధన చేశా. ప్రతి రోజూ పన్నెండు గంటలకుపైగా చదివా.
- ముంబయి ఐఐటీలో సీఎస్ఈలో చేరటం

జి.సాయిసాత్విక్


- 99.99 | రామచంద్రపురం
- భారతి, శ్రీనివాసరావు
- నిత్యం 12 గంటలు చదివా. పరీక్షలు ప్రతిభ సామర్థ్య స్థాయిని తెలిపాయి. అన్ని అంశాలపై సమయం కేటాయించి పట్టు సాధించా.
- ముంబయి ఐఐటీలో సీఎస్ఈలో చేరడం

ఎం.సాకేత్

- 99.99 | కడప
- నిర్మలాదేవి, వెంకట సుబ్బారెడ్డి
- సందేహాలను ఎప్పటికప్పుడు అధ్యాపకులతో నివృత్తి చేసుకోవడం. ఆన్‌లైన్‌లో పరీక్షల సాధన, క్లిష్ట సమస్యలను ఎక్కువగా సాధన చేయడం.
- ముంబయి ఐఐటీలో సీఎస్ఈ చదవడం.

పి.ప్రవీత్ చెన్న కేశవ్

- 99.99 | గుంటూరు
- శారద, వెంకటేశ్వరరావు
- నిత్యం 12 గంటలు చదివా. గణితం మరింత సాధన చేశా. పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు రివైజ్ చేసుకున్నా
- ముంబయి ఐఐటీలో సీఎస్ఈలో చేరటం

సంగా జాగృత్

- 99.98 | తాడిగడప
- లక్ష్మీరమ, సుబ్బారావు
- రోజుకు 16 గంటలు కష్టపడి చదివా. బేసిక్ కాన్సెప్టులపై పట్టుతో మంచి పర్సంటైల్ సాధించా.
- ముంబయి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించటం.

ఎల్. సాయి కుష్వంత్

- 99.97 | కోదాడ, సూర్యాపేట జిల్లా
- నాగలక్ష్మి, రామారావు
- అన్ని పాఠ్యాంశాల్లో కాన్సెప్టులపై పట్టు సాధించా. అధ్యాపకులు తెలిపిన టెక్నిక్స్ ఉపయోగించి ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయటం.
- ముంబయి ఐఐటీలో సీటు సాధించటం.

ఎం.వేదచరణ్‌రెడ్డి

- 99.97 | కొప్పోలు, వైఎస్సార్ కడప జిల్లా
- శిరీష, వేణుగోపాల్‌రెడ్డి
- రోజుకు 14 గంటలు చదివా. ఎప్పటికప్పుడు అనుమానాల నివృత్తి, ఆన్‌లైన్ టెస్టులు ఎక్కువ సాధనతో నైపుణ్యాల పెంపు.
- ముంబయి ఐఐటీలో సీఎస్ఈ సీటు సాధించటం

చల్లా సాయివెంకట ఆదిత్య

- 99.80 | కృష్ణలంక
- నాగమణి, శివ
- స్టడీ మెటీరియల్‌తో ప్రణాళికతో చదివా. రోజుకు 14 గంటలు కష్టపడ్డా. చదువుపైనే దృష్టి పెట్టా.
- ముంబయి ఐఐటీలో సీటు సాధించటమే లక్ష్యం.

ఆకుల సాయివర్ష

- 99.47 | విస్సన్నపేట
- లక్ష్మి, శేషగిరిరావు
- గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినా.. అధ్యాపకుల శిక్షణతో అన్నింటా రాణించా. రోజుకు 18 గంటలు శ్రమించా.
- చెన్నై ఐఐటీలో సీటు సాధించటమే లక్ష్యం.

విద్యార్థి పేరు | పర్సంటైల్ | ఊరు | తల్లిదండ్రులు | శ్రమించిన తీరు | లక్ష్యం

హలధారీ.. ఇదిగో సేంద్రియ దారి!



"రసాయనాలతో నిండిన సాగు పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రకృతి సేద్యం వైపు రైతన్నను నడిపించేదుకు సేంద్రియ రైతోత్సవానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 50 వేల ఎకరాల్లో సేంద్రియ సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో రైతు సాధికార సంస్థ అడుగేస్తోంది." - ఈనాడు, అమరావతి

21, 22న రైతు ఉత్సవం నిర్వహణ

అవగాహన.. శిక్షణ.. ఆచరణ

- సేంద్రియ సాగు విస్తీర్ణం పెంచడం, మధ్యవర్తుల్లేని మార్కెటింగ్ చూపడమే ఉద్దేశం. 21న ఏ.కొండూరులో ప్రకృతి సాగుపై మేళా నిర్వహించనున్నారు.
- సేంద్రియ సాగులో విజయం సాధించిన రైతుల ఉత్పత్తులు, సేంద్రియ ఎరువులు, కషాయాలు ప్రదర్శిస్తారు. వీటి తయారీ విధానంపై రైతులకు శిక్షణ ఇస్తారు.
- మార్కెటింగ్‌కు ఈ-కామర్స్‌ను ఎలా వాడాలి.. నిబంధనలు ఏంటి? అధిక ధరకు అమ్ముకునే మార్గాలపై నిపుణులతో కూడిన స్టాళ్లు పెడతారు.
- యంత్రాలను ప్రదర్శించి వాటి ద్వారా పంటలకు విలువ జోడింపును వివరిస్తారు.
- సాగు నుంచి అమ్మకం వరకు సేంద్రియ సాగుపై ఏం చేయాలో వివరిస్తూ 15 స్టాళ్లు పెట్టనున్నారు.

జాతీయ రహదారుల్లో అమ్మకాలు..


- సేంద్రియ ఉత్పత్తులను రైతులే అమ్ముకొనే విధానం తెలిపేందుకు 22న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిపుణులు, ఉన్నతాధికారులతో సదస్సు నిర్వహిస్తున్నారు.
- జిల్లాలో ఎక్కువ ప్రాంతాలు జాతీయ రహదారుల వెంట ఉన్నందున హైదరాబాద్ రహదారిలో విజయవాడ నుంచి జగ్గయ్యపేట మధ్య ఆరు, తిరువూరు జాతీయ రహదారిపై 4 సేంద్రియ పంటల అమ్మక దుకాణాలు పెట్టి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తారు.
- ఎక్కువ కొనుగోలు సామర్థ్య ప్రాంతాల్లో సేంద్రియ రైతులు తమ ఉత్పత్తులు అమ్మేందుకు ప్రత్యేక వాహనాలను ఉంచుతారు. ఆన్‌లైన్‌లోనూ యాప్‌ల ద్వారా అమ్ముకునే విధానంపై శిక్షణ ఇస్తారు.

మరింత చైతన్యం తెచ్చేందుకే

సేంద్రియ సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ప్రజలకు ఆరోగ్యం అందించవచ్చు. రైతులు రసాయన సాగు వీడి ప్రకృతి సాగు బాట పట్టాలి. సేంద్రియ రైతోత్సవంలో ఎక్కువ మంది పాల్గొనాలి.

– శంకర్‌నాయక్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్

హరహర మహాదేవ.. శంభో శంకర...!





వేద మంత్రోచ్ఛరణల వైభవం.. మగువల కోలాట సంరంభం.. కనుల విందైన కళారూపాలు.. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ.. గంగా పార్వతీ సమేతుడై దుర్గామల్లేశ్వరస్వామి నగర వీధుల్లో ఊరేగారు. మహాశివరాత్రి పర్వదిన వేడుకల ముగింపు సందర్భంగా పాత బస్తీలోని కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన దుర్గామల్లేశ్వరస్వామి వారి రథోత్సవం దేదీప్యమైంది.

- ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

విజయవాడ-హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ బోగీలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ-హుబ్లీ మధ్య నడిచే రైలు నంబరు 17329/17330 ఎక్స్‌ప్రెస్‌ను అత్యాధునిక లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలతో సోమవారం నుంచి నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి భద్రతతో కూడిన ఈ బోగీల్లో ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. రెండు సెకెండ్ ఏసీ బోగీలు, మూడు థర్డ్ ఏసీ, 7 స్లీపర్, మూడు జనరల్, లగేజీ, దివ్యాంగులు, పవర్‌కార్‌తో కలిపి మొత్తం 16 బోగీలతో రైలు నడుస్తుందని చెప్పారు. సెకెండ్ ఏసీలో 52 బెర్తులు, థర్డ్ ఏసీలో 72 బెర్తులు, స్లీపర్‌లో 78 బెర్తులు ఉంటాయని తెలిపారు. రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా రైల్వే శాఖ పని చేస్తుందని తెలిపారు.

వేసవి డిమాండ్ తట్టుకునేందుకు విద్యుత్తు శాఖ సిద్ధం

12 ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

ఈ ఏడాది వేసవి విద్యుత్తు డిమాండ్ తట్టుకునేందుకు విద్యుత్తు శాఖ సన్నద్ధమైంది. ఏటా 20 నుంచి 30 శాతం విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉపకేంద్రాలు కొత్తవి ఏర్పాటు చేస్తారు. ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 12 ఉపకేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికి తగ్గట్టుగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపగా అనుమతులు లభించాయి.

విజయవాడకు అత్యవసరం

విజయవాడ నగరంలో ఏటా విద్యుత్తు సర్వీసులు గణనీయంగా పెరుగుతుంటాయి. వ్యాపార, హెచ్‌టీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. డిమాండ్‌కు తగినట్లుగా ఉపకేంద్రాలు ఉండాలి. అప్పుడు మాత్రమే అంతరాయాలు లేని విద్యుత్తు అందించవచ్చని అధికారులు అంటున్నారు. దీనిలో గవర్నర్‌పేట, గాంధీనగర్, రామరాజ్యనగర్ సెక్షన్ల పరిధిలో మూడు సెమీ ఇండోర్ ఉపకేంద్రాలు నిర్మించాలని నిర్ణయించారు. మిగిలిన 9 విజయవాడ రూరల్‌తో పాటు ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేశారు. మొత్తం కేంద్రాలకు దాదాపు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు విద్యుత్తు శాఖకు అనుమతులు లభించాయి.

వచ్చే రెండేళ్లను దృష్టిలో ఉంచుకుని..

ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా ఉంది. మరో 30 శాతం పెరిగినా నగరంలో తట్టుకునే వెసులుబాటు ఉంది. దీనికి మించి వినియోగం పెరిగితే వినియోగాన్ని కట్టడి చేయాల్సిందే. రెండేళ్లలో వచ్చే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది కొత్త ఉపకేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గవర్నర్‌పేటలో బీసెంట్ రోడ్డు అన్సారీ పార్కులో నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. ఏలూరు లాకులు వద్ద కాలువ గట్టులో ఉపకేంద్రం నిర్మాణానికి అనువుగా ఉంటుందని తేల్చారు. దీనికి జలవనరులశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఇక వన్‌టౌన్ ప్రాంతంలో డిమాండ్ కోసం రామరాజ్యనగర్‌లో మరో కేంద్రం నిర్మిస్తున్నారు. ఇక మిగిలిన జిల్లాలో 9 కేంద్రాల నిర్మించనున్నారు.


ఏలూరు లాకులు కూడలిలో ఉపకేంద్రం నిర్మించే స్థలం ఇదే..

సబ్ డివిజన్ల పరిధిలో..

విజయవాడ సబ్ డివిజన్ పరిధిలో గవర్నర్‌పేట, గాంధీనగర్, రామరాజ్యనగర్‌లో ఉపకేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గుణదల పరిధిలో ఎనికేపాడు, కానూరు పరిధిలో పోరంకి, యనమలకుదురు నూజివీడు పరిధిలో ఆగిరిపల్లి, ముసునూరు, తిరువూరు పరిధిలో గంపలగూడెం, ఇబ్రహీంపట్నం పరిధిలో ఇబ్రహీంపట్నం, నందిగామ పరిధిలో నందిగామ పట్టణం, చిల్లకల్లు సబ్ డివిజన్ పరిధిలో వత్సవాయిలో ఉపకేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

రాష్ట్ర ప్రజలపై మెండుగా శివయ్య ఆశీస్సులు



ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా రథం దగ్గరకు తీసుకొస్తూ..

విద్యాధరపురం, న్యూస్‌టుడే: శివయ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు పేర్కొన్నారు. పాతబస్తీలోని కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రథోత్సవాన్ని సీపీ రాజశేఖరబాబు దంపతులు ప్రారంభించారు. కల్యాణమూర్తులు ఇంద్రకీలాద్రి నుంచి గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి, పాతశివాలయం నుంచి భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, వసంత మల్లికార్జునస్వామి ఆలయం నుంచి గంగా, పార్వతీ సమేత మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో రథం సెంటరుకు మేళాతాళాలతో సంబంధిత ఆలయాల అర్చకులు తీసుకొచ్చారు. భక్తుల శివనామ స్మరణ మధ్య రథోత్సవం కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి మీదుగా తిరిగి రథం



బేతాళ నృత్యం



రథాన్ని లాగుతున్న సీపీ రాజశేఖరబాబు దంపతులు, ఈవో శీనా నాయక్, దుర్గగుడి ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ

సెంటరుకు చేరింది. అధిక సంఖ్యలో భక్తులు ఆదిదంపతులను దర్శించుకున్నారు. కోలాట, డప్పు వాయిద్యాలు, బేతాళ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బచ్చు వెంకటలక్ష్మీవర ప్రసాద్, రాజేష్, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద శర్మ, పాతశివాలయం ఈవో నటరాజన్ షణ్ముఖం, వసంత మల్లికార్జున స్వామి ఆలయ ఛైర్మన్ సుదర్శనరావు, ఈవో శ్రీనివాసరెడ్డి, డీసీపీ షిరీన్ బేగం, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరాలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా సదస్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: మహాశివరాత్రి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా సదస్యాన్ని సోమవారం నిర్వహించారు. లింగోద్భవ సమయంలో గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దివ్య లీలా కల్యాణాన్ని భక్తులు వీక్షించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ దంపతులు, ఈవో శీనానాయక్ దంపతులు, స్థానాచార్య శివప్రసాద శర్మ తదితరులు పాల్గొన్నారు.



క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు, పక్కన ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ దంపతులు, ఈవో శీనానాయక్ దంపతులు

ఈ వినతి వెనుక లక్షల కుటుంబాల కన్నీళ్లు ఉన్నాయి

ఇంటి పట్టాల పేరిట వైకాపా మోసం ● విచారణకు భాజపా డిమాండ్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో 2019-24 మధ్య పేదలకు జారీ చేసిన ఇళ్ల పట్టాలు చెల్లుబాటు కాలేదని, వీటిపై విచారణ చేపట్టాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లో జేసీ ఎస్.ఇలక్కియాకు వినతిపత్రం సమర్పించారు. అవి నకిలీ పట్టాలైతే.. వాటిని రూపొందించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. అడ్డూరి మాట్లాడుతూ.. 'ఈ వినతి వెనుక లక్షల కుటుంబాల కన్నీళ్లున్నాయి. కోట్ల మంది శాపనార్థాలున్నాయి. తరతరాలుగా మోసపోయిన జనజీవితాల ఆవేదన ఉంది.' అని పేర్కొన్నారు. ఉచితమంటూ నాటి వైకాపా ప్రభుత్వం పట్టాలు అందజేసింది. ఇల్లు వచ్చేస్తుందంటూ ఆశ చూపింది. తీరా ఆ పట్టాకు భూమి లేదు.. ఇల్లూ లేదన్నారు. ఇది ఎన్నికల మోసం, రాజకీయ నేరం కాదా? అని ప్రశ్నించారు. భూమి లేని పట్టాలు ఎన్ని, వాటిలో నకిలీలు ఉన్నాయా?, ఎవరు ఆ పట్టాలు తయారు చేశారు, వాటిపై సంతకాలు ఎవరివి, రాజకీయంగా లాభం పొందడానికి ఈ మోసానికి పాల్పడింది ఎవరు అని అడ్డూరి ప్రశ్నించారు. ఎన్నికల మోసం కింద కేసులు నమోదు చేయాలని, ప్రజలను మోసం చేసిన నాయకులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఇది అతి



జేసీ ఇలక్కియాకు వినతిపత్రం అందజేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు

పెద్ద రాజకీయ నేరమని అధికారులు గమనించి చిత్తశుద్ధితో పేదలకు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై అధికారులు ఉదాసీనంగా ఉండడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అందరికీ సొంత ఇల్లు ఉండాలని ప్రధాని మోదీ రాష్ట్రానికి లక్షల్లో ఇళ్లు కేటాయించారని, వీటిని నిర్వీర్యం చేస్తూ. . ఏపీలో పేదల ఆశలతో చెలగాటం ఆడటాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్టు అడ్డూరి శ్రీరామ్ తెలిపారు.

సీపీ కార్యాలయంలో తగ్గిన ఫిర్యాదులు



బాధితురాలి సమస్య వింటున్న డీసీపీ ఉదయరాణి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం కేవలం 47 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. రెండో శనివారం ఆ తరువాత మహా శివరాత్రి కావడం వల్ల చాలా మంది ఊర్లు వెళ్లారు. దీంతో ఫిర్యాదుదారులు గణణీయంగా తగ్గారు. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా 29 భూ/ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన వచ్చాయి. ఇవికాక కుటుంబ కలహాలపై 3, మోసాలపై 1, మహిళా సంబంధ నేరాలపై 3, దొంగతనాలపై 1, వివిధ సమస్యలపై 10 వచ్చాయి. వీటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి సత్వరమే పరిష్కరించాలని డీసీపీ ఉదయరాణి ఆదేశాలు జారీ చేశారు.

ఐలాపురం వెంకయ్యకు కన్నీటి వీడ్కోలు



భారీ జనసందోహం మధ్య అంతిమయాత్ర

దుర్గాఅగ్రహారం(సీతారాంపురం), న్యూస్‌టుడే: బీసీ ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య అంత్యక్రియలు సోమవారం అశ్రునయనాల మధ్య నిర్వహించారు. పలువురు ప్రముఖులు, నాయకులు, అభిమానులు ఆయన పార్థివ దేహాన్ని కడసారిగా దర్శించుకుని కన్నీటి వీడ్కోలు పలికారు. అనంతరం భారీ జన సందోహం మధ్య అంతిమయాత్ర ఘనంగా సాగింది. దుర్గా అగ్రహారంలోని వెంకయ్య నివాసం వద్ద నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెదేపా సీనియర్ నాయకులు వర్ల రామయ్య, నూర్‌బాషా సంక్షేమ సంఘం ఛైర్మన్ కె. నాగుల్‌మీరా, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ గౌడ్, హజరత్తయ్య గుప్తా, మాజీ మేయర్ తాడి శకుంతల, ఏఎంసీ విజయవాడ మాజీ ఛైర్మన్ అర్జా పాండురంగారావు, పేర్ని వెంకట్రామయ్య(నాని), నరహరిశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, వి.గురునాథం, పి.గౌతమ్‌రెడ్డి, బొప్పన భవకుమార్, కార్పొరేటర్ చలపతిరావు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘ పెద్దలు తదితరులు పాల్గొని వెంకయ్యకు నివాళులర్పించారు. వెంకయ్య ఇంటి వద్ద నుంచి గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురం మీదుగా కృష్ణలంక భ్రమరాంబపురం శ్మశానవాటిక వరకు భారీగా అంతిమయాత్ర సాగింది.

పలువురు ప్రముఖుల సంతాపం: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, వైకాపా అధినేత జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కాసు కృష్ణారెడ్డి తదితరులు చరవాణి ద్వారా ఐలాపురం వెంకయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మ్యూల్ అకౌంట్స్ కేసు నిందితుల కస్టడీ కోరుతూ పిటిషన్

విజయవాడ నేరవార్తలు: మ్యూల్ అకౌంట్ల కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నిందితులను ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ సైబర్ క్రైం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో రవికుమార్, స్టీఫెన్, బాజీ, శివ దుర్గాప్రసాద్‌లను సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. వీరి నుంచి మరింత సమాచారం తెలుసుకోవాల్సి ఉందని సైబర్ క్రైం పోలీసులు అంటున్నారు. కస్టడీకి ఇస్తే మరింత లోతుగా విచారించాల్సి ఉందని వీరిని అయిదు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ 3వ ఏజేసీజే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులకు నోటీసుల నిమిత్తం న్యాయాధికారి తిరుమలరావు కేసు విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

విదేశీ విడిదికి వచ్చేశాయ్!



కొమ్మలపై విహంగాలు

పెనుగంచిప్రోలు, నందిగామ(న్యూస్‌టుడే): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం వెంకటాపురం గ్రామం వందల ఏళ్ల నుంచి విదేశీ విహంగాల విడిదిగా గుర్తింపు పొందింది. ఏటా క్రమం తప్పకుండా వచ్చే వేప్ జాతి కొంగలు(వేప్ స్టార్క్స్) కోసం గ్రామస్థులు ఎదురుచూస్తూ ఉంటారు. ఆస్ట్రేలియా ఖండం నుంచి కొన్ని వేల కిలోమీటర్లు ఆహార అన్వేషణకు వచ్చే ఈ పక్షుల రాకతో గ్రామంలో సిరి సంపదలు వృద్ధిచెందుతాయని వారి నమ్మకం. కృష్ణా నది, మున్నేరు వాగును వేటకు ఎంచుకొని జీవించే ఇవి ఆరు నెలలు తరువాత తిరిగి వెళతాయి. అప్పటివరకు వీటికి గ్రామస్థులు ఏ హానీ తలపెట్టరు. పొడవాటి కాళ్లు, ముక్కు, రెక్కలు కలిగి తెలుపు, నలుపు, ఎరుపు రంగులతో చూడటానికి ఆకర్షణీయంగా ఉండే ఇవి ఇక్కడే సంతతిని అభివృద్ధి చేసుకొని, అవి రెక్కలతో ఎగిరేవరకు ఉండి కలిసి వెళతుంటాయి. కొంగను పోలి ఉంటూ మేకలా అరుస్తూ ఉండే ఇవి గ్రామస్థులకు నేస్తాలుగా మారటంతో వాటి జోలికి ఎవరూ వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. గతంలో వర్షాభావ పరిస్థితుల వల్ల ఒక ఏడాది కొన్ని విహంగాలే వచ్చి నీటి వనరులు లేక తిరిగి వెళ్లిపోయాయని, వందేళ్ల నుంచి వస్తూనే ఉన్నాయని గ్రామ సర్పంచి కూచి నర్సయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు మాదిరి వెంకటాపురాన్ని కూడా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

శకటం.. ప్రాణ సంకటం



ఈ చిత్రంలో వాహనాన్ని చూడండి.. షెడ్డులో ఉండాల్సిన కారు రోడ్డుపై తిరుగుతుందన్నట్లు ఉంది కదా. పూర్తిగా తుప్పు పట్టి ఎప్పుడు ఏ భాగం ఊడిపోతుందో తెలియని ఇలాంటి వాహనాలు రోడ్డుపైకి తీసుకొస్తే.. లోపల ఉన్నవారితోపాటు ఎదురుగా వచ్చే వారికీ ప్రమాదమే. గోతుల్లో దబదబ శబ్దాలు చేస్తూ వెళ్తున్న ఈ వాహనాన్ని చూసి జనం ఇదేమి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అండీ.. అంటే ఎవరు ఇచ్చారు..? అని జనం ముక్కున వేలు వేసుకుంటున్నారు. సోమవారం మైలవరం-విజయవాడ రహదారిలో కనిపించిన చిత్రమిది. - ఈనాడు, అమరావతి

ధర వరలు

వంకాయలు-20/22, టమాటా-14, బెండ-26, పచ్చిమిర్చి-48, కాకర-32, బీర-30/28, క్యాబేజీ-15/20, క్యాబేజీ-14, క్యారెట్-28, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుడు-26, దోస-18/28, సొర-8/10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-26, అల్లం-72, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-40, బీట్‌రూట్-24, కీరదోస-44, బీన్స్-54/60, క్యాప్సికం-60, చిలకడదుంప-26, నిమ్మ (డజను)-36/30, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25 (నిస్వల్ది). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (కిలో రూ.ల్లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

న్యాయవాదులకు రక్షణ కల్పించాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న ఏకే బాషా, చిత్రంలో సతీష్‌బాబు, సుధీర్‌బాబు, సుభాని, రాజ్యలక్ష్మి, ఆంజనేయులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో న్యాయవాది మహ్మద్ ఖదీర్ దారుణ హత్యను బెజవాడ బార్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల సంఘం ఖండించింది. సోమవారం బీబీఏ హాలులో బీబీఏ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో మానవ హక్కుల పరిరక్షణపై న్యాయవాదుల సమావేశం జరిగింది. న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకు గురైన న్యాయవాది స్వప్న తాజాగా ఖదీర్ హత్య కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి కేసులను త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని కోరారు. పోలీసులు మెతక వైఖరిని విడనాడి చట్టాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ కల్పించాలన్నారు. తిరుపతిలో రాష్ట్ర పౌర హక్కుల సంఘం సమావేశంలో పాత కార్టూన్‌ను ముద్రించారంటూ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అయిన కె.క్రాంతిచైతన్యపై తిరుపతి పోలీసులు అక్రమంగా దేశద్రోహం కేసు బనాయించడం సరికాదన్నారు. చిన్న తప్పులకు న్యాయవాదులపై దేశద్రోహం కేసులు పెట్టటాన్ని ఖండిస్తూ ఆ కేసును పునర్విచారించాలని తీర్మానం చేశారు. న్యాయవాదులు పిచుక శ్రీనివాస్, వేముల రవీంద్రనాథ్, సతీష్‌బాబు, రవిబాబు, సుభాని, రాజ్యలక్ష్మి, టి.ఆంజనేయులు, కె.వి.రంగారావు, పిల్లా శ్రీనివాసరావు, పలగాని రవి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -115 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206 చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

ప్రకటన

మా క్లయింటు ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, పటమటలంక, కృష్ణవేణి స్కూలు వెనుక, రాఘవ నగర్, శ్రీ సూర్య పార్క్ వ్యూ, ఫ్లాటు నెం. 304కు, డోరు నెం. 64-8-10/2కు కాపురస్తులు బాయనేని సుబ్బారావు గారి కుమారుడు బాయనేని సత్యనారాయణ గారి సంబంధిత పొందిన యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..

విశాఖ జిల్లా, విశాఖపట్నం, సీతమ్మధార, డాక్టర్స్ కాలనీ, ఫ్లాటు నెం. 51కు, ప్రస్తుత నివాసం: ఫ్లాటు నెం.ఎ1004, [illegible]

ఇట్లు ముప్పి శ్రీకాంత్, అడ్వకేట్ [illegible] తేదీ: 16-02-2026 ఫోన్ నెం. 9533830605

పూల్ ఫైనల్‌కు 'కేఆర్‌యూ' నెట్‌బాల్ జట్టు



తలపడుతున్న కృష్ణా (ఆరంజ్ జెర్సీ), దావణగెరి (గ్రీన్ జెర్సీ) వర్సిటీల క్రీడాకారిణులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక మారిస్ స్టెల్లా కళాశాలలో కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా నెట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య కృష్ణా విశ్వవిద్యాలయం (కేఆర్‌యూ) జట్టు పూల్ 'సి'లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మూడో రోజైన సోమవారం జరిగిన నాకౌట్ దశ పూల్ సెమీఫైనల్స్ మ్యాచ్‌ల్లో పూల్ 'ఎ'లో సావిత్రి బాయి పులే వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు... హరియాణా స్పోర్ట్స్ వర్సిటీ (హరియాణా) జట్టుపై, పూల్ 'బి'లో హేమచంద్ యాదవ్ వర్సిటీ (దుర్గ్) జట్టు.. అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్సిటీ (బిలాస్‌పూర్) జట్టుపై, పూల్ 'సి'లో కృష్ణా వర్సిటీ (ఆంధ్రప్రదేశ్) జట్టు.. దావణగెరి వర్సిటీ (కర్ణాటక) జట్టుపై, పూల్ 'సి'లో కవికులగురు కాళిదాస్ సంస్కృత వర్సిటీ (మహారాష్ట్ర) జట్టు.. సర్వజనిక్ వర్సిటీ (సూరత్) జట్టుపై, పూల్ 'డి'లో కాలికట్ వర్సిటీ (కేరళ) జట్టు... మంగుళూరు వర్సిటీ (కర్ణాటక) జట్టుపై విజయం సాధించి పూల్ ఫైనల్‌కు చేరుకున్నాయి. సీహెచ్ చరణ్‌సింగ్ వర్సిటీ (మీరట్), పంజాబ్ వర్సిటీ (చండీగఢ్), దిల్లీ వర్సిటీ (దిల్లీ) జట్లు గత ఏడాది తొలి మూడు స్థానాల్లో నిలవడంతో.. నేరుగా పూల్ ఫైనల్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఆతిథ్య వర్సిటీ జట్టు విజయపరంపర కొనసాగిస్తోంది. పూల్ 'డి'లో కాలికట్, మంగుళూరు వర్సిటీ జట్ల మధ్య పోటీ ఆసక్తిగా సాగింది. మంగళవారం పూల్ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. మధ్యాహ్నం నుంచి లీగ్ పోటీలు ప్రారంభమవుతాయని పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి జె.నవీన లావణ్యలత తెలిపారు.

ఏప్రిల్ 1లోగా 'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

సింధియా (విశాఖపట్నం), న్యూస్‌టుడే : అగ్నివీర్‌ల నియామకం-2027కు గాను ఏప్రిల్ ఒకటో తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని విశాఖపట్నం ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఒక ప్రకటనలో కోరింది. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపింది. రాత పరీక్ష తెలుగులో రాసే వెసులుబాటు ఉందని వెల్లడించింది. 21 నుంచి 27 ఏళ్లకు వయోపరిమితి పెంచడం జరిగిందని స్పష్టం చేసింది. మరిన్ని వివరాలకు 0891-2756959 ద్వారా సంప్రదించాలని విజ్ఞప్తి చేసింది. శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు అభ్యర్థులు దరఖాస్తులను నమోదు చేసుకోవాలని కోరింది.

నకిలీ విడిభాగాల కేసు దర్యాప్తు ముమ్మరం

పటమట, న్యూస్‌టుడే: అశోక్ లేల్యాండ్ నకిలీ విడి భాగాల విక్రయం కేసు దర్యాప్తును పటమట పోలీసులు ముమ్మరం చేశారు. ఆటోనగర్‌లోని మూడు దుకాణాల్లో కంపెనీకి చెందిన అసలు విడి భాగాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా నకిలీవి తయారు చేసి విక్రయిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆటో నగర్‌లో సుమారు 2 వేల మెకానిక్ షాపులు ఉన్నాయి. లారీల మరమ్మతుల కోసం ఇతర జిల్లాల నుంచి కూడా ఆటో నగర్‌కు వస్తుంటారు. దాన్ని అదనుగా చేసుకొని కొంతమంది దుకాణదారులు నకిలీ విడిభాగాలను విక్రయిస్తున్నారు. ప్యాకింగ్‌లో ఎలాంటి తేడా లేకుండా తయారు చేయడంతో కొనుగోలుదారులు కూడా కనిపెట్టలేకపోతున్నారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ☛ పోలీసులు స్వాధీనం చేసుకున్న విడి భాగాలు అచ్చం అశోక్ లేల్యాండ్ కంపెనీ భాగాలుగా ఉండడంతో నిర్ధారణ కోసం ఆ కంపెనీకి పోలీసులు లేఖ రాయనున్నారు. అసలు విడి భాగాలను పటమట పోలీసులకు అందజేస్తే.. వాటితో పాటు నకిలీ విడిభాగాలను ల్యాబ్‌కు పంపనున్నారు. వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారు. దుకాణదారులు మాత్రం తమ వద్ద బిల్లులు ఉన్నాయని పోలీసులకు చెబుతున్నారు. దిల్లీలో కొనుగోలు చేసినట్లు పేర్కొంటున్నారు.


కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి



బాలాజీ (పాత చిత్రం)

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని వినగడప శివారు తండాలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లకావతు బాలాజీ(65) సోమవారం మృతి చెందారు. బాలాజీ పదేళ్ల కిందట మూత్ర పిండాల వ్యాధికి గురై చికిత్స తీసుకుంటున్నారు. కూలి పనులపై జీవనం సాగిస్తున్న కుటుంబం కావడంతో ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే పరిస్థితి లేదని, దీంతో కొంత కాలంగా మంచానే ఉంటూ మందులు వేసుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో వ్యాధి ముదరడంతో చనిపోయారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. రెండు నెలల కిందటే ఇతని అల్లుడు సత్య కూడా కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. వినగడప తండాలో కూడా మూత్ర పిండాల బాధితులు అధికంగా ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. రైతు దుర్మరణం



మధుసూదనరావు

చౌటపల్లి(వీరులపాడు), న్యూస్‌టుడే: వీరులపాడు మండలం చౌటపల్లిలో సోమవారం ట్రాక్టరు నడుపుతూ ఇంటికి వస్తున్న రైతు గురిజాల మధుసూదనరావు(47) ప్రమాదవశాత్తు అదే ట్రాక్టరు కిందపడి మృతిచెందారు. పొలం పనులు ముగించుకొని వస్తున్న క్రమంలో జరిగిన ఈ ప్రమాదంలో మధుసూదనరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య, కొడుకు, వివాహమైన కూతురు ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత విశాఖ ఈస్ట్‌కోస్ట్ రైల్వే జట్టు

కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలోని కౌతవరం జడ్పీ హైస్కూల్ ఆవరణలో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్విటేషన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో విశాఖ ఈస్ట్‌కోస్టు రైల్వే జట్టు విజేతగా నిలిచింది. తెలంగాణా, ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 17 పురుష జట్లు ఈ పోటీలలో పాల్గొనగా లీగ్, సూపర్ లీగ్ దశలుగా నిర్వహించారు. విజేతగా విశాఖ రైల్వే జట్టు, రన్నర్‌గా చెన్నై ఐసీఎఫ్ జట్టు, మూడవ స్థానాన్ని చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ జట్టు, నాల్గవ స్థానాన్ని సికింద్రాబాద్ ఎస్‌సీఆర్ స్పోర్ట్స్ క్లబ్, ఐదవ స్థానాన్ని చెన్నై టీబీఆర్ తిరువత్తూర్ జట్లు సాధించాయి. విజేత విశాఖ జట్టుకు రూ.40 వేల నగదు, ట్రోఫీని ముఖ్యఅతిథి నాట్స్ మాజీ అధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.శివశంకర్, జీఈసీ ప్రిన్సిపల్ బి.కరుణకుమార్, వడ్లమూడి యుగంధర్, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, వడ్లమూడి దేశ్‌పతి, సమ్మెట నాగయ్య, మణికుమార్, రాంప్రసాద్, కృష్ణప్రసాద్, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన పింగళి లక్ష్మీనారాయణను సత్కరించారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

తిరువూరు

• తిరువూరు • మైలవరం



పర్యవేక్షిస్తున్న అచ్చారావు, ఏసుపాదం

రహదారి మరమ్మతు పనులు ప్రారంభం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మచిలీపట్నం- నూజివీడు- కల్లూరు రహదారి మరమ్మతులకు రూ.89 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని ఆర్అండ్‌బీ ఏఈ అచ్చారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలోని రేపూడి తండా, కుమ్మరికుంట్ల తండా, ఎ.కొండూరు తండాల్లో జరుగుతున్న పనులను ఆయన ప్రారంభించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ ఏసుపాదం పర్యవేక్షించారు.

డేటా ఎంట్రీ శిక్షణకు దరఖాస్తులు

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుపై రెండు నెలల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రంగారావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యులు కుసుమ కుమారి, రత్నశ్రీ

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

జి.కొండూరు, న్యూస్‌టుడే : అనురాగ్ హెల్త్ కేర్, వాసన సీతారావమ్మ అంజయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు కుసుమ కుమారి, రత్నశ్రీ గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు వారికి చేశారు. ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వాసన నాగమల్లేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' విజయవంతానికి పిలుపు

మైలవరం, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోరుతూ ఈ నెల 25న చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.బసవయ్య సోమవారం కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను ఇప్పటికైనా అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు, పెండింగ్ డీఏల చెల్లింపులు, సీపీఎస్ రద్దు వంటి సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నట్లు ఆయన చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: రెడ్డిగూడెం 2వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం...మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగబాబు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

? వెంకటాపురం గ్రామంలోని రెడ్ల బజారులో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నాం. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.**-వై.రామకృష్ణారెడ్డి, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. **- రాజా, గ్రామ పంచాయతీ కార్యదర్శి**

? మునగపాడు పాల కేంద్రం సమీపంలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురవడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నాం. **- కోటేశ్వరరావు గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. **- మనోజ్ పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు**

ఆలయంలో పూజలు

చందర్లపాడు, న్యూస్‌టుడే: పొక్కునూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సోమవారం సందర్శించారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులు దేవస్థానానికి వితరణగా సమర్పించిన నూతన రథం ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులు దేవినేనిని సత్కరించారు. గుడిమెట్లలో భక్తులు కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఊరేగింపు చేపట్టారు.

హుండీ కానుకల లెక్కింపు నేడు

జగ్గయ్యపేట గ్రామీణం: ముక్త్యాల శ్రీకోటిలింగ హరిహర మహాక్షేత్రంలో భక్తులు హుండీలో వేసిన కానుకలను మంగళవారం లెక్కించనున్నారు. ఉదయం దేవాదాయ, ధర్మాదాయ అధికారుల సమక్షంలో లెక్కిస్తున్నట్లు ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు తెలిపారు.

కాలువల కబ్జా.. అక్రమార్కుల దర్జా

జి.కొండూరు, న్యూస్‌టుడే



చెవుటూరులో ఆక్రమణకు గురైన ఎన్నెస్పీ కాలువ

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి శాశ్వత రాజధాని కావడంతో స్థిరాస్తి వ్యాపారం ఊపందుకున్న విషయం తెలిసిందే. దీనికి తోడు జి.కొండూరు మండలం సీఆర్‌డీఏ పరిధిలో ఉండడంతో స్థిరాస్తి వ్యాపారులు జోరుగా భూములు కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఇది ఒక ఎత్తైతే గ్రామాల చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములను రైతులు నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, నిబంధనలను తుంగలో తొక్కి రాళ్లు పాతేసి అందినకాడికి విక్రయించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ భూముల పక్కనే ఉన్న ఎన్నెస్పీ కాలువలను సైతం కలిపేసుకుని రహదారుల నిర్మాణం చేస్తు మరింత ఎక్కువ ధరకు అమ్ముకొనేందుకు ఉపక్రమిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇలా ఎన్నెస్పీ కాలువలను పూడ్చి వేస్తే భవిష్యత్తులో వ్యవసాయం చేసుకునేందుకు సాగు నీరందక ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదని అన్నదాతలు వాపోతున్నారు. పంట పొలాల్లో బోర్లు లేని వారు ఇప్పటికీ ఎన్నెస్పీ కాలువలు, చెరువులను ఆధారంగా చేసుకుని పంటల పండించుకుంటున్నామని కర్షకులు చెబుతున్నారు. కాలువలు కనుమరుగైతే పొలాలకు సాగు నీరందక బీడు భూములుగా మారే ప్రమాదముందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

నోటీసులు అందజేసి...

జి.కొండూరు పోలీస్ స్టేషన్ సమీపంలోని ఫర్హానా హోటల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన అనుమతులు లేని లేఔట్‌కు సంబంధించిన వ్యక్తి 40 అడుగుల రహదారిని నిర్మించేందుకు పక్కనే ఉన్న ఎన్నెస్పీ మైనర్ కాలువను కలిపేసుకున్నాడు. దాదాపు రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాత గ్రావెల్‌తో సరిచేశాక సమాచారం తెలుసుకున్న అధికారులు నోటీసులు అందజేశామని తెలిపారు. మరో చోట చెవుటూరు బైపాస్ రోడ్డు సమీపంలో శివసాయి హోటల్ ఎదురుగా ఎన్నెస్పీ కాలువను ఆక్రమించి లేఔట్‌కు దారి వేసుకున్నారు. ఎన్నెస్పీ మైనర్ కాలువ దాదాపు 45 అడుగుల వెడల్పుతో ఇరుపక్కల ట్రాక్టర్ వెళ్లే దారి ఉండాలి. ప్రస్తుతం ఆక్రమణల మూలంగా 10 అడుగుల వెడల్పు కూడా లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై సంబంధిత ఎన్నెస్పీ సహాయక ఇంజినీరు నారాయణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఆక్రమణ సమాచారం తెలుసుకుని రహదారి నిర్మాణం నిలిపేయాలని ఆక్రమణదారులకు నోటీసులు అందించామని చెప్పారు.



సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, విద్యార్థులు

మత్తు పదార్థాలు వద్దు.. జీవితమే ముద్దు

తిరువూరు, న్యూస్‌టుడే : సమాజాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి.శ్రీనివాసరావు సూచించారు. 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సైకిల్ యాత్ర సోమవారం తిరువూరులోని వాహిని ఇంజినీరింగ్ కళాశాల వద్ద నుంచి బైపాస్ రోడ్డు వై-జంక్షన్ మీదుగా కొనసాగి తిరిగి కళాశాల వద్దకు చేరుకుంది. అనంతరం కళాశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అడ్మిన్ డీసీపీ సరిత, రూరల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ ప్రసాదరావు, సీఐ.గిరిబాబు, ఎస్సైలు శశాంక్, గౌరీశ్వర్, సిబ్బంది, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని పలు వార్డుల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యత, గడువు లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకునేందుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

జి.కొండూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం, మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా వసంత వెంకట కృష్ణప్రసాద్ విజయం సాధిస్తే తమిళనాడులోని వేళాంగిణి ఆలయానికి వస్తామని మండలంలోని గ్రామాల తెలుగు తమ్ముళ్లు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జి.కొండూరు నుంచి సూదిరెడ్డి సురేష్, బీజేపీ నరసయ్య, బజ్జపురెడ్డి రాజు, భట్టిప్రోలు నాగేశ్వరరావు, మంతెన శ్రీనివాసరావు కారులో వేళాంగిణి బయలుదేరగా తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు వీరిని అభినందించి సాగనంపారు.



గోసవీడులో శివపార్వతుల కల్యాణం



గంపలగూడెం: క్రతువులో పాల్గొన్న భక్తులు



కొత్త రెడ్డిగూడెంలో గ్రామోత్సవం

వైభవంగా కల్యాణ మహోత్సవాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని గంపలగూడెం, గోసవీడు, వినగడప, పెనుగొలను తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై ఆసీనులై కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. సోమవారం ఆయా గ్రామాల్లో కల్యాణం జరిపించిన ఉత్సవమూర్తులను గ్రామోత్సవం చేశారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : కొత్త రెడ్డిగూడెం గ్రామంలోని కాశీ రామలింగేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి వారికి పూజలు చేశారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక పార్వతీ సమేత అమృత లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శాంతి కల్యాణం నిర్వహించారు. రాత్రికి రథోత్సవాన్ని భక్తుల కోలాటాల మధ్య సందడిగా చేపట్టారు. భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం మూలపాడులోని బాలత్రిపుర సుందరి సమేత విరూపాక్షేశ్వర స్వామి, గుంటుపల్లిలోని కాశీ విశ్వేశ్వర విశాలాక్షి, ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ ఏ.కాలనీ ఉమాసహిత శక్తి విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం రాత్రి లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం శివ కల్యాణం నిర్వహించారు.



జి.కొండూరులో కోలాట ప్రదర్శన



మూలపాడు విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో..



జి.కొండూరు : స్వామి రథం లాగుతూ..

కొనసాగిన తిరునాళ్లు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని శ్రీభ్రమరాంబికా మల్లేశ్వర స్వామి వారి తిరునాళ్లు రెండో రోజు సోమవారం సందడిగా జరిగింది. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. శర్మ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఆర్ఐ సుజాత, ఉత్సవ కమిటీ, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

19న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి ముఖాముఖి

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు పరిధిలోని 19 అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకురాలు(ఆయా) పోస్టుల భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19న తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 8 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని సీడీపీవో పి.కృష్ణకుమారి సోమవారం తెలిపారు.

చిన్న పురుగు.. ప్రాణానికి చేటు

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం నేడు

చిన్నారులు, విద్యార్థులకు బిళ్లల పంపిణీకి ఏర్పాట్లు

గంపలగూడెం, న్యూస్‌టుడే

కడుపులో నులిపురుగును నిర్లక్ష్యం చేస్తే చిన్నా, పెద్ద తేడా లేకుండా ప్రాణానికి చేటు తెస్తోంది. ఆహారంతో పాటు కడుపులోకి చేరి శరీరాన్ని నిస్సత్తువకు గురి చేస్తోంది. ఒకటి నుంచి 18 ఏళ్ల మధ్య వయసున్న బాలబాలికల్లో నులిపురుగు సమస్య తీవ్రంగా ఉంటుంది. దాన్ని కడుపులోనే నులిమేస్తేనే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ నేపథ్యంలో ఏటా రెండు సార్లు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, కళాశాలల్లోని విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు నులిపురుగు నిర్మూలనకు ఆల్బెండజోల్ బిళ్లలు మింగిస్తున్నారు. నేడు జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా చిన్నారులు, విద్యార్థులతో బిళ్లలు మింగించేందుకు వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది.

భోజనానంతరం..: తిరువూరు నియోజకవర్గంలో 264 అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన 12,886 మంది ఏడాది వయసు దాటిన చిన్నారులు, 314 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని 36,161 మంది విద్యార్థులకు మంగళవారం మధ్యాహ్న భోజనానంతరం ఈ బిళ్లలు మింగిస్తారు. నులిపురుగు కడుపులో వృద్ధి చెందితే చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, మలంలో రక్తం వంటి రుగ్మతలతో బాధపడతారు.

తిరువూరు నియోజకవర్గంలో నులిపురుగు మందుల పంపిణీ వివరాలు..

మండలం	అం	పిల్లలు	వి	విద్యార్థులు
గంపలగూడెం	77	3,200	84	6,876
ఎ.కొండూరు	54	1,857	58	4,620
విస్సన్నపేట	70	4,557	85	11,079
తిరువూరు	64	3,272	87	13,586

అం: అంగన్‌వాడీలు వి: విద్యాలయాలు

ఆరు నెలలకోసారి.. కడుపులో నులిపురుగుల నిర్మూలనకు ఆరు నెలలకోసారి బిళ్లలు మింగాలి. మాత్రలతో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. ఇప్పటికే బడులకు, అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేశాం. శరీరంలో నులి పురుగులు తిష్ఠ వేస్తే రక్తాన్ని పీల్చుతూ..ఆహార శోషణ జరగకుండా అడ్డుకుంటాయి.



- ఎ.కనకదుర్గాభవాని, చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు



వ్యాపారులతో మాట్లాడుతున్న చిట్టిబాబు, వాసు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : చౌక ధరలకు కూరగాయలు దొరకడంతో పాటు రైతుల పంటకు మంచి ధర లభింపజేసే ఆలోచనతో ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేసిందని కొండపల్లి పురపాలిక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. ఇబ్రహీంపట్నం రైతు బజార్‌ను ఏఎంసీ ఛైర్మన్ నర్రా వాసుతో కలసి ఆయన సోమవారం సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. ఇబ్రహీంపట్నం రైతుబజార్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అయితే వాటన్నింటిని స్థానిక వ్యాపారులు పోగొట్టాలని సూచించారు. అదే విధంగా దుకాణాల నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైజ్ఞానిక విషయాలు అలవర్చేందుకే పోటీలు



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న జవివే సభ్యులు

కొండపల్లి, న్యూస్‌టుడే : సైన్స్ ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో విస్తృతమైన ఆలోచన ధోరణి పెంపొందుతుందని వైద్యుడు సీతారామారావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ కమిటీ సమావేశం సోమవారం స్థానికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక విషయాలను అలవర్చేందుకు జనవిజ్ఞాన వేదిక 35 సంవత్సరాల నుంచి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తుందని చెప్పారు. వీటిల్లో ఇన్నోవేషన్- టెక్నాలజీ, పర్యావరణం- వ్యవసాయం వంటివి నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన గోడప్రతులను జవివే సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామేశ్వరరావు, సర్దార్ సాహెబ్, ప్రసాద్, నాగరాజు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరిస్తాం



సంఘ నేతలతో మాట్లాడుతున్న సుహాసిని

విజయవాడ పాతా సుపత్రి, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆశా కార్యకర్తల సమస్యలన్నీ తప్పక పరిష్కరిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని హామీ ఇచ్చారు. సోమవారం జిల్లాలోని పలు యూనియన్‌లకు చెందిన ఆశా కార్యకర్తలు వారి నాయకులతో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.

ఊటుకూరులో తరచూ ట్రాఫిక్ వెతలు



మండలంలోని ఊటుకూరులో ట్రాఫిక్ సమస్య తరచూ ఉత్పన్నమవుతోంది. సాయంత్రం వేళ వాహనాల రద్దీ అధికమై జనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంటుంది. మేజర్ పంచాయతీతో పాటు పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఊటుకూరు ప్రధాన కూడలిగా ఉంది. ఈ నేపథ్యంలో నెమలి వెళ్లే మలుపు నుంచి బస్టాప్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాయంత్రం వేళ గ్రామంలో పర్యటించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఊటుకూరు(గంపలగూడెం)**

గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సిమెంట్ పైపులు వేయిస్తున్న పంచాయితీ సిబ్బంది, పక్కన సర్పంచి కుటుంబరావు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో మురుగు పారుదల సక్రమంగా జరిగేందుకు కాలువలకు సిమెంటు పైపులు ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. సర్పంచి కుటుంబరావు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకాలు చూపుతున్న క్రీడాకారులు

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక పిట్‌జోన్ జిమ్ క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించినట్లు శిక్షకుడు వెంకట్రావు సోమవారం తెలిపారు. రాజమహేంద్రవరంలో ఆదివారం సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో ఎం.ఆశ్రిత కీర్తి, రజత పతకం, ఎం.శ్రీలక్ష్మి, వి.సువర్ణ వివిధ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. పలువురు అభినందించారు.

మద్యం దుకాణం తొలగించాలని వినతి

గొల్లపూడి, న్యూస్‌టుడే : కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని సెయింట్ బెనెడిక్ట్ పాఠశాల సమీపంలోని మద్యం దుకాణాన్ని తొలగించాలని గ్రామస్థుడు మెండెం జమలయ్య జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. బడి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని ఆయన చెప్పారు.

అరుణానగర్ వాసులకు నాయకుల మద్దతు

కొండపల్లి, న్యూస్‌టుడే: క్రషర్ లారీల రాకపోకలతో ఇబ్బంది పడుతూ నిరసన తెలియజేస్తున్న కొండపల్లి అరుణానగర్ వాసులకు సీపీఎం, సీఐటీయూ నాయకులు సోమవారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి అరుణానగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారని చెప్పారు. వీరి పోరాటానికి తాము మద్దతు ఇస్తున్నామని తెలిపారు. పురపాలిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అరుణానగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వృథా ప్రవాహం.. మట్టికే అంటూ ఆగ్రహం

పరస్పరం అధికారులకు ఫిర్యాదు

మైలవరం, న్యూస్‌టుడే

సాధారణంగా గ్రామాల్లోని చెరువుల్లో నీరుంటే అన్నదాతలు ఆనందంగా ఉంటారు. వ్యవసాయ అవసరాలకు సరిపడా భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశపడతారు. ఎక్కువ మొత్తంలో నీటిని నిల్వ చేసుకునేందుకు తంటాలు పడుతుంటారు. కానీ విచిత్రంగా మండల పరిధి గణపవరంలో అందుకు విరుద్ధంగా సాగుతోంది. తూము నుంచి నీరు వృథాగా పోతోంది. మట్టి తవ్వకాల కోసమే తరలిస్తున్నారని కొందరు, అదేం కాదు, తూముల నుంచి నీటి లీకులంటూ మరికొందరు పరస్పర ఫిర్యాదులతో వివాదంగా మార్చడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తూర్పు చెరువు నీటి సంఘం ఎన్నిక వివాదంగా మారి ఏడాది కాలంగా కమిటీ లేకుండా ఉంది. గ్రామంలోని వర్గపోరాటంతో తరచూ అక్కడి మట్టి తోలకాల పేరిట వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం చెరువు తూము నుంచి నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుంటే, అవసరం లేకున్నా నీరెందుకు వదిలారంటూ కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు మట్టిపై కన్నేసి కావాలని, రాత్రి వేళ నీటిని వృథాగా విడుదల చేస్తున్నారని అధికారులకు చెప్పారు. దాంతో తహసీల్దార్ అబ్దుల్ దరియా తమ సిబ్బందిని పంపి తూము బయటకు పోతున్న నీటిని వరిగడ్డితో పూడ్పించి ఆపేలా చేశారు. అయితే అది తాత్కాలికమేనని చెరువును ఖాళీ చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్‌ను సంప్రదించగా తూము నుంచి కొద్దిగా నీరు పోతుంటే ఆపించామని, లాకులు తెరవకుండా తాళాలను తమ సిబ్బంది స్వాధీనంలో ఉంచామని తెలిపారు. ఆరోపణలపై ఆరా తీస్తున్నామని చెప్పారు.



చెరువు కాలువ ద్వారా పోతున్న నీరు

ప్రకటన

నా క్లయింట్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా RACPC, విజయవాడ వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ కాపురస్తులు శ్రీ నూతలపాటి నారాయణరావు గారు వారి తాలూకు స్థిరాస్తులకు సంబంధించి ఒక రిజిస్టర్డ్ వీలునామా నెం. 154/1991 ద్వారా వారి కుమారుడు నూతలపాటి వెంకటేశ్వరరావుగారికి గొల్లపూడి గ్రామం నందలి రీసర్వే నెం. 551/1 దాఖలా య. 0.18ట్లు చెందచేసినారని తదుపరి నూతలపాటి వెంకటేశ్వరరావు గారు వారి కుమార్తె మరియు అల్లుడు అయిన పోలవరపు సత్యనారాయణ మరియు సీతారత్నం గార్లకి చ.గ. 227.33లు ఒక రిజిస్టర్డ్ దఖలు దస్తావేజు నెం. 1711/1999 ద్వారా దఖలు పరిచారని తదుపరి వారు సదరు స్థలమును శ్రీమతి కందుల వీరవెంకట సత్యవతి గారికి ఒక రిజిస్టర్డ్ దస్తావేజు నెం. 2941/2010 క్రింద విక్రయించినారని తదుపరి సదరు స్థిరాస్తిని శ్రీమతి కందుల వీర వెంకట సత్యవతి గారు వారి కుమారుడు శ్రీ కందుల నాగేశ్వరరావు గారికి దఖలు పరిచి ఒక రిజిస్టర్డ్ దఖలు దస్తావేజు నెం. 1879/2019 ద్వారా చెందచేసినారని తదుపరి సదరు స్థలమునందున 'SATYA PLAZA' పేరుతో ఒక అపార్ట్‌మెంట్ బిల్డింగ్ కట్టు నిమిత్తం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ కాపురస్తులు శ్రీ కంపా వెంకటేశ్వరరావుగారి భార్య శ్రీమతి కంపా వెంకటరమణ గారితో ఒక రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ నెం. 2442/2025 వ్రాసుకునినారని తదుపరి సదరు స్థలమునందున ఏవిధమైన డెవలప్‌మెంట్ చేయుని దరిమిలా శ్రీ కందుల నాగేశ్వరరావుగారు మరియు శ్రీమతి కంపా వెంకట రమణగార్లు సదరు పైన తెలిపిన రిజిస్టర్డ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్‌ను రద్దుపరచుకొనుచూ ఒక రిజిస్టర్డ్ రద్దు దస్తావేజు నెం. 177/2026 ద్వారా రద్దు పరచుకొనినారని, అటులనే ఇరువురు పార్టీలు ఎవరితో ఏవిధమైన లావాదేవీలు జరపలేదని, తదుపరి ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థలమునందున శ్రీ కందుల నాగేశ్వరరావు గారు బిల్డింగ్ కట్టు నిమిత్తం నా క్లయింటు బ్యాంకు వారిని ఋణము మంజూరు చేయుమని కోరుచున్నారు. కావున సదరు దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు గాని, క్లయిములు గానీ, చట్టప్రకారం చెల్లదగిన అభ్యంతరములు గాని ఉన్న యెడల నాకు 7 దినములలోగా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా తెలియజేయవలెను. లేనిచో సదరు ఆస్తి నిర్వివాదమైనదని భావించి సదరు ఆస్తిని తనఖాగా ఉంచుకొని నా క్లయింట్ బ్యాంకు వారు ఋణము మంజూరు చేయుదురు. తదుపరి వచ్చు క్లయిమ్‌లు గానీ, లేక అభ్యంతరములు గానీ లా ప్రకారం చెల్లవు మరియు నాక్లయింట్ బ్యాంకు వారిని బైండు చేయజాలవు.

షెడ్యూలు: యన్.టి.ఆర్. జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ పంచాయితీ ఏరియాలోని గొల్లపూడి గ్రామ ఆర్.ఎస్.నెం. 551/1 దాఖలా చ.గ. 213లు స్థిరాస్తి ఖాళీనివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** పోలవరపు సీతారత్నం గారి ఆస్తి, **దక్షిణం:** దేవినేని ఉమామహేశ్వరరావు, నెల్లూరు దుర్గారాణి గార్ల ఆస్తి, **పడమర:** పంచాయితీవారి బజార్, **ఉత్తరం:** నడిపినేని శివరామకృష్ణ, విజయలక్ష్మి గార్ల ఆస్తి.

ఇట్లు: **పాదర్తి పూర్ణచంద్రరావు, అడ్వకేట్, F.F.-1, LRK టవర్స్, రామాలయంవీధి, కృష్ణలంక, విజయవాడ-13. Ph: 98482 30004.**

అన్నదాతలకు ఏఐ అగ్రిటెక్ సేవలు భేష్



రాష్ట్ర ప్రభుత్వానికి బిల్‌గేట్స్ ప్రశంసలు

- చంద్రబాబుతో కలసి వ్యవసాయక్షేత్రం సందర్శన
- సాగులో యాప్, డ్రోన్ల వినియోగాన్ని చూపించిన రైతులు



ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు ఏపీఏఐఎంఎస్ యాప్ పనితీరును వివరిస్తున్న మహిళా రైతు అన్నపూర్ణ



అరటి తోటలో చీడ పట్టిన మొక్కకు పురుగుల మందు పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, బిల్‌గేట్స్



ఈనాడు, అమరావతి: వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ ఆధారిత యాప్ సేవలు అద్భుతంగా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ కితాబిచ్చారు. యాప్‌లో రైతు రిజిస్ట్రేషన్ నుంచి సేవలు పొందడం వరకు మొత్తం ప్రక్రియను మహిళా రైతు వివరించగా ఆయన ఆసక్తిగా విన్నారు. డ్రోన్ ద్వారా అరటి తోటకు రసాయనం పిచికారీ చేసిన వైనాన్ని ప్రత్యక్షంగా చూసి అభినందించారు. సోమవారం మధ్యాహ్నం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి బిల్‌గేట్స్ ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రానికి చేరుకున్నారు. రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాలను వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆయనకు వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాగు ఖర్చు తగ్గింపు, దిగుబడి పెంపు, నాణ్యమైన ఉత్పత్తుల ఎగుమతితో రైతులకు అధికాదాయం సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో విశ్లేషణ, మానిటరింగ్ డాష్‌బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. సేంద్రియ సాగు విధానంలో పండించిన ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శనను బిల్‌గేట్స్ పరిశీలించారు. అక్కడి నుంచి సమీపంలోని శిగిరిశెట్టి మణి, అన్నపూర్ణ దంపతులు సాగు చేసిన అరటితోటకు కాలినడకన వచ్చారు. రైతు దంపతులు బిల్‌గేట్స్‌కు బొట్టు పెట్టి కండువా కప్పి ఆహ్వానం పలికారు. ప్రభుత్వం రూపొందించిన ఏపీఏఐఎంఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకుని.. ఏ పంటలు పండించాలి, సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, చీడపీడలు, రసాయనాల పిచికారీ వంటి విషయాలు సులభంగా తెలుసుకుంటున్నామని అన్నపూర్ణ ఆ యాప్‌ను సెల్‌ఫోన్‌లో చూపిస్తూ బిల్‌గేట్స్‌కు వివరించారు. ఆయన సమక్షంలోనే రైతులు ఏఐ టూల్ ఉపయోగించి వ్యాధి సోకిన మొక్క ఫొటో తీసి అప్‌లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట అది రసాయనం పిచికారీ చేసింది. ఇవన్నీ ప్రత్యక్షంగా పరిశీలించిన బిల్‌గేట్స్.. రైతులకు ఏఐ-అగ్రిటెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. స్థానిక రైతులతో ఆయన మాట్లాడారు. అన్నదాతలు అరటి, దానిమ్మ, జామ, మామిడి కాయల బుట్టను బిల్‌గేట్స్‌కు అందించారు. అన్నపూర్ణ అనే మహిళ ఇంట్లో వండి తెచ్చిన పునుగులు, కొబ్బరిచట్నీని బిల్‌గేట్స్ రుచి చూశారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేశ్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో స్థానిక మహిళ ఇచ్చిన పునుగులను రుచి చూస్తున్న బిల్‌గేట్స్




బిల్‌గేట్స్ పర్యటన సందర్భంగా ఉండవల్లిలోని వ్యవసాయక్షేత్రానికి తరలివచ్చిన అమరావతి రైతులు

చాలా సంతోషంగా ఉంది



బిల్‌గేట్స్ వంటి మహోన్నతమైన వ్యక్తి మా పొలానికి రావడం చాలా సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు, బిల్‌గేట్స్‌కు మా పేర్లు చెప్పి పరిచయం చేసుకున్నాం. అర ఎకరంలో చక్కరకేళీ రకం అరటి మొక్కలు 600 సాగు చేశామని చెప్పాం. రూ.80 వేలు ఖర్చు కాగా సుమారు రూ.1.80 లక్షల సొమ్ము వస్తుందని వివరించాం. ఏపీఏఐఎంఎస్ యాప్‌లో మా పంట పొలాల వివరాలన్నీ చూపించడంతో పాటు చీడపీడలు కనిపిస్తే ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే పంటకు ఏ తెగులు వచ్చింది? ఏ మందు ఎంత వాడాలో ఏఐ ఎలా చెబుతుందో, దాన్ని పిచికారీ చేయడానికి యాప్‌లోనే డ్రోన్ ఎలా బుక్ చేయాలో అవన్నీ తెలుగులో చెప్పాం. బిల్‌గేట్స్ ప్రతినిధి సౌమ్య ఆంగ్లంలోకి అనువదించి ఆయనకు చెప్పారు. ఆయన మమ్మల్ని అభినందించడం మరచిపోలేని అనుభూతి.

- శిగిరిశెట్టి మణి, అన్నపూర్ణ దంపతులు




హలో నేస్తం.. బాగున్నారా!

గేట్స్, చంద్రబాబు మధ్య ఆత్మీయ పలకరింపు

ఈనాడు-అమరావతి: 'హలో మై ఫ్రెండ్. హౌ ఆర్‌యూ..' అంటూ చంద్రబాబుకు బిల్‌గేట్స్ పలకరింపు. 'గుడ్' అంటూ సీఎం చంద్రబాబు సమాధానం. ఇద్దరు పాత మిత్రుల ఆత్మీయ పలకరింపులకు సచివాలయం వేదికైంది. గన్నవరం విమానాశ్రయం నుంచి సచివాలయానికి చేరుకున్న ఆయనకు సీఎం చంద్రబాబు ఆత్మీయ స్వాగతం పలికారు. గత కలయిక.. ఆనాటి జ్ఞాపకాలను ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. పంటల సాగు విధానాన్ని పరిశీలించారు.

బిల్‌గేట్స్ పర్యటనలో ఆసక్తికర అంశాలు..

- బిల్‌గేట్స్‌పై ఉన్న అపార గౌరవంతో గన్నవరం విమానాశ్రయంలో ఆయనకు స్వాగతం పలికేందుకు లోకేశ్ సహా ఐదుగురు మంత్రులను సీఎం పంపారు.
- సచివాలయం మొదటి బ్లాక్‌కు వచ్చిన గేట్స్‌ను సీఎం చంద్రబాబు స్వయంగా వచ్చి తోడ్కొని వెళ్లారు.
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర కేబినెట్ మంత్రులను సీఎం పరిచయం చేశారు.
- అల్పాహార సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన గేట్స్‌కు తన ఛాంబర్‌లోని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని చూపారు. తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని ఆయనకు వివరించారు.
- ప్రభుత్వ పాలనా వ్యవహారాలు.. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వినియోగిస్తున్న తీరును ఉదాహరణలతో సహా వివరించారు.
- గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు పురోగతిని సీఎం వివరించగా గేట్స్ మెచ్చుకున్నారు. ఆరోగ్యరంగంలో ఏఐ వినియోగం బాగుందని పేర్కొన్నారు.
- వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే పేద వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని గేట్స్ అభిప్రాయపడ్డారు.
- డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు సేవలు సులభతరం చేయడాన్ని అభినందించారు.
- రాజధాని అమరావతి ప్రణాళికలు.. 'బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌'తో భవిష్యత్తు నగరంగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకుని గ్రేట్‌వర్క్ అంటూ మెచ్చుకున్నారు.
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాజధాని నిర్మాణ ప్రణాళికలను సీఎం గేట్స్‌కు వివరించారు. ఈ ప్రాంతంలో మొత్తం గ్రీన్ ఎనర్జీ వినియోగించే దిశగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు.



సోమవారం అమరావతిలోని సచివాలయంలో బిల్‌గేట్స్‌తో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



సచివాలయంలో నిర్వహించిన అల్పాహార భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, బిల్‌గేట్స్. చిత్రంలో మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్ర, గేట్స్ ఫౌండేషన్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్, ఆఫ్రికా, ఇండియా కార్యాలయాల ప్రెసిడెంట్ అంకుర్ వోరా, గేట్స్ ఫౌండేషన్ ఇండియా డైరెక్టర్ అర్చనా వ్యాస్



సచివాలయంలో బిల్‌గేట్స్‌కు తన ఛాంబర్‌లోని వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని చూపిస్తున్న చంద్రబాబు

ఏపీ మీట్స్ బిల్‌గేట్స్

ఈనాడు - అమరావతి: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించొచ్చని, నిపుణుల వైద్య సేవలు మారుమూల ప్రాంతాలకు కూడా చేర్చవచ్చని గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్‌గేట్స్ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఏపీలో మాదిరిగా వ్యవసాయంలో ఏఐని ఉపయోగించడంలేదని, టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమని గేట్స్ ప్రశంసించారు. చంద్రబాబు నాడు ఐటీని ప్రమోట్ చేయడం వల్లే టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచి వచ్చేవారని వివరించారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగుల్లో హైదరాబాద్‌వారే ఎక్కువన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం సచివాలయానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తదితర మంత్రులు ఘన స్వాగతం పలికారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్‌ను గేట్స్ బృందం పరిశీలించింది. సెంటర్ ప్రత్యేకతను బిల్‌గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం సీఎం ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో బిల్‌గేట్స్ పాల్గొని మాట్లాడారు. పలువురు మంత్రులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ చంద్రబాబు


- 'విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థను ఏపీలో ఏర్పాటు చేయడం బాగుంది' అని బిల్‌గేట్స్ ప్రశంసించారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని చెప్పారు.
- 'మైక్రోసాఫ్ట్ కార్యాలయం హైదరాబాద్‌లో పెట్టాలన్న చంద్రబాబు ప్రతిపాదనలపై మా నిపుణులతో మాట్లాడితే వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ విధంగా మైక్రోసాఫ్ట్ కార్యాలయాన్ని ప్రారంభించాం' అని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అడిగిన ప్రశ్నకు బిల్‌గేట్స్ సమాధానమిచ్చారు.
- ఏఐ ద్వారా వైద్య రంగంలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించొచ్చని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అడిగిన ప్రశ్నకు జవాబిచ్చారు.
- ఏఐ రాకతో ఉద్యోగాలను పునర్ నిర్వచించాల్సిన (రీ డిఫైనింగ్) అవసరం ఉందని ఐఏఎస్ అధికారి బాబు.ఎ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దిల్లీలో నిర్వహిస్తున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.

2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీగా రాష్ట్రం

'స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నాం. ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్‌డీపీగా తీర్చిదిద్దనున్నాం. తలసరి ఆదాయం 3,400 డాలర్ల నుంచి 2047 నాటికి 42,000 డాలర్లకు పెంచనున్నాం. ఎగుమతులను 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు తీసుకెళతాం. నిరుద్యోగితను 4.1% నుంచి 2% కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8% నుంచి 80 శాతానికి పెంచడం మా లక్ష్యం. 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకెళతాం. 95% నైపుణ్యం గల మానవవనరులు ఉండేలా తీర్చిదిద్దుతాం. గర్భిణుల్లో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే మా లక్ష్యం' అని సీఎం వివరించారు.

గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం గేమ్‌ఛేంజర్: సీఎం

'రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి కొత్త దశ- దిశ ఏర్పడుతుంది. బిల్ గేట్స్ అమరావతి రాక చరిత్రాత్మకంగా నిలవడంతోపాటు ప్రజల సాధికారతకు దోహదపడుతుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్‌గేట్స్‌కు ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. 'పేదరిక నిర్మూలన, సంపూర్ణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటిభద్రత, రైతు- అగ్రిటెక్, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ- ఫ్యూయల్, ప్రొడక్ట్ పర్‌ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్.. ఇలా పది సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానం. దీనికి ఆధార్ ధ్రువీకరణ, వ్యక్తిగత కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సమగ్ర డేటా, ఎవేర్ ద్వారా రియల్‌టైమ్ డేటా సేకరణ, వాట్సప్ గవర్నెన్స్, డీజీవెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్తు కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం. క్వాంటమ్ వ్యాలీ- డిజైన్- ఫౌండ్రీగా అమరావతి, డేటా ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్- ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్- స్పేస్ సిటీగా తిరుపతిలను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం పది రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నాం. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నాయి. మొత్తం ఏడు డేటా లేక్ ప్రాజెక్టులు ప్రారంభించాం' అని చంద్రబాబు తెలిపారు.



సచివాలయానికి వచ్చిన బిల్‌గేట్స్‌కు ఆర్టీజీఎస్ కార్యకలాపాలను వివరిస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ విభాగం సంయుక్త కార్యదర్శి మలికా గార్గ్. చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం

'35 వేల పాఠశాలల్లో చదువుతున్న 13.4 లక్షల విద్యార్థులకు ఉపకరించేలా ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నాం. రైతు సంక్షేమం కోసం సాంకేతికతను వినియోగిస్తున్నాం. గోధార్ ద్వారా పశువుల ఆరోగ్య సంరక్షణ చేపట్టాం. భూసార పరీక్షలు, మార్కెట్ సలహాలు, సమర్థ నీటి నిర్వహణ ద్వారా సాగులో పెనుమార్పులు తీసుకొస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు.

జులైకల్లా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

'డబ్ల్యూహెచ్‌వో, అశోక్ యూనివర్సిటీ సహకారంతో నేషనల్ హెల్త్ ఏఐ స్ట్రాటజీ వర్క్‌షాప్ నిర్వహించాం. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్, ఏబీడీఎం (ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్) అమలు సహా తక్కువ ఖర్చుకే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో 71 లక్షల మందికి ఇప్పటికే 41 పరీక్షల ద్వారా స్క్రీనింగ్ పూర్తి చేశాం. సంజీవని కార్యక్రమాన్ని సమగ్ర ఆరోగ్య వేదికగా తీర్చిదిద్దుతున్నాం. కుప్పంలో ప్రయోగాత్మకంగా చేపట్టిన సంజీవని ప్రాజెక్టు విజయవంతమైంది. దీన్ని జులై నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తాం. ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను ఇవ్వాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో డీఎంఐడీసీ స్థాపించి ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా 'అమరావతి స్కూల్ ఆఫ్ బయోడిజైన్' చేపట్టాం' అని చంద్రబాబు వివరించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బిల్‌గేట్స్‌కు ఘన స్వాగతం

ఈనాడు- అమరావతి, ఈనాడు డిజిటల్- మచిలీపట్నం, న్యూస్‌టుడే- గన్నవరం గ్రామీణం: దిల్లీ నుంచి సోమవారం ఉదయం 8.25 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం చేరుకున్న బిల్‌గేట్స్‌కు మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, సత్యకుమార్‌యాదవ్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో వెలగపూడిలోని సచివాలయానికి బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నం విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధుతో కలిసి బిల్‌గేట్స్ పాల్గొన్నారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 2గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో దిల్లీ వెళ్లారు. మంత్రి లోకేశ్, అధికారులు ఆయనకు వీడ్కోలు పలికారు.



బిల్‌గేట్స్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఆహ్వానం పలుకుతున్న మంత్రి లోకేశ్

గుర్రపుడెక్క బుట్ట అందించిన కలెక్టర్

గుర్రపుడెక్కతో చేతివృత్తుల వారు తయారు చేసిన బుట్టలో కలంకారీ శాలువా, ఇతర వస్తువులు ఉంచి బిల్‌గేట్స్‌కు కలెక్టర్ బాలాజీ అందించారు. బిల్‌గేట్స్ దానిని ఆసక్తిగా పరిశీలించి, ఎలా తయారుచేశారని అడిగారు. కృష్ణా జిల్లాలో గుర్రపుడెక్క విరివిగా లభిస్తుందని, ఈ సహజ వనరును సమర్థంగా ఉపయోగించుకునేందుకు స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.



బిల్‌గేట్స్‌కు గుర్రపుడెక్కతో తయారు చేసిన బుట్టలో కలంకారీ శాలువా, ఇతర వస్తువులు అందిస్తున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత

- బిల్‌గేట్స్ వచ్చిన విమానం ఉదయం 8.10 గంటలకు విమానాశ్రయం సమీపానికి చేరుకుంది. ఆ సమయంలో దట్టమైన పొగమంచు ఉండడంతో రన్‌వేపై విజిబులిటీ సరిగా లేదు. దీంతో విమానాన్ని గాల్లోనే 15 నిమిషాలు చక్కర్లు కొట్టించిన పైలట్ 8.25 గంటలకు సురక్షితంగా రన్‌వే పైకి దించారు.

వసుంధర

vasundhara@eenadu.in

రయ్ రయ్... సైకిల్‌పై అమెరికాకు!



చుట్టూ పచ్చదనం... మధ్యలో సైకిల్ మీద రయ్యిమంటూ దూసుకెళ్తోంటే... ఆ అనుభూతే వేరు కదూ! కొద్దిసేపంటే సరే! అదే వందలు, వేల కిలోమీటర్లు సైకిల్ తొక్కాలంటే? అమ్మో అనేస్తాం కదూ! కానీ వందన ధావ్లే మాత్రం అలవోకగా తొక్కేస్తున్నారు. తాజాగా రేస్ అక్రాస్ అమెరికాకి అర్హత సాధించారు. ఆ అవకాశం అందుకున్న తొలి భారతీయ మహిళ ఆమె!

వందన పుట్టి పెరిగింది... మహారాష్ట్ర. పెళ్లయ్యాక భర్త నితిన్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. చాలాకాలం గృహిణిగానే ఉన్నారామె. కొవిడ్ తరవాత ఏదైనా చేయాలనుకున్న ఆమె... సైక్లింగ్‌ని ఎంచుకున్నారు. ఆపై రేసుల్లో పాల్గొనడం ప్రారంభించారు. 25 కి.మీ.లతో మొదలుపెట్టి, క్రమంగా దూరాలు పెంచుకుంటూ వెళ్లారు. సూపర్ రాండోనీర్ టైటిళ్లను ఎన్నింటినో గెలిచి... అల్ట్రా ఎండ్యూరెన్స్ సైక్లిస్ట్‌గా మారారు. అప్పుడే సైక్లింగ్‌లో ప్రతి పోటీలోనూ పాల్గొనాలనే ఆలోచన కలిగిందంటారు వందన. ప్రతి రేసునీ సవాలుగా స్వీకరిస్తూ 1200 కి.మీ.ల సెల్ఫ్ సపోర్టెడ్ అల్ట్రా రేసునీ పూర్తిచేశారు. 'విపరీతమైన వేడి, డీహైడ్రేషన్‌ని తట్టుకుని పూర్తిచేసిన ఈ రేసు... నాలోని ఓపికను నాకు పరిచయం చేయడమే కాదు, ఆత్మవిశ్వాసాన్నీ పెంచింది' అంటారు వందన.

ఆరు రోజుల రేసులో...



కొత్త సవాళ్ల కోసం వెతుకుతున్న ఆమెకు ప్రతిష్ఠాత్మక రేస్ అక్రాస్ అమెరికా (ఆర్‌ఏఏఎం) గురించి తెలిసింది. ఎలాగైనా దానికి అర్హత సాధించాలనుకున్నారు వందన. అందుకోసం ఇన్‌స్పైర్ ఇండియా నిర్వహించే... అల్ట్రా స్పైస్ రేస్‌ను పూర్తిచేయాలి. ఆరు రోజులు సాగే ఈ రేసులో 1200కి.మీ., 1750 కి.మీ. అనే రెండు విభాగాలుంటాయి. వాటిల్లో 1750 కి.మీ.లదే ఎంచుకున్నారు వందన. మహిళల 18-49 ఏళ్ల కేటగిరీలో సోలో సెల్ఫ్ సపోర్టెడ్ విభాగంలో పోటీపడ్డారు. ఇది గోవాలో మొదలై షిమోగా, చిక్‌మంగళూరు, కేరళ మీదుగా ఊటీ వరకూ వెళ్లి.. తిరిగి గోవాకి రావడంతో ముగుస్తుంది. ఇందుకు 154 గం. సమయమిస్తారు. దాన్ని వందన 129 గంటల్లోనే పూర్తిచేసి, ఆర్‌ఏఏఎంలో పాల్గొనడానికి అర్హత సాధించారు.

వయసుతో సంబంధమేంటి?

'పశ్చిమ కనుమలు, నీలగిరి కొండల్లో ఘాట్ రోడ్లను దాటుతుంటే ప్రకృతితో మమేకమైనట్లే అనిపించేది. అది మాటల్లో వర్ణించలేని అనుభూతి. రాత్రివేళల్లోనూ సైక్లింగ్‌ని ఆపలేదు. నిద్రలేక శరీరం అలసిపోయినా పూర్తిచేయాలన్న సంకల్పం ముందుకు నడిపింది. అందుకే ఈ రేసు నాకు జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకం. ఇలాంటి పోటీల్లో శారీరక సామర్థ్యమే కాదు, మానసిక దృఢత్వమూ అవసరమే. అందుకే వ్యాయామం, పోషకాలతో కూడిన శాకాహారంతో పాటు మానసిక సన్నద్ధతపైనా దృష్టిపెడతా. ఆర్‌ఏఏఎం సైక్లిస్టులకు కలల పోటీ. అమెరికా ఖండాన్ని దాటుతూ సుమారు 4800 కి.మీ. సైక్లింగ్ చేయాలి. దీనికి అర్హత సాధించడమే గొప్ప విజయంగా భావిస్తాం. ఎందుకంటే దాన్ని పూర్తిచేయాలంటే రోజులో 22గం. సైకిల్ తొక్కాలి. అలాంటి దానికి నేను అర్హత సాధించడం, దేశంలో ఆ అవకాశమందుకున్న తొలి మహిళగా నిలవడం ఆనందంగా ఉంది. ఈ పోటీ ఆగస్టులో ప్రారంభమవుతుంది' అని చెప్పే 48ఏళ్ల వందన... తన సైక్లింగ్ ప్రయాణంలో భర్త, కుటుంబమే పెద్ద బలమంటారు. 'ఏదైనా సాధించాలనుకుంటే ఎప్పుడైనా ప్రయత్నం మొదలుపెట్టొచ్చు. దానికి వయసుతో సంబంధం లేదు. ముఖ్యంగా మధ్యవయసు మహిళలు... ఈ వయసులో ఏం సాధిస్తామనుకోవద్దు. ప్రయత్నిస్తే... ప్రపంచం మనవైపు తిరిగి చూసేలా చేయొచ్చు' అన్న సలహానీ ఇస్తున్నారు.

– బందారం శివరామకృష్ణ ప్రసాద్, హైదరాబాద్

బాధను జయించి... రక్షణగా నిలిచి!





బాల్య వివాహాల్నీ, టీనేజ్ గర్భధారణల్నీ తగ్గించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాయి ప్రభుత్వాలూ, సేవా సంస్థలు. ఈ సహాయాలేవీ లేకముందే బాల్యవివాహ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు రోషిణి పర్వీన్. ఈ ఉచ్చులో చిక్కుకుని ఎన్నో బాధలు అనుభవించి... వాటినే బాధితులకు పాఠాలుగా మలిచారీమె. అంతర్జాతీయ వేదికల్ని సైతం కదిలించిన తన కథ ఇది...

పద్నాలుగేళ్లకే పెళ్లి... ఏడాది తిరగకుండానే గర్భం... లైంగిక వేధింపులు, సామాజిక, అనారోగ్య సమస్యలెన్నో రోషిణి పర్వీన్‌ను చుట్టుముట్టాయి. అప్పుడే నిర్ణయించుకున్నారు తనలా ఇంకో అమ్మాయి బాధపడకూడదని. 'మాది బిహార్‌లోని కిషన్‌గంజ్. తొమ్మిదో తరగతి వరకూ అందరు పిల్లల్లానే ఆటపాటలతో సంతోషంగా ఉండేదాన్ని. కానీ ఓ రోజు మా అమ్మానాన్నలు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారని తెలిసింది. నేను చదువుకోవాలన్నా. ఏడ్చాను, తిండి మానేశాను. ఇవేవీ వాళ్లు పట్టించుకోలేదు. వాళ్ల నిర్ణయం ముందు నా పంతం ఓడిపోయింది. 45 ఏళ్ల వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. అత్తారింట్లో రోజూ గొడవలే. కొట్టడం, తిట్టడం, బలవంతం చేయడం. నా తప్పేంటో కూడా అర్థమయ్యేది కాదు. మూడు నెలలు భరించా... ఇక నావల్ల కాదనిపించింది. ఇంటినుంచి పారిపోయి, మా పుట్టింటికి వెళ్లిపోయా. అప్పుడే తెలిసింది గర్భందాల్చానని. బాబు పుట్టాడు. అప్పటికి నాకు 15ఏళ్లే. ఏడాది తర్వాత మళ్లీ అత్తారింటికి వెళ్లమని బలవంతం చేశారు. నాకు ఇష్టం లేకున్నా... వాళ్లకి భారం కాకూడదని వెళ్లాను. కానీ నా భర్త నన్నూ, బిడ్డనీ అంగీకరించలేదు. తిరిగి అమ్మానాన్నల దగ్గరకు వెళ్లడం నాకు ఇష్టం లేదు. చేతిలో నెలల పిల్లాడితో నేను పడిన కష్టాలు ఇప్పుడు తలుచుకున్నా కళ్లలో నీళ్లు తిరుగుతాయి' అని గుర్తుచేసుకుంటారు రోషిణి. బాబుని పోషించడానికి ఓ షోరూమ్‌లో పనిచేయడం మొదలుపెట్టారామె. జీవితం ఓ గాడిన పడుతుందనగా... బాల్యవివాహాల నియంత్రణకు గళం వినిపించడం మొదలుపెట్టారు. '2018లో చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్‌లో చేరా. ఇక్కడ నాలాంటి వాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్ల అనుభవాలు నాకు పాఠాలయ్యాయి. వాళ్లు చేసే పని కూడా నచ్చింది. దాంతో వాళ్లతో కలిసి బాల్యవివాహాలు ఆపడం మొదలుపెట్టా' అంటారీమె.

అంతర్జాతీయ వేదికపై...

సంస్థతో కలిసి ఊరూరా తిరిగి అవగాహన కార్యక్రమాలు చేపట్టేవారు రోషిణి. ఈ క్రమంలో ఎదుర్కొన్న ఇబ్బందులెన్నో. కొందరైతే కొట్టడానికీ వచ్చేవారట. ఎప్పటికప్పుడు తప్పించుకుంటూ స్థానికంగా బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పరచుకున్నారీమె. 'సేవ్ ది చిల్డ్రన్, యునిసెఫ్ లాంటి సంస్థలతో కలిసి పనిచేయడం మొదలుపెట్టా. దాదాపు వందకు పైగా బాల్యవివాహాల్ని ఆపాను. విమెన్ ట్రాఫికింగ్‌ను అడ్డుకున్నా. ఆ పిల్లలందరినీ ఓ చోట చేర్చి వారికి వృత్తి నైపుణ్యాలు నేర్పించడం మొదలుపెట్టాను. చదువు మధ్యలో ఆగిపోయిన పిల్లలకి ఉపాధి కోసం... కుట్టుమెషీన్లు, కంప్యూటర్లు నేర్పిస్తున్నాం. వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చదువు చెప్పిస్తున్నా' అనే రోషిణి సేవల్ని మెచ్చి ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ అవార్డునూ ఇచ్చింది. దాంతో ఆమె పరిధి విస్తరించింది. రాష్ట్ర వేదికల మీదా చైతన్య పాఠాలు చెబుతున్నారీమె. నేటికీ ఈ పోరాటాన్ని కొనసాగిస్తున్న రోషిణి ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

బామ్మ... అడిగేసింది!



రాంగ్ రూట్‌లో రావడం, ఫుట్‌పాత్‌ల మీదా బండి పోనివ్వడం... నడిచేవారికీ రోడ్డు దాటేవారికీ ఎంత ఇబ్బంది? ఒక్కోసారి ప్రమాదాలూ జరుగుతుంటాయి. అందుకే అలా వచ్చేవాళ్లని చూస్తే కోపం తన్నుకొచ్చేస్తుంది. ఒక్కోసారి తిట్టుకున్నా... చివరికి ఏమీ చేయలేక మిన్నకుండిపోతాం. కానీ ప్రభావతి అమ్మ అలా కాదు. ప్రశ్నించారు... కాబట్టే, అందరి ప్రశంసలూ అందుకుంటున్నారు.

ఈ బామ్మ వయసు 73 ఏళ్లు. కేరళలోని ఎరనిపాలెం ఆమె ఊరు. ఫుట్‌పాత్ మీద నడుస్తోంటే ఎదురుగా బండి. మొదట 'మీరిలా వస్తే నడిచే వాళ్లకి ఇబ్బంది. వెనక్కి వెళ్లండి' అని మృదువుగానే చెప్పారామె. కానీ బండిమీదున్న వ్యక్తి వినకపోగా తప్పుకోమంటూ విసురుగా సమాధానం చెప్పాడు. బామ్మగారు మాత్రం పట్టు వదల్లేదు. పోనీయనంటే పోనీయనంటూ అడ్డుపడ్డారు. బండి, మీదకి పోనిస్తున్నా... చేయి, కాలు అడ్డుపెట్టి మరీ నిల్చున్నారు. ఆ వ్యక్తి దురుసుదనం ప్రదర్శించబోతే వీడియో తీయడం మొదలుపెట్టారు. అప్పుడు ఆ బండి మీది వ్యక్తి వెనక్కి తగ్గి, వేరే మార్గంలో వెళ్లాడు. ఇదంతా ఓ ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరలైంది. అయితే ఇదంతా ఆ



ఒక్కరోజు చర్యేమీ కాదు. బస్సులో కేటాయించిన సీట్లలో వేరే వాళ్లు కూర్చున్నా, రాంగ్‌రూట్‌లో బండి నడుపుతున్నా ప్రశ్నించడం బామ్మగారి నైజం. 'ఇవన్నీ చిన్నగానే కనిపిస్తాయి. కానీ తెచ్చిపెట్టే ఇబ్బందులు చాలానే. చాలామంది చూసి ఊరుకుంటారు. తప్పు చేస్తే ప్రశ్నించాలని చిన్నప్పుడే నేర్చుకున్నా. అందుకే నేను ఊరుకోను. ఈ విషయమ్మీద చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. అందుకే నా వంతుగా ఇలా చేస్తున్నా'నంటారు ప్రభావతి. ఒక సామాన్యురాలు ఇంత బాధ్యతగా వ్యవహరించడం అధికారులతో పాటు ఆ రాష్ట్ర నాయకులనీ ఆకర్షించింది. రహదారుల శాఖామంత్రి ఆమెను ప్రశంసించగా... మోటార్ వెహికల్ డిపార్ట్‌మెంట్ అధికారులు సన్మానించారు. ఇవన్నీ ఎలాగున్నా... 'తప్పు జరిగినప్పుడు చూస్తూ ఊరుకోవద్దు, ప్రశ్నించాలి. అది ప్రతి ఒక్కరి బాధ్యత' అంటున్న ఈ బామ్మని చూసి యువత నేర్చుకోవాల్సింది చాలానే... కదూ!

అందుకే మాయ చేద్దాం!



రోజూ అరగంటైనా వ్యాయామం చేస్తే మంచిది. కొద్దికొద్దిగా ముందుగా చదువుకుంటేనే ఆఖరి నిమిషంలో ఒత్తిడి ఉండదు. రోజూ కనీసం 2 లీటర్ల మంచి నీళ్లైనా తాగాలి... చెప్పాలే కానీ మనం చేయాల్సిన జాబితా చాలానే! పైగా ఇవన్నీ మనకు మేలు చేసేవే. అయినా పాటిస్తామా? ఈసారి నుంచి తప్పకుండా పాటించాలి అని రెండ్రోజులు ప్రయత్నిస్తామో లేదో... మళ్లీ మొదలు. వాటిని పక్కన పెట్టడానికి మన మెదడు ఎన్నెన్ని సలహాలు ఇస్తుందో! ఒక్కరోజు పడుకుంటే ఏం కాదు... వ్యాయామం వాయిదా వేద్దాం. పదే పదే బాత్రూమ్‌కి వెళ్లాలి. ఆ ఏం నీళ్లు తాగడంలే అంటూ మనల్ని ఆపుతుంటుంది. అలాగని వింటూ కూర్చుంటే ఎలా? అందుకే దాన్నే మాయ చేద్దాం.

ఇన్ని గంటలు చదవాలి, ఈ సబ్జెక్టు లేదా చాప్టర్ అంతా పూర్తి చేయాలి అంటే కదా... నీరసం వచ్చేది. అలాకాకుండా... ఈ పేజీ చదువుదాం చాలని మొదలుపెట్టండి. ప్రారంభించడమే సమస్య. తరవాత తెలియకుండానే కొనసాగిస్తాం. తీరా బోర్ కొట్టిందనుకోండి అప్పుడే ఆపొచ్చు. ఎంతో కొంత చదువుతాం కాబట్టి, మేలే. రోజూ అరగంట అంటే కదా ఇబ్బంది. ఉదయాన్నే అలా బయటికి వెళ్లొద్దాం అని వెళ్లండి. వేరే వాళ్లని చూసి మీరే కొనసాగుతారు. ఫోన్ పట్టుకున్న ప్రతిసారి మూడు సిప్‌లు నీళ్లు తాగాలి అనుకుంటే సరి. దాన్ని పట్టుకోకుండా ఎలాగూ ఉండం, కాబట్టి, అలాగైనా నీళ్లు తాగుతాం. ఇల్లు సర్దాలన్నా గదంతా అని పెట్టుకోవద్దు. ఎంతోకొంత నిర్ణయించుకుని సర్దుతూ వెళితే సరి. పని పెద్దగా కనిపిస్తుంటేనే దాన్ని పక్కన పెట్టడానికి మన మెదడూ కారణాలు చూపిస్తూ వెళ్తుంది. తీరా అవి పూర్తవకపోతే మనకే ఒత్తిడి. అదే ఇలా ప్రయత్నించండి... పనీ పూర్తవుతుంది. భారంగా తోయదు, మనసుకీ హాయి. ఏమంటారు?

బిగుతుగా ఉన్నాయా?



దుస్తుల మీదకు నప్పాలనీ, స్టైల్‌గా కనిపించాలనీ రకరకాల చెప్పులు ఎంచుకుంటూ ఉంటాం. కారణం ఏదైనా వాటిని ఎంచుకునేటప్పుడు కాస్త జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా మరీ బిగుతుగా ఉండేవాటికి దూరంగా ఉండాలి. ఎందుకంటే...

- బిగుతైన షూ, హీల్స్‌ని ఎంచుకోవడం వల్ల కాళ్లపై ఎక్కువ ఒత్తిడి పడుతుంది. ఫలితంగా పాదాలకు రక్తప్రసరణ సక్రమంగా జరగదు. దీంతో వాపు, నొప్పి, తిమ్మిరి వంటి సమస్యలు కనిపిస్తాయి. ఇలా అధిక సమయం వాడినా, దీర్ఘకాలం ఉపయోగించినా వెన్ను సంబంధిత సమస్యలూ రావొచ్చు. కాబట్టి వయసుతో పాటు మారే పాదాల పరిమాణానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు సరిపోతుందా? అన్నది చూసుకుని ఎంచుకోండి.
- పాదాల దుర్వాసనకు బిగుతైన బూట్లే కారణం. బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లకు కారణమై చెడువాసనను కలిగిస్తాయి. ముఖ్యంగా పొడి చర్మం ఉన్నవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాదు, గోళ్ల ఆరోగ్యమూ దెబ్బతింటుంది. నెయిల్స్ లోపలికి పెరిగి నొప్పిని కలుగజేస్తాయి. ఇన్ఫెక్షన్ల బారిన పడేలా చేస్తాయి
- చెప్పులన్నీ బిగుతుగా ఉన్నప్పుడు వేళ్లన్నీ పట్టి ఉంచినట్లుగా అతుక్కోవడం వల్ల వాటి సందుల్లో రాపిడి ఎక్కువై బొబ్బలు రావొచ్చు. అంతేకాదు, బొటనవేలు కీలుపై ఎముక పెరిగే అవకాశమూ ఎక్కువే. దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రభావం కనిపిస్తుంది. అందుకే, వేసుకుని చూశాకే కొనుక్కోండి.

పెద్దమ్మ ఆస్తి ఇస్తుందా?

మా నాన్నకి ఇద్దరు భార్యలు. పిల్లలు లేరని మొదటి భార్య అనుమతితో అమ్మను చేసుకున్నారు. ఏళ్లుగా అంతా కలిసే ఉంటున్నాం. ఐదేళ్ల క్రితం నాన్న చనిపోయారు. అప్పటి నుంచి ఆమె బంధువులు మా ఇంట్లో చేరారు. ఆస్తులేవీ మాకు దక్కకుండా చేయాలనేది వారి ఆలోచన. తాతల ఆస్తి అయినా... నాన్న ఉన్నప్పటి నుంచే పెద్దమ్మ చూసుకుంటున్నారు. ఈ మధ్య తనలో మార్పు కనిపిస్తోంది. అమ్మ కూడా గతేడాది రోడ్డు ప్రమాదంలో చనిపోయింది. ఇప్పుడు మేమేం చేయాలి? – ఓ సోదరి

డియర్ వసుంధర


జి. వరలక్ష్మి, న్యాయవాది

మీ నాన్న మొదటి భార్య అనుమతితో చేసుకున్నా సరే... రెండో పెళ్లి చెల్లదు. హిందూ వివాహచట్టంలోని సెక్షన్ 5 క్లాజ్(1) ప్రకారం చట్టబద్ధ వివాహంగా గుర్తించడానికి కొన్ని నియమాలు ఉన్నాయి. వాటిని అనుసరించి పెళ్లి చేసుకునే సమయానికి అతడికి మరో పెళ్లి అయ్యి ఉండకూడదు. విడాకులు తీసుకోకుండా భార్య బతికి ఉండగా చేసుకునే రెండో వివాహానికి చట్టబద్ధత ఉండదు. అంటే ఆమెకి భర్త తదనంతరం ఆస్తిలో హక్కు ఉంటుంది కానీ, బతికి ఉండగా అతడి పిత్రార్జితపు ఆస్తిలో వాటా అడిగే హక్కు ఆమెకు లేదు. అయినా పిల్లల వారసత్వపు హక్కులు ఎక్కడికీ పోవు. హిందూ వారసత్వచట్టం సెక్షన్-10 ప్రకారం ఒక హిందూ వ్యక్తి చనిపోతే అతడి ఆస్తి క్లాస్-1లో ఉన్న వారసులందరికీ చెందుతుంది. ఇద్దరు భార్యలు ఉంటే ఇరువురికీ చెరో భాగం వస్తుంది. మీ అమ్మ వాటా తన పిల్లలందరికీ సమానం. అయితే, ముందు మీరు మీ వారసత్వం నిరూపించుకుంటూ దావా వేయాలి. అందుకు తగిన పత్రాలు జత చేయాలి. ముందు మీ తాత ఆస్తి ఎవరి పేరు మీద ఉందో తెలుసుకోండి. మీ తండ్రి పేరు మీద ఉంటే మీరు కూడా వారసులవుతారు. అదే మీ పెద్దమ్మ పేరు మీదకు మారితే మాత్రం అది ఆవిడ స్వార్జితమవుతుంది. ఒకవేళ ఆ ఆస్తి... మీ నాన్న పోయిన తర్వాత మారింది అంటే ఆ మార్పు చెల్లదని కోర్టులో పిటిషన్ వేయండి. ఒకవేళ మీ నాన్న పేరు మీదే ఉంటే భాగస్వామ్యం కోరుతూ దావా వేయండి. మీరు, మీ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు... 'వాదులు'గా, మీ పెద్దమ్మని 'ప్రతివాది'గానూ చేర్చాలి. ఒకవేళ మీ తాతగారి పేరుమీదే ఉంటే అత్తయ్యలను, పెద్దనాన్న బాబాయిలను కూడా ప్రతివాదులుగా చేర్చాలి. ముందుగా ఆస్తి వివరాలు తెలుసుకుని తగిన కాగితాలతో లాయర్‌ను సంప్రదించండి.

వెళ్తూనే అసంతృప్తా..?



బస్ దిగి ఆఫీసులో అడుగైనా పెట్టం... అబ్బా ఈ రోజు సెలవు పెట్టేస్తే బాగుణ్ను అనుకుంటాం. అనుకోవడంతో సరిపెట్టుకుంటామా పక్కవారితోనూ విషయాన్ని చెప్పి, నిట్టూరుస్తాం. బాస్ నుంచి తిట్లు ఎదురైనప్పుడో, ప్రాజెక్టు విఫలమైనప్పుడో మనసు నిండా అసంతృప్తిని నింపుకొంటాం. పక్కవాళ్లతోనూ దాన్ని పంచుకుని బాధపడుతుంటాం. అంతేనా, అబ్బా రోజూ ఇదే పనా? ఎంత చేసినా గుర్తింపే లేదు?... వంటి మాటలు ఉద్యోగినుల జీవితంలో సర్వసాధారణం అయిపోయాయి. దీనివల్ల మీలోనే కాదు, అవతలి వాళ్లలోనూ మీకు తెలియకుండానే ప్రతికూల దృక్పథాలు నింపుతున్నారని మీకు తెలుసా? దీన్నే 'షిఫ్ట్ సల్కింగ్' అంటున్నారు కెరియర్ నిపుణులు. ఈ ప్రతికూలతలే 'యూనిఫామ్ బర్నవుట్'కు కారణం అవుతున్నాయట. ఒకరి నుంచి ఒకరికి ఈ అసంతృప్తి వ్యాపించి, పని మీద ధ్యాస లేక, ఒత్తిడి ఎక్కువై, సరైన ఫలితాలు అందక అందరూ మాస్ బర్నవుట్‌కు గురవుతున్నారట. దీనివల్ల వర్క్ కల్చర్ దెబ్బతింటుంది. శారీరక, మానసిక సమస్యలు సరేసరి. అందుకే ఆఫీస్‌కి వెళ్లాలన్న ఆలోచన ఏ మాత్రం లేకపోయినా... ఆ రోజుకి సెలవు పెట్టి నచ్చిన పని చేయడం మేలు అంటున్నారు నిపుణులు. దీనివల్ల పని వాతావరణం మీద ప్రభావం ఉండదు. సెలవు ఇచ్చిన ఉత్సాహం తర్వాతి రోజు రెట్టింపు పని చేయడానికి కారణం అవుతుంది.

ఆముదం చెదలు పట్టనివ్వదు!



ఘాటైన వాసన, జిడ్డుతో ఉండే ఆముదం పేరు చెబితే అంతా అదోలా ముఖం పెడతారు. కానీ, దీంతో ఉన్న ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోక మానరు. అవేంటంటారా?

- ఇంట్లో తలుపులు, కిటికీ బోల్టులు బిగుసుకుపోయి కిర్రు కిర్రుమంటున్నాయా? అయితే, వాటిపై రెండు చుక్కల ఆముదం వేయండి. సులువుగా కదులుతాయి.
- మొక్కలకు చీడపీడలు పట్టి వదలడం లేదా? అయితే, లీటరు నీటిలో చెంచా ఆముదం, చెంచా వంటసోడా కలిపి ఆకులూ, కొమ్మలపై చల్లండి. ఇట్టే పరిష్కారం లభిస్తుంది. నూనె తీయగా మిగిలిన ఆముదం చెక్కనూ చీడపీడల నివారణకు వాడొచ్చు.
- కాళ్లనొప్పులు వేధిస్తున్నాయా? అయితే ఆముదాన్ని వేడి చేసి గోరువెచ్చగా ఉన్నప్పుడు కాళ్లకు రాసి మర్దన చేయండి. ఉపశమనం లభిస్తుంది.
- చెక్క ఫర్నిచర్ ఇంట్లో ఉంటే ఆముదంతో పాలిష్ చేయండి. ఇది వాటిని నిగనిగలాడేలా మెరిపించడమే కాదు... చెదలూ పట్టనివ్వదు.
- కొందరికి కనుబొమలు, జుట్టు పల్చగా ఉంటాయి. ఇలాంటివారు వారంలో మూడు రోజులైనా ఆముదాన్ని వేడి చేసి రాసి మర్దన చేయండి. ఫాలికల్స్ ఉత్తేజితం చెంది వృద్ధి కనిపిస్తుంది. ఆముదం నూనెలో రిసినోలీక్ యాసిడ్ ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది.
- పాదాల పగుళ్లు ఇబ్బంది పెడుతున్నాయా? అయితే రోజూ రాత్రిపూట ఆముదాన్ని రాయండి. ఇలా కనీసం ఓ పదిరోజులు చేస్తే సమస్య దూరమవుతుంది. గోళ్లూ తేమగా ఉంటాయి.

అంచుల్లో ముత్యాలు ఎంతందమో!





చంద్రకాంతిలా... పాల మీగడ నురగలా... మెరిసే ముత్యాలను చూసి మెచ్చని మగువలుంటారా? ఒకప్పుడు రాజసానికి ప్రతీకగా రత్నాలతో జోడీకట్టాయివి. ఆ తర్వాత బంగారు తీగల్లోనూ, నూలు దారాల్లోనూ ఒదిగి నాటి తరం ఆడపిల్లల మనసు దోచుకున్నాయి. అలా కాలంతో పాటు రంగుల్నీ, రూపాల్నీ మార్చినా వీటికున్న ఆదరణ తగ్గనేలేదు. తరాలుగా, శతాబ్దాలుగా... ఆడవాళ్ల అలంకరణలో భాగం అవుతూనే వస్తున్నాయి. ఒకప్పుడు పెద్ద ముత్యమే ట్రెండ్ అన్నారు. ఆ తర్వాత గుత్త పూసలతో మెప్పించాయి. ఇప్పుడు చిన్నపూసలదే హవా అంటోంది ఫ్యాషన్ ప్రపంచం. అందుకే, చెవి పోగుల నుంచి చేతిగాజుల వరకూ ఆయా నగల డిజైన్ అంచుల్లో చేరి అదరహో అనిపిస్తున్నాయి. రూబీలు, పచ్చలతో చేరి కుందన్, పోల్కీ పనితనంతో మరింత అందంగా ఆకట్టుకుంటున్నాయి. ఇటు సంప్రదాయంగా శోభిస్తూనే... మరోపక్క ఆధునికతతో వెలిగిపోతున్నాయి. పెళ్లిళ్లు, శుభకార్యాలు మాత్రమే కాదు, కాన్సెప్ట్ శారీల మీదకూ ఫ్యూజన్ లుక్‌ని ఇస్తున్నాయి. ఓసారి ఇటు చూడండి. మీకూ నచ్చేస్తాయి.





బంగారం - వెండి

16న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,58,920	1,43,800	2,49,481
విజయవాడ	1,53,775	1,43,400	2,53,000
ప్రొద్దుటూరు	1,57,200	1,44,620	2,50,500
రాజమహేంద్రవరం	1,56,440	1,43,400	2,65,000
విశాఖపట్నం	1,56,440	1,43,400	2,48,000
తమిళనాడు	-----	1,44,400	2,65,000

రోడ్డు ప్రమాదాల నివారణకు

త్వరలో వీ2వీ వ్యవస్థ

- ఒక వాహనం నుంచి మరో వాహనానికి సమాచారం
- మోర్త్ చీఫ్ ఇంజినీర్ పంకజ్ అగర్వాల్ వెల్లడి
- 'రహదారి ప్రమాదాల నివారణకు ఏఐ' సదస్సులో వక్తల ప్రసంగం
- చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం ప్రజంటేషన్



దిల్లీలో ఏర్పాటు చేసిన ఏఐ సదస్సులో ప్రదర్శనకు ఉంచిన ఏఐ ఆధారిత వాహనం నమూనా

ఈనాడు, అమరావతి: 'కృత్రిమ మేధ(ఏఐ)తో భారతదేశంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం సాధ్యం. త్వరలోనే ఒక వాహనం నుంచి మరో వాహనానికి సమాచారం అందే సాంకేతిక వ్యవస్థను (వీ2వీ) అందుబాటులోకి తీసుకురానున్నాం. ఒక వాహనం మరో వాహనాన్ని ఢీకొనకుండా, ఒకేసారి వరుసగా ఢీకొనకుండా సాంకేతిక వ్యవస్థ ఇందులో డ్రైవర్లను అప్రమత్తం చేస్తుంది' అని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) చీఫ్ ఇంజినీర్ పంకజ్ అగర్వాల్ వెల్లడించారు. దిల్లీలో సోమవారం ఏఐ ఇంపాక్ట్ సదస్సులో భాగంగా 'రోడ్డు రవాణా- ప్రమాదాల నివారణలో ఏఐ పాత్ర' అన్న అంశంపై నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. 'ఏఐ సాయంతో రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడం సాధ్యమే. రోడ్డు ప్రమాదాలపై ప్రస్తుతం పోలీసులు నమోదు చేస్తున్న డేటా సంపూర్ణంగా ఉండటం లేదు. దీంతో పోలిస్తే ఏఐ సాయంతో సంపూర్ణ డేటా అందుబాటులోకి వస్తుంది. ఆ డేటా ఉంటే పరిష్కారాలు సులభమే' అని ఆయన చెప్పారు. ఈ సదస్సు సందర్భంగా ప్యానెల్ చర్చ జరిగింది. ఐఐటీ చెన్నైకు చెందిన అతుల్‌సింగ్ ఈ చర్చను సమన్వయం చేశారు.

16 ఏళ్ల వయసు తర్వాత పాఠ్యాంశంగా డ్రైవింగ్ శిక్షణ: పంకజ్ అగర్వాల్

- అతి వేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి. ఈ వేగం నియంత్రణలో ఏఐ కీలక పాత్ర పోషించేలా చూడొచ్చు.
- వీ2వీ సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తాం. దీని వల్ల ముందు వాహనం ప్రమాదంలో పడితే ఆ వాహనం నుంచి వెనుక వచ్చే వాహనాలకు సమాచారం చేరుతుంది. డ్రైవర్‌ను ఆ సమాచారం అప్రమత్తం చేస్తుంది. డ్రైవర్ అప్రమత్తమై ముందు వాహనాన్ని ఢీకొనకుండా నియంత్రిస్తారు.
- ప్రస్తుతం యువతకు డ్రైవింగ్ శిక్షణ లేదు. 16 ఏళ్లు దాటిన తర్వాత యువతీ, యువకులకు డ్రైవింగ్ శిక్షణను పాఠ్యాంశంగా తప్పనిసరి చేసే ఆలోచన ఉంది.
- నగరాల్లో కాలుష్యం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కాలుష్యం నివారించేలా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుంది.
- దేశంలో ద్విచక్రవాహనాలకు జరిగే ప్రమాదాల్లో తలకు గాయాలై ఎక్కువ మంది చనిపోతున్నారు. ఈ అంశంపై దృష్టి సారిస్తున్నాం.

సడక్ సురక్ష మిత్ర ద్వారా యువతకు శిక్షణ

– ఆర్.పి.శుక్లా, మోర్త్ రోడ్డు ప్రమాదాల నివారణ విభాగం డైరెక్టర్

- సడక్ సురక్ష మిత్ర కార్యక్రమం ద్వారా యువతీ యువకులకు శిక్షణ ఇస్తాం. వాలంటీర్లుగా ఈ శిక్షణకు ముందుకు రావాలి. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలు ఉన్న 100 జిల్లాల్లో ఇది తొలుత అమలు చేస్తాం. ఆ తర్వాత దేశమంతటా ఈ శిక్షణ ఇస్తాం.
- రోడ్డు భద్రతా ఉల్లంఘనలకు సంబంధించి జరిమానాలు వేసేది ఖజానా కోసం కాదు. మీ భద్రత కోసం. మీరు హెల్మెట్ వాడాల్సింది చలానా నుంచి రక్షణ కోసం కాదు. మీ ప్రాణాన్ని రక్షించుకునేందుకు. యువతులు జుట్టుపై ప్రేమతో హెల్మెట్లు వాడటం లేదు. ఇది సరికాదు. జెన్‌జీ తరం ముందు మీ దేహాన్ని ప్రేమించాలి, మీ దేహాన్ని రక్షించుకోవాలి.

అంతకుముందు ఐఐటీ చెన్నై సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ రోడ్ సేఫ్టీ విభాగానికి ప్రొఫెసర్ వెంకటేష్ బాలసుబ్రహ్మణ్యం ప్రజంటేషన్ ఇచ్చారు. ఐఐటీ చెన్నై రోడ్డు భద్రత నిమిత్తం ఏఐ ద్వారా ఎలాంటి మార్పులు తీసుకురాబోతోందో ఆయన వివరించారు. 'ఏఐ టూల్ ద్వారా డేటా ఆధారంగా ప్రభుత్వం చేసే ప్రక్రియలన్నింటినీ సులభంగా సమన్వయం చేసి నిర్ణయాలు తీసుకోవచ్చు. దీని వల్ల రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించవచ్చు' అని చెప్పారు. చెన్నై ఐఐటీ తయారు చేసిన సంజయ్, రాత్, తిన్ఎఐ, ఆర్ఎస్ఐ ఎల్‌టీ వంటి టూల్స్ ఎలా పని చేస్తాయో వివరించారు. ఇంటిగ్రేటెడ్ రోడ్డు సేఫ్టీ డ్యాష్‌బోర్డ్ సాయంతో ఐఐటీ చెన్నై వివిధ డేటా మార్గాలను సమన్వయం చేసి విధానాలు ఎలా మెరుగుపరచనున్నదీ వివరించారు.

క్రీడాకారుల ఆటను ఏఐతో ట్రాక్ చేస్తున్నాం

లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వీసీ కపానా శర్మ



ఈనాడు, అమరావతి: క్రీడాకారుల ఆట తీరు, వ్యక్తిగత శిక్షణ కార్యక్రమాలను కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా ట్రాకింగ్ చేస్తున్నామని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపకులపతి కపానా శర్మ తెలిపారు. ఏఐ ఆధారిత వీడియో వినియోగంతో కోచింగ్‌ను మెరుగుపరుస్తున్నామని వెల్లడించారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో సోమవారం 'విద్యారంగంలో అత్యుత్తమ నాణ్యత కలిగిన ఏఐని రూపొందించడం- ఆవిష్కరణ నుంచి వ్యవస్థ వ్యాప్త ప్రభావం వరకు' అనే అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో ఆమె మాట్లాడారు. "అత్యుత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు ఏఐ టూల్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఇది మంచి మోడల్. ఏఐ వినియోగం అంటే కేవలం టూల్స్ మాత్రమే కాదు.. అది మన విద్యార్థులు, క్రీడాకారులు, టీచర్ల పనితీరును ఎలా ప్రభావితం చేస్తుందో చూడాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఏఐ వినియోగం సురక్షితంగా, అందరికీ అందుబాటులో ఉండేలా విధానాన్ని రూపొందించాలి. ఏఐ వినియోగంలో డేటా భద్రత, స్థానిక భాషలు, సంస్కృతి దృష్టిలో ఉంచుకోవాలి. ఏఐతో బోధన, అభ్యసన టూల్స్‌ను అందరికీ అందుబాటులో ఉంచాలి" అని సూచించారు.

సముద్రాలకు ప్లాస్టిక్ నుంచి విముక్తి

– బేర్ కోస్ట్ క్లియర్ వ్యవస్థాపకురాలు దివ్యా హెగ్డే



ఏఐ ఆధారిత విధానాలతో సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపుతున్నట్లు బెంగళూరుకు చెందిన బేర్ కోస్ట్ క్లియర్ సంస్థ వ్యవస్థాపకురాలు దివ్యా హెగ్డే అనుభవపూర్వకంగా తెలిపారు. 'సముద్రంలో ఏటా 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ చేరుతోంది. ఇది జలచరాలు, జీవావరణంపై దుష్ప్రభావం చూపుతోంది' అని వివరించారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సులో దివ్యా హెగ్డే మాట్లాడారు. ఏఐ ఆధారిత విధానాలతో తీరప్రాంతాల్లో వ్యర్థాల నియంత్రణ, ప్లాస్టిక్ సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ప్రజంటేషన్ ఇచ్చారు. 'మేం మత్స్యకార మహిళల సహకారంతో సముద్ర శుద్ధిని ప్రారంభించాం. ఇది మూడు దశల్లో అమలవుతోంది. స్థానిక భాషలో ఉపయోగించగలిగే వాణి (వాయిస్ ఫస్ట్ ఏఐ ఫర్ ది లాస్ట్ మైల్) వారికి అందుబాటులో తెచ్చాం. 1,300 మంది దీన్ని ఉపయోగిస్తున్నారు. రెండో దశలో వేస్ట్ ఇంటెలిజెన్స్ ద్వారా సముద్రంలోకి చేరుతున్న వ్యర్థాలను ఐఓటీ, జీపీఎస్, ఫొటోలు, వాయిస్ ద్వారా గుర్తిస్తున్నాం. ఈ రెండు విధానాలను అనుసంధానించి వ్యర్థాల నిర్వహణ అమలు చేస్తున్నాం' అని వివరించారు. ఇప్పటికి 40 వేలకు పైగా టన్నుల ప్లాస్టిక్‌ను బయటకు తెచ్చినట్లు దివ్య తెలిపారు.



ఏఐ సదస్సు జరుగుతున్న భారత్ మండపానికి పోటెత్తిన ప్రతినిధులు

ఇంటింటికీ నీటి సరఫరాపై నిఘా

'అర్ఘ్యం' సీనియర్ మేనేజర్ భావన బడోలా



భావన బడోలా ● అర్ఘ్యం లోగో

గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సరఫరాలో నాణ్యత ప్రమాణాలను ఏఐతో ఎలా పర్యవేక్షిస్తున్నారో వివరించారు 'అర్ఘ్యం' సంస్థ సీనియర్ మేనేజర్ భావన బడోలా. అంతరాయం లేని రక్షిత నీటి సరఫరా తమ లక్ష్యమని చెప్పారు. 'అస్సాంలో జలసూచక్ అనే ఏఐ ఆధారిత స్మార్ట్ సొల్యూషన్ విధానం అమలు చేస్తున్నాం. తాగునీటిని తాగునీటి పథకాల నుంచే ఇస్తున్నారా, లేదా అన్నది ప్రభుత్వ పీఏటీడీ శాఖ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. నీటి నాణ్యతను పంప్ ఆపరేటర్లు మాన్యువల్‌గా నమోదు చేయడంలో ఇబ్బందులున్నాయి. వారి వద్ద డేటా పరిశీలించే విధానాలు లేవు. మేం వారికి ఇమేజ్ రీడింగ్ టూల్స్ ఇచ్చాం. ప్రతి పైప్‌లైన్ స్కీమ్‌లో బల్క్ ఫ్లో మీటర్ అమర్చాం. దీనితో ఎంత నీరు సరఫరా చేస్తున్నారో తెలుసుకోవచ్చు. ఫొటో తీసి వాట్సప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఏఐ సాంకేతికతతో పరిశీలించి.. అధికారులకు వివరాలు అందిస్తాం' అని వివరించారు. ప్రతిరోజు 10 వేల మంది ఆపరేటర్లు చిత్రాలు అప్‌లోడ్ చేస్తున్నారని చెప్పారు. వినియోగదారుల అభిప్రాయ సేకరణకు జల్‌కీ బాత్ అనే వాయిస్ విధానం అనుసరిస్తున్నట్లు భావన వివరించారు.



ఆర్కే బీచ్ రోడ్డుపై విద్యార్థినుల ప్రదర్శన

సాగరతీరంలో మిలన్ సంబరాలు

ఈనాడు, విశాఖపట్నం: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్-2026), మిలన్ వేడుకల్లో భాగంగా తూర్పు నౌకా దళం ఆధ్వర్యంలో సోమవారం సన్నాహక విన్యాసాలు జరిగాయి. యుద్ధ ట్యాంకర్లు, మిగ్-29, హాక్ ఫైటర్ జెట్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ, ఎస్‌సీసీ, పోలీసు సిబ్బంది, కోరుకొండ, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, మాజీ సైనికులు, ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది కవాతు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక బృందాల కళారూపాల ప్రదర్శన సాగింది. తూర్పు నౌకాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, ఇతర అధికారులు రిహార్సల్స్ వీక్షించారు.

14, 15 తేదీల్లో దక్షిణాది న్యాయమూర్తుల సమావేశం

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాదికి చెందిన హైకోర్టు న్యాయమూర్తుల ప్రాంతీయ సమావేశానికి తెలంగాణ హైకోర్టు ఆతిథ్యం ఇవ్వనుంది. మార్చి 14, 15 తేదీల్లో రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రాంతీయ సమావేశం (సౌత్ జోన్-2) నిర్వహణ కోసం రూ.2 కోట్లను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ రాసిన లేఖను పరిగణనలోకి తీసుకుని నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొననున్నారు.

నేడు విశాఖకు రాష్ట్రపతి రాక

రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కూడా

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంగళవారం విశాఖ రానున్నారు. ఈనెల 18 నుంచి ఇక్కడ జరగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), మిలాన్, సిటీ పరేడ్ తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 17వ తేదీ సాయంత్రం 4.40 గంటలకు రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో దిల్లీ నుంచి విశాఖ చేరుకుంటారు. రాత్రికి ఇక్కడే బసచేస్తారు. 18వ తేదీ ఉదయం ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.40 గంటలకు ప్రత్యేక విమానంలో తిరిగి దిల్లీ వెళ్లనున్నారు.

18న సీఎం చంద్రబాబు రాక: ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ఉదయం విశాఖకు రానున్నారు. రాష్ట్రపతితో కలిసి ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొంటారు.

- ఆర్కేబీచ్‌లో ఐఎఫ్ఆర్ సందర్భంగా నౌకాదళం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 18న ఫుల్‌డ్రెస్ రిహార్సల్స్, 19న సిటీ పరేడ్ జరపనున్నారు.

దిల్లీలో ఏవియేషన్ అకాడమీని ప్రారంభించిన మంత్రి లోకేశ్



సోమవారం దిల్లీలో చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్ సంస్థను ప్రారంభించి అక్కడి యువ పైలట్ కేడెట్లతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్



విమానం సిమ్యులేటర్ పనితీరును తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్

ఈనాడు, దిల్లీ: భారతీయ వైమానిక రంగం అవసరాలకు తగ్గట్టు యువతకు పైలట్ సహా వివిధ కేటగిరీల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటైన ఛార్లీ ఫాక్స్‌ట్రాట్ ఏవియేషన్ అకాడమీని ఏపీ మంత్రి లోకేశ్ సోమవారం ఇక్కడ ప్రారంభించారు. పైలెట్ శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ఆయన మాట్లాడారు. 'అట్లాంటా పర్యటన సమయంలో మొదలైన ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగానికి ప్రతిభావంతులను అందించే దిశగా వేసిన పెద్ద ముందడుగు ఇది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం సాయంత్రం దిల్లీ చేరుకున్న ఆయనకు ఎంపీలు కేశినేని శివనాథ్, సానా సతీష్‌బాబు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా షష్టిపూర్తి వేడుకల్లో పాల్గొన్నారు.

విద్యుత్తు బకాయిల వివాదంలో గీతం వర్సిటీకి ఊరట

- హైకోర్టు ఉత్తర్వులను సవరించిన సుప్రీంకోర్టు
- 4 వారాల్లోపు రూ.15 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశం

ఈనాడు, దిల్లీ: విద్యుత్తు బకాయిల వివాదం నుంచి హైదరాబాద్‌లోని గీతం యూనివర్సిటీకి తాత్కాలిక ఉపశమనం లభించింది. గీతం అనుబంధ సంస్థ వీబీసీ ఫెర్రోఅల్లాయిస్... తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌కి ఉన్న రూ.108 కోట్ల బకాయిల్లో రూ.54 కోట్లు వెంటనే చెల్లించాలని జనవరి 22న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సవరించింది. ఇందులో గీతం-ఫెర్రోఅల్లాయిస్‌ల మధ్య ఉన్న సంబంధంపై హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తుది నిర్ణయం వెలువరించేంత వరకు సదరన్ డిస్కం ఇచ్చిన డిమాండ్ నోటీసుకు స్పందనగా రూ.15 కోట్ల మొత్తాన్ని నాలుగు వారాల్లోపు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. వీబీసీ ఫెర్రోఅల్లాయిస్ సంస్థ రూ.108 కోట్ల బకాయిలు, వడ్డీ రూ.10 కోట్లు కలిపి రూ.118 కోట్ల మొత్తాన్ని చెల్లించాలని, లేదంటే గీతం సంస్థకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తామని గత ఏడాది సెప్టెంబరు 12న సదరన్ డిస్కం నోటీసులిచ్చింది. దీనిపై గీతం హైకోర్టును ఆశ్రయించింది. విచారించిన ఏకసభ్య ధర్మాసనం వీబీసీ ఫెర్రో అల్లాయిస్, గీతం విద్యాసంస్థల మధ్య సంబంధం ఉందని తేలితే మొత్తం బకాయిలను వడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పి 'గీతం'తో అండర్‌టేకింగ్ తీసుకొని విద్యుత్తును పునరుద్ధరించాలని డిస్కంను ఆదేశించింది. ఆ ఉత్తర్వులతో విభేదించిన డిస్కం... హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు సవాలు చేయగా ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విని మధ్యేమార్గంగా రూ.54 కోట్లు డిపాజిట్ చేయాలని నిర్దేశించింది. గీతం సుప్రీంకోర్టులో సవాలు చేయగా.. సోమవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం విచారించి... తీర్పు ఇచ్చింది. పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

ప్రియుడి కోసం.. మృత్యు నాటకం

హాసన, న్యూస్‌టుడే: భర్తను మోసగించి ప్రియుడితో వెళ్లిపోవాలనుకున్న ఓ మహిళ.. తాను చనిపోయినట్లు నాటకం ఆడి పోలీసులకు దొరికిపోయింది. ఈ ఘటన కర్ణాటకలో చోటుచేసుకొంది. తుమకూరు జిల్లా కుణిగల్‌కు చెందిన ప్రియాంక(29)కు చిక్కమగళూరుకు చెందిన వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహమైంది. గత శుక్రవారం హాసన తాలూకా కబ్బూర గ్రామంలో జరుగుతున్న స్నేహితురాలి పెళ్లికి ప్రియాంక వెళ్లింది. స్థానికంగా ఉన్న ఓ కాల్వగట్టున ఆమె దుస్తులు, పాదరక్షలు, ఇతర సామగ్రిని వదిలేసి పారిపోయింది. దీంతో తాను మరణించినట్లు భర్త భావిస్తారని ప్రియాంక అంచనా వేసింది. ఈ విషయం తెలియగానే భార్య కనిపించట్లేదంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రియాంక ఒంటిపై రూ.30 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయని, వాటిని కాజేయడానికి హత్య చేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారించిన పోలీసులు బేలూరు బస్టాండ్ వద్ద సీసీకెమెరా ఫుటేజ్‌లో ఆమెను గుర్తించారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా ప్రియుడు డేవిడ్ దగ్గర ఉన్నట్లు నిర్ధారించుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

వ్యాయామంతో దీర్ఘాయుష్షు



మీ శరీరాన్ని దృఢంగా ఉంచుకోవాలని, జీవితకాలాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారా? శక్తిమంతంగా ఉండాలన్నది మీ లక్ష్యమా? అయితే దానికి గల ఒకే ఒక మార్గం వ్యాయామం. దీన్ని చిన్నగా మొదలుపెట్టి నిలకడగా కొనసాగించండి. మీరు రోజువారీ కొనసాగించే ఈ అలవాటే మీ ఆరోగ్యకర దీర్ఘాయుష్షుకు పునాది అవుతుంది.

– బిగ్గీ మురళి, ఫిట్‌నెస్ కోచ్

తిరుమలలో తెలంగాణ భవన్‌కు

స్థలం కేటాయించండి

- సీఎం చంద్రబాబును కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అమరావతి అగ్రగామి రాజధానిగా ఉండాలనేదే తమ ఆకాంక్ష అని వెల్లడి



చంద్రబాబుతో భేటీ అయిన సందర్భంగా ఆయనను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

ఈనాడు, అమరావతి: తిరుమలలో తెలంగాణ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, భద్రాచలం సమీపంలోని ఐదు ఏపీ గ్రామాల్ని తెలంగాణలో కలిపేందుకు సహకరించాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరినట్టు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలోనే అగ్రగామి రాజధానిగా అమరావతి ఉండాలనేదే తెలుగువారందరి ఆకాంక్షని.. ఇదే తమ అభిమతమని స్పష్టంచేశారు. ఉండవల్లి నివాసంలో ఏపీ సీఎం చంద్రబాబుతో సోమవారం తుమ్మల సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టు కోసం గతంలో ఏడు మండలాల్ని తెలంగాణ నుంచి ఏపీకి బదిలీ చేశారు. ప్రాజెక్టు నిర్మాణం దృష్ట్యా దాన్ని మేమూ ఆమోదించాం. ఇప్పుడు భద్రాచలం పట్టణం నుంచి తెలంగాణ వెళ్లాలంటే ఏపీలోని ఐదు గ్రామాల గుండా వెళ్లాల్సి వస్తోంది. వాటిని తెలంగాణలో కలపాలని చంద్రబాబును కోరాను. ఆయనా పరిశీలిస్తానన్నారు. జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం(వయా వైరా, తల్లాడ); ఏలూరు నుంచి కొత్తగూడెం వరకూ రెండు జాతీయ రహదారుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా సహకరించాలని కోరాం. ఇవి పూర్తయితే భద్రాచలం పుణ్యక్షేత్రానికి ఏపీ నుంచి అనుసంధానం పెరుగుతుంది. అశ్వారావుపేట మండలంలో ఉన్న ఉమ్మడి సాగునీటి ప్రాజెక్టు పెదవాగు వర్షాలకు దెబ్బతిన్న దృష్ట్యా ఆయకట్టు ఆధారంగా రెండు రాష్ట్రాలు కలిసి మరమ్మతులు చేయాలని చంద్రబాబు దృష్టికి తెచ్చా'' అని తుమ్మల వివరించారు. ''చంద్రబాబు పలకరింపులో ఏ మాత్రం మార్పు రాలేదని, 1983 నుంచి తనతో ఎలా ఉన్నారో...ఇప్పుడూ అలానే ఉన్నారని'' తుమ్మల వెల్లడించారు.

గంట ప్రయాణం దూరంలో ఒక్కో విమానాశ్రయం!

- అందుబాటులోకి తెచ్చేలా ఏపీఏడీసీఎల్ ప్రణాళిక
- కొత్తగా 9 విమానాశ్రయాల అభివృద్ధికి ప్రణాళిక
- రూ.6,416 కోట్లతో ప్రతిపాదనలు
- టెండరు దశలో 2 ఎయిర్‌పోర్టులు



ఈనాడు, అమరావతి: రోడ్డు మీద గంట సేపు ప్రయాణం చేస్తే వెళ్లగలిగేంత దూరంలో ఒక్కో విమానాశ్రయం అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్యంలో భాగంగా కొత్తగా 9 విమానాశ్రయాలను.. రూ.6,416 కోట్లతో అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ప్రతిపాదనలు రూపొందించింది. నెల్లూరు జిల్లా దగదర్తి విమానాశ్రయాన్ని రూ.916 కోట్లతో పీపీపీ విధానంలో నిర్మించేందుకు ఇప్పటికే టెండరు పిలిచింది. వచ్చే నెలలో పనులు అప్పగించేందుకు కసరత్తు చేస్తోంది. కుప్పంలో విమానాశ్రయాన్ని రూ.1,142.10 కోట్లతో నిర్మించేందుకు త్వరలో టెండర్లు పిలవనుంది. దీనికోసం 444 ఎకరాల భూములను సేకరించాల్సి ఉంది. అమరావతి, శ్రీకాకుళం విమానాశ్రయాల నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. అమరావతిలో రూ.1,000 కోట్లు, శ్రీకాకుళంలో రూ.650 కోట్లతో విమానాశ్రయాలు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మిగిలిన తుని-అన్నవరం, తాడేపల్లిగూడెం, నాగార్జునసాగర్, ఒంగోలు, అనంతపురం విమానాశ్రయాల నిర్మాణానికి డీపీఆర్‌లు తయారీ దశలో ఉన్నాయి. భోగాపురంలో నిర్మాణంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి.. ప్రారంభించాలని భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 6 విమానాశ్రయాలు నిర్వహణలో ఉన్నాయి.

ఏటా పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య

- రాష్ట్రంలో ఇప్పటికే నిర్వహణలో ఉన్న విమానాశ్రయాల నుంచి ఏటా సుమారు 50-60 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వారి సంఖ్య ఏటా కనీసం 17 శాతం పెరుగుతోంది. జిల్లాల మధ్య విమాన సర్వీసులకు డిమాండ్ ఏటా పెరుగుతోంది.
- రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు వెళ్లే వారి సంఖ్య ఏటా సుమారు 1.5 లక్షల వరకు ఉంటోంది. అది ఏటా సుమారు 14 శాతం పెరుగుతోంది.
- జిల్లాల మధ్య అనుసంధానం పెంచితే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని ఏపీఏడీసీఎల్ భావిస్తోంది.

ఎకోసిస్టమ్ అభివృద్ధిపై దృష్టి

రాష్ట్రంలో విమానయాన రంగానికి అవసరమైన ఎకోసిస్టమ్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రయాణికుల సేవలతో పాటు.. సరకు రవాణాకు అనువుగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలోని విమానాశ్రయాల నుంచి ఏటా సుమారు 5,917 మెట్రిక్ టన్నుల సరకు రవాణా జరుగుతోంది. అనుసంధానాన్ని పెంచడం ద్వారా దానిని మరో 20 శాతం పెంచాలని భావిస్తోంది.

- విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వాటిలో ఏర్పాటు చేసే పరిశ్రమలు సరకు రవాణా కోసం విమానాశ్రయాలను వినియోగించుకునేందుకు వీలుగా రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించింది.
- కర్నూలు విమానాశ్రయంలో రెండు ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌టీవో) ఏర్పాటుకు ఓరియెంట్ ఫ్లైట్స్ ఏవియేషన్ అకాడమీ, మేల్‌స్టార్ టెక్ ఏవియేషన్ సంస్థలకు ఇప్పటికే అనుమతులు ఇచ్చింది.
- రాజమహేంద్రవరం విమానాశ్రయంలో మరో రెండు ఎఫ్‌టీవోల ఏర్పాటుకు నిర్ణయించింది. మిగిలిన విమానాశ్రయాల్లోనూ ఎఫ్‌టీవోల ఏర్పాటుపై అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

కర్ణాటకలో రూ.400 కోట్ల దారి దోపిడీ కట్టుకథే

బెళగావి, న్యూస్‌టుడే: ఓ ట్రక్కులో హవాలా సొమ్ము తరలిస్తుండగా రూ.400 కోట్ల నగదు దోపిడీ జరిగిందంటూ ఆ వాహన డ్రైవర్ చేసిన ఫిర్యాదు బోగస్ అని తేలింది. అతడు చెప్పింది కట్టుకథేనని, ఎటువంటి దారి దోపిడీ జరగలేదని పోలీసులు సోమవారం స్పష్టం చేశారు. నగదు తరలిస్తున్న ట్రక్కును అడ్డగించి దోపిడీ చేశారంటూ డ్రైవర్ సందీప్ పాటిల్ గతేడాది డిసెంబరు 17న మహారాష్ట్రలోని నాసిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కర్ణాటక నుంచి మహారాష్ట్రకు హవాలా సొమ్ము తరలిస్తుండగా గతేడాది అక్టోబరు 22న బెళగావి జిల్లాలోని చోర్లా ఘాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని నమ్మబలికాడు. ఏడుగురు వ్యక్తులు తనను అడ్డగించి, దాడి చేసి రూ.400 కోట్ల విలువైన రూ.2000 నోట్లతో (ప్రస్తుతం రద్దయ్యాయి) పరారైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దారి దోపిడీ గురించి సోషల్ మీడియాలో వీడియోలను అప్‌లోడ్ చేశాడు. ఈ వార్త కర్ణాటకలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. 'అతని ఫిర్యాదు మేరకు ఏడుగురు అనుమానితులను అరెస్టు చేసి విచారించాం. సందీప్ పాటిల్ ఆరోపణలు, ట్రక్కు రూట్, టైమింగ్స్, కాల్ రికార్డులు అన్నీ కట్టుకథలేనని తేలాయి' అని పోలీసు అధికారులు వివరించారు. అసలు దోపిడీ కట్టుకథ ఎందుకు అల్లాడనే దానిపై డ్రైవరును పోలీసులు పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. ఈ కేసులో అరెస్టయిన ఏడుగురినీ న్యాయస్థానం ఇప్పటికే విడుదల చేసింది.

దేశంలోనే అత్యంత పొడవైన తొండ



ఈటీవీ భారత్: మహారాష్ట్రలోని కొల్హాపుర్ జిల్లాలో నిర్వహించిన వ్యవసాయ ప్రదర్శనలో దేశంలోనే అత్యంత పొడవైన తొండ(ఇగ్వానా) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముంబయికి చెందిన జంతు ప్రేమికుడు కిశోర్ చవాన్ దీన్ని పెంచుకుంటున్నారు. 8 ఏళ్ల వయసున్న ఈ తొండ పొడవు ఐదున్నర అడుగులు కాగా, బరువు 20 కిలోలు. కేరళలో కొనుగోలు చేసిన ఈ తొండకు 'టోన్యా' అని పేరు పెట్టారు. దీనికి రోజూ స్నానం చేయించడంతో పాటు, కూరగాయలు, క్యారెట్, దోసకాయలు, గుమ్మడికాయలు, కొత్తిమీరను ఆహారంగా అందిస్తున్నట్లు కిశోర్ చెప్పారు.

ముచ్చటగా మూడోసారి.. ఐఏఎస్‌తోనే మనువు

- మళ్లీ వార్తల్లోకెక్కిన ఐఏఎస్ అధికారి అవీ ప్రసాద్



భోపాల్: మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అవీ ప్రసాద్ తన పెళ్లితో తాజాగా మరోసారి వార్తల్లో నిలిచారు. గతంలో ఇద్దరు ఐఏఎస్ అధికారిణులను వివాహం చేసుకొని విడాకులు తీసుకున్న ఆయన.. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి కూడా ఐఏఎస్ అధికారిణినే మనువాడారు. అవీ ప్రసాద్ స్వస్థలం ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపుర్ జిల్లా. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. ఆయన తాత తంబేశ్వర్ ప్రసాద్ ఎలియాస్ బచ్చా బాబు గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. అవీ ప్రసాద్ 2013లో ఐపీఎస్‌కు, మరుసటి ఏడాది ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన తొలుత ఐఏఎస్ అధికారిణి రిజు బాఫ్నా (ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని శాజాపుర్ కలెక్టర్)ను పెళ్లి చేసుకున్నారు. ఆమెతో విడిపోయిన తర్వాత 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి మిశా సింగ్ (ప్రస్తుతం రత్లాం జిల్లా కలెక్టర్)ను వివాహమాడారు. నాలుగేళ్ల క్రితం ఆమెతో విడాకులు తీసుకున్నారు. ఈ నెల 11న అవీ ప్రసాద్.. 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి అంకితా ధాక్రే (ప్రస్తుతం మధ్యప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ శాఖలో డిప్యూటీ సెక్రటరీ)ను మూడో వివాహం చేసుకున్నారు. వారి పెళ్లి ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అవీ ప్రసాద్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ ఉపాధి హామీ మండలి ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా పనిచేస్తున్నారు.

ఏప్రిల్ 7 నుంచి 'శబరిమల' కేసు విచారణ


దిల్లీ: కేరళలోని శబరిమల ఆలయంలోకి ప్రవేశం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై కొనసాగుతున్న వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 7 నుంచి విచారణ ప్రారంభమవుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం సోమవారం పేర్కొంది. సంబంధిత పక్షాలు తమ వాదనలను మార్చి 14లోపు సమర్పించాలని ఆదేశించింది. ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు విచారణ కొనసాగుతుందని పేర్కొంది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, అన్య మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాలపైనా విచారణ జరపనుంది.

'పరిశ్రమ' నిర్వచనాన్ని తేల్చేందుకు

9 మంది జడ్జీలతో విస్తృత ధర్మాసనం

- మార్చి 17,18 తేదీల్లో విచారణ: సుప్రీంకోర్టు

దిల్లీ: ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న 'పరిశ్రమ' నిర్వచన వివాదంపై 9 మంది జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం విచారణ జరపనుంది. పారిశ్రామిక వివాదాల చట్టం-1947లో ఉన్న పరిశ్రమ (ఇండస్ట్రీ) అనే పదం నిర్వచనంపై 1978 నుంచి పలు ధర్మాసనాలు విచారణ జరిపాయి. అయినప్పటికీ అస్పష్టత తొలగిపోలేదు. ఈ నేపథ్యంలో 9మంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం మార్చి 17, 18 తేదీల్లో ఈ అంశాన్ని విచారణకు చేపట్టనుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.



పంచోలి ధర్మాసనం సోమవారం వెల్లడించింది. విచారణ అంశాలు/ప్రశ్నలను రూపొందించింది. ఈ వ్యాజ్యంలో వాదులు పక్షపాతాలు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా ఈ నెల 28లోగా సమర్పించాలని ఆదేశించింది. 'ఒక సంస్థ.. పరిశ్రమ నిర్వచన పరిధిలోకి వస్తుందా? రాదా? దానిని నిర్ధారించే సరైన చట్టం ఏంటి?' 'పారిశ్రామిక వివాదాల సవరణ చట్టం-1982 అమలులోకి రాలేదా? పరిశ్రమ వ్యక్తీకరణపై 'పారిశ్రామిక స్మృతి(ఇండస్ట్రీ కోడ్) న్యాయ ప్రభావాన్ని చూపిందా?' అనే అంశాలను ఈ విస్తృత ధర్మాసనం విచారణ జరుపుతుందని సీజేఐ తెలిపారు. ప్రభుత్వ విభాగాలు అమలు చేసే సామాజిక సంక్షేమ పథకాలను ఈ చట్టం ప్రకారం పారిశ్రామిక కార్యకలాపాలుగా భావించవచ్చా.. అనే అంశాన్ని కూడా ధర్మాసనం పరిశీలిస్తుందని పేర్కొన్నారు.

25-26 తేదీల్లో మోదీ ఇజ్రాయెల్ పర్యటన

జెరూసలెం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 25-26 తేదీల్లో రెండ్రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఆదివారం జరిగిన 'ప్రెసిడెంట్స్ ఆఫ్ మేజర్ అమెరికన్ జూయిష్ ఆర్గనైజేషన్ కాన్ఫరెన్స్'లో మోదీ పర్యటన గురించి తొలుత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. "భారత్-ఇజ్రాయెల్‌ల మధ్య అద్భుతమైన మైత్రి ఉంది. మేము అన్ని రకాల సహకారాల



గురించి చర్చించబోతున్నాం. ఇప్పుడు భారత్ చిన్న దేశం కాదని మనందరికీ తెలుసు. 140 కోట్ల మంది ప్రజలున్నారు. భారత్ చాలా శక్తివంతమైనది, ప్రజాదరణ కలిగినది" అని సమావేశంలో నెతన్యాహు వ్యాఖ్యానించారు. పర్యటనలో భాగంగా... మోదీ ఇజ్రాయెల్ చట్టసభ నెసెట్‌ను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. 2017 జులైలో తొలిసారిగా ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. గత ఏడాది నవంబరులో ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బిట్)పై సంతకాలు చేసిన విషయం తెలిసిందే.

ముంబయిలో మెక్రాన్-మోదీ భేటీ నేడు

దిల్లీ: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మెక్రాన్ మంగళవారం భారత్ పర్యటనకు రానున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబయిలో ఆయనతో సమావేశం అవుతారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 'ఇండియా-ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్-2026' కార్యక్రమాన్ని ఇరువురూ ప్రారంభించనున్నారని తెలిపింది. 'భారత్-ఫ్రాన్స్' వ్యూహాత్మక భాగస్వామ్య పురోగతిని ఇరు దేశాల నేతలు సమీక్షించనున్నారని పేర్కొంది. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా చర్చిస్తారని తెలిపింది. మోదీ ఆహ్వానం మేరకు భారత్‌కు రానున్న మెక్రాన్.. ఈ నెల 17 నుంచి 19 వరకు మూడురోజుల పాటు ఇక్కడ పర్యటించనున్నారు.

తొలి దఫా బోర్డు పరీక్షలకు

'పది' విద్యార్థుల హాజరు తప్పనిసరి

- కనీసం మూడు సబ్జెక్టులైనా రాయాల్సిందే
- అలాంటివారికే రెండో దఫా పరీక్షలకు అనుమతి: సీబీఎస్ఈ



దిల్లీ: పదో తరగతి విద్యార్థులు మంగళవారం నుంచి నిర్వహించే మొదటి దఫా బోర్డు పరీక్షలు తప్పనిసరిగా రాయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) స్పష్టం చేసింది. మొదటి ఎడిషన్‌లో కనీసం మూడు సబ్జెక్టుల పరీక్షలు కూడా రాయనివారిని 'ఎసెన్షియల్ రిపీట్' కేటగిరీలో ఉంచుతామని, వారిని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే పరీక్షలకు మాత్రమే అనుమతించనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ పదో తరగతికి రెండు దఫాలుగా బోర్డు పరీక్షలను నిర్వహించనుంది. ఏవైనా కారణాల వల్ల పదో తరగతి విద్యార్థులు మొదటి బోర్డు పరీక్ష రాయకపోతే వారిని రెండో బోర్డు పరీక్షలు రాయడానికి అనుమతించాలని అభ్యర్థనలు అందిన నేపథ్యంలో సీబీఎస్ఈ ఈ వివరణ ఇచ్చింది. 'విద్యార్థులు మొదటి బోర్డు పరీక్షకు హాజరు కావడం తప్పనిసరి. అందులో ఉత్తీర్ణులైనవారిని సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, లాంగ్వేజెస్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టుల్లో మార్కులు పెంచుకోవడానికి మే నెలలో జరిగే రెండో దఫా పరీక్షలు రాయడానికి అనుమతిస్తాం. మొదటి ఎడిషన్ పరీక్షల్లో కంపార్ట్‌మెంట్‌లో ఉన్న విద్యార్థులు.. అదే కేటగిరీ కింద రెండో బోర్డు పరీక్షలు రాయవచ్చు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత రెండో దఫా పరీక్షల్లో అదనపు సబ్జెక్టులు రాయడానికి అనుమతి ఉండదు. విద్యార్థుల్ని స్టాండ్-ఎలోన్ సబ్జెక్టులకు అనుమతించరు' అని సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ పేర్కొన్నారు.



ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు..

- ఆరోగ్య బీమా తీసుకునేటప్పుడు మీకు ఉన్న అన్ని రకాల వ్యాధులను నిజాయతీగా వెల్లడించండి.
- మీరు ఉద్యోగం చేస్తున్న సంస్థ నుంచి కార్పొరేట్ కవరేజీ ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా మరో పాలసీ తీసుకోండి
- తక్కువ ప్రీమియంకు వస్తున్నాయని మోసపూరిత పాలసీల ఉచ్చులో పడకండి.
- ఆరోగ్య బీమాను ఖర్చుగా భావించొద్దు. అది మీ ఆర్థిక స్థితికి రక్షణ కవచంగా గుర్తించండి.

– నవీన్, ట్రేడర్

పెళ్లికి ముందు ఎవరినీ నమ్మవద్దు

- శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: పెళ్లికి ముందే శారీరక సంబంధాలు ఏర్పరచుకునే విషయంలో అబ్బాయిలు, అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలని సుప్రీంకోర్టు సోమవారం హెచ్చరించింది. పెళ్లి చేసుకుంటానంటూ తప్పుడు హామీఇచ్చి అత్యాచారానికి పాల్పడినట్లుగా ఆరోపణ ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి బెయిలు దరఖాస్తుపై విచారణ జరుపుతూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ఇరువురూ ఆమోదంతోనే శారీరకంగా కలిసినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడింది. "ఇది పరస్పర అంగీకారంతో జరిగిందే. పెళ్లికి ముందు అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు పూర్తిగా అపరిచితులే. వారు శారీరక సంబంధం ఎలా ఏర్పరచుకుంటారు? పెళ్లికి ముందు ఎవరినీ నమ్మడానికి వీల్లేదు" అని కోర్టు పేర్కొంది.

దుబాయ్‌కి ఎందుకు వెళ్లింది?

తప్పుడు హామీ ఇచ్చి అత్యాచారం జరిపాడని ఆరోపిస్తున్న అమ్మాయి అతనితో కలిసి దుబాయ్‌కి ఎందుకు వెళ్లిందో చెప్పాలని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. అది పరస్పర అంగీకారంతోనే జరిగినట్లు కనిపిస్తోందన్నారు. అమ్మాయి అంత కచ్చితమైన వ్యక్తే అయి ఉంటే పెళ్లికి ముందు అబ్బాయితో కలిసి వెళ్లి ఉండకూడదని, పరస్పర అంగీకారంతో కలుసుకున్నప్పుడు.. శిక్షలు వేయడానికి ఇవి తగిన కేసులు కావని వ్యాఖ్యానించారు. అమ్మాయికి కొంత పరిహారం చెల్లించి అంతటితో కథ ముగించాలని నిందితుని తరఫు న్యాయవాదికి సూచించారు. అమ్మాయి ఒక వెబ్‌సైట్ ద్వారా 2022లో అబ్బాయికి పరిచయమైందని, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చిన నిందితుడు ఆమెకు దిల్లీలో, దుబాయ్‌లో శారీరకంగా చేరువయ్యాడని అమ్మాయి తరఫు న్యాయవాది వాదించారు. ఆ యువకుడికి రెండుసార్లు వివాహాలయ్యాయని తెలుసుకున్న యువతి ప్రశ్నిస్తే.. ప్రైవేటు వీడియోలు బయటపెడతానని బెదిరింపులకు పాల్పడ్డాడని తెలిపారు. ఇరుపక్షాల అభిప్రాయాలు తెలుసుకునేందుకు తదుపరి విచారణ బుధవారం జరగనుంది. యువకుడికి దిల్లీ హైకోర్టు బెయిలు నిరాకరించగా దానిని సవాలు చేస్తూ అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

నేను రాహుల్‌వాదిని కాదు



- కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాదు
- వివాదం రేపుతున్న మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలు

తిరువనంతపురం: కేరళలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్‌డీఎఫ్) విజయం సాధిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయ్యర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేతలు మండిపడుతున్నారు. అయ్యర్ కాంగ్రెస్ పార్టీలో లేరని రమేశ్ చెన్నితాల పేర్కొన్నారు. అయ్యర్ మాత్రం తన దాడిని ఆపలేదు. కేరళలో కాంగ్రెస్ నెగ్గదని.. ఎల్‌డీఎఫ్ అధికారంలోకి వస్తుందని ఆయన సోమవారం పునరుద్ఘాటించారు. "నేను పార్టీ సభ్యుడినని రాహుల్ గాంధీ మరిచి పోయారు. నేను గాంధీవాదిని, నెహ్రూవాదిని, రాజీవ్‌వాదిని. రాహుల్‌వాదిని మాత్రం కాదు. కాంగ్రెస్ వ్యక్తిగా యూడీఎఫ్ గెలవాలనుకుంటున్నాను. కానీ గాంధేయవాదిగా వాస్తవం చెప్పాలి. పినరయి విజయన్ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. కాంగ్రెస్‌కు ఎవరు ఓటు వేస్తారు? ఆ పార్టీ నాయకత్వంలో సఖ్యత లేదు. పవన్ ఖేడా లాంటి వ్యక్తి కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఉన్నారంటేనే పార్టీ దుస్థితి అర్థం చేసుకోవచ్చు. ఆయన జైరాం రమేశ్ ఏం చెబితే అది చేస్తారు" అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌పై అయ్యర్ విమర్శలు చేశారు. "థరూర్‌కు సిద్ధాంతాలు లేవు. భాజపా ప్రభుత్వంలో జైశంకర్ స్థానంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి అవ్వాలని అనుకున్నారు" అని ఆరోపించారు.

రాష్ట్రపతికి అధికార భాషా కమిటీ నివేదిక

- సమర్పించిన అమిత్ షా



దిల్లీ: పార్లమెంటరీ అధికార భాషా కమిటీ 13వ నివేదికను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం సమర్పించారు. కమిటీ సభ్యులతో కలిసి షా రాష్ట్రపతి భవన్‌ను సందర్శించి నివేదికను రాష్ట్రపతికి అందించారు. అధికార భాషను బలోపేతం చేసి ఆధునీకరించడానికి, తన కార్యకలాపాలను వేగవంతం చేయడానికి కమిటీ గత ఆరేళ్లలో నాలుగు నివేదికలు సమర్పించిందని హోం మంత్రి తెలిపారు.

నేరస్థులకు ఖాయంగా శిక్షలు: షా

మూడు కొత్త క్రిమినల్ చట్టాలు పూర్తిగా అమల్లోకి వచ్చిన తరవాత 80 శాతం క్రిమినల్ కేసుల్లో శిక్షలు పడతాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన దిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ కవాతులో పాల్గొని ప్రసంగించారు. ఈ ఏడాది మార్చికల్లా మావోయిస్టుల బెడద సమసిపోతుందన్నారు. గడచిన 11 ఏళ్ల ఎన్డీయే పాలనలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)లు రూపుదిద్దుకోవడాన్ని ఒక మైలురాయిగా అభివర్ణించారు. వీటివల్ల కేసులు వేగంగా పరిష్కారమై, కనీవినీ ఎరుగని రీతిలో నిందితులకు శిక్షలు పడుతున్నట్లు అస్సాం, గుజరాత్, హరియాణా రాష్ట్రాలు తెలిపాయని ఆయన వెల్లడించారు.

ఐఏఈఏ డైరెక్టర్ జనరల్‌తో ఇరాన్ విదేశాంగ మంత్రి భేటీ

జెనీవా: అమెరికాతో అణు చర్చల కోసం స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు చేరుకున్న ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ సోమవారం ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాసీతో భేటీ అయ్యారు. సముచిత, సమన్యాయ ఒప్పందం కోసమే తాను జెనీవా వచ్చినట్లు గ్రాసీతో సమావేశానంతరం అరాఘ్చీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. బెదిరింపులకు ఇరాన్ తలొగ్గదని స్పష్టం చేశారు. ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్-బుసైదీతో అరాఘ్చీ మంగళవారం భేటీ కానున్నారు. ఒమన్ మధ్యవర్తిత్వంలోనే జెనీవా వేదికగా అమెరికా-ఇరాన్ అణు చర్చలు జరగనున్న సంగతి గమనార్హం. మరోవైపు- వాషింగ్టన్‌తో చర్చలకు సన్నద్ధమవుతున్నవేళ.. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధిలో ఇరాన్ పారామిలిటరీ దళమైన రెవల్యూషనరీ గార్డ్ సోమవారం ఉదయం విన్యాసాలు చేపట్టడం గమనార్హం.




రఫేల్ గ్రాసీతో అబ్బాస్ అరాఘ్చీ

బంతి అమెరికా కోర్టులోనే..: మాజిద్ తఖ్త్-రవాంచీ

తమపై విధించిన అంతర్జాతీయ ఆంక్షలను అమెరికా తొలగిస్తే.. అణుకార్యక్రమం విషయంలో రాజీ పడేందుకు సిద్ధమేనని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి మాజిద్ తఖ్త్-రవాంచీ తెలిపారు. 'ఇప్పుడు బంతి అమెరికా కోర్టులోనే ఉంది. మాతో ఒప్పందం కోరుకుంటున్నట్లు నిరూపించుకోవాల్సింది ఆ దేశమే" అని మాజిద్ పేర్కొన్నారు.

లౌకికవాద పరిరక్షణకు కేరళ నాయకత్వం వహించాలి

- ఆర్థికవేత్త అమర్త్యసేన్



తిరువనంతపురం: సామాజిక అభివృద్ధిలో ఎంతో ముందున్న కేరళ.. లౌకికవాద పరిరక్షణలో దేశానికి నాయకత్వం వహించాలని ఆర్థికవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత అమర్త్యసేన్ అన్నారు. ఒకప్పుడు భారత్‌లో లౌకికవాద స్ఫూర్తి చెరిగిపోనిది, ఎవరూ నాశనం చేయలేనిదని భావించానని.. ఇప్పుడు ఆ నమ్మకం చెదిరిపోతోందని పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం నిర్వహించిన విజన్-2031 సదస్సులో ఆయన ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. "విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన తదితర రంగాల్లో కేరళ గణనీయమైన పురోగతి సాధించింది. ఒకప్పుడు పేద రాష్ట్రంగా ప్రయాణం ప్రారంభించి, నేడు ఆర్థికంగా, సామాజికంగా గొప్పగా రాణిస్తోంది. చరిత్ర పుటల్లోనూ కేరళకు ప్రత్యేక స్థానం ఉంది" అని అమర్త్యసేన్ పేర్కొన్నారు. వీటితో పాటు దేశంలో లౌకికవాద విలువలను కాపాడటానికి జాతీయ స్థాయిలో కేరళ నాయకత్వం వహించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత సాంస్కృతిక వైభవం, ప్రాచీన కాలపు మేధో సంపత్తిపై ప్రస్తుతం అనేక అభూత కల్పనలు ప్రచారమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి ఘనతలు మన దేశానికి ఉన్నప్పటికీ.. ఇతర నాగరికతలతో ఇచ్చి పుచ్చుకునే సుగుణంతోనే వాటిని సాధించామని అన్నారు. ఇందుకు ఆయన గణితాన్ని ఉదహరించారు. గ్రీక్, బాబిలోనియన్ సంస్కృతుల ప్రభావంతోనే దేశంలో 2 వేల ఏళ్ల క్రితం గణిత శాస్త్రం అభివృద్ధి చెందడం ప్రారంభించిందని అమర్త్యసేన్ విశ్లేషించారు.

రాజస్థాన్‌లో అగ్ని ప్రమాదం.. ఏడుగురి సజీవ దహనం

జైపుర్: రాజస్థాన్‌లోని ఖైర్తల్-తిజారా జిల్లా భివాడీ ప్రాంతంలో ఉన్న ఓ రసాయన కర్మాగారంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. వస్త్రాల కర్మాగారంగా చలామణి అవుతూ.. ఇక్కడ అక్రమంగా బాణాసంచాను తయారుచేస్తున్నట్లు జిల్లా అదనపు మెజిస్ట్రేట్ సుమిత్రా పారీక్ పేర్కొన్నారు. రోజువారీ పెట్రోలింగ్ విధుల్లో ఉండగా ఈ ప్రమాదం గురించి తెలిసిందని, వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని ఆమె వివరించారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

సింగపూర్‌లో భారత్ సంతతి వ్యక్తికి జైలు శిక్ష

సింగపూర్: ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించి, ఆమె గౌరవానికి భంగం కలిగించినందుకు భారత సంతతికి చెందిన ఓ వ్యక్తికి సింగపూర్ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష విధించింది. నిందితుడు ఓం కుమార్ రాయ్ (42) గత ఏడాది జూన్ 17న బాధితురాలిని అడ్డగించి.. ఆమె తండ్రి సహోద్యోగిగా తనను పరిచయం చేసుకున్నాడు. మాట్లాడాలనే నెపంతో ఆమెను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు అతడి నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లింది. జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి, పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యవసాయ ఉద్గారాలు ఎక్కువగా ఉన్న ఆరు దేశాల్లో భారత్

దిల్లీ: వ్యవసాయ రంగ గ్రీన్‌హౌస్ ఉద్గారాల్లో 61 శాతానికి కారణమవుతున్న ఆరు దేశాల్లో భారత్ కూడా ఉందని తాజా అధ్యయనం పేర్కొంది. ఈ జాబితాలో చైనా, ఇండోనేసియా, అమెరికా, థాయ్‌లాండ్, బ్రెజిల్ కూడా ఉన్నాయి. అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయానికి చెందిన కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ లైఫ్ సైన్సెస్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. వీరు పంటలు, మూలాలపరంగా వ్యవసాయ ఉద్గారాల వివరాలను ఒక కచ్చితమైన, సవివర మ్యాప్ రూపంలో అందించారు. ఆహారాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశాల్లో ఉద్గారాలు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో వరి పంట వాటా 43 శాతంగా ఉంది. వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్, గోధుమ కలిపి.. పంట ఉద్గారాల్లో మూడొంతుల స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. పోషక విలువలు కలిగిన పండ్లు, కూరగాయల వంటి పంటల నుంచి ఈ తరహా వాయువుల తక్కువగా వెలువడటం విశేషం.

దోపిడీకి గురవుతున్న గిగ్ వర్కర్లు

- రాహుల్‌గాంధీ ఆందోళన



దిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన గిగ్ వర్కర్ల ప్రతినిధి బృందం


దిల్లీ: గిగ్ రంగంలో కుల, వర్గ వివక్షలు లోతుగా పాతుకుపోయాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం ఆరోపించారు. కేంద్రంలో, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని పేర్కొంటూ ఈ రంగానికి సంబంధించి బలమైన చట్టాలు లేకపోవడం, గిగ్ కంపెనీల్లో జవాబుదారీతనం లేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. తాను నిర్వహిస్తున్న 'జన్ సంసద్' కార్యక్రమంలో కొన్ని రోజుల క్రితం కొందరు గిగ్ వర్కర్ల ప్రతినిధి బృందాన్ని కలిశానని ఆయన తెలిపారు. గిగ్ ఆర్థిక వ్యవస్థ వల్ల ఆ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని చర్చల సందర్భంగా ప్రతినిధులు కోరినట్టు రాహుల్‌గాంధీ సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "గిగ్ వర్కర్లకు స్థిరమైన ఆదాయం లేదు. సామాజిక భద్రత, వైద్య సహాయం, ఆరోగ్య బీమా వంటి సదుపాయాలేవీ వాళ్లకు లేవు. వాళ్ల కనీస మానవ మర్యాదకు నోచుకోవడం లేదు" అని రాహుల్ అన్నారు. మహిళా గిగ్ వర్కర్లు రెండు విధాలా దోపిడీకి గురవుతున్నారని, వారికి ఆర్థిక భద్రత లేదని, గౌరవం, రక్షణ కరువయ్యాయని వాపోయారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో గిగ్ వర్కర్లకు హక్కులు కల్పించే చట్టాలను ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. వారికి సామాజిక భద్రత, కనీస వేతనాలు, సమానత్వం కల్పిస్తామన్నారు. ఈ విషయంలో దేశ వ్యాప్తంగా అమలు చేయతగిన చట్టపరమైన నమూనాను కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూపొందిస్తున్నామని రాహుల్ తెలిపారు.

బ్రిటన్, కెనడా పౌరులకు చైనాలో వీసారహిత ప్రవేశం



బీజింగ్: చైనాలో వీసా లేకుండా పర్యటించే అవకాశం బ్రిటన్, కెనడా దేశాల ప్రజలకు మంగళవారం నుంచి అందుబాటులోకి రానుంది. దీంతో ఇలాంటి సదుపాయం ఉన్న దేశాల సంఖ్య 79కి పెరిగింది. తమ దేశంలో పర్యాటకాన్ని, వాణిజ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చైనా ఈ సదుపాయం కల్పించింది. గడచిన రెండేళ్లుగా వీసా రహిత పర్యటనకు అర్హత కలిగిన దేశాల సంఖ్యను బాగా విస్తరించింది. ఈ సదుపాయం ఉన్న దేశాల పౌరులు ఎలాంటి వీసా లేకుండా 30 రోజుల పాటు ఇక్కడ ఉండవచ్చు. చైనాలో నిర్దిష్ట కాలంలో పర్యాటక, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడంతోపాటు కుటుంబ సభ్యుల్ని, మిత్రుల్ని సందర్శించవచ్చు. అమెరికా, ఇండోనేసియా దేశాల పౌరులు మరో దేశానికి వెళ్తూ మార్గమధ్యంలో (ట్రాన్సిట్‌పై) పదిరోజుల పాటు చైనాలో వీసా లేకుండా గడిపేందుకు వీలు కల్పించారు. ఐరోపా ఖండంలోని అత్యధిక దేశాలకు చెందిన పౌరులు కూడా చైనాలో వీసారహిత పర్యటనకు అర్హత కలిగి ఉన్నారు.

అబూ సలెం అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు



దిల్లీ: కోర్టు విధించిన 25 సంవత్సరాల జైలుశిక్షను పూర్తిచేసుకున్న తనను విడుదల చేయాల్సిందిగా కోరుతూ గ్యాంగ్‌స్టర్, ముంబయి బాంబు పేలుళ్ల కేసు నిందితుడు అబూ సలెం దాఖలు చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. కేసులో విధించిన శిక్షను పూర్తి చేశానని, తనను మరో పది నెలలు అక్రమ నిర్బంధంలో ఉంచారని కోర్టులో సలెం విన్నవించాడు. అతనికి మరణ శిక్ష విధించరాదని, కారాగార శిక్ష కూడా 25 ఏళ్లకు మించరాదని సలెంను భారత్‌కు అప్పగించే సమయంలో పోర్చుగల్ షరతులు విధించింది. శిక్షాకాలం ఇంకా పూర్తి కావాల్సి ఉందంటూ 2025 జులైలో బాంబే హైకోర్టు వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ సలెం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. మధ్యంతర ఊరట అందించడానికి మాత్రమే హైకోర్టు నిరాకరించిందని, తుది నిర్ణయం పొందడం కోసం అక్కడే వాదనలు వినిపించాలని సలెం తరఫు న్యాయవాదిని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఆదేశించింది. సలెం శిక్షాకాలాన్ని గణించడంలో పొరపాటు జరిగిందంటూ జైళ్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ దాఖలుచేసిన అఫిడవిట్‌ను న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సలెం 19 ఏళ్ల శిక్ష పూర్తి చేశాడని అఫిడవిట్‌లో ఉన్నట్టు అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. సలెం పిటిషన్‌ను కోర్టు కొట్టివేస్తూ, హైకోర్టుకు తిరిగి పిటిషన్ సమర్పించుకునేందుకు అతడు పూర్తి స్వేచ్ఛ కలిగి ఉన్నాడని స్పష్టం చేసింది. ముంబయి పేలుళ్ల అనంతరం సలెం పోర్చుగల్‌కు పారిపోయాడు. సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం 2005 నవంబరు 11న పోర్చుగల్ ప్రభుత్వం భారత్‌కు అప్పగించింది.

బలోచ్ తిరుగుబాటుదారుల అదుపులో ఏడుగురు పాక్ సైనికులు

దిల్లీ: పాకిస్థాన్ భద్రతా దళాలకు చెందిన ఏడుగురు సైనికులు తమ అదుపులో ఉన్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) తాజాగా ప్రకటించింది. వారం రోజుల్లోగా తమతో ఖైదీల మార్పిడి ఒప్పందానికి ముందుకు రావాలని పాకిస్థాన్ సర్కారుకు అల్టిమేటం జారీ చేసింది. లేకపోతే బందీలను చంపేస్తామని హెచ్చరించింది. బీఎల్ఏ మీడియా విభాగమైన హక్కల్ తాజాగా ఈ మేరకు ఓ ప్రకటనతో పాటు వీడియో సందేశాన్నీ విడుదల చేసింది.

22 ఏళ్ల క్రితం అదృశ్యమై... మళ్లీ కుటుంబం చెంతకు!

రాజ్‌గఢ్: మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి 22 ఏళ్ల క్రితం అదృశ్యమై... 44 ఏళ్ల వయసులో కుటుంబాన్ని కలుసుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం..రాజ్‌గఢ్ జిల్లాలోని సన్వాంసదా గ్రామానికి చెందిన దినేశ్ దర్జీగా పనిచేస్తుండేవారు. మతిస్థిమితం సరిగాలేని ఆయన 2004లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ సమయంలో ఆయనకు పెళ్లై, రెండేళ్ల కుమారుడు దీపక్ కూడా ఉన్నాడు. దినేశ్ కోసం రెండేళ్ల పాటు కుటుంబ సభ్యులు తీవ్రంగా గాలించారు. ఏళ్లు గడుస్తున్నా అతడి ఆచూకీ లభించకపోవడంతో ఆశలు వదిలేసుకున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయాక దినేశ్ వివిధ ప్రాంతాలు తిరుగుతూ జమ్మూకశ్మీర్ చేరుకున్నారు. మతిస్థిమితం లేని అతడిని 2025లో పోలీసులు గుర్తించి శ్రీనగర్‌లోని మానసిక ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో...దినేశ్ తన కుటుంబ వివరాలను వైద్యులతో పంచుకున్నారు. దీంతో 22 ఏళ్ల నిరీక్షణ తర్వాత 44 ఏళ్ల వయసులో దినేశ్ తిరిగి ఇంటికి చేరుకున్నారు. దినేశ్‌ను ఆయన భార్య, కుమారుడు దీపక్ (పెళ్లైంది) ఇతర కుటుంబ సభ్యులు ఆనందబాష్పాలతో ఆలింగనం చేసుకున్నారు.

ఒకే ఊళ్లో కాలేయ సంబంధిత వ్యాధులతో ఏడుగురి మృతి

చండీగఢ్: హరియాణాలోని పల్వల్ జిల్లాలోని ఛాయాంసా గ్రామంలో కాలేయ సంబంధిత వ్యాధులతో గత పదిహేను రోజుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో నలుగురు హెపటైటిస్ బి సోకి చనిపోయారని స్థానిక వైద్య యంత్రాంగం సోమవారం పేర్కొంది. నీళ్లు కలుషితమవ్వడంతో ఈ మరణాలు సంభవించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మృతుల్లో నలుగురు పాఠశాల విద్యార్థులు ఉన్నారు. వీరంతా గత నెల 31 నుంచి ఈ నెల 11 మధ్యలో చనిపోయారు. అధికారులు చెబుతున్న లెక్కల కంటే ఎక్కువ మంది చనిపోయారని, మూడు వారాల్లో 15 నుంచి 20 మంది ప్రాణాలు కోల్పోయారని గ్రామస్థుడు మహమ్మద్ ఇమ్రాన్ తెలిపారు.

అసెంబ్లీలో నేటి నుంచి బడ్జెట్‌పై సాధారణ చర్చ

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రెండు రోజుల విరామం తర్వాత మంగళవారం పునఃప్రారంభం కానున్నాయి. శాసనసభలో బడ్జెట్‌పై సాధారణ చర్చ ప్రారంభించనున్నారు. '2019-24 మధ్య నాడు-నేడు పథకం కింద పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలు-ఇతర అంశాలు, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు వ్యవస్థల క్రమబద్ధీకరణ, ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గంజాయి అక్రమ రవాణా, ఆక్వా రైతులందరికీ ఒకే రకమైన విద్యుత్ రాయితీ, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ గేట్ల పునర్నిర్మాణం' తదితర అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు.. ప్రశ్నోత్తరాల సమయంలో సంబంధిత శాఖల మంత్రులు సమాధానాలు ఇవ్వనున్నారు. ఇవేగాక మున్సిపల్ చట్టాల్లో రెండు సవరణ బిల్లులను మంత్రి నారాయణ, విద్యుత్ సుంకం సవరణ బిల్లును మంత్రి గొట్టిపాటి రవికుమార్ సభలో ప్రవేశపెట్టనున్నారు.

శాసనమండలిలో..: బడ్జెట్‌పై తొలిరోజు సాధారణ చర్చ ప్రారంభించనున్నారు. 'గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఆడబిడ్డ నిధి పథకం, యురేనియం గనుల తవ్వకం-పర్యావరణ అంశాలు, పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీల్లో మందుల నాణ్యత, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం' వంటి అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు సమాధానాలు ఇవ్వనున్నారు.

మంగళగిరిలో 'ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రం'

ఏపీఎంఎస్ఐడీసీ భవనంలో రూ.5 కోట్లతో ఏర్పాటు

ఈనాడు, అమరావతి: ఆరోగ్య అత్యయిక పరిస్థితుల్లో తక్షణ చర్యల కోసం ప్రభుత్వం ప్రజారోగ్య అత్యవసర సేవల కేంద్రాన్ని (పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్) ఏర్పాటు చేస్తోంది. అంటువ్యాధులు ప్రబలినప్పుడు, కొవిడ్ వంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఈ కేంద్రం ద్వారా ప్రత్యేక చర్యలు చేపడతారు. మంగళగిరిలోని ఏపీ వైద్య సేవలు - మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ప్రధాన కార్యాలయంలోని మూడో అంతస్తులో రూ.5 కోట్లతో ఈ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నారు. స్టూడియో, హైస్పీడ్ డేటా ట్రాన్స్‌ఫర్, వాయిస్ అండ్ వీడియో కాన్ఫరెన్స్ తదితర సౌకర్యాలు సమకూరుస్తున్నారు. వాతావరణ కేంద్రం నుంచి వచ్చే ముందస్తు హెచ్చరికల ఆధారంగా ఈ కేంద్రం పూర్వ పరిస్థితులను బేరీజు వేసుకుని అప్రమత్తమవుతుంది. జిల్లా యంత్రాంగాన్ని, ఆరోగ్య అనుబంధ రంగాల సమన్వయంతో క్షేత్రస్థాయి చర్యలకు ఉపక్రమిస్తుంది. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాన్ని త్వరలో అందుబాటులోకి తెస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

నూజివీడు కోర్టుకు హాజరైన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ



నూజివీడు కోర్టు వద్ద వల్లభనేని వంశీ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారంలో నమోదైన కేసులో వైకాపాకు చెందిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సోమవారం నూజివీడులోని న్యాయస్థానంలో హాజరయ్యారు. ఈ వ్యవహారంలో వంశీతోపాటు మరో ఇద్దరు అనుచరులపై అప్పట్లో కేసు నమోదైంది. పోలీసులు విచారించి న్యాయస్థానంలో హాజరుపర్చగా రిమాండ్ విధించింది. కొద్ది రోజుల తరువాత బెయిల్ మంజూరైంది. కేసు విచారణలో భాగంగా సోమవారం నూజివీడులోని న్యాయస్థానంలో వల్లభనేని వంశీమోహన్, ఆయన అనుచరులు మోహన్ రంగారావు, సురేష్‌లు తమ న్యాయవాదులతో కలిసి హాజరయ్యారు. న్యాయమూర్తి కె.శ్రావణి ఈ కేసును పరిశీలించి మార్చి 2వ తేదీకి వాయిదా వేశారు.

తంబళ్లపల్లె కోర్టుకు జోగి సోదరులు



కోర్టు బయట జోగి రమేష్

ఈనాడు, అన్నమయ్య-న్యూస్‌టుడే, ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం కేసులో వైకాపా నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాము, ఇతర నిందితులు బాలరాజు, రాజేష్, మణిమారన్, ఎన్.రవి, అన్బురాసు, అల్లాబక్ష కోర్టులో వాయిదాకు హాజరయ్యారు. తదుపరి వాయిదా తేదీని కోర్టు సమన్ల ద్వారా నేరుగా వారికి తెలియజేయనున్నారు. జోగి సోదరులు కోర్టుకు వస్తున్నట్లు తెలియడంతో ఆ పార్టీ నేతలు తంబళ్లపల్లె చేరుకున్నారు. ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి వారిని కలిశారు.



సవాళ్లకు భయపడితే ఎలా?

యువత సవాళ్లకు భయపడితే విజేతలుగా నిలబడలేరు. సురక్షితంగా ఉండేందుకే ఎల్లవేళలా ప్రయత్నిస్తే కొన్ని సందర్భాల్లో ఎదుగుదల ఆగిపోయే అవకాశం ఉంది. యవ్వనంలో ఉన్నప్పుడు విచక్షణతో, ఆలోచనాత్మకంగా సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధపడితే భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు పొందొచ్చు.

– టోబీ, ఆర్థిక వ్యవహారాల సలహాదారు

మద్యం రవాణాలో మహా దోపిడీ

- నిందితుల జాబితాలో వైకాపా నేత, మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- ఆయన తనయుడు కారుమూరి సునీల్, కోడలు కీర్తి కూడా..
- చిత్తూరు వైకాపా ఇన్‌ఛార్జి, ఎర్రచందనం స్మగ్లర్ ఎంసీ విజయానందరెడ్డి సైతం
- అప్పటి వైకాపా నేత ఉదయభాను అల్లుడు నరసింహారెడ్డి పేరు కూడా..

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం రవాణా కాంట్రాక్టులో రూ.200 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు దోచుకున్న వ్యవహారంపై సీఐడీ తాజాగా నమోదు చేసిన కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు కారుమూరి సునీల్, కోడలు కీర్తి, చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి, ఎర్రచందనం స్మగ్లర్ ఎంసీ విజయానందరెడ్డిని నిందితులుగా చేర్చారు. వీరితో పాటు అప్పటి వైకాపా నేత సామినేని ఉదయభాను అల్లుడు, ఏపీఎస్‌బీసీఎల్ నాటి ఎండీ వాసుదేవరెడ్డి బావమరిది నరసింహారెడ్డి కూడా నిందితుడిగా ఉన్నారు. మద్యం కుంభకోణం కేసు ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, అతడి ప్రధాన అనుచరులు బూనేటి చాణక్య, తూతేకుల ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ అప్పటి ఎండీ డి.వాసుదేవరెడ్డి సహా మరికొందరు ఈ నిందితుల జాబితాలో ఉన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణలో ఈ కుంభకోణంలో వీరందరి పాత్ర వెలుగులోకి రావటంతో నిందితులుగా చేర్చారు.

కోస్తా, ఉత్తరాంధ్ర అంతా కారుమూరి సునీల్ చేతుల్లోనే!

◆ డిపోల నుంచి ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరా చేసే రవాణా కాంట్రాక్టు.. రాజ్ కెసిరెడ్డి (ఏ1), అతని ప్రధాన అనుచరుడు ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డిలు (ఏ8) వాసుదేవరెడ్డితో కలిసి 2020-2022 వరకూ తమ జేబు సంస్థలైన దిల్లీలోని సిగ్మా లాజిస్టిక్స్‌కు, ఆ తర్వాత వెల్లూరులోని ప్రసాద్ ట్రాన్స్‌పోర్టుకు దక్కేలా చేసుకున్నారు. మొదట్లో జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఈ రవాణా కాంట్రాక్టును నిర్ణయించినప్పుడు ఒక్కో మద్యం కేసు రవాణాకు రూ.13 చొప్పున చెల్లించేవారు. దీన్ని రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృతం చేసిన తర్వాత ఒక్కో కేసు రవాణాకు ఏపీఎస్‌బీసీఎల్ రూ.34 చెల్లించేది. కాగితాలపై సిగ్మా లాజిస్టిక్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్‌ల పేర్లున్నా.. తెర వెనక నడిపించినదంతా రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలే.

◆ వారు ముగ్గురూ కలిసి కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో రవాణా సబ్‌కాంట్రాక్టును వైకాపా నేత, అప్పటి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు, గత సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా తరఫున ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసిన కారుమూరి సునీల్‌కు అప్పగించారు. సునీల్ హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటు చేసుకుని తన పరిధిలోని జిల్లాల్లో మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును ఒక్కో జిల్లాలో ఒక్కో వైకాపా నేతకు అప్పగించారు. ఈ క్రమంలో సిగ్మా లాజిస్టిక్స్ నుంచి సునీల్, అతని కుటుంబీకుల ఖాతాల్లోకి డబ్బులు పడినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఆర్థిక లావాదేవీలు బయటపడడంతో వారందర్నీ నిందితులుగా చేర్చారు.

◆ వాసుదేవరెడ్డి తరఫున అతని బావమరిది నరసింహారెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించి అతన్ని కూడా నిందితుడిగా చేర్చారు.

◆ రాయలసీమ ప్రాంతంలో చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి, ఎర్రచందనం స్మగ్లర్ ఎంసీ విజయానందరెడ్డికి సంబంధించిన నిఖిలానంద లాజిస్టిక్స్‌ను అడ్డం పెట్టుకుని దోచుకున్నట్లు తేలటంతో అతన్నీ నిందితుడిగా చేర్చారు.

వైకాపా బినామీల గుట్టు వెలుగులోకి!

మద్యం రవాణా కాంట్రాక్టు, సబ్ కాంట్రాక్టులను జిల్లాలవారీగా వైకాపా నేతలు, వారి బినామీలు, వారి కుటుంబ సభ్యులకు ఇచ్చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. ముఖ్యంగా గుంటూరు ప్రాంతంలో మాజీమంత్రి అంబటి రాంబాబు బినామీ సంస్థకు, ఉత్తరాంధ్రలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అనుచరులు, వారి బినామీల పేరిట ఉన్న సంస్థలకు సబ్ కాంట్రాక్టులిచ్చి దోచుకునేలా చేశారనే ఫిర్యాదులున్నాయి. సీఐడీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు చేస్తున్న సిట్ ఈ వివరాలు వెలికితీయనుంది.



ఆవు వెంట వెళుతున్న అటవీ సిబ్బంది



ఘటనా స్థలం వద్దకు చేరిన ఆవు

తల్లడిల్లుతూ.. తల్లి ప్రేమను చాటిన ఆవు

- పులి దాడిలో మృతిచెందిన దూడ ఆచూకీ చూపిన గోమాత

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: తల్లి ప్రేమకు భాష అక్కర్లేదని, పేగు బంధానికి మాటలు అవసరంలేదని ఓ మూగజీవి చాటింది. తన బిడ్డను కోల్పోయిన ఆవేదనలో ఉన్న ఆ గోమాత.. అటవీ అధికారులకు దారిచూపి ఆశ్చర్యపరిచింది. తెలంగాణలోని కుమురం భీం జిల్లా సిర్పూర్(టి) మండలంలోని ఇటిక్యాలపహాడ్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికుల కళ్లను చెమర్చింది. ఇటిక్యాలపహాడ్ గ్రామానికి చెందిన భీంరావుకు చెందిన ఆవు, దూడ ఆదివారం అడవిలో మేతకు వెళ్లాయి. సాయంత్రం తల్లి ఆవు ఒంటరిగా, బాధగా ఇంటికి చేరింది. తన బిడ్డ కోసం కన్నీరు కారుస్తున్న దాన్ని చూసి యజమాని మనసు ద్రవించింది. ఆపద జరిగిందని గ్రహించిన ఆయన.. అటవీ అధికారులకు సమాచారమిచ్చారు. సోమవారం ఉదయం ఎఫ్ఆర్ఓ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బంది భీంరావు ఇంటికి వచ్చారు. దూడ కోసం ఆవేదనతో ఉన్న ఆవును యజమాని విడిచిపెట్టగా... అది అడవిలోకి నడిచింది. అటవీ సిబ్బంది, యజమాని దానిని అనుసరించారు. సుమారు కిలోమీటరు దూరం వెళ్లి ఆవు ఆగగా... అక్కడ దూడ కళేబరాన్ని సిబ్బంది గుర్తించారు. పులి దాడిలోనే దూడ మృతి చెందినట్లు నిర్ధారించారు.

నగరాల్లో సురక్షిత రవాణాకు 'ఆంధ్రా యాత్రి'

- ప్రజలకు తక్కువ ధరకే సేవలు అందేలా ప్రణాళిక
- పీపీపీ విధానంలో ఏర్పాటుకు రవాణా శాఖ కసరత్తు
- ప్రైవేటు యాప్‌లకు పోటీగా అందుబాటులోకి తెచ్చే యత్నం

ఈనాడు, అమరావతి: ప్రస్తుతం నగరాల్లో ఎక్కడికైనా వెళ్లాలంటే ఎక్కువ మంది.. యాప్‌లో ఆటో, ట్యాక్సీ బుక్ చేసుకుంటున్నారు. ఒక్కరే వెళ్లాల్సి వస్తే.. బైక్ ట్యాక్సీని ఆశ్రయిస్తున్నారు. అయితే ఇలా రైడ్స్ బుక్ చేసుకునేందుకు ప్రస్తుతం ప్రైవేటు యాప్‌లే అందుబాటులో ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రా యాత్రి' పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమవుతోంది. ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్ నిర్వహణ, తదితరాలకు గుత్తేదారును ఎంపిక చేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు, భాగస్వామ్యం (పీపీపీ) కింద ఈ యాప్‌ను నిర్వహించనున్నారు.

చందా రుసుము చెల్లిస్తే చాలు..

కారు, ఆటో, బైక్ ట్యాక్సీ డ్రైవర్లు ఈ యాప్ ద్వారా రైడ్స్ పొందాలనుకుంటే.. నామమాత్రపు చందా రుసుము చెల్లిస్తే సరిపోతుంది.

◆ ఒక్కో ట్రిప్‌లో బైక్ ట్యాక్సీకి గరిష్ఠంగా రూ.3, ఆటోకు రూ.5, కారుకు రూ.11 వరకు చందా రుసుము ఉంటుంది. రోజు మొత్తానికి ఆయా వాహనాన్ని బట్టి రూ.30 నుంచి రూ.50 వరకు చెల్లిస్తే.. ఎన్ని రైడ్స్ అయినా పొందొచ్చు.

◆ ప్రస్తుతమున్న ప్రైవేటు యాప్స్‌లో ప్రతి రైడ్‌కు వసూలు చేసే మొత్తంలో 20 శాతం వరకు కమీషన్‌గా డ్రైవర్ చెల్లించాల్సి వస్తోంది. ఆంధ్రా యాత్రి యాప్‌లో ఇటువంటిదేమీ ఉండదు. చందా రుసుము మాత్రమే తీసుకుంటారు.

◆ ఇలా వసూలైన చందా రుసుములో 10 శాతం మొత్తాన్ని యాప్ నిర్వహణ గుత్తేదారు.. ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది.

◆ ఈ యాప్‌నకు బ్రాండింగ్, ప్రచారం తదితరాలకు రవాణాశాఖ ఆ మొత్తాన్ని వినియోగిస్తుంది.

◆ ఈ యాప్‌నకు చెందిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ నిర్వహణకు బిడ్లు ఆహ్వానిస్తారు. ఎవరైతే ఆయా వాహన యజమానుల నుంచి తక్కువ చందా రుసుము తీసుకుని, ఈ యాప్‌ను నిర్వహిస్తామంటూ కోట్ చేస్తారో వారికే టెండరు కేటాయిస్తారు.

అన్ని శాఖలను కలుపుతూ..: ఈ యాప్‌తో రవాణా శాఖతో పాటు, పోలీస్, ఆర్టీసీ, టూరిజం, కార్మిక శాఖలు, ఆర్టీజీఎస్‌ను కూడా ఇంటిగ్రేట్ చేస్తారు.

◆ అన్నిశాఖల పర్యవేక్షణ ఉండడంతో.. రైడ్ బుక్ చేసుకున్న వారికి సురక్షితమైన ప్రయాణం లభిస్తుంది.

◆ డ్రైవర్ల నుంచి ఎటువంటి కమీషన్ వసూలు చేయకపోవడంతో.. ప్రయాణికులకు కొంత తక్కువ ధరకే రైడ్స్ లభిస్తాయి.

◆ రియల్‌టైమ్ ట్రాకింగ్ తదితరాలన్నీ ఇందులో ఉంటాయి.

తొలుత 13 జిల్లా కేంద్రాల్లో..

పాత ఉమ్మడి జిల్లా కేంద్రాలు, విజయవాడ, తిరుపతి నగరాల్లో తొలుత ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఆ తర్వాత ఇతర పట్టణాల్లో కూడా అందుబాటులోకి తెస్తారు. ఇందుకోసం పాలసీ రూపొందిస్తున్నారు. అందులో నియమ నిబంధనలు ఖరారుచేసి, త్వరలో టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాల్లో ఇదే తరహాలో 'భారత్ యాత్రి' అనే యాప్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా గతంలో ప్రారంభించింది. దీనిని ఏపీలో కూడా భవిష్యత్తులో అమలుచేస్తారు. అందులో 'ఆంధ్రా యాత్రి' యాప్‌ని విలీనం చేస్తారు.

ఇక ఏడాది పొడవునా క్రీడా సంబరం

- శాప్ లీగ్స్‌తో జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణించే అవకాశం
- చంద్రబాబు ప్రభుత్వంలో క్రీడలకు ప్రోత్సాహం
- అంతర్జాతీయ క్రీడాకారిణులు పీవీ సింధు, కోనేరు హంపి



శాప్ లీగ్ కప్‌తో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి. చిత్రంలో శాప్ ఎండీ భరణి, శాప్‌లీగ్ మస్కట్

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న శాప్ లీగ్స్‌తో ఏడాది పొడవునా క్రీడా పోటీలు జరుగుతాయని.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణించేందుకు ఇదో గొప్ప వేదికగా నిలవనుందని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, భారత చెస్ స్టార్, మహిళా గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అన్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో క్రీడలకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. విజయవాడలోని బెరంపార్కులో శాప్ లీగ్ ట్రోఫీ, మస్కట్‌లను సంస్థ ఎండీ భరణితో కలిసి సోమవారం వారు ఆవిష్కరించారు. అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే లక్ష్యంగా వీటిని రూపొందించినట్టు తెలిపారు. "ఇటీవల విజయవాడలో జరిగిన బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు వచ్చాను. ఎందరో నైపుణ్యం గల క్రీడాకారిణులను చూశాను. చాలా సంతోషంగా అనిపించింది. ఇలాంటి లీగ్స్‌తో వారికి మంచి అవకాశం, ప్రోత్సాహం, గుర్తింపు లభిస్తాయి. చిన్న వయసులోనే తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదికగా మారుతుంది. ఇతర రాష్ట్రాలు సైతం ఇలాంటి పోటీలు నిర్వహించాలి" అని పీవీ సింధు అన్నారు.

నైపుణ్యం వెలికి తీయడమే కాదు.. సహాయం కూడా అందిస్తాం

"శాప్ ప్రోత్సాహంతో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుంది. వారి ప్రతిభ వెలుగులోకి వస్తుంది. ఆర్థిక సహకారం, మెరుగైన శిక్షణ లభించనుంది" అని కోనేరు హంపి అన్నారు. పాఠశాల విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు భరణి తెలిపారు. "డిసెంబర్ వరకూ ఈ పోటీలు జరుగుతాయి. ఫిబ్రవరి 21న తిరుపతిలో రాష్ట్రస్థాయి చెస్ లీగ్ ప్రారంభం కానుంది. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన వారు ఇందులో తలపడతారు. 20 వేల మంది ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నైపుణ్యాన్ని గుర్తించడంతోపాటు వారికి భవిష్యత్తులో అన్ని రకాలుగా సహకారం అందిస్తాం" అని భరణి వివరించారు.

గుంటూరు-బీబీనగర్ లైన్ డబ్లింగ్‌కు పల్నాడు జిల్లాలో భూసేకరణ పూర్తి

నోటిఫికేషన్ జారీచేసిన రైల్వే శాఖ


ఈనాడు, దిల్లీ: గుంటూరు - బీబీనగర్ రైల్వేలైన్ డబ్లింగ్ కోసం పల్నాడు జిల్లాలో భూసేకరణ పూర్తిచేసినట్లు రైల్వే శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. సత్తెనపల్లి మండలంలోని సత్తెనపల్లి, ధూళిపాళ్ల, గుడిపూడి, భీమవరం, కంకణాలపల్లి, బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం, పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు, లింగంగుంట్ల, చినమక్కెన, రాజుపాలెం మండలంలోని రాజుపాలెం, రెడ్డిగూడెం, చౌటపాపాయపాలెం తదితర గ్రామాల్లో మొత్తం 261 సర్వే నంబర్ల నుంచి 43.97 ఎకరాలు సేకరించినట్లు తెలిపింది.

రూ.200 కోట్లతో 45 సీఎఫ్‌సీల అభివృద్ధి: కొండపల్లి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.200 కోట్ల వ్యయంతో 45 కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సీఎఫ్‌సీ) అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. '2026-27 ఆర్థిక సంవత్సరంలో ఎంఎస్ఎంఈలకు బడ్జెట్‌లో రూ.84 కోట్లు అదనంగా కేటాయించాం. చిన్న పరిశ్రమలకు రుణ భరోసా కల్పించేందుకు ఏపీ క్రెడిట్ గ్యారంటీ పథకం అమలుకు రూ.10 కోట్లు ఇచ్చారు. చిన్న పరిశ్రమల నుంచి తీసుకున్న ఉత్పత్తులకు వెంటనే చెల్లింపులు జరిపేందుకు ట్రేడ్ రిసీవబుల్ డిస్కౌంటింగ్ విధానాన్ని అనుమతించాం. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 15 ప్రారంభించాం. మరో 82 పార్కులకు శంకుస్థాపన చేశాం' అని మంత్రి కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

జస్టిస్ బాలాజికి ఘన సన్మానం

హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం



జస్టిస్ బాలాజికి శ్రీవారి చిత్ర పటాన్ని బహూకరిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సుబోధ్, ఏఎస్‌జీ చల్లా ధనంజయ తదితరులు

ఈనాడు, అమరావతి: హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మెడమల్లి బాలాజిని హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా జస్టిస్ బాలాజి మాట్లాడుతూ.. న్యాయవాదుల(బార్)తో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వృత్తిలో ఉన్నత శిఖరాలను చేరేందుకు జూనియర్ న్యాయవాదులు ఓపికతో, కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) చల్లా ధనంజయ, అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) సాంబశివ ప్రతాప్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్, కార్యవర్గ సభ్యులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వైకాపా హయాంలోని ఇళ్ల పట్టాలపై విచారణ చేయాలి

- స్థలం చూపించకుండానే పట్టాలు ఇచ్చారు
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



ఈనాడు, అమరావతి: ఎన్నికలకు ముందు వైకాపా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల్లో అసలైనవి ఎన్ని, నకిలీవి ఎన్ని అనే అంశంపై ప్రభుత్వం విచారణ జరపాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. జగన్ ప్రభుత్వంలో లక్షల్లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, భూమి చూపించకుండా ప్రజల్ని మోసం చేశారని ఆరోపించారు. భాజపా నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో ఈ సమస్యపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నందున, రాష్ట్ర వ్యాప్తంగా భాజపా నేతలు కలెక్టరేట్‌లో వినతిపత్రాలు అందించినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. '2024 ఎన్నికల్లో గెలవాలనే కుట్రతో రాష్ట్రంలో 30 లక్షలకు పైగా పట్టాలు ఇవ్వాలని అప్పటి వైకాపా ప్రభుత్వం పిలుపునిచ్చింది. దీంతో పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, లక్షల్లో పట్టాలు పంపిణీ చేశారు. ఈ పట్టాలన్నీ ఎందుకూ పనికిరాని చిత్తుకాగితాల్లా పేదల ఇళ్లలో ఉన్నాయి. అప్పట్లో ఇల్లు వస్తుందని పేదలకు ఆశ చూపి.. పట్టా కాగితం చేతిలో పెట్టి.. స్థలం చూపించలేదు. ఇది ఎన్నికల మోసం కాదా..? వైకాపా ప్రభుత్వ అక్రమాలపై ఉదాసీనంగా ఉండడం సరికాదు. పేదలకు ఇచ్చిన పట్టాల్లో భూమి లేనివి ఎన్నో గుర్తించాలి. ఇచ్చినవి నకిలీ పట్టాలని తేలితే ఎన్నికల మోసం కింద కేసులు పెట్టాలి. ప్రజల్ని మోసం చేసిన నాయకులపై నిషేధం విధించాలి' అని మాధవ్ పేర్కొన్నారు.

ఉన్నత పదవుల్లో ఉన్నవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- నాగేంద్రన్ అనుచిత వ్యాఖ్యలను ఖండించిన త్రిష
- విచారం వ్యక్తం చేసిన భాజపా నేత



చెన్నై, న్యూస్‌టుడే: త్రిష ఇంటి నుంచి నటుడు విజయ్ బయటకు రావాలంటూ భాజపా తమిళనాడు అధ్యక్షుడు, ఆ పార్టీ శాసనసభా పక్ష నేత నయినార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలను నటి త్రిష ఖండించారు. ఈ మేరకు ఆమె న్యాయవాది నిత్యేశ్ నటరాజ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్ర రాజకీయాల్లో ఉన్నత పదవిలో ఉన్న ఒకరు ఇలా జుగుప్సాకర అభిప్రాయాన్ని వెల్లడిస్తారని నా కక్షిదారు ఏనాడూ ఊహించలేదు. నా కక్షిదారు ఏ పార్టీలో చేరలేదు. చేరాలని భావించడం లేదు. రాజకీయాల్లో తటస్థ వైఖరి అవలంబిస్తున్నారు. రాజకీయ వ్యవహారాల్లో పాల్గొనకుండా తన వృత్తిపై మాత్రమే దృష్టి సారించాలని ఆకాంక్షిస్తున్నారు. ఉన్నత పదవులు చేపట్టిన వ్యక్తులు బహిరంగ చర్చలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భావిస్తున్నారు. తన పేరును ఆయనతో(విజయ్) సంబంధం ఉన్న విషయాల్లో చేర్చకూడదని నా కక్షిదారు భావిస్తున్నారు" అని అందులో పేర్కొన్నారు. స్టాలిన్, పళనిసామి కొత్తగా పార్టీలు ప్రారంభించి పోటీ చేయగలరా అన్న విజయ్ సవాల్‌పై సేలం విమానాశ్రయంలో నాగేంద్రన్‌ను శనివారం విలేకరులు ప్రశ్నించగా.. విజయ్‌కు రాజకీయ అనుభవం లేదని, తొలుత ఆయన త్రిష ఇంటి నుంచి బయటకు రావాలని సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా తన వ్యాఖ్యలకు నాగేంద్రన్ తాజాగా విచారం వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించలేదని, ఆ రోజు అదుపు తప్పి మాట్లాడానని పేర్కొన్నారు. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే మనస్ఫూర్తిగా విచారం వ్యక్తం చేస్తున్నానని స్పష్టంచేశారు.

కర్ణాటకలో ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష

- ఇజ్రాయెల్ టూరిస్ట్, హోంస్టే యజమానురాలిపై అత్యాచారంతో పాటు మరొకరి హత్య
- సంచలన తీర్పు వెలువరించిన గంగావతి అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం
- 11 నెలల్లోనే విచారణ పూర్తిచేసి శిక్ష ఖరారు



ఉరిశిక్ష పడ్డ నిందితులు చేతన్‌సాయి, హంది మల్ల, శరణప్ప

గంగావతి, న్యూస్‌టుడే: కర్ణాటకలోని హంపి సమీపంలో పర్యాటకులపై దాడి, అత్యాచారం, హత్య కేసులో గంగావతి అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న హంది మల్ల, చేతన్‌సాయి, శరణప్పలకు మరణశిక్ష విధించింది. ఈ నెల 6న వారిని దోషులుగా నిర్ధారించిన న్యాయస్థానం సోమవారం శిక్ష ఖరారు చేసింది. పోలీసుల వివరాల ప్రకారం.. గతేడాది మార్చి 6న ఇజ్రాయెల్‌కు చెందిన ఓ మహిళ, అమెరికాకు చెందిన డేనియల్, మహారాష్ట్రకు చెందిన పంకజ్, ఒడిశాకు చెందిన బిబాస్ విడివిడిగా హంపి పర్యటనకు వచ్చారు. వీరందరూ హనుమనగుళ్లిలో ఓ మహిళ నిర్వహిస్తున్న హోంస్టేలో బస చేశారు. అదే రోజు రాత్రి స్థానికంగా సణాపుర సరోవరం పరిసరాల్లోని రంగాపుర గంగమ్మ ఆలయం వద్ద సంగీత కార్యక్రమం నిర్వహించుకోవడానికి ఆ ఐదుగురు కలిసి వెళ్లారు. ఈ సమయంలో విప్ర సాయినగర్‌కు చెందిన ముగ్గురు యువకులు హంది మల్ల, చేతన్‌సాయి, శరణప్ప ద్విచక్రవాహనంపై అక్కడికి వచ్చారు. తమ వాహనంలో పెట్రోల్ లేదని, దానికోసం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యాటకులు నిరాకరించడంతో దాడి చేసి బిబాస్, పంకజ్, డేనియల్‌ను తుంగభద్ర ఎడమ కాలువలోకి తోశారు. వారు నీటిలో కొట్టుకుపోగానే విదేశీ మహిళ, హోంస్టే యజమానురాలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కాలువలోకి తోసిన వారిలో బిబాస్ మృతిచెందగా మిగతా ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. గంగావతి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేశారు. ఘటన జరిగిన పుటి నుంచి 11 నెలల్లోనే విచారణ పూర్తి చేశారు. ఈ కేసులో 101 మంది సాక్షులను విచారించారు. ఈ మేరకు న్యాయమూర్తి సదానంద నాగప్పనాయక.. నిందితులకు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

EENADU Vol: 52, Issue: 188 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



ఏదైనా జబ్బుందనగానే మనదగ్గర అడిగే మొదటి ప్రశ్న 'పథ్యమేంటి?' అనే. మధుమేహం, గుండెజబ్బుల మాదిరిగానే దీర్ఘకాల కిడ్నీ జబ్బు (సీకేడీ) విషయంలోనూ ఇది తప్పనిసరి. కిడ్నీలు చేసే ప్రధానమైన పని రక్తాన్ని శుద్ధి చేసి, మూత్రాన్ని తయారు చేయటం. దీని ద్వారా వ్యర్థాలను బయటకు పంపటం. కిడ్నీల పనితీరు తగ్గితే ఈ ప్రక్రియ కుంటుపడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కిడ్నీలపై మరింత భారం పడితే ఇంకాస్త త్వరగా విఫలమయ్యే ప్రమాదముంది. ఇక్కడే మందులు, చికిత్సలతో పాటు పథ్యం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఆహార పరంగా చిన్న చిన్న మార్పులు చేసుకున్నా పెద్ద ఫలితమే కనిపిస్తుంది. తినే ఆహారం, తాగే పానీయాలు కిడ్నీల మీద నేరుగా ప్రభావం చూపుతాయి మరి.

కిడ్నీలకు ఆహార రక్ష!

కిడ్నీ జబ్బు నియంత్రణలో ప్రొటీన్, ఫాస్ఫరస్, పొటాషియం, సోడియం, ద్రవాలు చాలా ముఖ్యం. ఈ ఐదూ ఏం తింటున్నాం? ఏం తాగుతున్నాం? అనే వాటితో నేరుగా ముడిపడి ఉంటాయి. కాబట్టి దీర్ఘకాల కిడ్నీ జబ్బు గలవారికి ఆహారం మీద ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి. దీని విషయంలో జాగ్రత్త వహిస్తే కిడ్నీల మీద పడే భారాన్ని తగ్గించుకోవచ్చు. జబ్బు త్వరగా ముదరకుండా, దుష్ప్రభావాలు ముంచుకురాకుండా చూసుకోవచ్చు. కిడ్నీలు దెబ్బతిన్నవారికి రక్తపోటు పెరగటం, గుండెపోటు, గుండె వైఫల్యం వచ్చే అవకాశాలు ఎక్కువ. కొన్ని పదార్థాలు.. ముఖ్యంగా ఉప్పుతో రక్తపోటు పెరిగే ప్రమాదముంది. ఇది కిడ్నీలకు హాని చేస్తుంది. ఆహార నియంత్రణతో కిడ్నీ, గుండె రెండింటినీ కాపాడుకోవచ్చు. మిగతా అవయవాలూ బాగుంటాయి. మొత్తంగా ఆరోగ్యమూ మెరుగవుతుంది. హాయిగా జీవించటం సాధ్యమవుతుంది.

ప్రొటీన్ తగ్గించటం ముఖ్యం

కండరాలు, ఎముకలు, అనుసంధాన కణజాలాలు, లోపలి అవయవాలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రొటీన్ అత్యవసరం. ఇన్‌ఫెక్షన్లతో పోరాడటానికీ ఇది తోడ్పడుతుంది. చిక్కేంటంటే- ప్రొటీన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో వ్యర్థాలు పుట్టుకురావటం. వీటిని కిడ్నీలే తొలగించాల్సి ఉంటుంది. అవసరానికి మించి ప్రొటీన్ తీసుకుంటే రక్తంలో వ్యర్థాలూ ఎక్కువగా పోగవుతాయి. ఇవి కిడ్నీల మీద అదనపు భారం పడేలా చేస్తాయి. కాబట్టి కిడ్నీ జబ్బు గలవారు ఆహారంలో ప్రొటీన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు గానీ తగ్గించటం మంచిది. కిడ్నీ జబ్బు దశ, శరీర బరువు, మధుమేహం, కాలేయ జబ్బు వంటి ఇతరత్రా సమస్యలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని దీన్ని పరిమితం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ఆహార నిపుణుల సూచనలు కీలకం. ఇంటర్నెట్‌లో చూసో, ఎవరో చెప్పారనో ఎవరికివారు సొంతంగా నిర్ణయాలు తీసుకోవటం ప్రమాదకరం.

- మాంసాహార ప్రొటీన్ కన్నా శాకాహార ప్రొటీన్ మంచిది. కంది, మినప, పెసర, శనగ వంటి పప్పులు.. రాజ్మా, సోయాబీన్స్ వంటి వాటితో ప్రొటీన్ దండిగా లభిస్తుంది. మాంసాహారులైతే కొవ్వు తక్కువగా ఉండేవి ఎంచుకోవాలి. గుడ్లు, స్కిన్‌లెస్ చికెన్, చేపల వంటివి మితంగా తినొచ్చు. మాంసం, మాంసం ఉత్పత్తులు తగ్గించుకోవాలి.

ఫాస్ఫరస్ మీద కన్ను

దెబ్బతిన్న కిడ్నీలు రక్తంలోని ఫాస్ఫరస్‌ను అంత సమర్థంగా తొలగించలేవు. అందుకే కిడ్నీజబ్బు గలవారిలో ఫాస్ఫరస్ ఎక్కువగా ఉంటుంది. ఇది మరీ పెరిగితే ఇబ్బందికరంగా పరిణమిస్తుంది. ఒంట్లో క్యాల్షియం, ఫాస్ఫరస్ మోతాదుల సమతుల్యత దెబ్బతిని, ఎముకలు బలహీన పడతాయి. రక్తనాళాల్లో క్యాల్షియం చేరి, గట్టిపడి పూడికలుగా ఏర్పడొచ్చు. దీంతో ఆయా అవయవాలకు రక్త ప్రసరణ తగ్గుతుంది. దీంతో గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాద ముంటుంది. కొన్నిసార్లు చర్మం దురద పెట్టొచ్చు.

- ఫాస్ఫరస్ సహజంగా పాలు, పెరుగు, చీజ్, బటర్, పొట్టుతీయని ధాన్యాలతో లభిస్తుంది. పప్పులు, మాంసం వంటి వాటిల్లో ప్రొటీన్‌తో పాటు ఫాస్ఫరస్ కూడా ఉంటుంది. కాబట్టి మాంసాహారమైనా, శాకాహారమైనా జాగ్రత్త అవసరం. రక్తంలో ఫాస్ఫరస్ మోతాదులను బట్టి ఏయే పదార్థాలు ఎంతెంత తినాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.
- ఆహార పదార్థాల్లోని ఫాస్ఫరస్‌ను శరీరం సగమే శోషించుకుంటుంది. వీటితో పెద్దగా ఇబ్బంది ఉండక పోవచ్చు. కానీ ఫాస్ఫోరిక్ ఆమ్లం కలిపి తయారుచేసే కూల్‌డ్రింక్స్‌లోని ఫాస్ఫరస్‌ను శరీరం పూర్తిగా తీసుకుంటుంది. కాబట్టి కూల్‌డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, సోడాల వంటివి అసలే తాగొద్దు.

ఉప్పు మితంగా

ఉప్పులోని సోడియం మూలంగా శరీరంలో నీరు ఎక్కువగా చేరుతుంది. దీంతో బరువూ పెరుగుతుంది. అంతేకాదు, నీటితో పాటు రక్తం మోతాదూ పెరగటం వల్ల గుండె మీద ఎక్కువ భారం పడుతుంది. దీంతో రక్తపోటూ పెరుగుతుంది. కిడ్నీలకు అధిక రక్తపోటు పెద్ద శత్రువు. ఇది కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ సోడియం వాడకాన్ని రోజు మొత్తంలో 2 గ్రాముల కన్నా (చెంచా కన్నా తక్కువ) మించనీయొద్దు.

- వండేటప్పుడు ఎంత ఉప్పు వేస్తామో కచ్చితంగా తెలియదు. అందువల్ల వండిన తర్వాత తినే ముందు కూరల మీద ఉప్పు చల్లుకుంటే మంచిది.
- నిల్వ పచ్చళ్లు, సాస్‌లలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. వీటికి దూరంగా ఉండటం మంచిది. అప్పటికప్పుడు రోట్లో నూరుకునే పచ్చళ్లతో పెద్ద ఇబ్బంది ఉండదు.
- చిప్స్, బయట శుద్ధిచేసి అమ్మే ఆహార పదార్థాలు, ఉప్పు కలిపి ఎండించిన చేపలకు దూరంగా ఉండటం మంచిది.

ద్రవాలు అవసరమైనంత

కిడ్నీలు చేసే మరో పని ద్రవాల మోతాదులను నియంత్రించటం. పొటాషియం, ఫాస్ఫరస్ వంటి ఎలక్ట్రోలైట్లు మోతాదులూ ద్రవాలూ ఒకదాని మీద మరోటి ఆధారపడి ఉంటాయి. ఒంట్లో ద్రవాల మోతాదు ఎక్కువైతే వాటిని మూత్రం రూపంలో బయటకు పంపిస్తాయి. అయితే కిడ్నీ జబ్బులో వడపోత సామర్థ్యం, మూత్రం తయారయ్యే ప్రక్రియ నెమ్మదిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ద్రవాలు ఎక్కువగా తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పడుతుంది. ద్రవాలు సరిగా బయటకు రాకపోతే అవి ఒంట్లోనే ఉండిపోతాయి. గుండె, ఊపిరితిత్తుల చుట్టూరా.. కాళ్లలో, ఒళ్లంతా పోగుపడొచ్చు. దీంతో రక్తపోటు పెరగటం, ఆయాసం, కాళ్లు, ముఖం ఉబ్బటం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి అవసరమైన మేరకే నీరు తాగాలి. కొందరికి రోజుకు రెండు లీటర్ల ద్రవాలు సరిపోతే, కొందరు లీటరుకే పరిమితం చేసుకోవాల్సి రావొచ్చు. ఇది కిడ్నీల వడపోత సామర్థ్యాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. మూత్రం ఎంత వస్తుందనే దాన్ని బట్టి నీరు తాగాలి.

- నీరు ఒక్కటే కాదు.. కాఫీ, టీ వంటివీ ద్రవాల కిందికే వస్తాయి. గది ఉష్ణోగ్రత వద్ద కరిగే ఐస్‌క్రీమ్ కూడా ఒకరకంగా ద్రవ పదార్థమే.
- నీరు తాగాలని అనిపించినప్పుడు ఓ ద్రాక్షపండును నోట్లో పెట్టుకొని నమలొచ్చు. చిన్న ఐసుముక్కను నోట్లో పెట్టుకోవచ్చు. నోరు తడారుతున్నట్టు అనిపిస్తే పిప్పరమెంటు బిళ్లల వంటివి చప్పరించొచ్చు. దీంతో లాలాజలం ఊరుతుంది. దప్పిక తగ్గుతుంది.
- డయాలిసిస్ చేయించుకునేవారికి చికిత్సకు ముందు, తర్వాత బరువు కొలుస్తుంటారు. రెండు డయాలిసిస్‌ల మధ్య 2-3 కిలోల కన్నా ఎక్కువ బరువు పెరగకూడదు. అంతకన్నా ఎక్కువగా పెరిగితే ద్రవాలు ఎక్కువగా తీసుకుంటున్నారనే అర్థం. డయాలిసిస్‌తో మొత్తం ద్రవాలను తొలగించటం సాధ్యం కాదు. కాబట్టి ముందే తగ్గించుకోవటం ఉత్తమం.

పొటాషియం సరిగా

కిడ్నీ జబ్బు బాధితుల్లో పొటాషియం మోతాదులు ఎక్కువగా ఉంటాయి. ఇది గుండె, కండరాల సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి పొటాషియం మోతాదులు సరిగా ఉండేలా చూసుకోవాలి.

- అరటి, బత్తాయి, నారింజ, మామిడి పండ్లలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మొక్కజొన్న, కిస్‌మిస్ వంటి ఎండు ఫలాలు.. బాదం, జీడిపప్పు వంటి గింజపప్పుల్లోనూ ఎక్కువే. కాబట్టి వీటిని తగ్గించుకోవాలి. మానేస్తే మంచిది. పొటాషియం తక్కువగా ఉండే యాపిల్, ద్రాక్షపండ్లు, జామ, పైనాపిల్, నేరేడు, స్ట్రాబెర్రీ, సీతాఫలం వంటివి మితంగా తీసుకోవచ్చు.
- కూరగాయల్లో సొరకాయ, బీరకాయ, దొండకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, కీరా, బెండకాయ, కాకరకాయ, ఉడికించిన క్యారెట్ వంటి వాటిల్లో పొటాషియం కాస్త తక్కువగా ఉంటుంది. వీటిని తినొచ్చు.
- టొమాటో, బంగాళాదుంప, పాలకూర, చిలగడదుంప, కొబ్బరి, అరటికాయల్లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని పరిమితం చేసుకోవాలి లేదా మానెయ్యాలి.
- కూరగాయల్లో పొటాషియంను తగ్గించుకోవటానికి ఒక చిట్కా ఉంది. కూరగాయలను చెక్కు తీసి, ముక్కలుగా కోసి మూడు, నాలుగు గంటల సేపు గోరువెచ్చటి నీటిలో నానబెట్టాలి. తర్వాత నీటిని వడగట్టి, ఉడికించి వండుకుంటే పొటాషియం కొంతవరకు తగ్గే అవకాశముంది. రాత్రిపూట గోరువెచ్చటి నీటిలో నానబెట్టి, మర్నాడు కూడా వండుకోవచ్చు.

కొవ్వులు తక్కువగా

కిడ్నీజబ్బు గలవారిలో కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, చెడ్డ కొలెస్ట్రాల్ పెరుగుతుంటాయి. అదే సమయంలో మంచి కొలెస్ట్రాల్ తగ్గుతుంది. కాబట్టి నూనె, వెన్న, నెయ్యి, వనస్పతి వంటివి తగ్గించుకోవాలి. వేపుళ్లు అసలే తినొద్దు.

విటమిన్ డి, విటమిన్లు అవసరం

విటమిన్ డి చురుకుగా మారటం కిడ్నీల మీద ఆధారపడి ఉంటుంది. అంటే కిడ్నీల పనితీరు తగ్గుతున్నకొద్దీ విటమిన్ డి మోతాదులూ పడిపోతుంటాయన్నమాట. అందువల్ల విటమిన్ డి మాత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. కొందరికి క్యాల్షియం మాత్రలూ అవసరమవ్వచ్చు.

- కొందరికి బి విటమిన్లు, ఐరన్ కూడా తగ్గొచ్చు. వీటిని భర్తీ చేయటమూ అవసరమే.

వ్యాయామం కీలకం

కిడ్నీ, గుండె ఆరోగ్యం ఒకదాంతో మరోటి ముడిపడి ఉంటాయి. కాబట్టి కిడ్నీజబ్బు బాధితులకు వ్యాయామం తప్పనిసరి. డాక్టర్ సలహా మేరకు నడక, జాగింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలు చేయొచ్చు. ఇంట్లోనూ యోగాసనాల వంటివి వేయొచ్చు. క్యాల్షియం తగ్గటం వల్ల ఎముకలు పెళుసుబారే ప్రమాదముంది. అందువల్ల తేలికపాటి బరువులెత్తే వ్యాయామాలూ అవసరమే. ఆడవారికిది మరింత ముఖ్యం. దీంతో ఎముకలు, కండరాలు బలపడతాయి.



- ఆశా రాణి కాసరనేని
రీనల్ స్పెషలిస్ట్ డైటీషియన్
డావిటా డయాలిసిస్, రాక్‌ఫోర్డ్
ఇల్లినాయ్, యూఎస్ఏ

ముక్కు కింద పొడిగా

సమస్య సలహా

సమస్య: మా అమ్మాయికి 13 సంవత్సరాలు. మూడేళ్ల నుంచి ముక్కు కింది భాగంలో నల్లటి మచ్చతో ఇబ్బంది పడుతోంది. ఒకదగ్గర పొడిగా అనిపిస్తుంటుంది. చాలా ఆసుపత్రులకు తిరిగాం. ఒత్తిడితో లేదా గోరుతో గీరటం వల్ల అలా అవుతోందని అంటున్నారు. ఎన్ని ఆయింట్‌మెంట్లు వాడినా పొడిదనం తగ్గటం లేదు. దీనికి పరిష్కారమేంటి? – లిశిత

సలహా: మీరు తెలిపిన లక్షణాలను బట్టి సెబోరిక్ డెర్మటైటిస్ అనిపిస్తోంది. ఇది రోగనిరోధకశక్తి తగ్గటం, చర్మంలో నూనె (సీబమ్) ఉత్పత్తి పెరగటం వల్ల వచ్చే ఒకరకం ఈస్ట్ ఇన్‌ఫెక్షన్. కొందరికి విటమిన్ బి12, జింక్ లోపంతోనూ రావొచ్చు. అందువల్ల మీ అమ్మాయికి ఈ పోషకాలు లభించే ఆహారం (గుడ్డు, పాలు, రాగిజావ, మొలకెత్తిన గింజలు) ఇవ్వండి. విటమిన్ మాత్రలు కూడా అవసరమవ్వచ్చు. వీటితో పాటు సమస్య ఉన్నచోట వారానికి ఐదు రోజులు రాత్రిపూట లులికొనజోల్ యాంటీఫంగల్ పూతమందు రాసుకోవాలి. అలాగే పిమిక్రోలిమస్ 1% పూతమందు రాత్రిపూట వారానికి ఒకట్రెండు సార్లు వాడుకుంటే వాపుప్రక్రియ తగ్గటం మొదలవుతుంది.



దీర్ఘకాల ఫంగల్ ఇన్‌ఫెక్షన్ కొన్నిసార్లు మానసికంగానూ మారొచ్చు. దీంతో అక్కడేదో ఉందని మాటిమాటికీ గోకటం, లాగటం చేస్తుంటారు. దీనికి కూడా పిమిక్రోలిమస్ ఉపయోగపడుతుంది. స్నానం చేయటానికి, ముఖం కడుక్కోవటానికి కీటోకొనజోల్ సబ్బు వాడుకోవచ్చు. మీ అమ్మాయి కంటినిండా నిద్రపోయేలా చూసుకోవాలి కూడా. పడుకునే ముందు పాలు తాగితే మంచి నిద్ర పడుతుంది. ఆ భాగాన్ని చేత్తో తాకనీయొద్దు. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటూ పూత మందులు రాసుకుంటుంటే పూర్తిగా నయమవుతుంది. వీటితో నెల దాటినా ఫలితం కనిపించకపోతే డెర్మటాలజిస్టును సంప్రదించండి. చర్మం నుంచి చిన్న ముక్క తీసి, పరీక్షించి సమస్యను నిర్ధారిస్తారు. తగు చికిత్స సూచిస్తారు.

- మీరు స్టిరాయిడ్ పూత మందుల జోలికి అసలే వెళ్లొద్దు. వీటితో అప్పటికి సమస్య తగ్గొచ్చు గానీ మళ్లీ మళ్లీ వస్తుంది. చర్మం కూడా పలుచబడుతుందని గుర్తుంచుకోవాలి.



- డా॥ జీఎస్ఎస్ సందీప్, డెర్మటాలజిస్ట్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

పుట్టుకతోనే అధిక కొలెస్ట్రాల్

కొవ్వు పదార్థాలు ఎక్కువగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం వంటివి కొలెస్ట్రాల్ పెరగటానికి దోహదం చేస్తాయనేది తెలిసిందే. అయితే కొందరికి పుట్టుకతోనే కొలెస్ట్రాల్ చాలా అధికంగా ఉండొచ్చు. దీన్నే ఫ్యామిలియర్ హైపర్‌కొలెస్టెరోలీమియా అంటారు. ఇందులో ప్రధానంగా చెడ్డ కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) మోతాదులు పెరుగుతాయి. ఇది రక్తనాళాల్లో పేరుకుపోయి, పూడికలు ఏర్పడేలా చేస్తుంది. వంశపారంపర్యంగా కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండటానికి మూలం తల్లిదండ్రుల నుంచి సంక్రమించే జన్యువులు. చాలామందిలో లో డెన్సిటీ లైపోప్రొటీన్ రిసెప్టర్ (ఎల్‌డీఆర్) జన్యు మార్పులు కారణమవుతుంటాయి. కొందరికి అపోబ్ లేదా పీసీఎస్‌కే9 జన్యువుల్లో తలెత్తే మార్పులూ దోహదం చేయొచ్చు. సాధారణంగా ఈ జన్యువులు రక్తంలోని చెడు కొలెస్ట్రాల్ తొలగటానికి తోడ్పడతాయి. ఇవి సరిగా పనిచేయకపోతే ఎల్‌డీఎల్ మోతాదులు పెరుగుతాయి. ఇవి 100 ఎంజీ/డీఎల్ ఉండటం మంచిది. కానీ వంశపారంపర్య సమస్య గలవారిలో దీని మోతాదులు గణనీయంగా ఎక్కువగా ఉంటాయి. రెండు నుంచి ఐదు సార్లు పరీక్ష చేసి, అన్నిసార్లూ 200 ఎంజీ/డీఎల్, అంతకన్నా మించితే ఫ్యామిలియర్ హైపర్‌కొలెస్టెరోలీమియాగా నిర్ధారిస్తారు. ఇందులో రక్తనాళాలు దెబ్బతినటం ముందే మొదలవుతుంది. గుండె, పక్షవాతం ముప్పులూ త్వరగా పెరుగుతాయి. అందువల్ల కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

- **కొలెస్ట్రాల్ పరీక్ష:** కుటుంబంలో ఎవరైనా ఫ్యామిలియర్ హైపర్‌కొలెస్టెరోలీమియా బాధితులున్నట్టయితే 9-11 ఏళ్లలో, అంతకన్నా ముందే కొలెస్ట్రాల్ పరీక్ష చేయించుకోవటం మొదలెట్టాలి. పెద్దవాళ్లయితే కనీసం ప్రతి ఐదేళ్లకోసారి చేయించుకోవాలి. ఎందుకంటే కొలెస్ట్రాల్ ఎక్కువున్నా ఎలాంటి లక్షణాలూ ఉండవు. పరీక్షతో గుర్తించటం ఒక్కటే మార్గం.
- **ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం:** ఇవి ఎల్‌డీఎల్ తగ్గటానికి తోడ్పడతాయి. అలాగే ఇతరత్రా మార్గాల్లో గుండెజబ్బు ముప్పు తగ్గిస్తాయి.
- **మందులు:** వంశపారంపర్య కొలెస్ట్రాల్ సమస్య గలవారికి మందులూ అవసరం. డాక్టర్లు వీటిని సూచిస్తే విధిగా వాడుకోవాలి.
- **ఇతరులకూ పరీక్ష:** ఇంట్లో ఎవరికైనా ఫ్యామిలియర్ హైపర్‌కొలెస్టెరోలీమియా ఉన్నట్టు తేలితే సన్నిహిత కుటుంబ సభ్యులూ కొలెస్ట్రాల్ పరీక్ష చేయించుకోవటం మంచిది.



పాలీజెనిక్ ముప్పు

కొందరికి ఏదో ఒక జన్యువు కాకుండా చాలా జన్యువుల్లో స్వల్ప మార్పుల (పాలీజెనిక్) మూలంగానూ పుట్టుకతోనే కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండొచ్చు. ప్రతి ఒక్క మార్పూ కొద్దికొద్దిగా కొలెస్ట్రాల్ పెంచుతూ వస్తాయి. అన్నీ కలిసి క్రమంగా అధిక కొలెస్ట్రాల్ ముప్పు పెరిగేలా చేస్తాయి. చిన్నతనంలో దీనికి సంబంధించి ఎలాంటి లక్షణాలూ కనిపించవు. ఫ్యామిలియర్ హైపర్‌కొలెస్టెరోలీమియా తల్లిదండ్రుల నుంచి నేరుగా సంక్రమిస్తుంది గానీ పాలీజెనిక్ ముప్పు అలా కాదు. ఈ జన్యుమార్పులు కుటుంబాల్లో తాత, ముత్తాత, అమ్మమ్మ, నాన్నమ్మల నుంచీ కొనసాగుతూ వస్తుంటాయి. అంటే తల్లిదండ్రులకు లేకపోయినా వారి పిల్లలకు సంక్రమించొచ్చు అన్నమాట.

కుంగుబాటుకు వ్యాయామ కళ్లెం!



కుంగుబాటు (డిప్రెషన్), వ్యాయామం ఒకదాన్ని మరోటి ప్రోత్సహిస్తుంటాయి. కుంగుబాటుతో వ్యాయామం మీద ఆసక్తి తగ్గుతుంది. తగినంత శారీరక శ్రమ లేకపోతే కుంగుబాటు మరింత తీవ్రమవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారికి వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. దీంతో, ముఖ్యంగా బరువులెత్తే వ్యాయామాలతో మందులు, చికిత్సలతో సమానమైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తాజాగా తేలింది. యూనివర్సిటీ ఆఫ్ లాంకషైర్ పరిశోధకులు 70కి పైగా ప్రయోగ పరీక్షలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. మానసిక స్థితి (మూడ్) మీద శారీరక శ్రమ గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్న విషయాన్ని ఇది మరింత బలపరచింది. వ్యాయామం, శారీరక శ్రమలు కుంగుబాటుతో ముడిపడిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. జీవ గడియారాన్ని తిరిగి సరిచేసి నిద్ర బాగా పట్టేలా చేస్తాయి. నాడీ కణాల వృద్ధికి తోడ్పడే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ విడుదలనూ ప్రేరేపిస్తాయి. ఈ ఫ్యాక్టర్ మూడ్ నియంత్రణకు దోహదం చేయటం గమనార్హం. అందువల్ల కుంగుబాటు బాధితులు వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు. చికిత్స ప్రణాళికల్లో దీన్ని విధిగా చేర్చాలని చెబుతున్నారు. ఈ సమీక్ష కోసం పరిగణనలోకి తీసుకున్న అధ్యయనాలు కొన్ని పాఠాలనూ నేర్పుతున్నాయి.

1 ఒక చికిత్స సరిపోదు

కుంగుబాటు మనిషిని చాలా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. జీవితంలో తృప్తిని ఘోరంగా దెబ్బతీస్తుంది. ఇలాంటి తీవ్ర సమస్యకు ఒక చికిత్స సరిపోదు. సైకోథెరపీ, యాంటీడిప్రెసెంట్ మందులకు వ్యాయామాన్ని జోడిస్తే మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అందుకే మందులు వేసుకుంటున్నా, వేసుకోకపోతున్నా సైకాలజిస్టును సంప్రదించటం, వ్యాయామం చేయటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

2 ఎంత శ్రమకు అంత ఫలితం

వ్యాయామం చేస్తేనే సరిపోదు, ఎంత తీవ్రంగా చేస్తున్నామన్నదీ ముఖ్యమే. మామూలు వ్యాయామం కన్నా తీవ్రమైన వ్యాయామంతో ఎక్కువ ఫలితాలు కనిపిస్తున్నాయి. శరీరాన్ని 10 నుంచి 20 నిమిషాలు ఒకింత ఎక్కువ శ్రమకు గురిచేసినా చాలు. తీవ్రమైన వ్యాయామమంటే మరీ కష్టమని అనుకోవాల్సిన పనిలేదు. పక్కవారితో మాట్లాడటం కష్టంగా అనిపిస్తే తీవ్రంగా చేస్తున్నట్టే లెక్క. ఇది ఆయా వ్యక్తుల శరీర సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది.

3 వ్యాయామం ఏదైనా

నడక, నెమ్మదిగా పరుగెత్తటం, యోగా, బరువులు ఎత్తటం.. ఇలా ఏ రకం వ్యాయామమైనా కుంగుబాటు చికిత్సకు తోడ్పడుతుంది. రెండు, మూడు వారాలుగా కుంగుబాటుతో బాధపడేవారికి డ్యాన్స్ చాలా మేలు చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వీటిల్లో కొద్దిమందిని.. అదీ యువతులను పరిగణనలోకి తీసుకోవటం వల్ల అందరికీ వర్తింపజేయటం తగదని పరిశోధకులు భావిస్తున్నారు. బరువులెత్తటం, సైకిల్ తొక్కటం ఆడవారికి బాగా ఉపయోగపడుతుంటే.. యోగా, థాయ్ చీ మగవారికి మరింత మేలు చేస్తున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. వృద్ధులకు యోగాతో, చిన్నవయసువారికి బరువులెత్తటంతో ప్రయోజనం కనిపిస్తోంది. యోగా, బరువులు ఎత్తటాన్ని మానకుండా కొనసాగిస్తున్నట్టూ బయటపడింది.

4 తోడుగా చేస్తే

ఐకమత్యం బలమనే సూత్రం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఒంటరిగా కన్నా నలుగురితో కలిసి వ్యాయామాలు చేస్తే కుంగుబాటు లక్షణాలు మరింతగా తగ్గుతుండటం గమనార్హం. కుంగుబాటులో ఒంటరిగా ఉండిపోవటం పెద్ద లక్షణం. నలుగురితో కలిసి వ్యాయామం చేస్తే ఒంటరితనం దూరమవుతుంది. ఇతరుల కన్నా మరింత కఠినంగా చేయాలనే కోరికా కలుగుతుంది. కాబట్టి వీలుంటే జిమ్‌లో చేరి శిక్షకుల సమక్షంలో లేదా బృందంగా వ్యాయామం చేయటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

5 నైపుణ్యం సాధిస్తే


వ్యాయామాల్లో నైపుణ్యం సాధించటమూ దిగులు, నిరాశ ఎక్కువగా తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకింత ఎక్కువ బరువు ఎత్తటం.. కాస్త ఎక్కువ దూరం, ఎక్కువసేపు పరుగెత్తటం కూడా నైపుణ్యం కిందికే వస్తాయి. కుంగుబాటు ఎప్పుడూ గొప్ప పనులు చేయలేవని మనిషిని వెనక్కి లాగుతుంటుంది. దీంతో చాలామంది అక్కడే ఆగిపోతుంటారు. వ్యాయామం దాన్ని అబద్ధమని నిరూపిస్తుంది. మారటం సాధ్యమేనని, కొత్త అలవాట్లు నేర్చుకోవచ్చని, మెరుగ్గా పనులు సాధించొచ్చని నేర్పిస్తుంది. ఇది నిజంగా ఒక శక్తిమంతమైన ఔషధమే. పరుగు, బరువులెత్తటం శరీరానికి పరీక్ష పెట్టి, పురోగతి సాధించేలా చేస్తాయి. యోగా, థాయ్ చీ వంటివి ఏకాగ్రత, జాగరూకత ద్వారా నైపుణ్యం పెంపొందిస్తాయి.

6 ఫలితాలు నెమ్మదిగా

వ్యాయామ ఫలితం కనిపించటానికి కొంత సమయం పడుతుంది. కౌన్సెలింగ్, యాంటీడిప్రెసెంట్ మందుల విషయంలో డాక్టర్లు ఎవరికి ఏది పడుతుందో, ఎంత మోతాదు సరిపోతుందో తెలుసుకోవటానికి సమయం పడుతుంది. మరోవైపు వ్యాయామానికి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిమితులు అడ్డుతగులుతుంటాయి. ఎవరికేది నప్పుతుందో, ఆనందంగా చేయగలిగిన వ్యాయామాలేంటో గుర్తించటానికి కాస్త సమయం అవసరం. అప్పుడే మధ్యలో మానెయ్యకుండా ఉండటం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా చేస్తుంటే నెమ్మదిగా ఫలితాలు కనిపించటం మొదలవుతుంది.

కాలేయానికీ ఉందో లయ!


కాలేయం నిరంతరం రక్తంలోకి ప్రొటీన్లను విడుదల చేస్తుందని ఇప్పటివరకూ భావిస్తున్నారు. కానీ ఇది మన జీవగడియారానికి అనుగుణంగా, ఆయా సమయాల ప్రకారం ప్రొటీన్లను విడుదల చేస్తున్నట్టు ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ యూనివర్సిటీ అధ్యయనంలో తేలింది. రోజువారీ పనులు అస్తవ్యస్తమైతే.. అంటే షిఫ్ట్ ఉద్యోగాలు, వేళాపాళా లేని తిండి వంటివి కాలేయం పనితీరును ప్రభావితం చేస్తాయన్నమాట. శరీరం పనిచేయటానికి తోడ్పడే కీలక అవయవాల్లో కాలేయం ఒకటి. రక్తంలో ప్రసారమయ్యే చాలా ప్రొటీన్ల ఉత్పత్తి, రవాణాకు ఇదే మూలం. జీవక్రియ సజావుగా సాగటానికి, వాపుప్రక్రియ, శక్తి సమతులంగా ఉండటానికివి అత్యవసరం. అయితే ఈ ప్రొటీన్లు అన్ని వేళల్లోనూ ఒకేలా విడుదల కావని పరిశోధకులు పేర్కొంటున్నారు. కాలేయానికి తనదైన జీవగడియారం ఉంటుందని, ఇది 24 గంటల లయలో ప్రొటీన్లను విడుదల చేస్తుందని చెబుతున్నారు. ఈ క్రమానికి భంగం వాటిల్లితే ఊబకాయం వంటి దీర్ఘకాల జబ్బులకు దారితీస్తుందని వివరిస్తున్నారు. ఇది సజావుగా సాగటానికి వేళకు భోజనం చేయటం ముఖ్యమని సూచిస్తున్నారు. వేళకు భోజనం చేసేవారిలో కాలేయం లయ సక్రమంగా సాగుతోందని, కానీ గంటకోసారి పోషక పానీయాలు తాగేవారిలో ఇది అస్తవ్యస్తమవుతోందని చెబుతున్నారు. కాలేయ లయను బాగా అర్థం చేసుకోగలిగితే పోషకాహారం, షిఫ్ట్ ఉద్యోగాలు, జబ్బుల నివారణ గురించి మన అవగాహన మారగలదని భావిస్తున్నారు.



ఆర్సెనిక్‌తో అకాల మరణం


ఆర్సెనిక్ సహజ మూలకం. నేల, నీరు, గాలిలో ఉండే దీని ప్రభావానికి దీర్ఘకాలం గురైతే సమస్యలకు దారితీస్తుంది. కొన్నిచోట్ల జలవనరుల్లో ఆర్సెనిక్ పెద్దమొత్తంలో ఉంటుంది. కోట్లాది మంది ఈ నీటిని వినియోగిస్తుంటారు. ఆర్సెనిక్ ప్రభావాన్ని తగ్గించుకుంటే క్యాన్సర్, గుండెజబ్బుల మరణాలను తగ్గించుకోవచ్చని తాజా అధ్యయనం ఒకటి సూచిస్తోంది. ఇందులో భాగంగా పరిశోధకులు బంగ్లాదేశ్‌లో నివసించే వారి తాగునీటిలో, మూత్రంలో ఆర్సెనిక్ మోతాదులను పరీక్షించారు. ఇలా 20 ఏళ్ల పాటు అప్పుడప్పుడూ పరీక్షలు నిర్వహించారు. ఇదే సమయంలో క్యాన్సర్, గుండెజబ్బు మరణాలనూ పరిశీలించారు. ఆర్సెనిక్ మోతాదులు తక్కువగా ఉంటే మరణించే ముప్పు తగ్గినట్టు తేలింది. తాగునీటిలో ఆర్సెనిక్ మోతాదులు సురక్షిత స్థాయికి తేగలిగితే దీర్ఘకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరగలవని పరిశోధకులు సూచిస్తున్నారు.

పేగులకు థయమిన్ అండ



విటమిన్ బి1 (థయమిన్) శరీరంలో రకరకాల పనులు చేస్తుంది. వీటిల్లో ఒకటి మనం తినే ఆహారాన్ని శక్తిగా మలచటంలో పాలు పంచుకోవటం. దీని గురించి తాజాగా మరో విషయం బయటపడింది. పేగుల కదలికలతో ముడిపడిన మలబద్ధకం, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, విరేచనాల వంటి సమస్యలు నయం కావటానికీ తోడ్పడుతున్నట్టు తేలింది. ఆహారం ద్వారా తీసుకునే విటమిన్ బి1 మోతాదులకూ మల విసర్జన తీరుకూ బలమైన సంబంధం ఉంటున్నట్టు పరిశోధకులు గుర్తించారు. నిండుగింజ ధాన్యాలు, మాంసం, చేపలు, పప్పుల్లో విటమిన్ బి1 దండిగా ఉంటుంది. వీటిని తినటం లేదా థయమిన్ మాత్రలు వేసుకోవటం ద్వారా మలబద్ధకం, పేగుపూత వంటి సమస్యలను తగ్గించుకునే అవకాశముందని అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

ఈనాడు సినిమా



వెంకయ్యనాయుడు, మురళీమోహన్, పూర్ణచంద్రరావు, రజనీకాంత్

అట్లూరి జీవితం నేటి తరానికో పాఠం

• మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

• ఘనంగా ప్రముఖ నిర్మాత అట్లూరి పూర్ణ చంద్రరావు 90వ పుట్టినరోజు వేడుకలు

కష్టపడి అనే సూత్రానికి ప్రముఖ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు నిలువెత్తు నిదర్శనమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. గేటు కీపర్‌గా జీవితాన్ని ప్రారంభించి, రూ.5తో సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టి, 9 భాషల్లో 87 సినిమాలు పూర్తి చేయడం, వాటిలో ఎక్కువ సినిమాలు చరిత్ర నెలకొల్పడం ఆయన దూరదృష్టి, నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పూర్ణచంద్రరావు 90వ పుట్టిన రోజును పురస్కరించుకుని కర్ణాటకలోని మడికేరిలో 'గ్రీన్‌పార్క్ రిసార్ట్ అండ్ స్పా'లో ఆదివారం నిర్వహించిన వేడుకలో ఆయనను సత్కరించి మాట్లాడారు. పదేళ్ల కిందట ఇక్కడ భూమి కొని, దీన్ని రిసార్ట్‌గా అట్లూరి అభివృద్ధి చేశారు. అట్లూరి ప్రస్థానం నేటి తరానికి ఒక పాఠమని పేర్కొన్నారు. సినిమాలను విజయాలతోనే కాకుండా, విలువలతో లెక్కించిన నిర్మాతగా, వ్యాపారాన్ని లాభాలతోనే కాకుండా లక్ష్యాలతో ముందుకు నడిపిన క్రాంతిదర్శి అని ప్రశంసించారు. సినీరంగంలో ఆదర్శనీయమైన విలువలను పాటించడం ఒక ఎత్తయితే, ఆ ప్రస్థానాన్ని ఎక్కడ పరిపూర్ణం చేయాలన్న విషయం బాగా తెలిసిన వ్యక్తిగా కీర్తించారు. "నన్ను 'అందా కానూన్' చిత్రంతో హిందీ సినిమాకి పరిచయం చేసిన వ్యక్తి పూర్ణచంద్రరావే. ఎంతో నిజాయతీ గల మనిషి. వారు 120ఏళ్లు బతకాలని కోరుకుంటున్నా" అన్నారు ప్రముఖ కథానాయకుడు రజనీకాంత్. వ్యాపారవేత్తగా ఉన్న తనను 1973లో సినిమాల్లోకి రావాలని అట్లూరి ఆహ్వానించారని, తనకు పేరు కూడా పెట్టారని సీనియర్ నటుడు, నిర్మాత మురళీమోహన్ చెప్పారు. నిర్మాతలు దిల్ రాజు, కేఎస్ రామారావు తదితరులు తమకు పూర్ణచంద్రరావుతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మురళీమోహన్‌కు జీవితకాల పద్మశ్రీ ప్రకటించిన నేపథ్యంలో ఈ వేడుకలో ఆయన్ని పూర్ణచంద్రరావు సత్కరించారు.

– న్యూస్‌టుడే, మడికేరి

ఏఐ.. నిశ్శబ్దంగా సినిమా భాషని తిరగరాస్తోంది



రానా

చిత్రపరిశ్రమలో తదుపరి పెద్ద విభజన.. ఏఐ(కృత్రిమ మేధ)ని స్వీకరించేవారికి, వ్యతిరేకించేవారికి మధ్య ఉండదని, ఆ సాధనంతో మేధో సంపత్తిని నిర్మించేవారికి, వాటిని ఉపయోగించేవారికి మధ్య ఉంటుందని అంటున్నారు హీరో రానా. తాజాగా ఆయన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో తొలి రోజు "ఏఐ వర్సెస్ క్రియేటివిటీ: స్క్రిప్టింగ్ ది ఇన్నోవేషన్ ఇన్ ది ఇంటెలిజెంట్ ఎకానమీ" అనే సెషన్‌లో భాగమైన రానా కృత్రిమ మేధ సినిమాలపై చూపుతున్న ప్రభావం గురించి మాట్లాడారు. "నిశ్శబ్దంగా సినిమా భాషను తిరగరాస్తోంది కృత్రిమ మేధ. గతంలో ఒక షాట్ పూర్తి చేయడానికి 3 నుంచి 5 రోజులు పట్టేది. కానీ ఇప్పుడు అది కేవలం రెండు నుంచి మూడు గంటలకు తగ్గింది. అంతేకాకుండా ఒక చిత్రనిర్మాత షూటింగ్ ప్రారంభం కాకముందే తన సినిమాను చూడవచ్చు. ఇది నటుల స్థానాన్ని కూడా భర్తీ చేయగలదు. కానీ కథ చెప్పడం, సందర్భాన్ని అర్థం చేసుకోవడం లాంటి కొన్ని ప్రధాన నైపుణ్యాలను ఏఐతో భర్తీ చేయలేమ"ని అన్నారు.

ఏఐ పట్ల.. అప్రమత్తత అవసరం!



అభిషేక్ బచ్చన్

నటులు ఏఐ(కృత్రిమ మేధ)ని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అభిషేక్ బచ్చన్ అన్నారు. ఏఐ అనేక రంగాలను ప్రభావితం చేస్తుందని.. కానీ, దానిని అదుపు లేకుండా వాడటం పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇటీవల ఓ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన ఏఐ గురించి మాట్లాడుతూ.. ''ఏఐ నన్ను భయపెడుతుంది. అలానే అది ప్రతి నటుణ్ని భయపెట్టాలి. ఇది సృజనాత్మక రంగంలో చాలా విషయాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురాబోతుంది. కానీ, దానిని బాధ్యతాయుతంగా ఉపయోగించుకోకపోతే అది నటులకు ప్రమాదం. ముఖ్యంగా తెరవెనుక యానిమేషన్, స్పెషల్ ఎఫెక్ట్స్ లాంటి వాటికి చాలా ప్రయోజనకరంగా ఉంటూనే పని గంటల్నీ తగ్గిస్తుంది. ఏఐ నుంచి వచ్చే కంటెంట్‌లో కొన్ని అద్భుతంగా ఉన్నప్పటికీ.. కొన్నిటిలో భావోద్వేగాల లోతు ఉండడం లేదు. అసంపూర్ణంగా అనిపిస్తుంది. ఏఐ ప్రభావం సినిమాలకే పరిమితం కాదు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అర్థం చేసుకోవడానికి ఇంకా ప్రయత్నిస్తున్నాను. సినిమాల విషయానికొస్తే ఏఐ ల్యాండ్‌స్కేప్ గురించి పూర్తి అవగాహన లేదు. అది ప్రయోజనకరంగా ఉంటుందా లేదా అనే దానిపై నాకు సందేహం ఉంది. దాని గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను''అని అన్నారు. అభిషేక్ తదుపరి షారుక్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'కింగ్' చిత్రంలో కనిపించనున్నారు.

ఓటీటీలో ఈ వారం

కొత్త వారం మొదలైంది.. వినోదాల జాతరకి కూడా సమయం ఆసన్నమైంది. అదేనండీ.. ఓటీటీలో వచ్చే కొత్త కథల గురించే ఇదంతా. ఎప్పటిలాగే ఈ వారం కూడా నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేయడానికి వైవిధ్యమైన సిరీస్‌లు, సినిమాల్ని అందుబాటులోకి తీసుకొచ్చాయి ఓటీటీలు.

56డేస్ (సిరీస్)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
వథా వచ్చ (సినిమా)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
ది నైట్ ఏజెంట్ సీజన్ 3(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
అమోర్ తలెగ్గాండర్ (సినిమా)	శుక్రవారం	సన్‌నెక్స్ట్
ది స్వీడిష్ కొనెక్షన్(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
ఫైర్‌బ్రేక్ (సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
పవనే(సినిమా)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్

చిదంబరం సందేశం



ప్రతి మనిషిలోనూ ఏదో ఒక లోపం ఉంటుంది. భయపడకుండా దాన్ని దాటుకొని బయటకు రావాలని సందేశాత్మకంగా చూపించిన చిత్రం 'శ్రీచిదంబరంగారు'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ ప్రధాన పాత్రలు పోషించారు. వినయ్ రత్నం దర్శకత్వం వహించారు. చింత వినీషా రెడ్డి, చింత గోపాలకృష్ణ రెడ్డి నిర్మాతలు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల్ని అలరించింది. ఇప్పుడీ విలేజ్ డ్రామా గురువారం నుంచి ప్రముఖ ఓటీటీ ఈటీవీ విన్‌లో సందడి చేయడానికి సిద్ధమైంది. ఇందులో తన మెల్ల కన్నే తనకు శాపంగా భావించే చిదంబరం పాత్రలో ఒదిగిపోయారు వంశీ. 'ఇవాళ నువ్వు నీకై నిలబడితే.. రేపన్న రోజు గెలుపే దిగిరాదా!' అంటూ మనసుకు హత్తుకునే పాటలతో ఆకట్టుకున్న ఈ సినిమా కథేంటో మీరూ చూసేయ్యండి.

కుక్కపిల్ల రాకతో మారిన జీవితాలు



ఓవైపు మ్యూజిక్.. మరోవైపు నటనతో అదరగొడుతున్నారు జీవీ ప్రకాశ్ కుమార్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లక్కీ ది సూపర్ స్టార్'. ఉదయ్ మహేశ్ దర్శకత్వం వహించారు. అనస్వర రాజన్ కథానాయిక. లక్కీ అనే ఓ కుక్కపిల్ల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. అనుకోకుండా దారితప్పి వేర్వేరు మనుషుల దగ్గరకు వెళ్తుంది. లక్కీ వెళ్లిన ప్రతిచోటా అక్కడ ఉండేవారి జీవితాలు మారిపోతుంటాయి. మరి ఆ తర్వాత ఏమైంది? లక్కీకి, రాజకీయ నాయకులకు ఉన్న సంబంధమేంటి? అనేదే ఈ సినిమా కథ. ఈ కామెడీ డ్రామా శుక్రవారం నుంచి జియోహాట్‌స్టార్ వేదికగా అలరించనుంది.

సూపర్ డీలక్స్ తర్వాత పాకెట్ నావెల్



నలుగురు వ్యక్తుల జీవితాల్లోని సంఘటనలతో రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'సూపర్ డీలక్స్'. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, దర్శకుడు త్యాగరాజన్ కుమార రాజా కలయికలో వచ్చిన విజయవంతమైన చిత్రమిది. ఇప్పుడీ హిట్ కాంబినేషన్‌లో ఏడేళ్ల తర్వాత మరో సినిమా రాబోతుంది. దీనికి 'పాకెట్ నావెల్' అనే పేరును ఖరారు చేశారు. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు విజయ్ సేతుపతి. ఈ చిత్రంలో రాజ్ బి.శెట్టి, మాళవిక మోహనన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణను ప్రారంభించినట్లు, త్వరలో మరిన్ని వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

'జై హనుమాన్' సన్నాహాలు



రిషబ్ శెట్టి

'హను-మాన్' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. ఇప్పుడాయన ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జై హనుమాన్'ను పట్టాలెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. రిషబ్ శెట్టి టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఇది వచ్చే వారం హంపీలో లాంఛనంగా ప్రారంభం కానుందని సమాచారం. దీనికి ఈనెల 22వ తేదీని ముహూర్తంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రామాయణంతో ముడిపడిన ఈ మైథలాజికల్ యాక్షన్ చిత్రం కోసం ప్రశాంత్ ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రీ విజువలైజేషన్ పనులు పూర్తయినట్లు ప్రచారం జరుగుతోంది. సినిమా ప్రారంభం రోజునే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశముంది.

సుహాస్ - శివానీ నాగారం జంటగా నటించిన 'హే భగవాన్' చిత్రం పేరు మార్చుకుంది. సెన్సార్ బోర్డు సూచనల మేరకు ఈ టైటిల్‌ని 'హే బల్‌వంత్'గా మార్చినట్లు చిత్ర బృందం ప్రకటించింది. గోపీ అచ్చర తెరకెక్కించిన ఈ సినిమా ఈనెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది కథానాయిక శివానీ నాగారం.

నేనూ వాళ్ల బాటలోనే...!



• "నటిగా నాకు అన్ని రకాల జానర్లు చేయాలని ఉంది. రొమాంటిక్ కామెడీ చిత్రాల్ని ఎక్కువ ఇష్టపడతా. నేను నటించిన సినిమాలు ఓటీటీలోకి రావడం వల్ల అన్ని భాషల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. ప్రస్తుతం తమిళంలో రెండు సినిమాలు.. తెలుగులో రెండు చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలోనే ఆ చిత్ర వివరాల్ని అధికారికంగా వెల్లడిస్తా".

"అంబాజీ పేట మ్యారేజి బ్యాండు' తర్వాత సుహాస్‌తో నాకిది రెండో సినిమా. అందులో కథతో పాటు నా పాత్ర చాలా గాఢతతో నిండి ఉంటుంది. కానీ, ఈ సినిమా ఆద్యంతం వినోదాత్మకంగానే ఉంటుంది. నా పాత్ర అమాయకంగా కనిపిస్తూనే అందర్నీ నవ్విస్తుంటుంది. నేనెంతో ఎంజాయ్ చేస్తూ చేసిన పాత్రిది. ఇందులోని తండ్రీ - కొడుకుల అనుబంధం అందరి మనసుల్ని హత్తుకుంటుంది. విరామ సన్నివేశాలు ప్రతి ఒక్కర్నీ ఆశ్చర్యపరిచేలా ఉంటాయి. సుహాస్ నాకు మంచి మిత్రుడు. ఈ సినిమాలో మా ఇద్దరి మధ్య వచ్చే సన్నివేశాల్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. అలాగే సుహాస్ - సుదర్శన్‌ల ట్రాక్‌తో పాటు వెన్నెల కిశోర్ పాత్ర కూడా చాలా నవ్విస్తుంది. దీంట్లో నరేశ్ చేసే ఫ్యామిలీ బిజినెస్ ఏంటన్నది తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. దీనితో హ్యాట్రిక్ కొడతాననే నమ్మకముంది".

• "నేను నటిని అవ్వాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ, ఇంట్లో వాళ్ల ప్రోత్సాహంతో ఇక్కడికి రావడం.. లక్కీగా ఆరంభంలోనే మంచి సినిమాలు పడటం.. నాకు చక్కటి గుర్తింపు తెచ్చిపెట్టింది. నా దృష్టిలో సినిమా అంటే సినిమానే. కథ, పాత్ర నచ్చితేనే ఏదైనా ఒప్పుకుంటా. ఎందుకంటే నేను ఎలాంటి నేపథ్యం లేకుండా ఇక్కడి దాకా వచ్చా. ప్రేక్షకులిచ్చిన ఆ గుర్తింపును నిలుపుకోవడమే నాకు ముఖ్యం. నాకు వంద సినిమాలు చేయాలని లేదు. చేసినవి అయిదు చిత్రాలైనా మంచి కథలతోనే చేస్తాను. నాకు కథ నచ్చిందంటే కాంబినేషన్‌తో సంబంధం లేకుండా సినిమా ఒప్పుకుంటా".

• "ప్రస్తుతం నటులతో పాటు రచయితలు, దర్శకులు ఎక్కువయ్యారు. తెలుగమ్మాయిలకు ఎక్కువ అవకాశాలు వస్తున్నాయి. ఇప్పుడు ప్రేక్షకులు చిన్న - పెద్ద సినిమాలని తేడాలు చూపించట్లేదు. కంటెంట్ బాగుందంటే చిన్న చిత్రాల్ని కూడా పెద్ద సినిమాలు చేసేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో చాలా మంది నాతో వెంట వెంటనే సినిమాలు చేయకపోతే కనిపించకుండా పోతావని సలహాలిచ్చారు. కానీ, నేను సినిమాల పరంగా ఆచితూచే అడుగులేస్తున్నా. 'ఈ అమ్మాయి ఎప్పుడూ మంచి సినిమాలే చేస్తుంది' అనే మాట అందరి నోట వినాలని ఉంది. సాయిపల్లవి, నిత్యామేనన్ లాంటి వాళ్లంతా సెలక్టివ్‌గానే సినిమాలు చేస్తున్నారు. నేనూ వాళ్ల బాటలోనే ముందుకెళ్తా".

అందమైన ప్రేమకథతో..



హర్షిత్ రెడ్డి

హర్షిత్ రెడ్డి హీరోగా శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వంలో 'దీవాన' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మాతలు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమాని ఈ వేసవిలోనే విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ''ఇదొక అందమైన ప్రేమకథతో ముస్తాబవుతున్న సినిమా. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి సంగీతం: ఈశ్వర్ చంద్, ఛాయాగ్రహణం: వంశీ పచ్చిపులుసు.

కథ ఇంకా పూర్తి కాలేదు



'దల్దాల్' సిరీస్‌లో డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించి నిండితుల్ని పరుగులు పెట్టించింది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. అమ్రిత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌కు సురేశ్ త్రివేణి సృష్టికర్త. ఇటీవలే విడుదలై ప్రేక్షకుల్ని అలరించిందీ సిరీస్. ఇప్పుడీ క్రైమ్ థ్రిల్లర్‌కు సీక్వెల్‌గా సీజన్ 2ను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సురేశ్ త్రివేణి 'దల్దాల్ 2' గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. "మేము సీజన్ 2కు సిద్ధంగా ఉన్నాం. రచయితలు ఈ సిరీస్ కోసం మూడేళ్లుగా పనిచేస్తున్నారు. వారు కూడా ముందుకు రావడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇందులో హత్యకు సంబంధించిన రహస్యాన్ని డీసీపీ రీటా ఫెరీరా ఛేదించవచ్చు. కానీ అసలు కథ ఇంకా పూర్తి కాలేదు. మొదటి భాగానికి వచ్చిన అన్ని అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకుంటున్నాం. త్వరలోనే సరైన నిర్ణయం తీసుకొని అధికారికంగా వెల్లడిస్తాం" అని తెలిపారు.

నైస్... మీరా జాస్మిన్



తన రాబోయే చిత్రం ఎల్ 366(వర్కింగ్ టైటిల్)లో లవ్ లాజన్ అనే పోలీసు పాత్రలో కనిపించనున్నట్లు ఇటీవలే ప్రకటించారు మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్. ఈ సినిమాకి తరుణ్ మూర్తి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నటి మీరా జాస్మిన్ కీలక పాత్రలో నటిస్తుంది. ఇటీవల ఆమె పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమాలోని మీరా పాత్రని పరిచయం చేస్తూ.. ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ పోస్టర్‌కు 'నైస్ ఈజ్ నైస్' అనే క్యాప్షన్‌ని జోడించింది. దీంతో ఆమె నైస్ అనే పాత్రలో నటిస్తున్నట్లు స్పష్టం చేసింది. గతేడాది మీరా.. మోహన్‌లాల్ 'హృదయపూర్వం' చిత్రంలో అతిథి పాత్రలో అలరించింది.

ఈ కష్టమంతా ఆ రెండు జీవిత కథల కోసమే!



రాజ్‌కుమార్ రావ్

బాలీవుడ్ కథానాయకుడు రాజ్‌కుమార్ రావ్.. త్వరలో ముంబయికి చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్, క్రికెటర్ సౌరభ్ గంగూలీ బయోపిక్‌లతో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన.. ఉజ్వల్ నికమ్ బయోపిక్ చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. దీంతో పాటు కొన్ని రోజులుగా తన లుక్‌పై నెట్టింట్లో వస్తోన్న విమర్శల గురించి కూడా తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు రాజ్‌కుమార్. "నా కళతోనే నా ఉనికి. నా తదుపరి ప్రాజెక్టు నికమ్ బయోపిక్ షూటింగ్ ముగిసింది. దీని కోసం నన్ను నేను శారీరకంగా చాలా మార్చుకున్నా. ఇందులోని పాత్ర కోసం బరువు పెరగడం, వృద్ధాప్యంగా కనిపించడం, జుట్టు రాలిపోవడం లాంటివి చేయడాన్ని నా హెయిర్ స్టైలిస్ట్ వ్యతిరేకించారు. 'శ్రీకాంత్' సినిమా సమయంలో కూడా దృష్టి లోపం ఉన్న వ్యక్తిగా నటించొద్దని కొందరు చెప్పారు. 'నికమ్' బయోపిక్ కోసం నేను దాదాపు 9 నుంచి 10 కిలోల బరువు పెరగాల్సి వచ్చింది. త్వరలో రాబోతున్న ఈ సినిమాలో నా కష్టమంతా కనిపిస్తుంది. దీని తర్వాత గంగూలీ మోడ్‌లోకి రావాలంటే ఇప్పుడు పెరిగిన బరువంతా తగ్గాలి. ఏదేమైనా నా పని ద్వారా మిమ్మల్ని అలరించడానికి ఎప్పుడూ కష్టపడి పనిచేస్తూనే ఉంటా'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఉద్యోగం ఉండాలంటే ఏఐ టూల్స్ నేర్చుకోండి



యువతకు టెక్ దిగ్గజాల సూచన

కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతున్నాయని ఆందోళన చెందుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు భరోసానిచ్చే సలహాను టెక్ పరిశ్రమ దిగ్గజాలు సూచిస్తున్నారు. 'ప్రశాంతంగా ఉండండి, నైపుణ్యాలు పెంచుకోండి' అని తెలిపారు. ఏఐ సముద్రాన్ని ఈదాలంటే, జీవితాంతం నేర్చుకునే సామర్థ్యం ఉండాలన్నారు. వచ్చే 3-5 ఏళ్ల పాటు ఏఐ మారుతూనే ఉంటుందని, అందువల్ల కంపెనీల్లో ఉద్యోగుల విషయంలో మార్పులు భారీగానే కనిపించొచ్చని సోమవారం దిల్లీలో ప్రారంభమైన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026'లో భాగంగా పలువురు వివరించారు.

ఏఐ ఇంపాక్ట్ సమిట్

కంప్యూటర్లు వచ్చినపుడు పోయాయా?

'ఏఐ కారణంగా ప్రస్తుతం ఉన్న కొన్ని రకాల ఉద్యోగాలు పనికిరాకుండా పోవచ్చు. అదే సమయంలో కొన్ని కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ఉద్యోగులు ఏ నైపుణ్యాలు నేర్చుకోవాలో తరచూ గమనిస్తూ ఉండాల'ని 'ద ఫ్యూచర్ ఆఫ్ ఎంప్లాయబిలిటీ ఇన్ ది ఏజ్ ఆఫ్ ఏఐ' అనే సెషన్‌లో నిపుణులు పేర్కొన్నారు. నౌకరీ వ్యవస్థాపకుడు సంజీవ్ బిఖ్‌చందానీ మాట్లాడుతూ 'కంప్యూటర్లు వచ్చినప్పుడు, బ్యాంకుల్లో ఉద్యోగాలు పోతాయని చాలా మంది భావించారు. ఎవరి ఉద్యోగమూ పోలేదు. పైగా ఉత్పాదకత పెరిగింద'ని గుర్తు చేశారు. 'ఎక్కువగా ఆందోళన పడకండి. ఏఐ వల్ల మీ ఉద్యోగం పోకుండా ఉండాలంటే ఏం చేయాలో ఆలోచించండి. వచ్చే 3 నెలల్లో మీకు అవసరమయ్యే ఏఐ టూల్స్ నేర్చుకోవాలనే లక్ష్యం పెట్టుకోండి' అని యువతకు సలహానిచ్చారు.

చేసే పనే మారుతుంది

ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ ఎడ్జ్‌వర్వ్ సీఈఓ సతీశ్ సీతారామయ్య మాట్లాడుతూ 'కంపెనీలకు మరింత ఉత్పాదకతను ఏఐ అందిస్తోంది. ఆ పనులను చూసుకోవాల్సిన బాధ్యత మనిషిదే. కాబట్టి ఉద్యోగాలు పోవు. అయితే 50% పైగా కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. మీ వృత్తిలో ఏ నైపుణ్యాలు అవసరమో గమనించండి'ని సంపర్క్ వ్యవస్థాపక ఛైర్మన్ వినీత్ నాయర్ అన్నారు. 'ఏఐతో 50% ఉద్యోగాలు ఎక్కడికీ పోవు. చేసే పనే మారుతుంద'న్నారు.

ఆసుపత్రుల్లో స్వయంచాలిత రోబో డెలివరీ సేవలు!



భారత్‌లో తయారైన రోబోటిక్స్, ఏఐ వల్ల ఆసుపత్రులు, పరిశ్రమ ప్రాంగణాలు, పట్టణాల్లో లాజిస్టిక్స్ సేవల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. పూర్తిస్థాయి అటానమస్ డెలివరీ వ్యవస్థను ఓటోనమ్ ఇంక్ ఇక్కడి సదస్సులో ఆవిష్కరించింది. లెవెల్-4 అటానమస్ డెలివరీ రోబోట్స్ అయిన 'ఓటోబాట్స్'తో ఆసుపత్రులు, ఫ్యాక్టరీల్లోని ఫ్లోర్లు, ఎలివేటర్లతో పాటు సైడ్ వాక్స్, సర్వీసు రోడ్ల వంటి సంక్లిష్ట ప్రాంతాల్లోనూ సేవలు అందించొచ్చు. అరైవ్‌ఏఐతో స్మార్ట్ స్టోరేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 'అరైవ్ పాయింట్స్'ను, స్కై ఎయిర్ మొబిలిటీ వద్ద డ్రోన్ సామర్థ్యాలను అందిపుచ్చుకుని ఈ డెలివరీ రోబోట్స్ రూపొందించినట్లు ఓటోనమీ తెలిపింది.

జియో ఏఐ పెవిలియన్‌ను సందర్శించిన మోదీ



మోదీతో ఆకాశ్ అంబానీ

ఇండియా ఇంపాక్ట్ సమిట్‌లో 'జియో ఇంటెలిజెన్స్ పెవిలియన్'ను ప్రధాని నరేంద్రమోదీ సందర్శించారు. జియో ఏఐ స్టాక్, జియో సంస్కృతి ఏఐ, జియో ఆరోగ్య ఏఐ, జియో శిక్ష, జియో ఏఐ హోమ్ తదితర ప్లాట్‌ఫారాల లైవ్ డెమోలను ప్రధాని వీక్షించారు. భారతీయ భాషలు, సంస్కృతి వంటి వాటిని ప్రోత్సహించడం, మరింత మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందజేత, విద్యా వ్యవస్థ బలోపేతం, స్మార్ట్ లివింగ్‌కు ఏఐ వినియోగం వంటి వాటికి ఈ ప్లాట్‌ఫారాలను రూపొందించారు. అయా రంగాల్లో డిజిటల్ మార్పులను వేగవంతం చేసేందుకు, జియో విస్తృత స్థాయి ఏఐ వ్యవస్థలు, వాటి పాత్ర గురించి ప్రధాని మోదీకి జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్ ఆకాశ్ అంబానీ వివరించారు.

టీసీఎస్‌తో ఏఎండీ భాగస్వామ్యం

చిప్ తయారీదారు ఏఎండీ, మనదేశంలోని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇరు కంపెనీలు కలిసి ఏఎండీకి చెందిన 'హీలియోస్' ప్లాట్‌ఫామ్‌పై ఒక ర్యాక్-స్కేల్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజైన్‌ను అభివృద్ధి చేస్తాయి. ఏఐ రెడీ డేటా సెంటర్ బ్లూప్రింట్‌ను సైతం సిద్ధం చేస్తాయి. తద్వారా ఎన్‌విడియా కార్యాలకు పోటీ ఏఎండీ సిద్ధమవుతోంది.

ఎయిరిండియా, కాగ్నిజెంట్‌కు ఆంథ్రోపిక్ సేవలు

వినియోగదారు సంబంధిత సాఫ్ట్‌వేర్ సృష్టించే నిత్యం తమ క్లాడ్ ఏఐ ఎయిరిండియా వినియోగిస్తోందని ఆంథ్రోపిక్ ప్రకటించింది. కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ కార్ప్ కోడ్ సిస్టమ్స్ తాము అందిస్తున్నట్లు తెలిపింది. 'ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఏఐని అందిపుచ్చుకోవడం చాలా వేగంగా జరుగుతోంద'ని ఆంథ్రోపిక్ సహ వ్యవస్థాపకుడు డారియో అమోడీ పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో ఆంథ్రోపిక్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

భారత కంపెనీలకు బ్లూమెషీన్స్ సేవలు: 'ఏఐ అనేది మానవ సామర్థ్యాన్ని మరింత పెంచుతుంద'ని బ్లూ మెషీన్స్ ఏఐ సీఈఓ క్రిషిక్ జైన్ అన్నారు. 'భారత్‌లో పలు పెద్ద కంపెనీలు మా సేవలను పొందుతున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఇతర అంతర్జాతీయ మార్కెట్ల నుంచీ ఆసక్తి కనిపిస్తోంద'న్నారు. ఐటీఎల్ ఏఐ-పర్సన్-హ్యూమన్ లైవ్ డిజిటల్ నిర్వహించడం ద్వారా, ఈ కంపెనీ దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ తనవైపునకు తిప్పుకుంది.

విదేశీ ప్రయాణికులకు ఎన్‌పీసీఐ వాలెట్ సేవలు: భారత్‌లో పర్యటించే అంతర్జాతీయ ప్రయాణికులు 'యూపీఐ ఒన్ వరల్డ్' పేరిట వాలెట్ సేవలను ఎన్‌పీసీఐ అందుబాటులోకి తీసుకురానుంది. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను ప్రారంభించింది. దీని ద్వారా విదేశీయులు భారత్‌లో రియల్ టైమ్ పర్సన్ టు మర్చంట్(పీ2ఎమ్) యూపీఐ చెల్లింపులు చేయగలుగుతారు.

ఈనాడు బిజినెస్

2035కు రూ.215 లక్షల కోట్ల రిటెయిల్ విపణి



మన దేశ భారత రిటెయిల్ రంగ విపణి పరిమాణం 2035 నాటికి రూ.210-215 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఓ నివేదిక తెలిపింది. 2025లో రూ.90- 95 లక్షల కోట్ల స్థాయితో పోలిస్తే, ఈ విలువ రెట్టింపు కంటే ఎక్కువ. దిగ్గజ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలను మించి భారత్ రాణిస్తుండటం, మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశలో సాగుతుండటం ఇందుకు కారణమవుతుందని ఆ నివేదిక వివరించింది. 'రిటెయిల్ లీడర్స్ సదస్సు 2026'లో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ), రిటెయిలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాయ్) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. మలివిడత వృద్ధి పథంలో భారత రిటెయిల్ రంగం ప్రయాణిస్తోందని నివేదిక తెలిపింది. క్రమశిక్షణతో వ్యూహాల అమలుపై దృష్టి సారించే కంపెనీలు విజయం సాధిస్తాయని, కృత్రిమ మేధ సాంకేతికతను అందిపుచ్చుకోవడమూ ముఖ్యమేనని పేర్కొంది. వినియోగదారులతో సత్సంబంధాలు, కార్యకలాపాల విధానాలు, నైపుణ్యం లాంటి విభాగాల్లో వ్యవస్థాగత మార్పులను ప్రాధాన్యమిచ్చే రిటెయిల్ సంస్థలు.. అత్యధిక మార్కెట్ వాటా సొంతం చేసుకోగలిగే స్థితిలో ఉంటాయని వివరించింది.

కొనుగోలు నిర్ణయాల్లోనూ ఏఐ ప్రభావం..: వినియోగదారు కొనుగోలు నిర్ణయాల దోరణిలో గణనీయ మార్పులు చోటు చేసుకుంటున్నాయని, కృత్రిమ మేధ లాంటి సాంకేతికతల వల్ల నిర్ణయాలపై ప్రభావం చూపించడం పెరిగిందని నివేదిక వివరించింది. ఈ నేపథ్యంలో రిటెయిల్ కంపెనీలు కూడా తమ కార్యకలాపాల విధానాల్లో మార్పులు చేపట్టేందుకు ఏఐని ఒక ఉత్ప్రేరకంగా ఉపయోగించుకోవాలని నివేదిక సూచించింది. ఏజెంటిక్ కామర్స్ కూడా ప్రయోగదశ నుంచి వాస్తవ రూపానికి మారిందని.. పరిశోధన, కొనుగోలు నిర్ణయాలపై జెన్‌ఏఐ ప్రభావం చూపించడం పెరిగిందని తెలిపింది.

2030కి స్థిరాస్తి రంగం రూ.88 లక్షల కోట్లకు

దిల్లీ: దేశీయ స్థిరాస్తి రంగం 2030 నాటికి రూ.88 లక్షల కోట్లకు చేరొచ్చని సలహా సంస్థ కేపీఎంజీ, స్థిరాస్తి సంస్థల సంఘం నారెడ్కో రూపొందించిన నివేదిక అంచనా వేసింది. 2025లో దేశీయ స్థిరాస్తి రంగం విలువ రూ.26.4 లక్షల కోట్లుగా ఉంది. అంటే 2030 కల్లా 3 రెట్లు పెరగొచ్చని నివేదిక పేర్కొంది. 2047 నాటికి ఈ రంగం మరింతగా దూసుకెళ్లి రూ.440.5- 616.7 లక్షల కోట్ల స్థాయికి చేరొచ్చని వివరించింది. ఈ రంగంలో ఉద్యోగాలు ప్రస్తుతం 7 కోట్లని అంచనా ఉండగా, 2030కి 10 కోట్లకు చేరతాయని తెలిపింది. నిర్మాణరంగం, విక్రయాలు, డిజైన్ సంబంధిత రంగాల్లో మొత్తం కలిపి ఈ అంచనాలు వెలువరించింది.

చలామణిలో రూ.40 లక్షల కోట్ల నగదు

యూపీలో ఏఐ హబ్ నిర్మాణం

ఈనాడు, హైదరాబాద్: గ్రీన్‌కో గ్రూపు వ్యవస్థాపకుల నేతృత్వంలోని ఏఎం గ్రూపు ఉత్తరప్రదేశ్‌లో 1 గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న కంప్యూట్ హబ్ పనులు ప్రారంభం కానున్నాయి. దావోస్‌లో జరిగిన సదస్సులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంతో చేసుకున్న అవగాహనా ఒప్పందం మేరకు సంస్థ ఈ ప్రాజెక్టును చేపడుతోంది. నిర్మాణానికి సంబంధించి, యమునా ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' లభించినట్లు ఏఎం గ్రూపు సోమవారం వెల్లడించింది. దీని ప్రకారం 1 గిగావాట్ సామర్థ్యం కలిగిన ఏఐ, అధిక సామర్థ్యం కంప్యూటింగ్ డేటా సెంటర్ ఏర్పాటులో భాగంగా తొలి, రెండో దశలకు (150, 200 మెగావాట్లు) అవసరమైన భూకేటాయింపులు జరగనున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ దాదాపు రూ.2.25 లక్షల కోట్ల (25 బిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టనుంది.

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవం కొనసాగుతున్నా, ప్రజల చేతుల్లో నగదు వినియోగమూ అదే స్థాయిలో పెరుగుతోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీల సంఖ్య-విలువ పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నా, 2026 జనవరి చివరికి చలామణిలో ఉన్న నగదు పరిమాణమూ జీవనకాల గరిష్ఠమైన రూ.40 లక్షల కోట్లకు చేరినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. అయితే అయిదేళ్ల వ్యవధిలో స్థూల దేశీయోత్పత్తితో పోలిస్తే, నగదు నిష్పత్తి 14.4% నుంచి 11 శాతానికి తగ్గడం, ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులను అద్దం పడుతోంది. ఈ నివేదిక ప్రకారం..

తెలుగు రాష్ట్రాల్లో అధికంగా రూ.100 నోట్ల వినియోగం: కర్ణాటక, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణ పెరుగుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో క్రమంగా తగ్గుతోంది. 2022-23లో ఏపీలో ఒక్కో ఏటీఎం నుంచి సగటున నెలకు రూ.1.57 కోట్లు విత్‌డ్రా అయ్యేవి. 2025-26 డిసెంబరుకు ఇది రూ.1.34 కోట్లకు తగ్గింది. అంటే డిజిటల్ లావాదేవీలు అధికమయ్యాయి. సాధారణంగా డిజిటల్ చెల్లింపులు పెరిగాక, తక్కువ విలువైన నోట్ల వినియోగం తగ్గుతుంది. కానీ, తెలంగాణ, ఏపీలో రూ.100 నోట్ల వినియోగం పెరుగుతోంది. తమిళనాడులో రూ.200 నోట్ల వినియోగం అధికంగా ఉంది.



నగదు లావాదేవీలు ఎందుకు పెరుగుతున్నాయి?

- ✦ కర్ణాటక వాణిజ్య పన్నుల శాఖ చిన్న వ్యాపారులు, విక్రేతలకు దాదాపు 18,000కు పైగా జీఎస్‌టీ నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామం వ్యాపారులను డిజిటల్ చెల్లింపుల నుంచి నగదు వైపు మళ్లేలా చేసింది.
- ✦ బంగారం, వెండి ధరలు విపరీతంగా పెరగడం.. మార్కెట్లో నగదు లభ్యత పెరగడానికి ఒక కారణం. గృహస్థులు తమ వద్ద ఉన్న పాత ఆభరణాలను విక్రయించి, నగదుగా మార్చుకుంటున్నారు.

రూ.500 నోట్లదే ఆధిపత్యం: 'యూపీఐ ప్రధానంగా చిన్న మొత్తాల నోట్లకు (రూ.100, రూ.200) ప్రత్యామ్నాయంగా మారింది. పెద్ద నోట్లకు (రూ.500) కాదు. రూ.500 కంటే తక్కువ విలువైన లావాదేవీలే యూపీఐలో 86% వాటా కలిగి ఉన్నాయి. అందుకే, మార్కెట్లో రూ.500 నోట్ల ఆధిపత్యం కొనసాగుతోంద'ని నివేదిక తెలిపింది.

టోకు ధరలూ పెరిగాయ్

దిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం వరుసగా మూడో నెలా పెరిగి, జనవరిలో 1.81 శాతంగా నమోదైంది. డిసెంబరులో ఇది 0.83%. ఆహార, ఆహారేతర ఉత్పత్తులు, తయారీ వస్తువులు ప్రియం కావడం ఇందుకు కారణం. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 1.55 శాతంగా నమోదైంది. కూరగాయల ద్రవ్యోల్బణ రేటు -3.50% నుంచి 6.78 శాతానికి పెరిగింది. తయారీ ఉత్పత్తుల ధరల్లో 2.86% పెరుగుదల ఉంది. ఇంధనం, విద్యుత్ విభాగంలో ప్రతిద్రవ్యోల్బణ స్థితే ఉంది.

కోడి గుడ్లు

17న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	520
వరంగల్	522
విజయవాడ	525
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593

వేణుగోపాల్ ధూత్ సహా 12 సంస్థలకు దిల్లీ న్యాయస్థానం నోటీసులు



దిల్లీ: మొజాంబిక్‌లోని కంపెనీ చమురు-గ్యాస్ ఆస్తులకు నిధులు సమకూర్చడంలో భాగంగా రూ.61,700 కోట్ల బ్యాంకు రుణ మోసానికి పాల్పడిన వీడియోకాన్ గ్రూప్ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్, ఆ గ్రూప్ అనుబంధ డజను సంస్థలకు దిల్లీ న్యాయస్థానం నోటీసులు జారీ చేసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం తెలిపింది. ఈ కేసులో దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్నాక, ఈ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. ఛార్జ్‌షీట్‌ను 2024 డిసెంబరు 18న దాఖలు చేయగా, రౌస్ అవెన్యూలో ఉన్న ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కోర్టు విచారణకు స్వీకరించిందని ఈడీ తెలిపింది. వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (వీఐఎల్), ఆ గ్రూప్ కంపెనీల ఖాతాలు 2018లో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు)గా మారాయి. స్టాండ్ బై లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎస్‌బీఎల్‌సీ) విషయంలో బ్యాంకులు రూ.23,647.12 కోట్ల ఎన్‌పీఏతో పాటు మొత్తం రూ.61,773.02 కోట్ల క్లెయిమ్ దాఖలు చేశాయని ఈడీ వివరించింది.

టొరెంట్ పవర్ చేతికి నభా పవర్

దిల్లీ: నభా పవర్‌లో 100% ఈక్విటీ వాటా కొనుగోలు చేసేందుకు ఎల్ అండ్ టీ పవర్ డెవలప్‌మెంట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు టొరెంట్ పవర్ సోమవారం వెల్లడించింది. ఈ లావాదేవీ ఎంటర్‌ప్రైజ్ విలువ రూ.6,889 కోట్లు. మౌలిక రంగ దిగ్గజం ఎల్ అండ్ టీ అనుబంధ సంస్థగా ఉన్న ఎల్ అండ్ టీ పవర్ డెవలప్‌మెంట్‌కు అనుబంధంగా నభా పవర్ లిమిటెడ్ పనిచేస్తోంది. నభా పవర్‌ను కొనుగోలు చేసేందుకు ఎల్ అండ్ టీ పవర్‌తో తప్పనిసరిగా అమలయ్యే ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని, ఈ లావాదేవీకి నియంత్రణ సంస్థలు, వాటాదార్ల అనుమతులు లభించాల్సి ఉందని టొరెంట్ పవర్ తెలిపింది. ఈ లావాదేవీ పూర్తయితే టొరెంట్ నిర్వహణ సామర్థ్యం 5 గిగావాట్ నుంచి 6.4 గిగావాట్‌కు చేరుతుంది.

నైసాలో బ్లాక్‌స్టోన్ రూ.5,400 కోట్ల పెట్టుబడులు

దేశంలో 20,000 జీపీయూల ఏర్పాటుకు సన్నాహాలు

దిల్లీ: దేశీయ కృత్రిమ మేధ సంస్థ నైసాలో 600 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,400 కోట్ల) పెట్టుబడులు పెట్టడానికి బ్లాక్ స్టోన్, సహ-పెట్టుబడి సంస్థలు డెఫినిటివ్ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. మరో 600 మి.డాలర్ల రుణాలను కూడా ఈ సంస్థలు అందించనున్నాయి. తద్వారా భారత అగ్రగామి ఏఐ మౌలిక సదుపాయాల ప్లాట్‌ఫామ్‌గా నిలిచేందుకు 1.2 బి.డాలర్ల (దాదాపు రూ.10,800 కోట్ల) మూలధనం లభించనున్నట్లు నైసా వెల్లడించింది. మన దేశంలో 20,000కు పైగా జీపీయూలను ఏర్పాటు చేయాలన్న నైసా ప్రణాళికలకు, తాజా నిధులు తోడ్పాటు అందించే అవకాశం ఉంది. తద్వారా మన దేశ ఏఐ మౌలిక సదుపాయాల సామర్థ్యాలు కూడా బలోపేతం కానున్నాయి.

జనవరిలో నిరుద్యోగిత 5%

దిల్లీ: దేశంలో నిరుద్యోగితా శాతం ఈ ఏడాది జనవరిలో స్వల్పంగా పెరిగి 5 శాతానికి చేరిందని ప్రభుత్వం తెలిపింది. 2025 డిసెంబరులో ఇది 4.8%. 15 ఏళ్లు, అంతకన్నా ఎక్కువ వయస్సుతో పనిచేసేందుకు అర్హత కలిగిన వారి వివరాలతో ఈ సర్వే నివేదిక రూపొందుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత 3.9% నుంచి 4.2 శాతానికి, పట్టణాల్లో 6.7% నుంచి 7 శాతానికి పెరిగింది. పురుషుల్లో మార్పు లేకున్నా, మహిళల్లో మాత్రం నిరుద్యోగిత పెరిగినట్లు సర్వే వివరించింది.

మన వ్యవసాయ రంగానికి రూ.36 లక్షల కోట్ల అవకాశాలు

అమెరికా, ఐరోపాలతో భారత్ ఒప్పందాల నేపథ్యం



దిల్లీ: అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ)తో కుదిరిన వాణిజ్య ఒప్పందాల కారణంగా, భారత వ్యవసాయ రంగానికి 400 బి. డాలర్ల (దాదాపు రూ.36 లక్షల కోట్ల) అవకాశాలు లభించగలవని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాకు భారత వ్యవసాయ ఎగుమతులు 2.8 బి. డాలర్లుగా ఉండగా, దిగుమతులు 1.5 బి. డాలర్ల మేర ఉన్నాయి. వివిధ దేశాల నుంచి మనదేశానికి వస్తున్న వ్యవసాయ దిగుబడుల విలువ 35 బి. డాలర్లు (సుమారు రూ.3.15 లక్షల కోట్లు)గా ఉండగా, ఇక్కడి నుంచి వెళ్లే ఎగుమతులు విలువ 51-52 బి. డాలర్ల (సుమారు రూ.4.59-4.68 లక్షల కోట్లు) ఉన్నాయి. 'అమెరికా, ఐరోపా ఒప్పందాలతో ఇంతకు కొన్ని రెట్లు అధికంగా 400 బి. డాలర్ల మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. మన వ్యవసాయ రంగానికి ఇది ఒక గొప్ప అవకాశమ'ని పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన రైతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, ఆయన ఇలా వ్యాఖ్యానించారు. ఏ దేశంతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంలోనూ డెయిరీ, పౌల్ట్రీ, తృణధాన్యాలకు సుంకం మినహాయింపులను మనదేశం ఇవ్వడం లేదన్నారు.

మధ్యంతర ఒప్పందంలో డిజిటల్ వాణిజ్య అంశం లేదు: అమెరికాతో కుదుర్చుకున్న మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో, డిజిటల్ వాణిజ్యం అంశం లేదని, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)లో ఇది భాగంగా ఉంటుందని మరో అధికారి తెలిపారు. విదేశీ ఇ-కామర్స్ సరఫరాలపై 2% సుంకాన్ని గతేడాది మనదేశం ఉపసంహరించిన సంగతి తెలిసిందే.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ నుంచి మరిన్ని మోడళ్లు

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఈ ఏడాది 4 కొత్త మోడళ్లను ఆవిష్కరించాలని యోచిస్తోంది. వాటిలో ప్లగ్-ఇన్ హైబ్రిడ్ ఎస్‌యూవీ కూడా ఉంది. వీటి ద్వారా తదుపరి దశ వృద్ధిని సాధించడానికి అయిదేళ్ల ప్రణాళికను సంస్థ రూపొందించింది. కొత్త మోడళ్లను తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉత్పత్తి పెంచడానికి వీలుగా రూ.5,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గుజరాత్‌లోని హాలోల్ ప్లాంటులో కంపెనీ వార్షికంగా 1.2 లక్షల కార్లను ఉత్పత్తి చేస్తోందన్నారు. 2024లో చైనాకు చెందిన ఎస్ఏఐసీ, దేశీయ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ సంయుక్తంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియాను ప్రకటించాయి. ప్రతి 3-6 నెలలకు ఒక కొత్త కారు తీసుకొస్తామని ప్రకటించాయి. ఈ ఏడాది 4 కొత్త మోడళ్లను తీసుకొస్తామని, ఇందులో మెజెస్టార్‌ను ఏప్రిల్-మేలో విపణిలోకి విడుదల చేస్తామన్నారు. ఇది టయోటా ఫార్చునర్‌తో పోటీ పడే అవకాశం ఉంది. మరో మూడు మోడళ్లలో కొత్త ఇంధన వాహనాలుంటాయని, వీటిలో ఒకటి ప్లగ్-ఇన్ హైబ్రిడ్ ఉంటుందని మెహ్రోత్రా వివరించారు.

3 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

దిల్లీ: జనవరిలో మన దేశ ఎగుమతులు 0.61% పెరిగి 36.56 బిలియన్ డాలర్ల (రూ.3.30 లక్షల కోట్ల)కు చేరాయి. దిగుమతులు కూడా 19.2% అధికమై 71.24 బి.డాలర్లు (రూ.6.4 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. ఫలితంగా దేశ వాణిజ్య లోటు (దిగుమతులు, ఎగుమతుల మధ్య అంతరం) 3 నెలల గరిష్ఠమైన 34.68 బి.డాలర్లకు చేరిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. పసిడి, వెండి అధిక ధరల కారణంగా, దిగుమతుల బిల్లు 3 నెలల గరిష్ఠానికి చేరింది. గత నెలలో పసిడి దిగుమతులు 349.22% దూసుకెళ్లి 12 బి.డాలర్లు, వెండి దిగుమతులు 127% వృద్ధి చెంది 2 బి.డాలర్లుగా నమోదయ్యాయి. చమురు దిగుమతులు 0.24% తగ్గి 13.4 బి.డాలర్లకు పరిమితమయ్యాయి.

అమెరికాకు తగ్గిన ఎగుమతులు: జనవరిలో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతులు 21.77% క్షీణించి 6.6 బి.డాలర్లకు చేరాయి. అధిక టారిఫ్‌లు ప్రతికూల ప్రభావం చూపాయని వాణిజ్య శాఖ తెలిపాయి. అయితే అమెరికా నుంచి దిగుమతులు 23.71% పెరిగి 4.5 బి.డాలర్లుగా ఉన్నాయి.

రూ.2,000 కోట్ల బాండ్ల జారీ: ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ నిధుల సమీకరణ కోసం రూ.2,000 కోట్ల ఎన్‌సీడీలు (మార్పిడి రహిత డిబెంచర్లు) జారీ చేయనుంది. ఇష్యూలో భాగంగా రూ.500 కోట్లు సమీకరించనుంది. అధిక స్పందన లభిస్తే మరో రూ.1,500 కోట్లూ (గ్రీన్ షూ ఆప్షన్) స్వీకరించనుంది. మదుపరులు 24, 36, 60 నెలల కాలపరిమితితో పెట్టుబడి పెట్టాలి. గరిష్ఠ వార్షిక వడ్డీ 9%. ఈ బాండ్లకు క్రిసిల్ ఏఏ/స్టేబుల్, బ్రిక్‌వర్క్ ఏఏ+/స్టేబుల్ రేటింగులు లభించాయని సంస్థ పేర్కొంది.

మఫత్‌లాల్ మెడ్‌ఫిట్స్‌కు శ్రీకారం

దిల్లీ: డైరెక్ట్ టూ కన్జ్యూమర్ (డీ2సీ) విభాగంలోకి అడుగుపెడుతున్నట్లు అరవింద్ మఫత్‌లాల్ గ్రూప్ ప్రధాన సంస్థ మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ ప్రకటించింది. ఔషధ దుస్తుల కోసం ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'మఫత్‌లాల్ మెడ్‌ఫిట్స్'ను సంస్థ ప్రారంభించింది. వైద్య నిపుణులు వినియోగించే స్క్రబ్స్, ల్యాబ్ కోట్స్, మెడికల్ క్యాప్స్, అనుబంధ ఉత్పత్తులు సహా ఔషధ దుస్తులు ఈ ప్లాట్‌ఫామ్‌పై లభిస్తాయని కంపెనీ తెలిపింది. ఆరోగ్య సంరక్షణ, టెక్నికల్ దుస్తుల విస్తరణలో మఫత్‌లాల్ మెడ్‌ఫిట్స్ ప్రారంభం కీలక అడుగని మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ సీఈఓ రఘునాథ్ మన్నిల్ బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌లో ఉత్పత్తులు రూ.549- 1999 శ్రేణిలో లభిస్తాయని కంపెనీ వెల్లడించింది.

రాణించిన బ్యాంకింగ్, విద్యుత్ షేర్లు



రూ.3 లక్షల కోట్లు పెరిగిన సంపద

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.972.13 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.1666.98 కోట్లు

సెన్సెక్స్ ▲ 650 **83277**
నిఫ్టీ ▲ 212 **25683**

విద్యుత్, బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్ల రాణింపుతో సోమవారం స్టాక్ మార్కెట్ లాభాల్లో ముగిసింది. అమెరికా- ఇరాన్ చర్చల ప్రభావంతో, అంతర్జాతీయంగా చమురు ధరలు సానుకూలంగా కదలాడటం మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 8 పైసలు తగ్గి 90.74 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.35% లాభంతో 67.99 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, జపాన్ సూచీలు నష్టపోగా.. మిగతా దేశాలవి లాభాల్లో ముగిశాయి.

✦ బీఎస్ఈలోని మదుపర్ల సంపద రూ.3.12 లక్షల కోట్లు పెరిగి రూ.468.58 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

నష్టాల్లో మొదలైనా..: బీఎస్ఈ సెన్సెక్స్ స్వల్ప నష్టాల్లో 82,480.40 పాయింట్ల (క్రితం ముగింపు 82,626.76) వద్ద ఆరంభమైంది. ఆ వెంటనే లాభాల్లోకి వచ్చిన సూచీ... క్రమక్రమంగా పెంచుకుంటూ వెళ్లింది. ఒకానొక దశలో 83,333.49 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 650.39 పాయింట్లు పెరిగి 83,277.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 211.65 పాయింట్లు పెరిగి 25,682.75 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,372.70 వద్ద కనిష్ఠాన్ని; 25,697 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

9 మినహా మిగతావి లాభాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల్లో 9 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. పవర్‌గ్రిడ్ 4.45%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.19%, యాక్సిస్ బ్యాంక్ 1.83%, ఎన్‌టీపీసీ 1.69%, అదానీ పోర్ట్స్ 1.45%, ఐటీసీ 1.39%, ఏషియన్ పెయింట్స్ 1.38%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.35% లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 1.44%, మారుతీ సుజుకీ 1.17%, బజాజ్ ఫైనాన్స్ 1.10% నష్టపోయాయి.

✦ **హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్** (హెచ్‌యూఎల్) నుంచి విభజించిన క్వాలిటీ వాల్స్ ఇండియా లిమిటెడ్ షేర్లు సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యాయి. వ్యాపార విభజన ఆధారంగా.. క్వాలిటీ షేర్లకు నిర్ధరించిన ధర (ఇండికేటివ్ ప్రైస్) రూ.38.15తో పోలిస్తే, 21.6% తక్కువగా రూ.29.90 వద్ద బీఎస్ఈలో క్వాలిటీ వాల్స్ షేర్ల ట్రేడింగ్ ఆరంభమై, రూ.29.51 వద్ద ముగిశాయి. ప్రారంభ ధరతో పోలిస్తే షేరుకు 1.30% నష్టం వచ్చింది.

✦ జెన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ **యూనిస్ట్రింగ్ టెక్ సొల్యూషన్స్..** అధునాతన ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ రూపకల్పన, అభివృద్ధి కోసం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) నుంచి రూ.30.01 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకుంది.

✦ **పీఎన్‌జీఎస్ రెవా డైమండ్ జ్యూవెలరీ** ఐపీఓ ఈనెల 24న మొదలై 26న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.367- 386. ఐపీఓ ద్వారా రూ.384 కోట్లు సమీకరించాలని కంపెనీ అనుకుంటోంది.

✦ ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,500 కోట్లు సమీకరించినట్లు **మోతీలాల్ ఓశ్వాల్ ఆల్టర్నేట్స్** తెలిపింది. వివిధ కంపెనీల వృద్ధి అవసరాల కోసం మూలధనంగా ఈ నిధిని వినియోగించనుంది.

ఫ్రాక్టల్ పేలవం.. ఆయ్ స్తబ్దుగా

✦ **ఫ్రాక్టల్ అనలిటిక్స్** షేర్లు స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన తొలి రోజే పేలవ ప్రదర్శన కనబర్చాయి. ఇష్యూ ధర రూ.900 వద్దే, బీఎస్ఈలో ఈ షేరు ట్రేడింగ్ ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుని, ఒక దశలో రూ.832.10కు దిగివచ్చింది. చివరకు 5.84% నష్టంతో 847.40 వద్ద ముగిసింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.14,572.32 కోట్లుగా నమోదైంది.

✦ **ఆయ్ ఫైనాన్స్** షేర్లు తొలి రోజున స్తబ్దుగా ముగిశాయి. ఇష్యూ ధర రూ.129 వద్దే బీఎస్ఈలో షేర్ల ట్రేడింగ్ ఆరంభమైంది. ఆ తర్వాత నష్టాల్లోకి వచ్చి రూ.120.60కు పడిపోయాయి. అనంతరం పుంజుకున్నా, రూ.128.90 వద్ద ముగిశాయి. మొదటి రోజు మార్కెట్ విలువ రూ.3,181.05 కోట్లుగా నమోదైంది.

దిల్లీ సమిట్‌తో ఏఐ ప్రయోజనాల విశ్వరూపం

- బ్రిటన్ ఉప ప్రధాని వ్యాఖ్య

లండన్: దిల్లీలో ప్రారంభమైన ఏఐ సమిట్‌తో శీఘ్రాభివృద్ధి, కొత్త ఉద్యోగావకాశాలు, ప్రజా సేవల మెరుగుదల, ప్రజలకు ప్రయోజనాలను అందించడంలో ప్రపంచ వ్యాప్తంగా ఏఐ విశ్వరూపం చూపించనుందని బ్రిటన్ ఉప ప్రధాని డేవిడ్ లామీ, ఏఐ మంత్రి కనిష్క నారాయణ్ తెలిపారు. ప్రపంచంలోని ప్రతి మూలలో ప్రజల జీవితాన్ని ఎలా ప్రభావితం చేయనుందో ఈ సదస్సు ద్వారా చెప్పాలనుకుంటున్నామని వివరించారు. వారిద్దరి నేతృత్వంలో బ్రిటన్ బృందం ఏఐ సదస్సులో పాల్గొనేందుకు దిల్లీకి వచ్చింది. 'జబ్బును త్వరగా గుర్తించేలా డాక్టర్లకు, వ్యక్తిగత బోధనా పద్ధతులపై టీచర్లకు, సేవలందించడంలో కౌన్సెలర్లకు నిమిషాల్లో ఏఐ సాయం చేస్తోంది. తదుపరి తరం ఉద్యోగాల కల్పనకు వ్యాపారాలను అభివృద్ధి చేయనుంది' అని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

టీచర్లను ఏఐ భర్తీ చేయలేదు: జితిన్ ప్రసాద

ఏఐ టూల్స్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, తప్పుడు సమాచారం కారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే అవకాశం ఉందని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీశాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, టీచర్ల అభ్యసన సామర్థ్యాన్ని ఏఐ గణనీయంగా పెంచే అవకాశముందని, అయితే దానిని షార్ట్‌కట్‌గా ఉపయోగించుకుని అధికంగా దానిపైనే ఆధారపడితే ఆలోచనా సామర్థ్యం, ఆసక్తి తగ్గుతాయని స్పష్టం చేశారు. ఏఐ ఎప్పటికీ టీచర్ల స్థానాన్ని భర్తీ చేయలేదని పేర్కొన్నారు. సోమవారం దిల్లీలో ఏఐ సమిట్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'భారత్‌లో ప్రతి సంవత్సరం ఎక్కడో ఒక చోట ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. తప్పుడు మార్గంలో ప్రజల మనసులను మార్చే శక్తి ఏఐకి ఉంటుంది. ఒకసారి తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లి.. వారు ఒక నిర్ణయం తీసుకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది' అని జితిన్ ప్రసాద పేర్కొన్నారు.



దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో రోబోను పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

ఏఐ కోడ్ రాస్తుంటే.. మరి ఇంజినీర్ల పనేంటి?

- ఆంథ్రోపిక్ ఏమందంటే..

ఇంటర్నెట్ డెస్క్: కృత్రిమ మేధ యుగంలో కొద్ది రోజులుగా ఆంథ్రోపిక్ పేరు ట్రెండింగ్‌లో ఉంది. ఈ ఏఐ స్టార్టప్ నుంచి వచ్చిన క్లాడ్ ప్లగిన్‌లు టెక్ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. తమ ఏఐ మోడల్స్ 100శాతం కోడ్‌ను రాస్తున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. మరి ఇలాంటప్పుడు ఇంజినీర్ల పనేంటి.. అని ఓ నెటిజన్ వేసిన ప్రశ్నకు ఆంథ్రోపిక్‌కు చెందిన కోడింగ్ అసిస్టెంట్ క్లాడ్ కోడ్ చీఫ్ బోరిస్ చెర్నీ సమాధానం ఇచ్చారు. 'కోడింగ్ అనేది ఉద్యోగంలో ఒక భాగమే. ఏఐ వ్యవస్థలకు సరైన ప్రాంప్ట్‌లు ఇవ్వడం, ఇతర బృందాలను సమన్వయం చేసుకోవడం, కస్టమర్లతో అనుసంధానం కావడం, తర్వాత ఎలాంటి ఫీచర్‌ను తీసుకురావాలి.. అనే అంశాలపై పరిశోధన చేయడం వంటి పనులు ఇంజినీర్లకు ఉన్నాయి. అయితే ఇంజినీరింగ్ అనేది మారుతోంది. ఆ మార్పులకు అనుగుణంగా ఉండే ఇంజినీర్లు మాకు కావాలి' అని చెర్నీ వివరించారు. ఏఐ టూల్స్ కోడింగ్, డాక్యుమెంటేషన్ వంటి పనులు చేసినప్పటికీ.. ఇంజినీర్లు సమీక్షించి, ధ్రువీకరిస్తారని చెప్పారు. సిస్టమ్ డిజైన్, దీర్ఘకాలిక ప్రణాళికలో వారి అవసరం ఉందని వివరించారు.



మోదీతో భారత గ్రాండ్ ముఫ్తీ భేటీ

దిల్లీ: భారత అత్యున్నత ముఫ్తీ (గ్రాండ్ ముఫ్తీ ఆఫ్ ఇండియా) షేక్ అబూబకర్ అహ్మద్ సోమవారం ఇక్కడ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిశారు. ఇరువురూ అనేక అంశాలపై చర్చించుకున్నారు. అబూబకర్ అహ్మద్‌తో సంభాషణ ఆసక్తికరంగా సాగిందని, పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నామని మోదీ పేర్కొన్నారు. సంబంధిత ఛాయాచిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. పదో గ్రాండ్ ముఫ్తీ అయిన షేక్ అబూబకర్ అహ్మద్ కేరళకు చెందిన సున్నీ ముస్లిం ప్రముఖుడు. ఆయన ఆలిండియా సున్నీ జమియాతుల్ ఉలమా సంస్థకు నేతృత్వం వహిస్తున్నారు.

నదుల్లో ప్రవాహతీరుపై ఏఐతో కచ్చితమైన అంచనాలు

- దిల్లీ ఐఐటీ పరిశోధకుల ఘనత

దిల్లీ: సంప్రదాయ నమూనాలకు కృత్రిమ మేధ (ఏఐ)ను జోడించడం ద్వారా భారత నదుల్లో నీటి ప్రవాహ తీరుపై దిల్లీలోని ఐఐటీ పరిశోధకులు అత్యంత కచ్చితత్వంతో లెక్కలు కట్టారు. దేశంలోని 208 నదులు, ఉపనదులకు సంబంధించిన అంచనాలను ఇది గణనీయంగా మెరుగుపరిచినట్లు వారు వివరించారు. జలవనరుల నిర్వహణతో ముడిపడిన సాగునీటి విడుదల షెడ్యూల్, వరద ముప్పు నివారణ, రిజర్వాయర్ కార్యకలాపాల ప్రణాళిక వంటివాటికి నీటి ప్రవాహ సంబంధ సమాచారం చాలా కీలకం. భారీ స్థాయి హైడ్రాలాజికల్ నమూనాల్లో కొన్నిసార్లు స్థానిక సమాచారానికి సంబంధించి గణనీయ స్థాయిలో అనిశ్చితి ఉంటోంది. బేసిన్ స్థాయి విశ్లేషణ జరిగితే తప్పించి ఈ పరిస్థితికి ఆస్కారం ఎక్కువగా ఉంటోందని పరిశోధకులు తెలిపారు. అయితే ఈ తరహా విశ్లేషణ ఖరీదైనది, భారీ డేటా సెట్లో ఇది చాలా సమయాన్ని కూడా కూడుకున్న వ్యవహారం. ఏఐ ఆధారిత నమూనా ద్వారా ఐఐటీ పరిశోధకులు దీన్ని అధిగమించారు. ఇందుకోసం 220 నదీ గేజ్ స్టేషన్ల వద్ద గత రెండు దశాబ్దాల్లో సేకరించిన నీటిప్రవాహ డేటాతో ఈ మోడల్‌కు తర్ఫీదు ఇచ్చారు.

భార్య, కుమారుడిని హతమార్చి విశ్రాంత జవాను ఆత్మహత్య

కాన్పుర్: ఆర్మీ విశ్రాంత జవాను ఒకరు తన భార్య, కుమారుడిని కాల్చి చంపి.. అనంతరం రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుల్సియాపుర్‌లోని నాయ్ బస్తీ ప్రాంతంలో నివాసముంటున్న చేత్రామ్ పాస్వాన్(51) సైన్యం నుంచి రిటైర్ అయ్యాక ఓ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించేవారు. ఆదివారం రాత్రి ఆయనకు భార్య సునీత వర్మ(40)తో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఆమెను తుపాకీతో కాల్చిచంపాడు. పేలుడు శబ్దం విన్న కుమారుడు దీప్(16) వచ్చి చూడగా అతనిపై కూడా పాస్వాన్ కాల్పుల జరపడంతో మృతిచెందాడు. అనంతరం ఆయన సమీపంలోని రైలు పట్టాల వద్దకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దేశంలోనే తొలి హైడ్రోజన్ వ్యవసాయ డ్రోన్

ఈటీవీ భారత్: దేశంలోనే తొలి హైడ్రోజన్ ఆధారిత వ్యవసాయ డ్రోన్‌ను హరియాణాకు చెందిన అంకుర సంస్థ వావ్ గో గ్రీన్ అభివృద్ధి చేసింది. హిసార్‌లో నిర్వహించిన కృషి దర్శన్ ఎక్స్‌పోలో దీన్ని ప్రదర్శించారు. ఈ హైడ్రోజన్ డ్రోన్‌లో మూడు కిలోల ఇంధనం నింపితే ఏకధాటిగా 3 గంటల పాటు గాలిలో ఉండి పురుగుమందుల పిచికారీ చేయడంతో పాటు ఎరువులను చల్లుతుందని, 50 కిలోల వరకు బరువును మోయగలదని ఆ సంస్థ చెబుతోంది. దీనివల్ల రైతులకు పదేపదే బ్యాటరీ ఛార్జింగ్ చేయాల్సిన తిప్పలు తప్పుతాయని వెల్లడించింది. రైతులకు కలిగే ఆరోగ్య పరమైన ముప్పులను కూడా ఈ డ్రోన్ నివారిస్తుందని, ఎటువంటి కాలుష్య కారకాలను విడుదల చేయదని సంస్థ ప్రతినిధి కునాల్ ప్రతాప్ సింగ్ తెలిపారు. బ్యాటరీతో నడిచే డ్రోన్ల కోసం ఒక ఎకరాకు 200 నుంచి 250 లీటర్ల నీటిని వినియోగించాల్సి ఉంటుందని, కానీ తమ హైడ్రోజన్ డ్రోన్‌కు ఎకరానికి 10 లీటర్ల నీరు చాలని ఆయన అన్నారు. మల్టీ స్పెక్ట్రల్ సెన్సర్లతో కూడిన ఈ డ్రోన్ చీడపీడలు, వ్యాధులు, పంట ఆరోగ్యం, పోషకాహార లోపాలను సకాలంలో గుర్తించగలదని వెల్లడించారు. ఈ డ్రోన్ ధర జీఎస్టీని మినహాయించి రూ.15 లక్షలు అని తెలిపారు.

రాహుల్‌పై కాంగ్రెస్‌లోనే విశ్వాసం లేదు

- ఆయనో విఫల వారసుడు: భాజపా
- కూటమిలోనూ నమ్మకం లేదన్న రిజిజు

తవాంగ్, దిల్లీ: లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీపై కాంగ్రెస్ పార్టీలోనే విశ్వాసం లేదని, ఆయనో విఫల వారసుడని భాజపా ఎద్దేవా చేసింది. పార్లమెంటు సజావుగా నడవాలనే ఆసక్తి రాహుల్‌కు లేదని, పార్టీకి మంచిరోజులు వస్తాయని కొన్ని ఎన్నికల్లో వేచి చెప్పడంతో ఆయన లోక్‌సభను స్తంభింపచేస్తున్నారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఆ పార్టీకి మంచిరోజులు వచ్చే అవకాశం లేదని, తదుపరి ఎన్నికల్లో వారి సంఖ్య ఇంకా తగ్గిపోతుందని చెప్పారు. సోమవారం అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్‌లో ఆయన పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడారు. పార్లమెంటులో ప్రతిష్టంభనను తొలగించడానికి ఇప్పటికే అన్ని ప్రయత్నాలు చేశామని, కాంగ్రెస్‌ను బుజ్జగించడానికి ఇక ఎలాంటి అడుగులు వేసేది లేదని స్పష్టంచేశారు. సభ నడవడం కంటే ఏదో ఒక వివాదం రేకెత్తించడంపైనే రాహుల్‌కు ఆసక్తి ఉంటుందన్నారు. వరుస ఓటములతో కాంగ్రెస్‌లో నైరాశ్యం నెలకొందని చెప్పారు.

ఎవరూ సీరియస్‌గా తీసుకోవట్లేదు:

రాహుల్‌పై కాంగ్రెస్ నేతల్లో గానీ, విపక్ష కూటమిలోగానీ ఏమాత్రం నమ్మకం లేదని భాజపా జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా 'ఎక్స్'లో విమర్శించారు. 'తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌ను తప్పించి, మమతను తీసుకురమ్మంటున్నారు. అస్సాం కాంగ్రెస్ మాజీ నేత భూపేన్ బోరా ఆ పార్టీని వీడారు. కేరళలో కాంగ్రెస్ ఓడిపోతుందని, విజయన్ గెలుస్తారని మణిశంకర్ అయ్యర్ చెబుతున్నారు. రాహుల్‌ను ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదని చెప్పడానికి ఇంతకన్నా ఏ తార్కాణాలు కావాలి' అని ప్రశ్నించారు. ప్రజల్లోనూ, పార్టీలోనూ ఆయనకు ఆదరణ కొరవడిందన్నారు.



దేశ సరిహద్దు గురించి రాహుల్‌కు ఏమీ తెలియదు

ఇంటర్నెట్ డెస్క్: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సోమవారం భారత్-చైనా సరిహద్దుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీపై విమర్శలు చేశారు. ఆయనకు సరిహద్దు గురించి ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు. 2020లో గల్వాన్ లోయలో చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించిన విషయాలను ప్రస్తావిస్తూ భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకాన్ని ఇటీవల రాహుల్‌గాంధీ లోక్‌సభకు తీసుకురావడం, అందులోని కొన్ని అంశాలను ప్రస్తావించడం తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చైనా సరిహద్దు దగ్గర్లో ఉన్న తన నియోజకవర్గం అరుణాచల్ వెస్ట్ (అరుణాచల్‌ప్రదేశ్)లో రిజిజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ.. 'ప్రచురితం కాని పుస్తకం గురించి మనం మాట్లాడకూడదు. జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలను రాజకీయం చేయకూడదు. ఆయనకు(రాహుల్) సరిహద్దు గురించి ఏమీ తెలియదు. అందుకే అలాంటి ప్రకటనలు చేస్తుంటారు. సరిహద్దు గురించి ఆయన కొంచెం నేర్చుకోవాలి' అని రిజిజు వ్యాఖ్యానించారు.

అస్సాం కాంగ్రెస్‌లో భూపేశ్ బోరా రాజీనామా లేఖ ప్రకంపనలు

- ఉపసంహరించుకున్నారన్న హస్తం పార్టీ
- పునఃపరిశీలనకు సమయం కోరానని మాత్రమే చెప్పిన బోరా

గువాహటి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అస్సాం కాంగ్రెస్‌లో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపేశ్ కుమార్ బోరా పార్టీకి సోమవారం రాజీనామా చేసి తొలుత ప్రకంపనలు సృష్టించారు. అనంతరం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుంటానని ప్రకటించారు. అయితే బోరా తన రాజీనామాను ఉపసంహరించుకున్నారని కాంగ్రెస్ పేర్కొంది. 32 ఏళ్లుగా కాంగ్రెస్ కోసం పనిచేస్తున్న తనను పార్టీ నాయకత్వం విస్మరిస్తోందని. . రాష్ట్ర యూనిట్‌లో తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు బోరా తొలుత రాజీనామా లేఖ పంపారు. దీంతో పార్టీ అధిష్ఠానం రంగంలోకి దిగింది. ఖర్గే, పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ తదితర కీలక నేతల జోక్యంతో బోరా తన రాజీనామాను ఉపసంహరించుకున్నారని ఏఐసీసీ అస్సాం ఇంఛార్జి జితేంద్ర సింగ్ తెలిపారు. ఆయనతో రాహుల్ 15 నిమిషాలు మాట్లాడారని చెప్పారు. అయితే ఉపసంహరణపై బోరా స్పష్టమైన ప్రకటన చేయలేదు. రాజీనామా నిర్ణయాన్ని పునఃపరిశీలించుకునేందుకు హైకమాండ్‌ను తాను మంగళవారం ఉదయం వరకు సమయం కోరినట్లు మాత్రమే పేర్కొన్నారు.

భాజపా తలుపులు తెరిచే ఉంటాయి: హిమంత

బోరా కోసం భాజపా తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, తమ పార్టీలో చేరితే బలమైన స్థానం నుంచి ఎన్నుకుంటామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ప్రకటించారు. మంగళవారం బోరాతో భేటీ అవుతానని కూడా హిమంత చెప్పడం గమనార్హం. ✦ మరోవైపు- మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అబ్దుర్ రషీద్ మండల్ కాంగ్రెస్‌కు రాజీనామా చేసి.. అఖిల్ గొగొయ్ నేతృత్వంలోని రాయిజోర్ దళ్ పార్టీలో చేరారు.

కిమ్ కుమార్తెకు వారసత్వ పగ్గాలు!

- అత్తాకోడళ్ల నడుమ ఆధిపత్య పోరు

సియోల్: నిరంకుశ పాలనకు చిరునామాగా నిలిచే ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ రాజ్యంలో కుటుంబ పోరుకు తెరలేచిందా? అధికార పగ్గాల కోసం కిమ్ సోదరి, కుమార్తె పోటీ పడనున్నారా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఇలాంటి ప్రశ్నలే ఎదురవుతున్నాయి. కిమ్ తన రాజకీయ వారసురాలిగా కుమార్తె కిమ్ జు యేను ప్రకటించే అవకాశాలున్నట్లు దక్షిణ కొరియా నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎన్ఐఎస్) ఇటీవల వెల్లడించింది. అయితే కుమార్తెకు పగ్గాలు అప్పగిస్తే కిమ్‌కు సోదరి నుంచి సవాలు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలకు పార్టీపరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. 2022లో తొలిసారిగా కిమ్ జు యే ప్రపంచానికి కనిపించింది. ఆ తర్వాత ఆయుధ పరీక్షల నుంచి సైనిక కవాతుల వరకు పలు అధికారిక, కీలక కార్యక్రమాల్లో తండ్రి వెంట హాజరైంది. వాస్తవానికి ఉత్తర కొరియా పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమెకు వారసత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువనే అభిప్రాయాలున్నాయి.



కిమ్‌తో కుమార్తె జు యే, కిమ్ సోదరి యో జోంగ్

కానీ, గతేడాది సెప్టెంబరులో తండ్రితో కలిసి బీజింగ్ పర్యటనకు వెళ్లడంతో ప్రపంచం దృష్టి ఆమెపై పడింది. ఆమే కిమ్ రాజకీయ వారసురాలు అనే అంచనాలకు నాటినుంచే బలం చేకూరింది.

శక్తిమంతమైన నాయకురాలు..

వారసత్వ పగ్గాల బదిలీ విషయంలో కిమ్‌కు తన సోదరి కిమ్ యో జోంగ్ నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 38 ఏళ్ల యో జోంగ్ ప్రస్తుతం దేశంలోనే రెండో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా పేరొందారు. కొరియా వర్కర్స్ పార్టీ సెంట్రల్ కమిటీలో సీనియర్ హోదాలో కొనసాగుతున్న ఆమెకు రాజకీయ, సైనిక మద్దతు ఉంది.

ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల పేరుతో మోసాలు

ఇంటర్నెట్ డెస్క్: జాతీయ రహదారులపై టోల్ భారాన్ని తగ్గించే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌ల పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త మోసాలకు తెర తీశారు. వార్షిక పాస్‌ల పేరిట నకిలీ వెబ్‌సైట్‌లను తెరిచి వాహనదారులను బోల్తా కొట్టిస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సూచించింది. కేవలం అధికారిక వెబ్‌సైట్‌లోనే కొనుగోలు చేయాలంటూ ఓ అడ్వైజరీ జారీ చేసింది. 'వార్షిక పాస్‌ల గురించి శోధించినప్పుడు సెర్చ్ ఇంజిన్‌లో టాప్ లిస్ట్‌లో నకిలీ వెబ్‌సైట్‌లు కనిపిస్తున్నాయి. యూజర్ వీటిని క్లిక్ చేయగానే ఫోన్ నంబరు, వాహన రిజిస్ట్రేషన్ నంబరు వంటి వ్యక్తిగత వివరాలను అడుగుతున్నాయి. పేమెంట్ గేట్‌వే ద్వారా ఆ సొమ్ము అక్రమంగా మోసగాళ్ల ఖాతాలోకి చేరుతోంది. వీటిని నిరోధించాలంటే ఫాస్టాగ్ పాస్‌ల కోసం కేవలం అధికారిక ప్లాట్‌ఫామ్‌లనే వినియోగించాలి' అని ఎన్‌హెచ్ఏఐ సూచించింది.


గ్రహాంతర జీవులు సంప్రదింపులు జరిపినట్లు ఆధారాల్లేవు: ఒబామా

వాషింగ్టన్: గ్రహాంతర జీవులున్నాయంటూ ఓ పాడ్‌కాస్ట్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఇన్‌స్టాగ్రాం వేదికగా ఒబామా తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. విశ్వం చాలా పెద్దదని, భూమిపైనే కాక ఇతర చోట్లా జీవం ఉండే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అయితే సౌర వ్యవస్థల మధ్య దూరం చాలా ఎక్కువని, అందువల్ల గ్రహాంతర జీవులను చూసే అవకాశాలు తక్కువని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో గ్రహాంతర వాసులు సంప్రదింపులు జరిపినట్లు నిరూపించడానికి ఎలాంటి ఆధారాలూ లేవన్నారు.

గుజరాత్‌లో 34 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్, వడోదర నగరాల్లో 34 పాఠశాలలకు సోమవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఆయా స్కూల్ యాజమాన్యాలు పోలీసులకు సమాచారమిచ్చాయి. విద్యార్థులు, సిబ్బందిని తక్షణమే ఇంటికి పంపించి ఆయా స్కూళ్లలో పోలీసులు బాంబు నిర్వీర్య దళాలతో తనిఖీలు చేపట్టారు. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని వెల్లడించారు.

సైబర్ మోసాల బాధితులకు పరిహారం.. పరిరక్షణ అందాలి



- సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: సైబర్ నేరగాళ్ల చేతిలో మోసానికి గురై కష్టార్జితాన్ని నష్టపోయిన నిర్భాగ్యుల్లో ప్రభుత్వం అవగాహనను పెంపొందించాలని, పరిహారం చెల్లించడంతోపాటు రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. ఆన్‌లైన్ మోసాల ద్వారా గడించిన మొత్తాన్ని దాచి ఉంచేందుకు మ్యూల్ బ్యాంకు అకౌంట్లు సృష్టించి వాటిని నేరగాళ్లకు విక్రయించిన కేసులో నిందితుడైన పరంజీత్ ఖర్బ్ బెయిలు దరఖాస్తుపై విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. జీవితాంతం కష్టించి సంపాదించుకున్న మొత్తాలను సైబర్ మోసాల కారణంగా పోగొట్టుకున్న వయో వృద్ధులకు పోలీసులు, ప్రభుత్వం పరిహారాన్నిచ్చి, పరిరక్షించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.డి.సంజయ్‌ను ఉద్దేశించి జస్టిస్ నాగరత్న అన్నారు. "మీరు ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. సైబర్ నేరగాళ్లు ఎలా వ్యవహరిస్తారన్న విషయంపై కార్యక్రమాలు రూపొందించి వాటికి టీవీ ఛానళ్లతోపాటు రేడియో కార్యక్రమాల ద్వారా ప్రాచుర్యం కల్పించాలి" అని ధర్మాసనం పేర్కొంది. "ఎక్కువగా వయోవృద్ధుల్ని లక్ష్యం చేసుకుంటున్నారు. వారి విషయంలో ఏ విధంగా నేరాలకు పాల్పడతారన్న విషయంపై అవగాహన పెంచాలి. మోసాలకు గురయ్యే మహిళలు, వయో వృద్ధ జంటలకు ఈ మోసాలు గురించి తెలియకపోవచ్చు, అలాంటి వారిలో చైతన్యం నింపి ఆయా పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో నేర్పాలి" అని జస్టిస్ నాగరత్న అన్నారు. ఈ కేసులో 2024 నుంచీ నిర్బంధంలో ఉన్న నిందితుడు ఖర్బ్‌కు కోర్టు బెయిలు మంజూరు చేసింది. అతని సహ నిందితునికి బెయిలు మంజూరైన కారణంగా అతనికీ ఆ వెసులుబాటు కల్పిస్తున్నట్టు పేర్కొంది. నిందితుడు తన పాస్‌పోర్టును సరెండర్ చేయాలని, ప్రతినెలా మొదటి సోమవారం సంబంధిత పోలీసు స్టేషన్‌లో హాజరవ్వాలని ఆదేశించింది.

వ్యవస్థల్ని మృతప్రాయం చేయకండి

దేశంలో పాక్షిక న్యాయ విభాగాలైన ట్రైబ్యునళ్ల పనితీరులో తలెత్తుతున్న సమస్యలపై సుప్రీంకోర్టు సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ట్రైబ్యునళ్ల నిర్వహణ కోసం సమగ్రమైన, ఏకరూప ప్రతిపాదనను నాలుగువారాల్లోగా సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ట్రైబ్యునళ్ల స్వతంత్ర ప్రతిపత్తి, నిర్మాణాలకు సంబంధించి మద్రాస్ బార్ అసోసియేషన్ చాలాకాలం క్రితం దాఖలు చేసిన వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉద్యోగాల భర్తీలో తాత్సారం, తగినన్ని అధికారాలు లేకపోవడం ట్రైబ్యునళ్లకు శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంపై గతంలో న్యాయస్థానాలు వెలువరించిన ఆదేశాల వెలుగులో ప్రభుత్వం నడుచుకోవాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణికి సీజేఐ సూచించారు. వ్యవస్థల్ని మృతప్రాయం చేయకండని అన్నారు. "అన్ని ట్రైబ్యునళ్లకూ వర్తించే ఏకరూప ప్రతిపాదనతో ముందుకు రండి. కొత్త చట్టం తీసుకొస్తారా, సవరణలు చేస్తారా అన్నది మీ ఇష్టం" అని చెప్పారు. ఖాళీలు ఏర్పడకుండా చూసేందుకు ఒక ఆచరణాత్మక విధానాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని అటార్నీ జనరల్ నొక్కి చెప్పారు. కీలకమైన ఆర్థిక ట్రైబ్యునళ్లు తమ కార్యకలాపాలను నిరంతరాయంగా కొనసాగించేలా ఒక సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అభిప్రాయపడింది. తదుపరి ఆదేశాలు వెల్లడించే వరకూ జస్టిస్ రాజేశ్ ఖరేను 'డెట్ రికవరీ అప్పిలేట్ ట్రైబ్యునల్' ఛైర్మన్‌గా కొనసాగించాలని ఆదేశించింది.

డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం-2023 నిబంధనలపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన 'డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ (డీపీడీపీ) చట్టం'లోని నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అయితే, వివాదాస్పదమైన నిబంధనల అమలును నిలిపివేస్తూ (స్టే) మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న అభ్యర్థనను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి ధర్మాసనం తిరస్కరించింది. పార్లమెంటు ఆమోదంతో తీసుకొచ్చిన చట్టాన్ని విచారణ జరపకుండానే మధ్యంతర ఉత్తర్వుతో అడ్డుకోలేమని తెలిపింది. అయితే, పిటిషన్‌లోని అంశాలపై స్పందించాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. మార్చిలో విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది.

ఎక్కడ ఎన్నికలొచ్చినా సుప్రీంకోర్టు రాజకీయ రణ క్షేత్రంగా మారిపోతోంది!

దిల్లీ: 'అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఓ వర్గం వారిని లక్ష్యంగా చేసుకుని తుపాకీ ఎక్కిపెడుతున్నటుగా ఉన్న వీడియో' వివాదంపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. పిటిషనర్లు గువాహటి హైకోర్టుకు వెళ్లాలని ఆదేశించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ పార్టీలు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. 'ఎక్కడ ఎన్నికలు వచ్చినా సుప్రీంకోర్టు రాజకీయ రణ క్షేత్రంగా మారిపోతోంది. ప్రతి విషయానికీ ఇక్కడకు వస్తే ఎలా? గువాహటి హైకోర్టుకు మీరు ఎందుకు వెళ్లకూడదు?' అని పిటిషనర్లను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను సత్వరమే చేపట్టాలని గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సూచించింది. రాజకీయ పక్షాలు రాజ్యాంగ పరిమితులకు, నైతికతలకు లోబడి ఉండాలని హితవుపలికింది. స్వీయనియంత్రణను పాటిస్తూ, పరస్పర గౌరవంతో ఎన్నికల్లో పోరాడాలని సూచించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తరచూ విద్వేషపూరిత వ్యాఖ్యలు, ప్రసంగాలు చేస్తున్నారని, ఈ కేసును విచారణకు చేపట్టాలని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి అంతకుముందు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ, సీపీఎం నేతలు ఈ పిటిషన్ దాఖలు చేశారు.

దివ్యాంగ అభ్యర్థుల కోసం సుప్రీంకోర్టు చొరవ

దిల్లీ: యూపీఎస్సీ పరీక్షలలో దృష్టిలోపం ఉన్న దివ్యాంగ అభ్యర్థుల కోసం లాప్‌టాప్‌లపై స్క్రీన్ రీడింగ్ సాఫ్ట్‌వేర్‌ను అమర్చాలని గత డిసెంబరు 3న ఇచ్చిన ఉత్తర్వును అమలుచేయడానికి ఏయే చర్యలు తీసుకుంటున్నదీ వారం రోజుల్లో తెలపాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. యూపీఎస్సీ న్యాయవాది కోరిన మేరకు ఇలా గడువు ఇచ్చింది. ఆ ఉత్తర్వును అమలు చేసినట్లు తెలిపే ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల 23 నాటికి సమర్పించాలని పేర్కొంది. సాఫ్ట్‌వేర్ అమర్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి రెండు నెలల్లో తెలియజేయాలని మునుపటి ఉత్తర్వులో ఆదేశించింది. తాజాగా మరో వారం గడువిచ్చింది. తన తరఫున పరీక్ష రాసే వ్యక్తిని పరీక్షలకు వారం రోజుల ముందు మార్చుకోవడానికి అభ్యర్థి దరఖాస్తు చేసుకోవచ్చునీ, ఈ అంశాన్ని పరీక్షల నోటిఫికేషన్‌లో చేర్చాలని ఆదేశించింది. దరఖాస్తు అందిన మూడు పనిదినాల్లో యూపీఎస్సీ తన నిర్ణయాన్ని తెలపాలని సూచించింది.

ఈ శివలింగం పెరుగుతోంది.. జరుగుతోంది!



బిహార్‌లోని నిరంజన నదిలో ఉన్న శివలింగం ఏటా అత్యంత స్వల్పంగా పెరుగుతోందని.. కదులుతోందని స్థానికులు చెబుతున్నారు. మనోకామన మహాదేవ్, చతుర్భుజ్ మహాదేవ్, బుధ్వా మహాదేవ్ అని పిలిచే ఈ శివలింగం లాడు దేమా గ్రామ సమీపంలో నది మధ్యలో ఉంది. ఇది గయకు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది. వరదలు వచ్చినప్పుడు ఈ శివలింగం మునుగుతుంది. ఇది ఏటా ఉత్తరం వైపునకు ఒక అంగుళం జరుగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. స్థానికంగా ఉండే గ్రామ పెద్దలు.. తాము 60 ఏళ్లుగా ఈ శివలింగాన్ని చూస్తున్నామని, అప్పటి నుంచి ఇప్పటిదాకా అది 5 అడుగులకుపైగా జరిగిందని వివరించారు.

వేలాడే తీగల మార్గమే దిక్కు!

ఉత్తరాఖండ్‌లోని ఘరుధి, మాన్‌కోట్ గ్రామాలకు ఇంకా తీగల మార్గమే దిక్కుగా ఉంది. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పిల్లలు, పెద్దలు ఈ తీగల ద్వారా గోరి నదిని దాటాల్సిందే. ఈ నదిని దాటే క్రమంలో గతంలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా వంతెన నిర్మించడానికి



ప్రభుత్వం ముందుకు రావడం లేదు. గతంలో ఇక్కడ నిర్మించిన సస్పెన్షన్ వంతెన 2013 నాటి వరదల్లో కొట్టుకుపోయింది. దీంతో తీగలతో వేలాడే మార్గాన్ని తాత్కాలికంగా స్థానికులే ఏర్పాటు చేసుకున్నారు. గత 12 ఏళ్లుగా ఈ మార్గమే వారికి దిక్కుగా ఉంది.

మేక పాలతో సబ్బులు

ఈటీవీ భారత్

మేకపాలతో సబ్బులు తయారు చేస్తూ గ్రామీణ ప్రాంత మహిళలు ఉపాధి పొందుతున్నారు. సేవా భారత్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో బిహార్‌లోని ముంగేర్ జిల్లా కటోరియా గ్రామ మహిళలు రసాయన రహిత సబ్బుల తయారీలో శిక్షణ పొందారు. మేక పాలలో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, సహజ కొవ్వులు, లాక్టిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి మన చర్మాన్ని మృదువుగా, ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదం చేస్తాయి. మృత కణాలను శరీర ఉపరితలం నుంచి తొలగించే శక్తి మేక పాలకు ఉంది. దీనిలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలూ ఉన్నాయి. దీంతో మేకపాల సబ్బులకు మంచి ఆదరణ లభిస్తోంది. కటోరియా గ్రామానికి చెందిన 18 మంది మహిళలు బృందంగా ఏర్పడి సబ్బుల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి మహిళకు నెలకు సగటున రూ.15,000 ఆదాయం అందుతోంది. స్వచ్ఛమైన మేక పాలతో తయారు చేస్తున్న ఈ సబ్బు ధర ప్రస్తుతం ముంగేర్ జిల్లాలో రూ.70 ఉంది. ఇతర జిల్లాల్లో రవాణా ఖర్చులను కలుపుకొని రూ.150కి విక్రయిస్తున్నారు. వెనీలా, లావెండర్, లెమన్‌గ్రాస్, శాండల్ ఫ్లేవర్లలో సబ్బులు తయారు చేస్తున్నారు.



కరెంట్ అఫైర్స్



❖ జాతీయ జౌళి శాఖ మంత్రుల సమావేశాన్ని 2026, జనవరి 8, 9 తేదీల్లో ఎక్కడ నిర్వహించారు? ('ఇండియాస్ టెక్స్‌టైల్స్: వీవింగ్ గ్రోత్, హెరిటేజ్ అండ్ ఇన్నోవేషన్' అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.) **జ:** గువాహటి

❖ దేశంలోనే మొదటి డీప్‌టెక్ స్టార్టప్ పాలసీని ఇటీవల ఏ రాష్ట్రం ప్రారంభించింది? **జ:** తమిళనాడు (కృత్రిమ మేధస్సు, అధునాతన కంప్యూటింగ్, సెమీ కండక్టర్స్, బయోటెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికతలు, క్లీన్, గ్రీన్ ఎనర్జీలను ప్రోత్సహించడం లక్ష్యంగా 100 డీప్‌టెక్ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం కోసం రూ.100 కోట్లతో ఈ రాష్ట్రం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది.)


మాదిరి ప్రశ్నలు

❖ 2026, జనవరిలో భారత సైన్యం సృష్టించిన కొత్త ఆధునిక యుద్ధ దళం ఏది?
జ: భైరవ్ (డ్రోన్ సాంకేతికతను యుద్ధకార్యకలాపాల్లో అనుసంధానించడానికి దీనిని రూపొందించారు. లక్ష మందికి పైగా శిక్షణ పొందిన డ్రోన్ ఆపరేటివ్‌ల సమూహంతో దీనిని ఏర్పాటు చేశారు.)

❖ 2026, జనవరిలో ఏ రాష్ట్రంలోని కల్పెట్టాలో దేశంలోనే మొదటి పూర్తి కాగిత రహిత జిల్లా కోర్టును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించారు? **జ:** కేరళ (ఏఐ ఆధారిత న్యాయ సాధనాలతో ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ప్రక్రియలతో కేరళ హైకోర్టు ఆధ్వర్యంలో దీనిని అభివృద్ధి చేశారు.)

మరింత సమాచారం

రాజ్యాంగం ప్రకారం దేశాధినేత రాష్ట్రపతి అయితే రాష్ట్రాధినేత గవర్నర్. సమాఖ్య వ్యవస్థలో కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా, రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన రాజ్యాంగ బద్ధంగా జరిగే విధంగా చూసే పర్యవేక్షకులుగా గవర్నర్‌కు అమిత ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యమంత్రి, మంత్రిమండలి మొదలు రాష్ట్రస్థాయిలో ముఖ్య పదవులకు నియామకాలను గవర్నర్ నిర్వహిస్తారు. ఆ పదవికి ఉన్న సాధారణ, ప్రత్యేక, విచక్షణాపూర్వక, క్షమాభిక్ష అధికారాలను, వాటిని వివరించే ఆర్టికల్స్‌తో సహా పోటీ పరీక్షార్థులు గుర్తుంచుకోవాలి. శాసనసభ రద్దు, రాష్ట్రపతి పాలనకు సిఫార్సుల విషయంలో గవర్నర్ పాత్రతోపాటు గత అనుభవాలనూ తెలుసుకోవాలి.



రాష్ట్రంలో కార్యనిర్వాహక శిఖరం!

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

గవర్నర్-అధికారాలు, విధులు

భారత రాజ్యాంగ నిర్మాతలు జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా పనిచేసే విధానాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయిలో రాజ్యాంగబద్ధమైన అధిపతిగా గవర్నర్ వ్యవహరిస్తూ, కేంద్రం ప్రతినిధిగా కీలకపాత్ర పోషిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన గవర్నర్ పేరు మీదే జరుగుతుంది. గవర్నర్ అనేక సాధారణ అధికారాలతో పాటు, ప్రత్యేక సందర్భాల్లో విచక్షణ అధికారాలను నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాలను, ప్రభుత్వ పనితీరును ప్రభావితం చేస్తుంటారు.

కార్యనిర్వాహక అధికారాలు

ఆర్టికల్ 154: గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యనిర్వహణాధికారి. రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన కార్యనిర్వహణాధికారాలన్నీ గవర్నర్ పేరు మీదుగా నిర్వహిస్తారు. రాష్ట్రానికి ప్రథమ పౌరులు. రాజ్యాంగబద్ధమైన అధిపతి. గవర్నర్ స్వయంగా లేదా ఇతర అధికారుల ద్వారా రాష్ట్ర పాలన నిర్వహిస్తారు.

ఆర్టికల్ 163(1): గవర్నర్‌కు రాష్ట్ర పరిపాలనలో సహకరించడానికి ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర మంత్రిమండలి ఉంటుంది.

ఆర్టికల్ 164(1): రాష్ట్ర ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సిఫార్సు మేరకు రాష్ట్ర మంత్రిమండలి సభ్యులను నియమిస్తారు. గిరిజన జనాభా ఎక్కువ ఉన్న మధ్యప్రదేశ్, ఒడిశా, బిహార్ రాష్ట్రాల మంత్రిమండలి ఏర్పాటు సమయంలో 'గిరిజన సంక్షేమ మంత్రి'ని తప్పనిసరిగా నియమించడం అక్కడి గవర్నర్ల బాధ్యతగా రాజ్యాంగం నిర్దేశించింది. ➼ 94వ రాజ్యాంగ సవరణ చట్టం (2006) ప్రకారం రాష్ట్ర మంత్రివర్గంలో 'గిరిజన సంక్షేమ మంత్రి' ఉండాలనే నియమం నుంచి బిహార్‌ను తొలగించి కొత్తగా ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను చేర్చారు.

గవర్నర్ చేసే నియామకాలు

ఆర్టికల్ 165: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన న్యాయ సలహాదారుగా వ్యవహరించే 'అడ్వకేట్ జనరల్'.

ఆర్టికల్ 233: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సుమేరకు జిల్లా స్థాయి, ఇతర దిగువస్థాయి న్యాయమూర్తులు.

ఆర్టికల్ 243(I): రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు, ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యుల నియామకం.

ఆర్టికల్ 243(K): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకం.

ఆర్టికల్ 316: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఛైర్మన్, సభ్యుల నియామకం. ◆ రాష్ట్ర సమాచార కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్, రాష్ట్ర మైనార్టీ కమిషన్‌లకు ఛైర్మన్, సభ్యుల నియామకం. ◆ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్‌లకు ఛైర్మన్, సభ్యుల నియామకం. ◆ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన లోకాయుక్తకు ఛైర్మన్, సభ్యుల నియామకం. ◆ రాష్ట్రఅధికార భాషా సంఘం ఏర్పాటు, ఛైర్మన్, సభ్యుల నియామకం. ◆ గవర్నర్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తూ, వైస్ ఛాన్సలర్లను నియమిస్తారు.

శాసనాధికారాలు

ఆర్టికల్ 168: రాష్ట్ర శాసన వ్యవస్థలో గవర్నర్ అంతర్భాగం. రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర శాసన వ్యవస్థ అంటే గవర్నర్, శాసన సభ/విధాన సభ, శాసన మండలి/విధాన పరిషత్.

ఆర్టికల్ 171: శాసనమండలికి కళలు, సాహిత్యం, సామాజిక సేవా రంగాల్లో ప్రావీణ్యం ఉన్నవారిని 1/6వ వంతు సభ్యులుగా నామినేట్ చేస్తారు.



ఆర్టికల్ 174: గవర్నర్ శాసన సభ సమావేశాలు ప్రారంభిస్తారు. దీర్ఘ కాలం పాటు వాయిదా వేస్తారు. శాసన సభను రద్దు చేస్తారు.

ఆర్టికల్ 176: రాష్ట్ర శాసన సభలో గవర్నర్ ప్రత్యేక ప్రసంగాలు చేస్తారు. నూతన విధాన సభ మొదటి సమావేశంలో ప్రసంగిస్తారు.

ఆర్టికల్ 186: నూతన విధాన సభకు తాత్కాలికంగా అధ్యక్షత వహించేందుకు 'ప్రొటెం స్పీకర్'ను నియమిస్తారు. ఎమ్మెల్యేలు ప్రొటెం స్పీకర్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు. ◆ కొత్తగా శాసన మండలి ఏర్పడితే దానికి ప్రొటెం ఛైర్మన్‌ను నియమిస్తారు.

న్యాయాధికారాలు: ఆర్టికల్ 161 ప్రకారం గవర్నర్‌కు క్షమాభిక్ష/న్యాయాధికారాలు ఉన్నాయి. సైనిక కోర్టులు విధించే శిక్షలు, మరణశిక్షలు, కేంద్రం శాసనాలు ధిక్కరించడంతో విధించే శిక్షలు మినహా మిగిలిన అన్ని శిక్షలకు రాష్ట్రపతి తరహాలో క్షమాభిక్ష అధికారాలను గవర్నర్ వినియోగించవచ్చు.



ఆర్థిక అధికారాలు

ఆర్టికల్ 202: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి.

ఆర్టికల్ 243(I): గవర్నర్ ఐదేళ్లకు ఒకసారి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేస్తారు.

ఆర్టికల్ 267(2): రాష్ట్ర అసంఘటిత నిధి గవర్నర్ నియంత్రణలో ఉంటుంది.

ఆర్టికల్ 293: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రుణాలు సేకరించాలంటే సంబంధిత బిల్లులను గవర్నర్ అనుమతితో శాసన సభలో ప్రవేశపెట్టాలి. ➥ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పించగా, దాన్ని గవర్నర్ రాష్ట్ర శాసనసభకు నివేదిస్తారు.



ఆర్టికల్ 192: శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం గవర్నర్‌కు ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం సిఫార్సుల మేరకు ఆ ప్రక్రియ నిర్వహిస్తారు.

ఆర్టికల్ 200: రాష్ట్ర శాసన సభ ఆమోదించిన బిల్లులు గవర్నర్ ఆమోదంతో చట్టాలుగా మారతాయి. శాసన సభ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆమోదించవచ్చు లేదా పునఃపరిశీలనకు పంపవచ్చు. పునఃపరిశీలన అనంతరం వచ్చిన బిల్లులను తప్పనిసరిగా ఆమోదించాలి.

ఆర్టికల్ 201: శాసనసభ బిల్లుల్లో రాజ్యాంగపరమైన అంశాలు ఇమిడి ఉన్నాయని గవర్నర్ భావిస్తే వాటిని రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేస్తారు.

ఆర్టికల్ 333: విధాన సభలో ఆంగ్లో ఇండియన్లకు ప్రాతినిధ్యం లేకపోతే ఒక ఆంగ్లో ఇండియన్‌ను నామినేట్ చేస్తారు. ◆ 104వ రాజ్యాంగ సవరణ చట్టం, 2019 ప్రకారం ఆంగ్లో ఇండియన్‌ను చట్టసభలకు నామినేట్ చేసే విధానాన్ని రద్దు చేశారు. అది 2020, జనవరి 25 నుంచి అమల్లోకి వచ్చింది.

ఆర్టికల్ 213: మంత్రిమండలి సిఫార్సుల మేరకు గవర్నర్ ఆర్డినెన్స్‌ను జారీ చేస్తారు.



రచయిత: బంగారు సత్యనారాయణ

TENTH Biology — Control and coordination



1. Nervous and hormonal systems together perform the function of control and coordination in human beings. Justify the statement. **8 Marks**

A: The evolution of both nervous and endocrine (chemical) coordination systems in multicellular organisms provides complementary mechanisms for control and coordination, each with its own advantages.

a) Nervous system: ★ The nervous system allows for rapid, specific and precise responses to stimuli. ★ It's well-suited for immediate, short-term responses to external and internal changes. ★ Nervous systems are more energy-intensive and require a higher degree of complexity.

b) Endocrine system: ★ The endocrine system involves hormones, which are chemical messengers that travel through the blood stream. ★ It enables slower, long-term regulation of physiological processes and coordination between different body parts. ★ Hormones can have widespread and long-lasting effects, influencing growth, development, metabolism and more.

The coexistence of both systems offers organisms flexibility. Nervous systems handle rapid, acute responses (**e.g.:** reacting to a sudden threat), while the endocrine system manages more prolonged and continuous processes (**e.g.:** growth, reproduction and metabolism). This duel approach enhances an organism's ability to adapt to a wide range of environmental conditions and challenges.

Final Exams-2026 IMPORTANT Q & A

2. Differentiate between Cerebrum and Cerebellum.


A: Cerebrum

1. Cerebrum is the part of the fore-brain.
2. It is divided into two cerebral hemispheres.
3. It is the seat of intelligence. It has sensory centres which receive and analyse the information from receptors.
4. It is the centre for reasoning and memory.

Cerebellum

1. Cerebellum is the part of the hind-brain. 2. It has an intact part and has no divisions. 3. It is concerned with the equilibrium and maintaining the posture of the body. 4. It controls the voluntary movements of the body.

For more IMP Q & A



Writer: M.S.N.MURTHY

అందుకే కూరగాయలపై గోధుమరంగు పూత!




పాలు పెరుగుగా మారడం, ఇనుము తుప్పుపట్టడం, పీల్చే గాలిలోని ఆక్సిజన్ శక్తిగా రూపాంతరం చెందడం మొదలైనవన్నీ సాధారణ మార్పులు కాదు. అవి రసాయన చర్యలు. ఒక పదార్థం తన ప్రాథమిక స్వభావాన్ని కోల్పోయి, కొత్త లక్షణాలతో సరికొత్త పదార్థంగా ఏర్పడటంలో రసాయ చర్య పాత్ర ప్రధానంగా ఉంటుంది. ఈ ప్రక్రియలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి, వాటిని సంక్షిప్తంగా, స్పష్టంగా సూచించే సంకేతమే రసాయన సమీకరణం. ఆ రసాయ చర్యలు జరిగే తీరుపై, వాటిని సమీకరణాల రూపంలో తుల్యం చేయడంపై పోటీ పరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. క్షయకరణం, క్షయం చెందడం తదితర అంశాలపై కూడా పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.

జనరల్ స్టడీస్ - రసాయన శాస్త్రం

రసాయనిక చర్యలు - సమీకరణాలు

1. కింది వాటిలో సరికానిది?
   1) రసాయన చర్య అనేది ఒకటి లేదా అంత కంటే ఎక్కువ రసాయన పదార్థాల్లో రసాయన మార్పులు జరిగి కొత్త పదార్థాలు ఏర్పరిచే ప్రక్రియ.
   2) రసాయన చర్యలు జరిగినప్పుడు శక్తి మార్పులు సంభవిస్తాయి.
   3) రసాయన మార్పు జరిగినప్పుడు కొత్త పదార్థాలు ఏర్పడతాయి.
   4) రసాయన చర్యలో పాల్గొనే వాటిని 'క్రియాజన్యాలు', ఉత్పన్నమయ్యే వాటిని 'క్రియాజనకాలు' అని అంటారు.
2. రసాయన చర్య కింది వాటిలో ఏ నియమాన్ని పాటిస్తుంది?
   1) ద్రవ్యరాశి క్రియా నియమం
   2) శక్తితుల్యతా నియమం
   3) ద్రవ్యనిత్యత్వ నియమం 4) పైవన్నీ
3. నిశ్చితం-(ఎ): పదార్థం సంఘటనంలో మార్పు ఉంటే దానిని 'రసాయన మార్పు' అంటారు.
   కారణం-(ఆర్): రసాయన చర్యలన్నీ రసాయన మార్పులే.
   1) ఎ, ఆర్ సరైనవి; ఆర్ 'ఎ' కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఆర్ 'ఎ'కు సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
4. లెడ్ నైట్రేట్ ద్రావణానికి, దేన్ని కలిపినప్పుడు పసుపు రంగు అవక్షేపం ఏర్పడుతుంది?
   1) పొటాషియం అయోడైడ్ జలద్రావణం
   2) పొటాషియం క్లోరైడ్ జలద్రావణం
   3) సజల సల్ఫ్యూరిక్ ఆమ్లం
   4) సోడియం క్లోరైడ్ జలద్రావణం



5. Br_2, KI ల మధ్య జరిగే చర్య?
   1) సంయోగ చర్య 2) వియోగ చర్య
   3) రసాయన స్థానభ్రంశం
   4) రసాయన ద్వంద్వ వియోగం
6. కాపర్ పాత్రలపై ఆకుపచ్చ పదార్థపు పూత ఏర్పడటానికి కారణం?
   ఎ) కాపర్ జల విశ్లేషణం
   బి) కాపర్ తుప్పుపట్టడం వల్ల
   సి) కాపర్ క్షయకరణం చెందడం
   డి) కాపర్ ఆక్సీకరణం చెందడం
   1) ఎ 2) బి, డి
   3) బి, సి 4) పైవన్నీ
7. నిశ్చితం-(ఎ): $Zn + CuSO_4 \rightarrow ZnSO_4 + Cu$ రసాయన స్థానభ్రంశ చర్య.
   కారణం-(ఆర్): Cu కంటే Zn అధిక చర్యాశీలత మూలకం.
   1) ఎ, ఆర్ సరైనవి; ఆర్, ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఆర్, 'ఎ'కు సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
8. కింది వాటిలో దేనికి విలీన సల్ఫ్యూరిక్ ఆమ్లం కలిపితే తెల్లని అవక్షేపం ఏర్పడుతుంది?
   1) $CuSO_4$ ద్రావణం 2) $NaCl$ ద్రావణం
   3) $BaCl_2$ ద్రావణం
   4) Na_2SO_4 ద్రావణం
9. కింది వాటిలో ఉష్ణవియోగ చర్య?
   1) $2AgBr_{(\text{ఘ})} \rightarrow 2Ag_{(\text{ఘ})} + Br_{2(\text{వా})}$
   2) $2H_2O_{(\text{ద్ర})} \rightarrow 2H_{2(\text{వా})} + O_{2(\text{వా})}$
   3) $2AgCl_{(\text{ఘ})} \rightarrow Ag_{(\text{ఘ})} + Cl_{2(\text{వా})}$
   4) $CaCO_{3(\text{ఘ})} \rightarrow CaO_{(\text{ఘ})} + CO_{2(\text{వా})}$
10. తటస్థీకరణ చర్య ఒక...
    1) రసాయన వియోగ చర్య
    2) రసాయన సంయోగ చర్య
    3) రసాయన స్థానభ్రంశ చర్య
    4) రసాయన ద్వంద్వ వియోగ చర్య
11. $Pb(NO_3)_{2(\text{ఘ})} \xrightarrow{\text{ఉష్ణం}} XPbO + Y\,NO_2 + Z\,O_2$
    దీనిలో X, Y, Z విలువలు వరుసగా
    1) 2, 2, 2 2) 2, 4, 1
    3) 2, 4, 2 4) 4, 2, 1
12. కింది చర్యలో ద్రవ్య నిత్యత్వ నియమం పాటించనిది ఏది?
    1) $Na_2CO_3 + 2HCl \rightarrow 2NaCl + CO_2 + H_2O$
    2) $AgNO_3 + NaCl \rightarrow AgCl + NaNO_3$
    3) $C_2H_6 + O_2 \rightarrow CO_2 + H_2O$
    4) $NaOH + HCl \rightarrow NaCl + H_2O$
13. గాలిలో మెగ్నీషియం తీగ దహనం ఏ రసాయన చర్య?
    1) క్షయకరణం + సంయోగం
    2) ఆక్సీకరణం + సంయోగం
    3) ఆక్సీకరణం + వియోగం
    4) క్షయకరణం+ఉష్ణమోచక చర్య




14. $BaCl_2 + Na_2SO_4 \rightarrow BaSO_4 + 2NaCl$ అనే రసాయన సమీకరణం దేనికి ఉదాహరణ?
    1) రసాయన సంయోగ చర్య
    2) రసాయన వియోగ చర్య
    3) రసాయన స్థానభ్రంశం
    4) రసాయన ద్వంద్వ వియోగం
15. ప్రవచనం-(ఎ): తటస్థీకరణ చర్యలన్నీ రసాయన ద్వంద్వ వియోగ చర్యలే.
    ప్రవచనం-(బి): రసాయన ద్వంద్వ వియోగ చర్యలన్నీ తటస్థీకరణ చర్యలు కావు.
    1) ఎ, బి సత్యం. 2) ఎ సత్యం, బి అసత్యం.
    3) ఎ అసత్యం, బి సత్యం. 4) ఎ, బి అసత్యం.
16. తాజా వంట నూనెలను ఎక్కువ కాలం నిల్వ ఉంచడంలో సహాయపడే వాయువు?
    1) కార్బన్ డై ఆక్సైడ్, హీలియం
    2) హీలియం, నైట్రోజన్
    3) హైడ్రోజన్, నైట్రోజన్
    4) హీలియం, ఆక్సిజన్



17. నూనె లేదా కొవ్వు పదార్థాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచడం వల్ల ఆక్సీకరణ చెంది వాటి రుచిని, వాసన కోల్పోవడాన్ని ఏమంటారు?
    1) ముక్కిపోవడం 2) ఆమ్లత్వం
    3) క్షయకరణం 4) క్షయం చెందడం
18. బంగాళదుంప చిప్స్ ఎక్కువ కాలం నిల్వ చేయడానికి చిప్స్ ప్యాకెట్‌లో నింపే వాయువు?
    1) హైడ్రోజన్ 2) నైట్రోజన్
    3) ఆక్సిజన్ 4) హీలియం
19. ఆహారం పాడవకుండా నిల్వ ఉండాలంటే వాటికి కలపాల్సిన సంరక్షకాలు (విటమిన్లు)?
    1) A, K 2) B, D
    3) E, C 4) A, C
20. పండ్లు, కూరగాయలు కోసినప్పుడు వాటి ఉపరితలంపై గోధుమ రంగు పూత ఏర్పడటానికి కారణం?
    1) క్షయ కరణం
    2) స్ఫటికీకరణ
    3) ఆక్సీకరణం 4) ఉత్పతనం



21. క్షయం చెందడం అనేది .... చర్య
    1) ఆక్సీకరణ 2) క్షయకరణ
    3) రిడాక్స్ 4) ఉత్పతనం
22. ప్రవచనం-(ఎ): ఇనుము తుప్పు పట్టడం ఉష్ణమోచక చర్య.
    ప్రవచనం-(బి): తుప్పు పట్టడం ఆక్సిజన్ సమక్షంలో మాత్రమే జరుగుతుంది.
    1) ఎ, బి సత్యం
    2) ఎ సత్యం, బి అసత్యం.
    3) ఎ అసత్యం, బి సత్యం. 4) ఎ, బి అసత్యం.
23. కింది వాటిలో సరికానిది?
    1) స్థానభ్రంశ చర్యలన్నీ ఆక్సీకరణ, క్షయకరణ చర్యలే.
    2) కిరణజన్య సంయోగక్రియలో నీరు క్షయకరణం చెందుతుంది.
    3) శ్వాసక్రియ ఉష్ణమోచక చర్య.
    4) కిరణజన్య సంయోగక్రియ ఉష్ణగ్రాహకచర్య.
24. నిశ్చితం-(ఎ): ముక్కిపోవడం ఆక్సీకరణ, ఉష్ణమోచక చర్య.
    కారణం-(ఆర్): ముక్కిపోవడం చర్యలో ఉష్ణం వెలువడుతుంది.
    1) ఎ, ఆర్ సరైనవి; ఆర్ 'ఎ' కు సరైన వివరణ.
    2) ఎ, ఆర్ సరైనవి; ఆర్ 'ఎ' కు సరైన వివరణ కాదు.
    3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
    4) ఎ సరికాదు, ఆర్ సరైంది.
25. కింది వాటిని జతపరచండి.
    ఎ) స్లేక్డ్ లైమ్ 1) క్యాల్షియం హైడ్రాక్సైడ్
    బి) మిల్క్ ఆఫ్ లైమ్ 2) క్యాల్షియం ఆక్సైడ్
    సి) మిల్క్ ఆఫ్ మెగ్నీషియా 3) క్యాల్షియం కార్బొనేట్
    డి) లైమ్ స్టోన్ 4) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
    1) ఎ-2, బి-1, సి-3, డి-4 2) ఎ-1, బి-2, సి-4, డి-3
    3) ఎ-2, బి-1, సి-4, డి-3 4) ఎ-1, బి-4, సి-3, డి-2
26. $MnO_2 + 4HCl \rightarrow MnCl_2 + 2H_2O + Cl_2$ అనే చర్యలో MnO_2
    1) క్షయకరణం చెందుతుంది.
    2) ఆక్సీకరణం చెందుతుంది.
    3) MnO_2 క్షయకరణి
    4) 2, 3
27. కింది వాటిలో రసాయన చర్య కానిది?
    1) ఆహారం జీర్ణమవడం
    2) ఇనుము తుప్పుపట్టడం
    3) శ్వాసక్రియ 4) ఇనుము అయస్కాంతీకరణం
28. ఉష్ణం గ్రహించే రసాయన మార్పు?
    1) పొడి సున్నం నీటితో చర్య
    2) బొగ్గు దహనం
    3) మెగ్నీషియం మండటం
    4) నైట్రోజన్, ఆక్సిజన్‌తో కలపడం



29. కింది వాటిలో ఉష్ణమోచక చర్యలు?
    ఎ) పొడిసున్నంతో నీటి చర్య
    బి) ఆమ్లాన్ని నీటితో విలీనం చేయడం
    సి) నీరు బాష్పీభవనం చెందడం
    డి) కర్పూరం ఉత్పతన చర్య
    1) బి, సి 2) ఎ, బి
    3) సి, డి 4) బి, డి
30. శ్వాసక్రియ అనేది?
    1) ఉష్ణగ్రాహక క్షయకరణ చర్య
    2) ఉష్ణగ్రాహక ఆక్సీకరణ చర్య
    3) ఉష్ణమోచక ఆక్సీకరణ చర్య
    4) ఉష్ణమోచక క్షయకరణ చర్య
31. $2PbO_{(\text{ఘ})} + C_{(\text{ఘ})} \rightarrow 2Pb_{(\text{ఘ})} + CO_{2(\text{వా})}$ పై సమీకరణం అనుసరించి ఏది సరైంది?
    ఎ) లెడ్ ఆక్సైడ్ ఆక్సీకరణం చెందుతుంది.
    బి) కార్బన్ డై ఆక్సైడ్ ఆక్సీకరణం చెందుతుంది.
    సి) కార్బన్ ఆక్సీకరణం చెందుతుంది.
    డి) లెడ్ ఆక్సైడ్ క్షయకరణం చెందుతుంది.
    1) సి, డి 2) ఎ, బి
    3) ఎ, బి, సి 4) పైవన్నీ
32. గోడకు సున్నం వేసినప్పుడు గోడలను మెరిసేలా చేసే పదార్థం?
    1) CaO
    2) $Ca(OH)_2$
    3) $CaCO_3$
    4) $Ca(HCO_3)_2$




33. ఇనుము తుప్పు పట్టడం...
    1) ఆక్సీకరణం, స్థానభ్రంశ చర్య
    2) క్షయకరణం, సంయోగ చర్య
    3) ఆక్సీకరణం, సంయోగ చర్య
    4) క్షయకరణం, స్థానభ్రంశ చర్య
34. కింది వాటిలో రసాయన మార్పు కానిది?
    1) నూనెలు, కొవ్వులు ముక్కిపోవడం
    2) నీటి విద్యుద్విశ్లేషణ చర్య
    3) శ్వాసక్రియ
    4) జింక్ ఆక్సైడ్ వేడి చేయడం
35. కిందివాటిలో ఉష్ణగ్రాహక చర్య
    1) కిరణజన్య సంయోగ క్రియ
    2) బొగ్గు మండటం
    3) మెగ్నీషియం తీగ మండటం
    4) సహజ వాయువు మండటం

సమాధానాలు

1-4, 2-3, 3-1, 4-1, 5-3, 6-2, 7-1, 8-3, 9-4, 10-4, 11-2, 12-3, 13-2, 14-4, 15-1, 16-2, 17-1, 18-2, 19-4, 20-3, 21-1, 22-2, 23-2, 24-1, 25-3, 26-1, 27-4, 28-4, 29-2, 30-3, 31-1, 32-3, 33-3, 34-4, 35-1.

పరమాణు కేంద్రకంలో అతి తక్కువ ప్రదేశంలో ఎక్కువ సంఖ్యలో ఆవేశ కణాలుంటాయి. ధనావేశం కలిగిన ప్రోటాన్లు, తటస్థంగా ఉండే న్యూట్రాన్లు అతి తక్కువ వైశాల్యంలో ఒకదాని వికర్షణను మరొకటి అధిగమిస్తూ ఉంటాయి. వీటిని బంధించి ఉంచే శక్తిని బంధన శక్తి (Binding Energy) అంటారు. పరమాణు ద్రవ్యరాశిలో వచ్చే లోపమే ఈ శక్తిగా మారుతుందని ఐన్‌స్టీన్ ద్రవ్యరాశి-శక్తి తుల్యత నియమం $E = \Delta mc^2$ తెలియజేస్తుంది.



ఆధునిక భౌతికశాస్త్రం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

ఫొటోగ్రాఫిక్ పలకల ప్రభావితం.. ప్రతిదీప్తి పదార్థాలపై మెరుపులు!

పరమాణు సంఖ్యకు సమానమైన ప్రోటాన్లు ఒకదాన్ని మరొకటి వికర్షించుకుంటూ అతిచిన్న ప్రాంతమైన పరమాణు కేంద్రకంలో ఉంటాయి. ఫలితంగా కొన్ని మూలకాలు అదృశ్య కిరణాలను విడుదల చేస్తూ సహజ రేడియోధార్మికతను ప్రదర్శిస్తాయి.

ఉదా: యురేనియం (పరమాణు సంఖ్య 92), రేడియం (88), థోరియం (90) మొదలైనవి.

- రేడియోధార్మిక పదార్థాలను పరిశీలించినప్పుడు వాటిలో నుంచి α, β, γ లాంటి కొన్ని అదృశ్య కిరణాలు విడుదలవుతున్నట్లు తేలింది.
- రేడియోధార్మిక పదార్థాన్ని ఒక సీసపు దిమ్మెలో ఉంచి, సన్నటి రంధ్రం ద్వారా కిరణాలు వెలువడేలా చేస్తారు. ఆ దిమ్మె తగినంత మందంగా ఉంటే వికిరణాలను పక్కవైపు నుంచి విడుదల కాకుండా కాపాడుతుంది. ఈ రేడియోధార్మిక వికిరణాలు అత్యంత ప్రమాదకరమైనవి.
- రేడియోధార్మిక వికిరణ పుంజాన్ని ఒక అయస్కాంత క్షేత్రం ద్వారా పంపితే మూడు విభాగాలుగా విడిపోవడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. అదేవిధంగా విద్యుత్ క్షేత్రం నుంచి పంపినప్పుడు కూడా మూడు విభాగాలుగా విడిపోతుందని గుర్తించారు. అనంతరం వీటికి α - కిరణాలు, β - కిరణాలు, γ - కిరణాలు అని పేరుపెట్టారు.

α - కిరణాల ధర్మాలు

హీలియం పరమాణు కేంద్రకం మాదిరిగానే α- కిరణంలోని కణంలో రెండు ప్రోటాన్లు, రెండు న్యూట్రాన్లు ఉంటాయి. దీన్ని ద్విగుణ అయనీకరణం చెందిన హీలియం పరమాణువుతో పోల్చవచ్చు.

- α - కణాల వేగం గాలిలో సుమారు 10^7 మీ./సె. ఉంటుంది.
- α - కణాలకు ఉన్న అధిక ద్రవ్యరాశి, ఆవేశం కారణంగా ఇవి తమ ప్రయాణ మార్గంలో ఎదురయ్యే వాయువులను అధికంగా అయనీకరిస్తాయి.
- β, γ - కణాలతో పోల్చినప్పుడు α - కణాలకు పదార్థాల ద్వారా చొచ్చుకుపోయే సామర్థ్యం తక్కువగా ఉంటుంది.
- విద్యుత్, అయస్కాంత క్షేత్రాల ద్వారా ప్రయాణించేటప్పుడు α - కణాలు పక్కకు విచలనం చెందుతాయి. కానీ వీటి ద్రవ్యరాశి ఎక్కువ ఉండటంతో β - కిరణాల కంటే తక్కువ కోణంతో విచలనం చెందుతాయి.
- వీటిని ${}^{4}_{2}He^{2+}$గా సూచిస్తారు.

β - కణాల ధర్మాలు

β - కణాలను కేంద్రకం నుంచి ఉత్పన్నమయ్యే ఎలక్ట్రాన్లుగా చెప్పవచ్చు. β - కణం ద్రవ్యరాశి, ఆవేశాలు ఎలక్ట్రాన్‌కు సమానంగా ఉంటాయి. కాబట్టి β - కణాన్ని ${}_{-1}^{0}e$ లేదా ${}_{-1}^{0}\beta$ గా సూచిస్తారు.

- β - కణాల వేగం గాలిలో సుమారుగా 10^8 మీ./సె. ఇది కాంతి వేగం (3×10^8 మీ./సె.) కంటే తక్కువగా ఉంటుంది.
- β - కణాలు తాము ప్రయాణించే వాయువులను అయనీకరిస్తాయి. కానీ α - కణాల కంటే తక్కువ.
- β - కణాలు కూడా పదార్థాల ద్వారా చొచ్చుకుపోగలవు. కానీ γ - కణాలతో పోలిస్తే తక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.
- β - కణాలు కూడా విద్యుత్ అయస్కాంత క్షేత్రం నుంచి ప్రయాణించేటప్పుడు విచలనం చెందుతాయి. కానీ α - కణాలకు వ్యతిరేక దిశలో విచలనం చెందుతాయి.
- β - కణాలు ఫొటోగ్రాఫిక్ పలకలను ప్రభావితం చేస్తాయి.
- ప్రతిదీప్తి పదార్థాలపై మెరుపులు వచ్చేలా చేస్తాయి.

γ - కణాల ధర్మాలు

γ - కణాలు విద్యుదయస్కాంత వికిరణాలు.

- ఇవి x - కిరణాల కంటే తక్కువ తరంగదైర్ఘ్యం కలిగి ఉంటాయి.
- ఇవి విద్యుదయస్కాంత వికిరణాలు కాబట్టి కాంతి వేగంతో ప్రయాణిస్తాయి. వీటి వేగం గాలి లేదా శూన్యంలో 3×10^8 మీ./సె.
- ఈ కిరణాలపై విద్యుత్, అయస్కాంత క్షేత్రాల ప్రభావం ఉండదు.
- α, β కణాలతో పోల్చితే γ - కణాలకు చొచ్చుకుపోయే సామర్థ్యం ఎక్కువ.
- γ - కిరణాలు కూడా ఫొటోగ్రాఫిక్ ప్లేట్లను ప్రభావితం చేస్తాయి.
- ప్రతిదీప్తి పదార్థాలపై మెరుపులు వచ్చేలా చేస్తాయి.
- γ - కిరణాలు మానవ శరీర కణజాలం నుంచి సులువుగా ప్రయాణిస్తూ కణాలను నాశనం చేస్తాయి. కాబట్టి ఈ కిరణాలను క్యాన్సర్ కణ నిర్మూలనకు రేడియేషన్ చికిత్సలో వినియోగిస్తారు.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

రేడియోధార్మిక పరివర్తనం

రేడియోధార్మిక వికిరణాలతో కేంద్రకంలో సంభవించే మార్పులు, అది ఎలా పరివర్తనం చెందుతుంది, అదేవిధంగా ఒకే మూలకం వేర్వేరు ఐసోటోపులుగా ఎలా ఉంటుందనే భావనను రేడియోధార్మిక పరివర్తనం ద్వారా తెలుసుకోవచ్చు.

- ఒక అస్థిర కేంద్రకం విఘటనం చెంది మరొక కేంద్రకంగా మారటాన్ని రేడియోధార్మిక పరివర్తనం అంటారు. విడుదలయ్యే కణం ఆధారంగా వీటిని 3 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

α - విఘటనం

α - కణాన్ని ${}^{4}_{2}He^{2+}$ కేంద్రకంతో పోల్చవచ్చు. కాబట్టి ఒక α - కణం కేంద్రకం నుంచి వెలువడితే పరమాణు సంఖ్య 2, ద్రవ్యరాశి సంఖ్య 4 కోల్పోయినట్లు.

$${}^{A}_{Z}P \longrightarrow {}^{A-4}_{Z-2}D + {}^{4}_{2}He \text{ (α - కణం)}$$

ఈ సమీకరణంలో P అంటే మాతృక కేంద్రం

D అంటే పుత్రికా కేంద్రం, Z అంటే పరమాణు సంఖ్య

A అంటే ద్రవ్యరాశి సంఖ్య

ఉదా: ${}^{238}_{92}U$ కేంద్రకం ఒక α - కణాన్ని విడుదల చేస్తే...

$${}^{238}_{92}U \longrightarrow {}^{234}_{90}Th + {}^{4}_{2}He$$

పై ఉదాహరణలో ${}^{238}_{92}U$ కేంద్రకం α - కణాన్ని విడుదల చేసి ${}^{234}_{90}Th$ కేంద్రకంగా మారింది. ఈ విధంగా ఏర్పడిన థోరియాన్ని 'థోరియం ఐసోటోపు' అంటారు.

- మూలకాల లక్షణాలు వాటి పరమాణు సంఖ్యపై ఆధారపడతాయి.
- α - విఘటనం జరిగినప్పుడు ఆ మూలకం స్థానం ఆవర్తన పట్టికలో రెండు స్థానాలు ఎడమకు జరుగుతుంది. ద్రవ్యరాశి 4 ప్రమాణాలు తగ్గుతుంది.

β - విఘటనం

β - కణాన్ని ఒక ఎలక్ట్రాన్‌తో పోల్చవచ్చు. β - విఘటనం జరిగినప్పుడు ఆ మూలకం అదే పరమాణు ద్రవ్యరాశి సంఖ్య ఉన్న మరొక మూలకంగా పరివర్తనం చెందుతుంది.

- కేంద్రకంలోని ఒక న్యూట్రాన్ ఒక ప్రోటాన్, ఒక ఎలక్ట్రాన్‌గా విడిపోవడంతో β - విఘటనం జరుగుతుంది. ఫలితంగా ఎలక్ట్రాన్ β - కణంగా బయటకు వస్తుంది. కొత్తగా ఒక ప్రోటాన్ రావటం వల్ల పరమాణు సంఖ్య 1 ప్రమాణం పెరుగుతుంది.

న్యూట్రాన్ → ప్రోటాన్ + β - కణం

$${}^{A}_{Z}P \longrightarrow {}^{A}_{Z+1}D + {}^{0}_{-1}\beta$$

(మాతృక కేంద్రకం) (పుత్రిక కేంద్రకం) β - కణం

γ - విఘటనం

γ - కిరణాలు విద్యుదయస్కాంత వికిరణాలు. కాబట్టి γ - విఘటనం వల్ల కేంద్రకం పరమాణు సంఖ్య (Z)లో, ద్రవ్యరాశి సంఖ్య (A)లో ఎలాంటి మార్పు ఉండదు. అయితే γ - విఘటనంతో కేంద్రక శక్తి స్థాయిలో మార్పు ఉంటుంది.

924 Word of the Day

Turbulence

Telugu meaning: అల్లకల్లోలం, అస్థిరత్వం

English meaning: The word turbulence (టర్బ్యులెన్స్) is a noun that refers to a state of disorder, confusion, or violent movement, especially of air or water.

Synonyms: Chaos, Instability; ***Antonyms:*** Calmness, Stability

Usage: **1.** The aeroplane experienced sudden turbulence, causing passengers to fasten their seat belts immediately.

2. The country went through a period of political turbulence that affected its economic growth and stability.

Current Affairs



Andhra Pradesh Finance Minister Payyavula Keshav presented the State Budget for the 2026-27 financial year in the Assembly on 14 February 2026. The Budget specified a total outlay of Rs.3,32,205 crore. Of this, revenue expenditure is estimated at Rs.2,56,142 crore, while capital expenditure stands at Rs.53,915 crore. The revenue deficit is estimated at Rs.22,002 crore and the fiscal deficit at Rs.75,868 crore.



Prime Minister Narendra Modi inaugurated a series of major infrastructure projects in Assam on 14 February 2026, including the Kumar Bhaskar Varma Setu over the Brahmaputra River in Guwahati and the North-East's first Emergency Landing Facility (ELF) on a national highway in Dibrugarh district.



India's Pramod Bhagat captured the men's SL3 gold medal at the BWF Para World Championships on 14 February 2026. He defeated Muhammad Al Imran of Indonesia with 21-12, 21-18 in the final. This is his fourth consecutive singles gold at the world championships and his sixth overall world title in the category.

The government on 14 February 2026, gave its go ahead to PM RAHAT (Road Accident Victim Hospitalization and Assured Treatment) Scheme aimed at ensuring immediate medical assistance to road accident victims to prevent fatalities.

For more Current Affairs: Scan QR code

ప్రపంచ పర్యాటక స్థితిస్థాపక దినోత్సవం

ఫిబ్రవరి 17
చరిత్రలో ఈనాడు

దేశాభివృద్ధిలో పర్యాటక రంగం కీలక భూమిక పోషిస్తుంది. ప్రపంచ అవగాహనను పెంపొందించడంలో, ఉద్యోగ - ఉపాధి కల్పనలో, సమ్మిళిత వృద్ధిని సాధించడంలో ఇది చాలా ముఖ్యం. సేవా రంగంలో ప్రధాన విభాగమైన పర్యాటకం అనేది ఆయా దేశాల్లో ఉండే విభిన్న సంస్కృతులు, ప్రజలు, వారసత్వం, కళలు, వంటలు, ప్రదేశాలపై ఆధారపడి ఉంటుంది. వాతావరణ మార్పు, ఆర్థిక మాంద్యం, మహమ్మారి (pandemics) పరిస్థితులు టూరిజానికి పెద్ద సవాళ్లు. వీటన్నింటినీ అధిగమించి పర్యాటక రంగం బలం, అనుకూలతలను చాటే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 17న 'ప్రపంచ పర్యాటక స్థితిస్థాపక దినోత్సవం'గా (Global Tourism Resilience Day) నిర్వహిస్తారు. ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక మార్పిడి, పర్యావరణ స్థిరత్వాన్ని పెంపొందించగల టూరిజం రంగంపై అందరికీ అవగాహన కల్పించడంతోపాటు భవిష్యత్తులో వచ్చే అంతరాయాలను ఎదుర్కొనేలా వ్యూహాలు రచించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

పర్యాటకులు అంటే?

సాధారణంగా విశ్రాంతి, వినోదం కోసం ప్రయాణించే వ్యక్తులను పర్యాటకులు అంటారు. వారు సందర్శించే ప్రదేశాలను పర్యాటక గమ్యస్థానాలు (tourist destinations) అంటారు.

- ప్రపంచ పర్యాటక సంస్థ, విశ్రాంతి, వ్యాపారం కోసం లేదా సందర్శన ప్రదేశం నుంచి డబ్బు గ్రహించని ఏ ఇతర కార్యక్రమం కోసమైనా ప్రజలు తాము ఉన్న చోటు నుంచి మరో ప్రాంతానికి ప్రయాణం చేసి 24 గంటలకు మించి, ఒక సంవత్సరానికి మించని సమయం గడిపితే అలాంటి వారిని పర్యాటకులుగా నిర్వచించింది.




- భారత ప్రభుత్వ నిర్వచనం ప్రకారం, విదేశీ పాస్‌పోర్టు కలిగి విశ్రాంతి, వినోదం, వైద్యం, మతసంబంధ కార్యక్రమం, క్రీడలు, వ్యాపారం, సభలు, సమావేశాలు మొదలైన వాటి కోసం భారత్‌ను సందర్శించి ఒక రోజు కంటే ఎక్కువ, ఏడాది కంటే తక్కువ కాలం గడిపిన విదేశీయుడు మనకు విదేశీ పర్యాటకుడు అవుతాడు.

అంతర్జాతీయ పర్యాటకుల గణాంకాలు, స్వదేశ్ దర్శన్, ఉడాన్ పథకాల సమాచారంతోపాటు గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

సంక్షేమ యంత్రాంగం

దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అనేక మంది ఉన్నారు. ఈ ప్రజల ప్రయోజనాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తున్నాయి. అసమానతలను తగ్గించి, అవకాశాల్లో వ్యత్యాసాలను తొలగించాలని, రిజర్వేషన్ల కల్పన కోసం ప్రభుత్వాలు పలు కమిషన్లను ఏర్పాటు చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా కమిషన్లు, నిర్వర్తించే విధులు, వాటి అధికారాలు, చేసిన సిఫార్సులపై పోటీపరీక్షార్థులకు పూర్తి అవగాహన ఉండాలి.



ఇతర వెనుకబడిన వర్గాలు

భారత రాజ్యాంగంలో 'ఇతర వెనుకబడిన వర్గాలు' (ఓబీసీ) అనే పదాన్ని రాజ్యాంగ నిర్మాతలు నిర్వచించలేదు.

- ఈ పదం పాలనాపరమైంది మాత్రమే. వెనుకబడిన వర్గాలు మిశ్రమ వర్గాలకు చెందుతాయి.

వెనుకబాటుతనానికి లక్షణాలు:

1. నిరక్షరాస్యత
2. విద్యలేమి
3. పేదరికం
4. శ్రమ దోపిడీ
5. సేవారంగంలో ప్రాతినిధ్యం లేకపోవడం
6. అస్పృశ్యత/ అంటరానితనం

మండల్ కమిషన్

మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో 1979లో బి.పి. మండల్ అధ్యక్షతన రెండో వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటైంది. దీని ప్రధాన ఉద్దేశం - సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిని గుర్తించి, రిజర్వేషన్లు కల్పించడం.

జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్

ఇందిరా సహానీ కేసులో భాగంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 1993లో జాతీయ వెనుకబడిన తరగతుల చట్టం చేశారు.

ఓబీసీలకు సంబంధించిన అంశాలు, ఇందిరా సహానీ కేసు 1992, జాతీయ మహిళా కమిషన్, జాతీయ మైనారిటీ కమిషన్ మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Junior Resident Posts

Jawaharlal Institute of Postgraduate Medical Education and Research (JIPMER), Puducherry, is conducting interviews for the Junior Resident on a regular basis. The total no. of posts is 26. Eligible candidates can appear for the interview on 28 February 2026.

Project Staff Posts

Central Electronics Engineering Research Institute (CEERI) of CSIR Pilani, Rajasthan, invites applications for the filling of Project Staff posts on a temporary basis. The total no. of posts is 16. The last date for online applications is 26 February 2026.

Faculty Jobs

Dr. B.R. Ambedkar National Institute of Technology, Jalandhar (NIT) is inviting applications for Professor, Associate Professor, and Assistant Professor positions on a regular basis. The total number of posts is 101. The application fee is Rs.2000. Eligible candidates can apply online before 27 February 2026.

Did You Apply..?

Today (February 17) is the last date for the following Jobs

- 225 Insurance Medical Officer (IMO) Grade-2 posts in ESIC. ***Eligibility:*** MBBS.
- 13 Manager Jobs at UCSL. ***Eligibility:*** Degree (Engineering).
- Research Associate posts at IIT BHU. ***Eligibility:*** Degree, PG/PhD.

For more information and other notifications - scan QR code

Bank Exams

Quantitative Aptitude

Chain Rule

1. 27 persons engaged to complete a work in 45 days. After 30 days it is observed that only $\frac{3}{5}$ th part of the work has been completed. The number of more persons to be engaged to complete the remaining work in the said period is:

A) 10 B) 8 C) 9 D) 3 E) 7

2. If 220 workers can construct a wall of 3410 meters long in 31 days, then the number of workers required to construct a similar wall of 3575 meters long in 25 days.

A) 275 B) 286 C) 300 D) 250 E) 225

3. A contractor employed 110 workers at the beginning to complete a work in 60 days. After 50 days he engaged 110 more workers and completed the work in stipulated time. If he had not engaged the additional workers, how many days behind schedule would it be finished?

A) 10 B) 15 C) 12 D) 7 E) 11

4. A garrison had provisions for a certain number of days. After 14 days, $\frac{1}{4}$ of the men desert, and it is found that the remaining provisions will now last just as long as originally planned. How long were the provisions originally meant to last?

A) 52 days B) 50 days C) 48 days D) 56 days E) 42 days

5. 800 soldiers have food for 51 days. After 15 days, 200 soldiers leave and the remaining soldiers start consuming 20% more food per day. How long will provisions last?

A) 54 days B) 53 days C) 55 days D) 52 days E) None of the above

6. The cost of 18 packets of sugar, each weighing 850 grams is Rs.36. What will be the cost of 34 packets of sugar. If each packet weight 1 kg?

A) 85 B) 80 C) 90 D) 87 E) 110

7. Amith can complete certain work in 18 days. If after every 6 days his efficiency increases by 20%, then in in how many days will the total work be completed?

A) 15 days B) $15\frac{1}{2}$ days C) $15\frac{2}{3}$ days D) $15\frac{1}{3}$ days E) None of the above

8. 25 persons working 8 hours a day can complete a work in 18 days. In how many days 30 persons working 10 hours a day will complete 90% of that work?

A) $10\frac{4}{5}$ days B) $10\frac{1}{5}$ days C) 11 days D) $10\frac{3}{5}$ days E) None of the above

9. A group of workers can complete a construction work in 78 days. When they are working individually. On the first day one person works, on the second day another person joins him, on the third day one more person joins them and this process continues till the work is completed. How many days are needed to complete the work?

A) 10 days B) $11\frac{2}{3}$ days C) 12 days D) $13\frac{1}{3}$ days E) 16 days

10. A contractor under took to finish a bridge construction work in 170 days and employed 180 men on it. After 120 days, he found that $\frac{4}{5}$ th of the work had completed. The number of men can discharge now, so that the work may finish in time is?

A) 72 B) 80 C) 75 D) 108 E) 112

11. 24 workers can finish a road work in 45 days. After how many days should 6 workers leave the jobs, so that work is completed in 50 days?

A) 25 days B) 30 days C) 35 days D) 28 days E) 11 days


12. 72 men working 6 hours a day plan to complete a building repair work in 12 days. After 7 days, they were able to complete only 45% of the work. The number of hours, they should work per day so as to complete the remaining work on remaining 5 days is:

A) $10\frac{11}{15}$ hrs B) $10\frac{13}{15}$ hrs C) $10\frac{14}{15}$ hrs D) $10\frac{4}{15}$ hrs E) $11\frac{3}{11}$

Scan the QR code for Key

These model questions were prepared by ***Dr.Vangala Srinivas, Subject Expert***

భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) 650 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో ప్రతిభతో నియామకాలుంటాయి. ఇలా అవకాశం వచ్చిన వారు మొదటి నెల నుంచే రూ.58 వేల వేతనం అందుకోవచ్చు. ఇతర ప్రోత్సాహకాలూ ఉంటాయి. అనుభవం, శాఖాపరమైన పరీక్షలతో భవిష్యత్తులో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.



అసిస్టెంట్ కొలువులకు ఆర్‌బీఐ పిలుపు!

ఎక్కువ మంది ప్రాధాన్యం ఇచ్చే వాటిలో ఆర్‌బీఐ ఉద్యోగాలు ముఖ్యమైనవి. వారానికి ఐదు పని దినాలు, తక్కువ పనివేళలు, ఒత్తిడి లేని విధులు ఈ కేంద్ర బ్యాంకు ప్రత్యేకత. అసిస్టెంట్‌గా ఎంపికైనవారు బ్యాంకుల లావాదేవీలను పరిశీలిస్తారు. మూడేళ్ల ఉద్యోగ అనుభవం తర్వాత శాఖాపరమైన పరీక్షలతో గ్రేడ్ ఏ, అనంతరం గ్రేడ్ బీ స్థాయినీ చేరుకోవచ్చు. అసిస్టెంట్ పోస్టులకు ముందుగా ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికి ప్రధాన పరీక్ష ఉంటుంది. ఈ దశను దాటిన వారు భాషా నైపుణ్య పరీక్షలో అర్హత సాధించడం తప్పనిసరి. ఈ మార్కులను తుది నియామకాల్లో పరిగణనలోకి తీసుకోరు. ప్రధాన పరీక్ష స్కోరుతో మెరిట్, రిజర్వేషన్లు అనుసరించి ఉద్యోగానికి ఎంపిక చేస్తారు. అసిస్టెంట్‌గా చేరిన వారికి రూ.29,000 మూలవేతనం చెల్లిస్తారు. అన్నీ కలిపి నెల జీతం రూ.58,514 అందుతుంది. దీనికి హెచ్‌ఆర్‌ఏ, పలు ప్రోత్సాహకాలు అదనం. ఆర్‌బీఐ వసతి గృహాల్లో అవకాశం లేకపోతే నెల జీతంలో 15 శాతం హెచ్‌ఆర్‌ఏ చెల్లిస్తారు.

లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ

మెయిన్స్‌లో అర్హత సాధించినవారికి భాషా నైపుణ్య పరీక్ష (ఎల్‌పీటీ) నిర్వహిస్తారు. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న కార్యాలయానికి కేటాయించిన భాషలో ఈ పరీక్ష రాయాలి. హైదరాబాద్‌లోని 11 ఖాళీలకు మాత్రమే తెలుగు భాషలో పరీక్ష రాసే అవకాశం ఉంది. ముంబయి కార్యాలయంలో 249 ఖాళీలు ఉన్నాయి. వీటికి పోటీ పడడానికి మరాఠీ లేదా కొంకణి భాషలో ప్రావీణ్యం అవసరం. హిందీ భాష వచ్చిన వారు చండీగఢ్ 20/ కాన్పూర్ అండ్ లఖ్‌నవూ 50/ నాగ్‌పుర్ 17/ న్యూదిల్లీ 49 ఖాళీల్లో ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని పోటీ పడవచ్చు. బెంగళూరు 24 ఖాళీలకు కన్నడ వచ్చినవారు, చెన్నై 53 ఖాళీలకు తమిళంతో పోటీ పడొచ్చు.

ముఖ్య సమాచారం

అర్హత: 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు ఉత్తీర్ణులైతే చాలు.

వయసు: ఫిబ్రవరి 1, 2026 నాటికి 20 - 28 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే ఫిబ్రవరి 2, 1998 - ఫిబ్రవరి 1, 2006 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 8

దరఖాస్తు రుసుం: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు రూ.50. మిగిలిన అందరికీ రూ.450. జీఎస్టీ అదనం

ప్రిలిమినరీ పరీక్ష తేదీ: ఏప్రిల్ 11

మెయిన్ పరీక్ష తేదీ: జూన్ 7

వెబ్‌సైట్: https://www.rbi.org.in/

ప్రాథమిక పరీక్ష

వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున వంద ప్రశ్నలు వస్తాయి. ఇందులో 3 విభాగాలు ఉన్నాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30, న్యూమరికల్ ఎబిలిటీ 35, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి ఒక గంట. ఒక్కో విభాగాన్నీ 20 నిమిషాల్లో పూర్తిచేయాలి. ఇందులో అర్హత సాధించినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఒక్కో పోస్టుకూ పది మంది చొప్పున ప్రధాన పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.

ప్రధాన పరీక్ష

ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున 200 ప్రశ్నలకు 200 మార్కులు. ఐదు విభాగాల్లో ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచీ 40 చొప్పున.. రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్‌ల్లో ప్రశ్నలు అడుగుతారు. జనరల్ అవేర్‌నెస్ విభాగానికి 25 నిమిషాలు, కంప్యూటర్ నాలెడ్జ్‌కు 20 నిమిషాల వ్యవధి ఉంది. మిగిలిన ఒక్కో విభాగాన్నీ 30 నిమిషాల్లో పూర్తిచేయాలి. మొత్తం పరీక్ష వ్యవధి 135 నిమిషాలు. ఇందులో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం విభాగాల వారీ ఒక్కో పోస్టుకు ఇద్దరి చొప్పున లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ పరీక్షకు ఎంపిక చేస్తారు.

✦ ప్రాథమిక, ప్రధాన.. రెండు పరీక్షల్లోనూ ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. ప్రశ్నలు ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో అడుగుతారు. హైదరాబాద్ ఖాళీలకు దరఖాస్తు చేసుకున్నవారు కావాలనుకుంటే తెలుగులోనూ పరీక్ష రాసుకోవచ్చు. రెండు పరీక్షల్లోనూ విభాగాల వారీ అర్హత మార్కులు పొందడం తప్పనిసరి.

సన్నద్ధత

✦ ఇప్పటి నుంచి ప్రిలిమినరీకి సరిగా 53 రోజులు ఉన్నాయి. ఉన్న వ్యవధిని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకుంటే పోటీలో నిలుస్తారు. ఇప్పటికే బ్యాంకు పరీక్షల సన్నద్ధతలో ఉన్నవారికి ఇది మంచి అవకాశం.

✦ తాజా అభ్యర్థులైతే నెల రోజుల పాటు రోజూ ప్రాథమికాంశాలు చదివి, విభాగాల్లోని అంశాల వారీ మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. చివరి 20 రోజులు మాక్ టెస్టులు రాయాలి.

✦ ప్రతి విభాగాన్నీ నిర్ణీత సమయంలోనే పూర్తిచేయాలి. అలాగే అన్ని విభాగాల్లోనూ కనీస మార్కులు పొందడం తప్పనిసరి. కాబట్టి ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయకూడదు.

✦ రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఉన్న వ్యవధిలో ఎక్కువ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడానికి వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయడమే మార్గం.

✦ ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ ఈ మూడు అంశాలూ ప్రాథమిక, ప్రధాన పరీక్ష రెండిటిలోనూ ఉన్నాయి కాబట్టి ఒకే సన్నద్ధతతో ప్రిలిమ్స్, మెయిన్స్ రెండిటినీ ఎదుర్కోవచ్చు. జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్ విభాగాలను ప్రాథమిక పరీక్ష అనంతరం చదువుకోవాలి.

✦ న్యూమరిల్ ఎబిలిటీ ప్రశ్నలు సులువుగా ఉన్నప్పటికీ సమాధానం రాబట్టడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. అందువల్ల తక్కువ వ్యవధిలో సమాధానం గుర్తించడానికి అవకాశం ఉన్న ప్రశ్నలపైనే ముందు దృష్టి పెట్టాలి. ఆ తర్వాతే మిగిలినవి ప్రయత్నించాలి.

✦ కూడికలు, తీసివేతలు, భాగహారం, గుణింతాలపై పట్టు సాధించాలి. అంకెలు, సూక్ష్మీకరణపై ప్రావీణ్యం పొందితే ఎక్కువ మార్కులు సొంతం చేసుకోవచ్చు.

✦ రుణాత్మక మార్కులు కారణంగా తెలియని ప్రశ్నలను వదిలేయడమే మంచిది.

✦ ఆర్‌బీఐ అసిస్టెంట్స్ పాత ప్రశ్నపత్రాలు బాగా సాధన చేయాలి.

✦ మాక్ టెస్టులు రాస్తున్నప్పుడు ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

ఎంపీసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. సౌండ్ ఇంజినీరింగ్ చేయాలనుంది. ఈ కోర్సు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ అందుబాటులో ఉంది? - కావ్య



సౌండ్ ఇంజినీరింగ్ కోర్సు ఏ సంస్థల్లో?

■ సౌండ్ ఇంజినీరింగ్ అనేది శబ్దాన్ని సాంకేతిక పద్ధతుల ద్వారా రికార్డు చేయడం, ఎడిట్ చేయడం, మిక్స్ చేయడం, మెరుగుపరచడం లాంటి ప్రక్రియలకు సంబంధించిన ఒక ముఖ్యమైన టెక్నికల్ కోర్సు. సినిమా, టెలివిజన్, రేడియో, సంగీతం, యూట్యూబ్, డిజిటల్ మీడియా లాంటి రంగాల్లో శ్రావ్యమైన ధ్వనులను అందించడంలో సౌండ్ ఇంజినీర్లు కీలక పాత్ర పోషిస్తారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున ఈ కోర్సుకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత సౌండ్ ఇంజినీరింగ్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ ప్రోగ్రామ్స్‌లో చేరవచ్చు. సౌండ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఆడియో రికార్డింగ్, సౌండ్ ఎడిటింగ్, మిక్సింగ్, మాస్టరింగ్, స్టూడియో పరికరాల వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ కూడా అందిస్తారు.

◗ హైదరాబాద్‌లో సౌండ్ ఇంజినీరింగ్ శిక్షణలో.. పత్సవ్ అకాడమీ, ఎస్ఏఈ ఇన్‌స్టిట్యూట్, ఎల్‌వీ ప్రసాద్ కాలేజ్ ఆఫ్ మీడియా స్టడీస్ ముఖ్యమైనవి. ఈ సంస్థల్లో పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వంలో ప్రాక్టికల్ శిక్షణ పొందవచ్చు. దేశంలోని కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ సంస్థలు బీటెక్/ బీఈ సౌండ్ ఇంజినీరింగ్ కోర్సు అందిస్తున్నాయి. జేఈఈ/ సీయూఈటీ.. మొదలైన పరీక్షల స్కోరుతో ప్రవేశం లభిస్తుంది. మేటి అవకాశాలకు సర్టిఫికెట్, డిప్లొమా కోర్సుల కంటే బీటెక్‌లో చేరడమే మంచిది..

సౌండ్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా/ డిగ్రీ పూర్తిచేసిన తర్వాత సినిమా పరిశ్రమ, టీవీ ఛానెళ్లు, ఎఫ్ఎం రేడియో స్టేషన్లు, మ్యూజిక్ స్టూడియోలు, యూట్యూబ్ ఛానెళ్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రారంభంలో నెలకు ఇరవై నుంచి ముప్పై వేల రూపాయల వరకు వేతనం లభించినా, అనుభవం పెరిగే కొద్దీ ఎక్కువే పొందవచ్చు.

◗ సంగీతం, టెక్నాలజీలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు సౌండ్ ఇంజినీరింగ్ భవిష్యత్తు ఉన్న కెరియర్ ఎంపిక. పేరున్న సంస్థలో శిక్షణ తీసుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఇన్‌స్టిట్యూట్ ఎంచుకునే ముందు దాని విశ్వసనీయత గురించి పూర్తిగా తెలుసుకున్నాకే సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ప్రేరణ క్రమంగా తగ్గుతోందా..

విద్యార్థులు కోర్సుల్లో చేరిన కొత్తలో ఎంతో ఉత్సాహంతో ఉంటారు. అయితే వీరిలో కొంత మందికి తొలి నాళ్లలో ఉన్న ఉత్సాహం, ప్రేరణ చివరి వరకూ కొనసాగదు. దీంతో లక్ష్య సాధనకు నెమ్మదిగా దూరమవుతుంటారు. విద్యార్థి దశలో ఇలాంటివి సాధారణమే. అయితే కొన్ని పద్ధతులను పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.



స్పష్టమైన లక్ష్యమంటూ లేకపోవడం, ఒకేసారి ఎక్కువ పనులు పెట్టుకోవడం, సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయాన్ని గడపడం, కొన్ని సబ్జెక్టులంటే ఆసక్తి లేకపోవడం, అధ్యాపకుల కొరత, పరీక్షల్లో విఫలమవుతారనే భయం, వ్యక్తిగత, అనారోగ్య సమస్యలు.. ఇలా ఎన్నో పరిణామాలు/అంశాలు ప్రేరణ తగ్గడానికి కారణమవుతుంటాయి.

ఆసక్తికి అనుగుణంగా: ఏ సబ్జెక్టులంటే ఇష్టం, ఎలాంటి ఉద్యోగం చేయాలనుకుంటున్నారు, మీ ఆసక్తులు, అభిరుచులకు దగ్గరగా ఉండే కెరియర్ ఏది? బలాలు బలహీనతలు ఏమిటి? ఇలా ప్రతి విషయాన్నీ నిశితంగా గమనించాలి. ఆ తర్వాతే తగిన నిర్ణయం తీసుకోవాలి. దీనివల్ల కోర్సు మధ్యలోనే నిరాసక్తతకు లోనయ్యే పరిస్థితి ఉండదు.

అన్నీ ఒకేసారి: ఒకే రోజు వివిధ సబ్జెక్టుల్లోని పాఠాలు చదివేయాలని తాపత్రయపడకూడదు. చదివిన పాఠం పూర్తిగా అర్థమైన తర్వాతే మరోదాన్ని మొదలుపెట్టాలి. ఇలా చేయడం వల్ల బాగా అలసిపోయామనే భావన కలగదు. మరో కొత్త పనినీ ఉత్సాహంగా ప్రారంభించగలుగుతారు.

స్టడీ ప్లాన్ ముఖ్యం: కొందరు విద్యార్థులు వారికి ఎప్పుడు ఏది నచ్చితే అది చదువుతుంటారు. అలాకాకుండా స్టడీప్లాన్ వేసుకుని ఏ సబ్జెక్టుకు ఎంత సమయం కేటాయించాలో తెలుసుకోవాలి. అలాగే మధ్యలో కాసేపు విరామం తీసుకోవాలనే విషయాన్నీ గుర్తుంచుకోవాలి. పొమడారో లేదా మరే ఇతర పద్ధతైనా అనుసరించడం వల్ల ప్రయోజనం ఉంటుందని నిపుణులూ చెబుతున్నారు. ప్రతి అరగంటకూ ఐదు నిమిషాలు లేదా గంటకు పది నిమిషాలు చొప్పున విరామం తీసుకోవాలి.

సానుకూల ఆలోచనలు: గతంలోని ప్రతికూల ఫలితాలను పదే పదే గుర్తు చేసుకోకూడదు. తక్కువ మార్కులు వచ్చినప్పుడు ఇక ఎప్పటికీ పరిస్థితి ఇలాగే ఉంటుందనుకుంటే చదవాలనే ఆసక్తి తగ్గిపోతుంది. అలాకాకుండా సానుకూలంగా ఆలోచించాలి. తర్వాత పరీక్షల్లో తప్పకుండా ఎక్కువ మార్కులు తెచ్చుకుంటానని సాధన ప్రారంభించాలి.

ఇతరులతో పోల్చుకోవడం: ఒక్కోసారి మానసిక ఒత్తిడి కారణంగా చదువులో వెనకబడినట్టు అనిపించవచ్చు. ఇతరులతో పోల్చుకుని బాధపడటంతో ఆందోళన పెరుగుతుంది. ఆత్మవిశ్వాసమూ తగ్గిపోతుంది. అందుకే సమస్య ఎదురైన వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేయకుండా.. దాని వెనుక ఉన్న కారణాలను తెలుసుకుని పరిష్కరించడానికి ప్రయత్నించాలి.

అభిరుచులతో ప్రయోజనం: తరగతి పాఠాలకు మాత్రమే పరిమితం కాకుండా అభిరుచులకు అనుగుణంగా ఇతర వ్యాపకాల్లోనూ చురుగ్గా పాల్గొనాలి. అవి క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం, విదేశీ భాషలు నేర్చుకోవడం, కంప్యూటర్ నైపుణ్యాలు ఏవైనా కావొచ్చు. వాటివల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆ స్ఫూర్తి చదువులోనూ కొనసాగుతుంది.

చదువు తప్ప మరో వ్యాపకం ఏదీ లేకపోవడం వల్ల ఒక్కోసారి బాగా ఒత్తిడిగా అనిపించవచ్చు. ఇలాంటప్పుడు స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమస్యలను పంచుకోవడం, నచ్చిన పుస్తకం చదవడం, సరదాగా బయటకు వెళ్లడం లాంటివి చేయాలి. దీంతో ఆ మర్నాడు మరింత ఉత్సాహంగా చదవగలుగుతారు.

సైంటిస్టులు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, న్యూదిల్లీ.. సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. సైంటిస్ట్-సీ గెజిటెడ్ గ్రూప్-ఎ: 10 పోస్టులు.
అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, ఎండీ.
వేతన శ్రేణి: నెలకు రూ.67,700 - 2,08,700.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు ఫీజు:** రూ.2000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు. **ఎంపిక:** రాత పరీక్ష (సీబీటీ), ఇంటర్వ్యూలతో.. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 14.03.2026.
వెబ్‌సైట్: https://dbtindia.gov.in/

సీనియర్ రిసెర్చ్ ఫెలో

ఐకార్ - ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - డివిజన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎకనామిక్స్, న్యూదిల్లీ .. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● సీనియర్ రిసెర్చ్ ఫెలో
అర్హత: మాస్టర్స్ డిగ్రీతో పాటు నెట్ స్కోరు, ఉద్యోగానుభవం ఉండాలి. **వేతనం:** నెలకు రూ.35,000. **వయసు:** 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. **ఇంటర్వ్యూ తేదీ:** 06.03.2026. **వేదిక:** డివిజన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎకనామిక్స్, ఐసీఏఆర్-ఐఏఆర్ఐ, పుస క్యాంపస్, న్యూదిల్లీ.
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

జేఆర్ఎఫ్‌లు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), రిషికేశ్.. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● జూనియర్ రిసెర్చ్ ఫెలో
అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ.
వేతనం: నెలకు రూ.12,000.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో
దరఖాస్తు: ఈమెయిల్ ద్వారా em@aiimsrishikesh.edu.in కు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 11.03.2026
వెబ్‌సైట్: https://aiimsrishikesh.edu.in/a1_1/?page_id=2809

ఎయిమ్స్‌లో

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), రిషికేశ్.. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
● ఫార్మసిస్ట్/ నర్సింగ్ ఆఫీసర్: 01 ● టెక్నీషియన్: 01
● డేటా ఎంట్రీ ఆపరేటర్: 01
అర్హత: డిప్లొమా/ బీఫార్మసీ/ బీఎస్సీ (ఫార్మసిస్ట్/ నర్సింగ్ ఆఫీసర్/ రేడియోలాజికల్ ఇమేజింగ్ టెక్నిక్స్/ కంప్యూటర్ అప్లికేషన్స్).
వేతనం: నెలకు ఫార్మసిస్ట్/ నర్సింగ్ ఆఫీసర్, టెక్నీషియన్‌కు రూ.40,000. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.30,000.
చిరునామా: ఆఫ్‌లైన్ దరఖాస్తులను.. ఎయిమ్స్ రిషికేశ్‌లోని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి పంపాలి. **దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 23.02.2026
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://aiimsrishikesh.edu.in/a1_1/?page_id=2809

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఏఐ వీడియో కంటెంట్
సంస్థ: బ్రెయిన్ క్వెస్ట్
నైపుణ్యాలు: ఏఐ వీడియో జనరేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ టూల్స్ **స్టైపెండ్:** రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 13
☛ https://shorturl.at/1M5gx

గేమ్ డెవలపర్
సంస్థ: కిడ్ లోల్యాండ్ కిడ్స్ అండ్ టోడ్లర్ గేమ్స్ ప్రై.లి. **నైపుణ్యం:** యూనిటీ ఇంజిన్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: మార్చి 14
☛ https://tinyurl.com/2p4awck8

ప్రజెంటేషన్ కన్సల్టెంట్
సంస్థ: వియ్ సోర్స్ యు
నైపుణ్యాలు: ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ అనాలిసిస్, ఎంఎస్-పవర్‌పాయింట్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్, స్టోరీటెల్లింగ్
స్టైపెండ్: రూ.11,000-17,000
దరఖాస్తు గడువు: మార్చి 14
☛ https://shorturl.at/cQmE1

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: ఫుడ్ వాలాస్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, కేన్వా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్ **స్టైపెండ్:** రూ.7,500-12,000
దరఖాస్తు గడువు: మార్చి 14
☛ https://tinyurl.com/yubxxpdr

3డీ విజువలైజర్
సంస్థ: ద టైల్స్ హౌస్
నైపుణ్యాలు: ఆటోడెస్క్ రెవిట్, బ్లెండర్ 3డీ, గూగుల్ స్కెచప్ **స్టైపెండ్:** రూ.3,500-4,000
దరఖాస్తు గడువు: మార్చి 13
☛ https://tinyurl.com/53vjem73

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: ట్రయొర జెనిత్ ప్రై.లి.
నైపుణ్యాలు: కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ **స్టైపెండ్:** రూ.5,000
దరఖాస్తు గడువు: మార్చి 13
☛ https://tinyurl.com/uwj8m2th

ఆపరేషన్స్
సంస్థ: ఇంపాక్ట్ గ్రేడ్ ఎడ్యుకేషన్
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ మేనేజ్‌మెంట్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-పవర్‌పాయింట్, ఎంఎస్-వర్డ్, జోహో సీఆర్ఎం
స్టైపెండ్: రూ.4,000-5,000
దరఖాస్తు గడువు: మార్చి 13
☛ https://shorturl.at/hOwZ3

అడ్మిషన్స్ అసోసియేట్
సంస్థ: యాక్సిలిస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ప్రై.లి. **నైపుణ్యాలు:** క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్, హిందీ మాట్లాడటం, సేల్స్ **స్టైపెండ్:** రూ.4,000-13,000
దరఖాస్తు గడువు: మార్చి 13
☛ https://tinyurl.com/m38auyhr

నైపుణ్యానికి మార్గం నిరంతర అభ్యాసం

నేటి పోటీ ప్రపంచంలో పాత కొలువులెన్నో కనుమరుగవుతున్నాయి. కృత్రిమ మేధ, డిజిటల్ టెక్నాలజీ, ఆటోమేషన్ లాంటివి ఉద్యోగ రంగాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో విద్యార్థులు, ఉద్యోగార్థులు కొలువులు సాధించాలంటే "లెర్న్, అన్ లెర్న్, రీలెర్న్' నైపుణ్యాలు పెంచుకోవాలి.

లెర్నింగ్

విశ్వవ్యాప్త అవకాశాలు అందుకోవడంలో మల్టిపుల్ స్కిల్స్ ఉన్నవారు ముందుంటున్నారు. అందువల్ల ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నవారు, విద్యార్థులూ.. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. కోడింగ్, డేటా విశ్లేషణ, కమ్యూనికేషన్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్ లాంటివి భవిష్యత్తులో ఎంతో మేలు చేస్తాయి. అందువల్ల ప్రతిరోజూ కొంత సమయాన్ని కొత్త విషయాలను నేర్చుకోవడానికి కేటాయించాలి. ఉదాహరణకు మీరు బీటెక్ చదువుతోన్న విద్యార్థులైతే.. సిలబస్‌తో పాటు పైతాన్, డేటా అనాలిసిస్ లాంటి కోర్సులు నేర్చుకుంటే ఎంతో మేలు. ఇలా మీ విద్యా నేపథ్యం అనుసరించి కోర్సుకు సంబంధించిన సిలబస్ మాత్రమే కాకుండా అదనపు నైపుణ్యాలపై దృష్టి సారించాలి. దీంతో ఇంటర్న్‌షిప్పులతో పాటు ఉద్యోగాలు పొందడంలో ముందుంటారు.



అన్ లెర్నింగ్

ఒకే డిగ్రీ, ఒకటే నైపుణ్యం అనేవి కెరియర్‌ని ముందుకు తీసుకెళ్లలేవు. కొత్త ఉద్యోగాలు పొందాలంటే పాత నైపుణ్యాలు వదులుకోవాలి. మార్పులకు సిద్ధపడాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త మెలకువలపై దృష్టి సారించాలి. గతంలో ఎక్కువ అకడమిక్ మార్కులు పొందినవారు మిగతా వారితో పోలిస్తే కొంచెం సులువుగా ఉద్యోగానికి ఎంపికయ్యేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కులొక్కటే సరిపోవడం లేదు. కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి సారించడం తప్పనిసరి. అన్‌లెర్నింగ్ అంటే ఆలోచనల్లో ఫ్లెక్సిబిలిటీ కలిగి ఉండటమే. కాలానుగుణంగా పాత నైపుణ్యాలను వదిలేసి, కొత్త వాటికి అలవాటు పడటమే.

రీ లెర్నింగ్

టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో వినియోగదారులు, మార్కెట్‌లను అనుసరించి సంస్థలు ఎంపిక పద్ధతులను మార్చుకుంటున్నాయి. కొత్త సాంకేతికతలో నైపుణ్యం ఉన్నవారికే ఉద్యోగంలో అవకాశం కల్పిస్తున్నాయి. అందువల్ల ఒకసారి నేర్చుకున్నదానితో ఆగిపోకుండా, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. ఇలా చేస్తేనే పోటీలో ఉండటానికి వీలవుతుంది. రాహుల్ గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. ముందు అతడికి సాధారణ డిజైన్ టూల్స్ మాత్రమే తెలుసు. కానీ ఏఐ ఆధారిత డిజైన్ టూల్స్ రావడంతో వాటినీ నేర్చుకున్నాడు. దీంతో అతడి కెరియర్ మరింత మెరుగ్గా మారింది. కాబట్టి అవసరమైనప్పుడు ఇలా కొత్త టెక్నాలజీ నైపుణ్యాలను మళ్లీ మళ్లీ నేర్చుకుంటూనే ఉండాలి.

చివరిగా ఉద్యోగార్థులే కాదు కొలువుల్లో ఉన్నవారు కూడా నేర్చుకోవడాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. కొత్త నైపుణ్యాలతో పాటు సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్నీ పెంచుకోవాలి. అలాగే నాయకత్వ లక్షణాలూ అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో స్థిరమైన కెరియర్ మీ సొంతమవుతుంది.

క్యాన్సర్‌కు కణ చికిత్స


- కార్-టి సెల్, జన్యు థెరపీలకు పునర్నిర్వచనం
- భవిష్యత్తులో వ్యాధి స్వభావానికి తగ్గట్టుగా ఔషధాలు
- కణ, జన్యు చికిత్సల్లో భారత్‌తో కలిసి పనిచేస్తాం
- 'ఈనాడు'తో పెన్సిల్వేనియా వర్సిటీ ప్రొ.డాక్టర్ బ్రూస్ లెవిన్
- నేడు జీనోమ్‌వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు స్వీకరించనున్న వైద్య శాస్త్రవేత్త



అయితరాజు రంగారావు
ఈనాడు - హైదరాబాద్

క్యాన్సర్ చికిత్సలో ఒక విప్లవాత్మక అధ్యాయం మొదలైంది. మహమ్మారిని అంతమొందించేందుకు 'కణ' చికిత్సను విజయవంతంగా ఆవిష్కరించారు అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బ్రూస్ లెవిన్. వర్సిటీలోని 'పెరెల్మాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్'లో క్యాన్సర్ చికిత్సలో సెల్, కార్-టి సెల్, జన్యు థెరపీలపై ఆయన చేసిన పరిశోధనలు విజయవంతమయ్యాయి. ఆయన నేతృత్వంలోని బృందం చేసిన పరిశోధన కణం, జన్యుచికిత్సల సరిహద్దులను పునర్నిర్వచించింది. ఇంజినీర్డ్ టి-సెల్, కార్-టి సెల్ చికిత్సలను ముందుకు తీసుకెళ్లడంలో.. క్యాన్సర్ చికిత్సలో ఎఫ్‌డీఏ ఆమోదించిన జన్యు చికిత్సల ఆవిర్భావానికి ప్రత్యక్షంగా దోహదపడింది. క్యాన్సర్ చికిత్సల్లో విప్లవాత్మక పురోగతి సాధించిన డాక్టర్ బ్రూస్ లెవిన్‌కు ప్రతిష్ఠాత్మక బయోఆసియా సదస్సులో మంగళవారం జీనోమ్‌వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా 'ఈనాడు'కి ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో పలు అంశాలపై మాట్లాడారు.

కార్-టి చికిత్సలో మీ ప్రధాన ఆవిష్కరణ ఏమిటి? క్యాన్సర్ చికిత్సలో వినియోగించే 'క్రిమియా' ఔషధానికి ఎఫ్‌డీఏ ఆమోదం లభించడంలో మీ పాత్ర నిర్వచించండి..



ఒక శక్తిమంతమైన జీవశాస్త్ర భావన (కాన్సెప్ట్)ను వైద్యపరంగా తిరిగి వినియోగించగలిగే చికిత్స విధానంగా మార్చడంలో మా పరిశోధన కీలకంగా మారింది. ఇందులో రోగి శరీరం నుంచి టి-కణాలను తీసుకొని.. వాటిని క్యాన్సర్‌ను గుర్తించేలా మార్పులు చేసి.. అతని శరీరంలోకే ఒక 'సజీవ ఔషధం'గా ప్రవేశపెట్టడం.. ఆ కణాలు శరీరంలో వృద్ధి చెంది.. క్యాన్సర్‌పై పోరాడటం.. చికిత్సలో ప్రధానాంశం. 'క్రిమియా' ఔషధ తయారీ సంబంధించిన పూర్తి విధానాన్ని రూపొందించాం. అది రెగ్యులేటరీ సంస్థల ప్రమాణాలకు లోబడి ఉండేలా చూశాం. నియంత్రణ సంస్థలు విశ్వసించదగిన డేటాను రూపొందించడానికి క్లినికల్ బృందం, పరిశ్రమ భాగస్వాములతో కలిసి పని చేశాం. 'పెన్' విశ్వవిద్యాలయంలో మేం పాటించిన విధానాలనే 'నోవార్టిస్' సంస్థ కూడా పాటించేలా సాంకేతిక బదిలీ (టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్) చేయడంలో మా బృందం కీలక పాత్ర పోషించింది. దీనివల్ల లుకేమియా, లింఫోమాతో బాధపడే వారికి ఎఫ్‌డీఏ ఆమోదిత జన్యు చికిత్స అందుబాటులోకి వచ్చింది.

● ఈ తరహా చికిత్స తీసుకున్న మొదటి చిన్నారి ఎమిలీ వైట్‌హెడ్ 14 ఏళ్లుగా ఆరోగ్యంగా ఉన్నారు. ఈ ఫలితం ఎటువంటి ఆశలు రేకెత్తిస్తోంది?

ఎమిలీ ఇన్నేళ్లుగా ఆరోగ్యంగా ఉండటం.. 'కార్-టి' థెరపీ తాత్కాలిక ఉపశమనం కాదని, దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తోందని నిరూపిస్తోంది. అలాగే కొంతమంది రోగుల్లో వ్యాధి ఎందుకు తిరగబెడుతోంది? దీర్ఘకాలిక ఉపశమనం కోసం ఏం చేయాలి? అనే విషయాల అంతు చూసేలా మమ్మల్ని ప్రోత్సహిస్తోంది. క్యాన్సర్, ఇతర తీవ్రమైన వ్యాధులతో పోరాడుతున్న కుటుంబాలకు మద్దతు ఇవ్వడానికి ఎమిలీ కుటుంబం స్థాపించిన 'ఎమిలీ వైట్‌హెడ్ ఫౌండేషన్' రోగులకే కాదు.. మాలాంటి పరిశోధకులకూ స్ఫూర్తిదాయకం.

● క్యాన్సర్‌కే కాకుండా.. ఈ చికిత్స ఇతర వ్యాధులకు ఎలా ఉపయోగపడుతుంది?

ప్రస్తుతం 'స్వయం ప్రతిరక్షక వ్యాధుల (ఆటోఇమ్యూన్ డిసీజెస్)' చికిత్సలో ఇది ఆశాజనకంగా మారింది. రోగనిరోధక వ్యవస్థకు 'పునః శిక్షణ (రీ ఎడ్యుకేషన్)' ఇవ్వడం ద్వారా.. మందులు వాడే అవసరం లేకుండానే వ్యాధిని లోతుగా నయం చేయవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. స్వల్పకాలంలో 'ఆటోఇమ్యూన్ డిసీజెస్' చికిత్సలో వేగవంతమైన విజయాలు సాధించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

ఈ చికిత్స ఖరీదైనది, ఎక్కువ సమయం తీసుకుంటుంది కదా? పరిష్కారాలేంటి?

ఈ విధానంలో ప్రతి రోగికి ప్రత్యేకంగా మందు తయారు చేయాల్సి రావడం, మానవ శ్రమ, నాణ్యతా పరీక్షల వల్ల ఖర్చు, సమయం ఎక్కువవుతోంది. ఆటోమేషన్ (యంత్రాల వినియోగం)తో సమయాన్ని, వ్యత్యాసాలను తగ్గించవచ్చు. ఇక ఇన్-వివో డెలివరీ (శరీరంలోనే మందు తయారీ) అనేది విప్లవాత్మకమైన ఆలోచన. నేరుగా రోగి శరీరంలోనే రోగనిరోధక కణాలను సురక్షితంగా మార్పు చేయగలిగితే ఖర్చు బాగా తగ్గుతుంది. ఈ చికిత్సను విశ్వసనీయ సేవలు మార్చడమే మా లక్ష్యం.



గట్టి కణితులు (సాలిడ్ ట్యూమర్స్) నయం చేయడం కష్టమంటారు.. ఎందుకని?

ప్యాంక్రియాటిక్ లేదా ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి గట్టి కణితులను గుర్తించే లక్ష్యం (టార్గెట్) స్పష్టంగా ఉండదు. పైగా కణితి చుట్టూ ఉండే వాతావరణం మన టి-కణాలను అణిచివేస్తుంది. ఆ కణజాలంలోకి టి-కణాలు చొచ్చుకెళ్లి నిలబడడం కష్టం. మరో సమస్య ఏమిటంటే.. కణితిలోని అన్ని కణాలు ఒకేలా ఉండవు (హెటిరోజెనిటీ). అంటే ప్రతి క్యాన్సర్ కణం ఒకేరకమైన గుర్తును కలిగి ఉండదు. అందుకే మేము ఒకేసారి బహుళ మార్గాల్లో కణితిపై దాడిచేసే విధానాలు, క్లిష్టమైన వాతావరణాన్ని తట్టుకునే కణాలను రూపొందిస్తున్నాం. కేవలం ఒక కణంపై కాకుండా.. మొత్తం వ్యవస్థపై చికిత్స చేస్తున్నట్లుగా మా వ్యూహాలు ఉంటాయి.

సెల్, జీన్ థెరపీ రంగంలో రాణించాలనుకునే యువ పరిశోధకులకు మీరిచ్చే సలహా?

రోగులకు ఎటువంటి చికిత్సలు అవసరమో.. అలాంటి వ్యాధులపైనే పరిశోధనలు చేయండి. మందుల తయారీ నుంచి క్లినికల్ ప్రయోగాల వరకూ పూర్తి ప్రక్రియను నేర్చుకోండి. అందరితో కలిసి పని చేయడం (కొలాబరేషన్) అలవాటు చేసుకోండి. కచ్చితత్వం, పునరుత్పత్తి పట్ల నిబద్ధతతో ఉండండి. ఫలితాలు మొదట్లో గందరగోళంగా ఉన్నా.. నిరంతరం ప్రయత్నించే వారినే ఈ రంగం ఆదరిస్తుంది.

మెర్కిన్ ప్రైజ్, జీనోమ్‌వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందుకోవడం ఎలా అనిపిస్తోంది?

ముందుగా నా గురువు, పెన్సిల్వేనియా వర్సిటీలోని 'సెంటర్ ఫర్ సెల్యులర్ ఇమ్యునోథెరపీస్ (సీసీఐ) అధిపతి, చిరకాల సహచరుడు కార్ల్ జూన్‌ని గుర్తు చేసుకోవాలి. మా అందరి సమష్టి కృషి వల్లే ఈ క్లినికల్ ట్రయల్స్, ఆవిష్కరణలు సాధ్యమయ్యాయి. 2025లో మెర్కిన్ ప్రైజ్, 2026లో జీనోమ్‌వ్యాలీ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందుకోవడం చాలా ప్రత్యేకంగా భావిస్తున్నా. ఈ పురస్కారాలు ఒక ఆవిష్కరణ ప్రయోగశాల నుంచి రోగి మంచం వరకు (బెంచ్ టు బెడ్‌సైడ్) తీసుకురావడంలో ఉన్న కృషిని గుర్తిస్తాయి.

'లాజిక్-గేటెడ్' కార్-టి కణాలతో దుష్ప్రభావాలు తక్కువంటున్నారు.. అదెలా?

ఇవి తెలివైన కణాలు. కేవలం ఒక సంకేతం కాకుండా.. నిర్దిష్ట పరిస్థితులు కల్పిస్తేనే లేదా సందర్భాన్ని బట్టి ఇవి స్పందించేలా సర్క్యూట్ ఉంటుంది. దీంతో ఆరోగ్యకర కణాలపై దాడి జరగదు. దుష్ప్రభావాలు తగ్గుతాయి. ఇప్పుడు 'పెరిల్ రొమేల్' అభివృద్ధి చేసిన కొత్త విధానం 'సింగిల్ వెక్టర్ డిజైన్' ద్వారా మొత్తం వ్యవస్థను ఒకేసారి కణంలోకి పంపవచ్చు. తయారీలో స్థిరత్వం ఉంటుంది. చికిత్స సులభమవుతుంది.

2030 నాటికి కార్-టి థెరపీ రంగం ఎలా ఉండబోతోంది?

నాలుగేళ్లలో ఇది సాధారణ చికిత్సలా మారుతుందని నమ్మకం. వ్యాధి స్వభావానికి అనుగుణంగా వివిధ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి. దుష్ప్రభావాలను ఎదుర్కొనేందుకు వచ్చే మార్పులతో ఆసుపత్రిలో చేరకుండానే చికిత్స తీసుకునే వెసులుబాటు పెరుగుతుంది. రక్త క్యాన్సర్లకు పూర్తి చికిత్స సాధారణమవుతుంది. రోగులకు వేగంగా చికిత్స అందించడానికి 'ఇన్-వివో' డెలివరీ ఆమోదం లభించవచ్చు.

భారత్ భవిష్యత్తు.. కలిసి పనిచేయడంపై మీరేమంటారు?

భారతదేశంలో లైఫ్‌సైన్సెస్ అభివృద్ధి వేగాన్ని జీనోమ్‌వ్యాలీ ప్రతిబింబిస్తోంది. నాణ్యమైన తయారీ (జీఎంపీ)లో శిక్షణ, బాధ్యతాయుతమైన క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అందరికీ అందుబాటులో ఉండేలా ఉత్పత్తిని పెంచడం వంటి అంశాల్లో భారత్‌తో కలిసి పని చేయడానికి భారీ అవకాశాలున్నాయి. నాణ్యత, ప్రమాణాల విషయంలో మనం ఒక్కటైతే.. భవిష్యత్ సెల్, జీన్ థెరపీ చికిత్సల్లో భారత్ మాకు ప్రధాన భాగస్వామి అవుతుంది.

మాజీ మంత్రి నారాయణస్వామి మా భూమి కబ్జా చేశారు

- అధికారులకు ఫిర్యాదిచ్చినా న్యాయం జరగలేదు
- తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో అప్పటి మంత్రి నారాయణస్వామి కక్షపూరితంగా తన భూమిని కబ్జా చేశారని చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం జూపల్లికి చెందిన ధర్మారెడ్డి వాపోయారు. "అప్పట్లో తెదేపా తరఫున ఎంపీటీసీ, సర్పంచి స్థానాలకు పోటీ చేసేందుకు నామినేషన్ వేశాను. నామినేషన్ ఉపసంహరించుకోవాల్సిందిగా ఆయన నా మీద ఒత్తిడి తెచ్చినా లొంగలేదు. దీంతో అక్రమంగా భూమిని లాక్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు' అని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలి వచ్చిన బాధితుల నుంచి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. భూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నా ఆన్‌లైన్‌లో తమ పేర్లు ఎక్కించుకొని వైకాపా నేతలు తన భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని తిరుపతి జిల్లా చెర్లోపల్లికి చెందిన నిరోషా తెలిపారు.

పీజీ మెడికల్ స్ట్రే కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ(ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కన్వీనర్/యాజమాన్య కోటా నాన్ సర్వీస్ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్ మాప్‌అప్ రౌండ్ తర్వాత మిగిలిన సీట్లకు 'స్ట్రే' కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం తెలిపింది. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ దరఖాస్తులకు అవకాశం ఉందని తెలిపింది. స్ట్రే సీట్ల వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

11 ఆర్టీసీ డిపోల వద్ద 20న నిరసనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 11 ఆర్టీసీ డిపోల్లో విద్యుత్ బస్సుల ఆపరేటర్లకు అవకాశం కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 20న ఆయా డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) తెలిపింది. విజయవాడలో విద్యాధరపురం, గుంటూరు-2 డిపోలను పూర్తిగా వారికి అప్పగించడం, మిగిలిన డిపోల్లో కొంత స్థలాల చొప్పున అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. ప్రైవేట్ ఆపరేటర్లతో కాకుండా ఆర్టీసీయే విద్యుత్ బస్సులను నిర్వహించాలని కోరింది. ఆర్టీసీ పరిరక్షణకు దశల వారీగా ఆందోళనలు చేస్తామని, ఇందులో భాగంగా తొలుత డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ ఎండీ కార్యాలయంలో లేఖ అందజేసినట్లు ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై దామోదరనాయుడు అప్పీల్

- పూర్తిస్థాయి వాదనలు వినకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వలేమన్న ధర్మాసనం

ఈనాడు, అమరావతి: పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా తన నియామకాన్ని రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై డాక్టర్ టి.దామోదరనాయుడు దాఖలు చేసిన రెండు అప్పీళ్లపై హైకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పూర్తిస్థాయి వాదనలు వినకుండా సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని పేర్కొంది. పదవీవిరమణ చేసిన అధికారులను పునర్నియమించడం వల్ల అర్హులైన అధికారులకు అన్యాయం జరుగుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. సింగిల్ జడ్జి తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సైతం అప్పీల్ దాఖలు చేసిందని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పడంతో అన్ని అప్పీళ్లను కలిపి విచారిస్తామంటూ ఈ నెల 24కు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ కిరణ్మయితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన దామోదరనాయుణ్ని తిరిగి నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక సీఎస్ గతేడాది ఆగస్టు 6న జీవో 285ని జారీ చేశారు. దానిని రద్దు చేయాలని కోరుతూ ఏపీ పశు సంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ పాముల సత్యకుమారి, ఆ శాఖలోని వివిధ సంఘాల అధ్యక్షులు సీహెచ్‌ఎస్ కృష్ణారావు, కె.సత్యనారాయణ, టి.జయప్రకాశ్ హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. దామోదరనాయుడి నియామకాన్ని తప్పుపడుతూ గత నెల 29న తీర్పిచ్చారు. ఈ తీర్పుపై దామోదరనాయుడు దాఖలు చేసిన అప్పీళ్లు సోమవారం ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల ప్రచురణకు రంగం సిద్ధం

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల కోసం సీనియార్టీ జాబితాలను జిల్లాల వారీగా వెబ్‌సైట్‌లో ప్రచురించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో పొందుపరిచిన వివరాల ఆధారంగా సీనియార్టీ జాబితాలను ఉపాధ్యాయులకు అందుబాటులోకి తేనున్నారు. ఈ వివరాలను లీప్ యాప్‌లోనూ పొందుపరిచారు. వీటిపై ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిశీలించేందుకు ఉమ్మడి జిల్లా స్థాయి విద్యాధికారి ఛైర్మన్‌గా ఐదుగురు అధికారులతో గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. దీంతో పాటు సబ్జెక్టుల వారీగా అభ్యంతరాలను పరిశీలించేందుకు డిప్యూటీ ఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ నియమించారు. ఈ కమిటీలు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయి. ఈనెల 25, మార్చి 5, 15 తేదీల్లో కలిపి మొత్తం మూడు సార్లు తాత్కాలిక సీనియార్టీ జాబితాలు ప్రకటిస్తారు. అభ్యంతరాలు పరిశీలించాక మార్చి 30న తుది జాబితాను ప్రకటించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఆ తర్వాత ఎలాంటి మార్పులూ ఉండవని స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లాల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను పూర్తిచేయాలని డీఈవోలు, ఆర్జేడీలకు సూచించింది.

ఆర్ఐడీఎఫ్ కింద చేసిన పనులకు రూ.100 కోట్లు

ఈనాడు-అమరావతి: రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఆర్ఐడీఎఫ్) కింద చేసిన రహదారుల పనుల కోసం రూ.100 కోట్లకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీచేసింది. దీనివల్ల ఈ పనులు చేసిన గుత్తేదార్లు బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు అవకాశం కలుగుతుంది.

దేవాదాయశాఖలో జేసీ ఎస్టేట్స్‌గా రత్నరాజు

ఈనాడు-అమరావతి: దేవాదాయశాఖలో ఇటీవల ఉప కమిషనర్ నుంచి సంయుక్త కమిషనర్ (జేసీ)గా పదోన్నతి పొందిన ఎం.రత్నరాజుకు కమిషనరేట్‌లో ఎస్టేట్స్ విభాగం జేసీగా పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీచేసింది. ప్రస్తుతం ఆ పోస్టులో అదనపు బాధ్యతలు చూస్తున్న ప్రాంతీయ సంయుక్త కమిషనర్ (తిరుపతి) చంద్రశేఖర్ ఆజాద్‌ను రిలీవ్ చేశారు.

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో దంపతులు పాల్గొనే అవకాశం

ఆలయ ఈవో భవానీ శంకర్

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వారం రోజులు నిర్వహించే అలంకార సేవలు, వాహనోత్సవాల్లో దంపతులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు ఈవో భవానీశంకర్ ప్రకటించారు. రూ.20 వేలు చెల్లించిన దంపతులకు ఈ నెల 20 నుంచి 26 వరకు జరిగే బ్రహ్మోత్సవ సంబరాల్లో పాల్గొనడంతోపాటు అంతరాలయ ప్రవేశం స్వయంభువుల దర్శనం కల్పిస్తామని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 18 నుంచి 28 వరకు నిత్య కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, అలంకార జోడు సేవల నిర్వహణను నిలిపివేస్తున్నట్లు దేవస్థానం ఈవో తెలిపారు.

ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

- ప్రజలకు సులభంగా చేరడంపై అధ్యయనానికి కమిటీ
- పాలనలో ప్రక్రియలు, నిబంధనల సరళీకరణ
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ సేవలు అత్యంత సులభంగా ప్రజలకు చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దీనిపై అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ఆదేశించారు. పాలనలో వివిధ ప్రక్రియల్ని, నిబంధనల్ని మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ఉండవల్లి నివాసంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ఆయన సమీక్షించారు. 'టెక్నాలజీ అనుసంధానంతోనే సుపరిపాలన సాధ్యం. ఆటోమేషన్ దిశగా అడుగులు వేయాలి. దీనికి ప్రతి ప్రభుత్వ శాఖ సన్నద్ధం కావాలి. సులువుగా పౌర సేవల్ని అందించాలి. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా చెల్లింపులు, ఇతర ప్రభుత్వ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కోకూడదు. ప్రజల్లో డిజిటల్ లిటరసీ పెంచేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వంలోని 8.20 లక్షలమంది ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణ సామర్థ్యాన్ని మరింత మెరుగు పరుచుకునేలా వివిధ కోర్సుల్లో శిక్షణ తీసుకోవాలి. వారికి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలి' అని సూచించారు. బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఆర్టీజీఎస్ కేంద్రంలో ఇచ్చిన ప్రజంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని ఆయన అధికారులను అభినందించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏపీఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టులపై ప్రజంటేషన్లు బిల్ గేట్స్‌ను కూడా ఆకట్టుకున్నాయని వెల్లడించారు.

అన్నింటా అత్యుత్తమ ప్రమాణాలుండాలి..

వివిధ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల్లో అమలవుతున్న అత్యుత్తమ విధానాల్ని గుర్తించి వాటిని అన్నింటా అనుసరించేలా చూడాలని అధికారులకు సీఎం సూచించారు. తద్వారా ప్రజల నుంచి మంచి అభిప్రాయం వ్యక్తం అవుతుందన్నారు. 'అన్న క్యాంటీన్లలో వడ్డించే ఆహారం మరింత రుచికరంగా ఉండేలా చూడాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపడాలి. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక బెస్ట్ హాస్టల్‌ను మోడల్‌గా తీసుకుని మిగిలిన వాటిలోనూ అవే ప్రమాణాలు పాటించేలా చూడాలి' అని సూచించారు.

విజిబుల్ పోలీసింగ్ అత్యంత కీలకం

'మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో విజిబుల్ పోలీసింగ్ అత్యంత కీలకం. నేరాల రేటును తగ్గించే అంశంలో పోలీసు విభాగం పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించాలి. గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం చేపడుతున్న చర్యల్ని ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా ప్రజలకు వివరించాలి' అని హోంశాఖ అధికారుల్ని ఆదేశించారు.

- ◆ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించటంతో పాటు కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలి.
- ◆ వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఇప్పటి నుంచే ముందస్తు కార్యాచరణ చేపట్టాలి.
- ◆ వివిధ ప్రభుత్వ శాఖలు డ్రోన్ వినియోగాన్ని పెంచి పౌరసేవలను మరింత సరళతరం చేయాలి.
- ◆ ఈ సమీక్షకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

స్థానిక భాషలకు ప్రాధాన్యం ఇవ్వాలి: రొమానా క్రోపిలోవా

ఈనాడు, అమరావతి: మధ్య ఆదాయ దేశాల్లో విద్యలో తీసుకొచ్చిన కొన్ని ఏఐ సాధనాలు విఫలమవుతున్నాయని ఫ్యాబ్ ఏఐ ఎడ్యుటెక్ డైరెక్టర్ రొమానా క్రోపిలోవా తెలిపారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంప్యాక్ట్ సమ్మిట్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ.. "గత రెండేళ్లల్లో 10వేల యాప్‌ల వరకు వచ్చాయి. ప్రాథమిక పెడగాగి పరీక్షల్లో 70% వరకు విఫలమవుతున్నాయి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉండడం లేదు. కొన్ని ఏఐ టూల్స్ సాధారణ కంటెంట్‌ను మాత్రమే అందిస్తున్నాయి. ఫ్యాబ్ ఏఐలో వందల ఏఐ యాప్‌లను మదింపు చేశాం. ఏఐ టూల్స్ బహుభాషలకు అనుకూలంగా ఉండాలి. భారత్‌లో అనేక భాషలు ఉన్నాయి. ఆంగ్ల భాషకు అనుకూలంగా ఉన్న ఏఐ ట్యూటర్ గ్రామీణ విద్యార్థుల్లో 60% మందికి ఉపయోగపడడం లేదు. మేము స్థానిక భాషల మధ్య సులభంగా తర్జుమా జరిగేలా మోడల్స్‌ను రూపొందించాం. ఇన్నోవేషన్ ల్యాబ్‌లు ఉండాలి. కానీ, తరగతి గదే ప్రధానమైన అభ్యసన కేంద్రం" అని తెలిపారు.

బడిపిల్లల సురక్షిత ప్రయాణానికి 'రెడ్‌లైన్'

ఏఐని ఉపయోగించుకుంటూ టైమ్ ఆధారిత రక్షిత జోన్ల విధానాన్ని అమలుచేసే 'రెడ్‌లైన్' ప్రాజెక్టుపై దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో నోరా అనే విద్యార్థి ప్రజంటేషన్ ఇచ్చారు. ఇది రహదారులపై రద్దీని అంచనా వేస్తూ 30 నిమిషాల ముందే తల్లిదండ్రుల్ని అప్రమత్తం చేస్తుంది. 'దిల్లీలో డైనమిక్ ట్రాఫిక్ సిగ్నల్, టైమింగ్, ఐఓటీ సెన్సర్లు, జీపీఎస్ ఇంటిగ్రేషన్‌తో పని చేస్తుంది. దీని ద్వారా పిల్లల్ని త్వరగా పాఠశాలలకు తీసుకెళ్లవచ్చు. ట్రాఫిక్ రద్దీ 60% తగ్గించవచ్చు. అత్యవసర వాహనాలు 2.5 రెట్లు వేగంతో పాఠశాలలకు చేరుకోవచ్చు. వాహనాల నుంచి వెలువడే శబ్ద కాలుష్యాన్ని 40% తగ్గించవచ్చు. పిల్లలు భయం లేకుండా పాఠశాలలకు వెళ్లొచ్చు. ఈ విధానంపై తల్లిదండ్రుల నుంచి 85% సంతృప్తి వ్యక్తమైంద'ని నోరా వివరించారు. 'రెడ్‌లైన్.. ట్రాఫిక్ ఆపద, ప్రమాదాల్ని నివారిస్తుంది' అని చెప్పారు.

ప్రజావ్యతిరేక చట్టాలకు నిరసనగా మార్చి 24న దిల్లీలో ధర్నా

- సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఎ.బేబీ. చిత్రంలో జాన్‌వెస్లీ, బీవీ రాఘవులు

ఈనాడు, హైదరాబాద్: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ దిల్లీలోని రాంలీలా మైదానంలో మార్చి 24న ధర్నా చేపడుతున్నట్లు సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ప్రకటించారు. అమెరికాతో ఇటీవల మోదీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం దేశానికే ప్రమాదకరమన్నారు. హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "అమెరికాతో ఒప్పందం ప్రభావం వ్యవసాయం తదితర రంగాలపై పడుతుంది. ఏ దేశం నుంచి చమురు దిగుమతి చేసుకోవాలనే విషయాన్ని భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయించడం ఏమిటి? మోదీ ప్రభుత్వ విధానాలు దేశానికి నష్టదాయకం. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిని 125 రోజులకు పెంచుతామని మోదీ ప్రకటించడం మోసం. ఈ పనిదినాలు కల్పించాలంటే రూ.3 లక్షల కోట్లు అవసరం. బడ్జెట్‌లో మామూలు కేటాయింపులే జరిగాయి. ఈ పథకానికి కేటాయించే నిధుల్లో 0% రాష్ట్రాలే భరించాలని చెప్పడం దారుణం. విద్యుత్ సవరణ చట్టంతో వ్యవసాయానికి, పేద వినియోగదారులకు, ఆసుపత్రులకు, విద్యాలయాలకు సబ్సిడీ సౌకర్యం పోనుంది. విశ్వవిద్యాలయాల బిల్లు కూడా ప్రమాదమే. కర్ణాటక, తెలంగాణల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు 'లేబర్‌కోడ్' అమలు నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలి. 'ఎస్ఐఆర్' పేరుతో పశ్చిమబెంగాల్‌లో పెద్దఎత్తున ఓట్లను తొలగించారు. భాజపాకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ కొమ్ము కాస్తున్నారు" అని ఎం.ఎ.బేబీ ఆరోపించారు.

విష ప్రయోగంతో 26 వలస పక్షుల మృతి

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: తెలంగాణలోని కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు చెరువు వద్ద... 26 వలస పక్షులు వేటగాళ్ల విషపు ఎరకు బలయ్యాయి. బాధ్యులైన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌కు చెందిన ప్రకాశ్ సర్కార్, కుశాల్ మండల్, తుషార్‌దేయ్, తరఫ్దార్ సంజిత్‌లు పెంచికల్‌పేట్ మండలంలోని లోడ్పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు వచ్చారు. ఈ నెల 13న వీరు ఎల్లూరు చెరువు వద్ద వడ్ల గింజల్లో పురుగుమందు కలిపి తామర ఆకులపై ఉంచారు. వాటిని తిన్న పక్షులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. వాటిని వండుకుని తినడానికి, అమ్మడానికి సంచుల్లో నింపారు. 14న సమాచారం అందుకున్న బీట్ అధికారి సతీశ్ వారిని పట్టుకున్నారు. వారివద్ద 19 నార్తర్న్ పిన్‌టైల్స్, ఏడు గ్రే-హెడెడ్ స్వాంప్‌హెన్ పక్షుల కళేబరాలను స్వాధీనం చేసుకున్నారు. వెటర్నరీ వైద్యుల సమక్షంలో వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించిందని ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ సీఈవోగా గీతాంజలి శర్మ

ఈనాడు, అమరావతి: ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ సీఈవోగా గీతాంజలి శర్మకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఎండీగా వ్యవహరిస్తున్నారు. డ్రోన్ కార్పొరేషన్ సీఈవోగా ఉన్న సూర్యమాన్ పటేల్ అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.

'సీఐఐ-ఐజీబీసీ' జాతీయ ఛైర్మన్‌గా సి.శేఖర్‌రెడ్డి



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)-ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) జాతీయ ఛైర్మన్‌గా సీఎస్ఆర్ ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సి.శేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. ప్రస్తుతం ఐజీబీసీ వైస్ ఛైర్మన్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. వైస్ ఛైర్మన్‌గా గ్లాస్ బిజినెస్, సెయింట్ గోబైన్ ఇండియా ఎండీ ఏఆర్ ఉన్నికృష్ణన్ నియమితులయ్యారు. ప్రస్తుత ఛైర్మన్ బి.త్యాగరాజన్ పదవీకాలం ముగియనుండటంతో ఏప్రిల్ 1 నుంచి వీరిద్దరూ కొత్త బాధ్యతలు స్వీకరిస్తారని సోమవారం ఓ ప్రకటనలో కౌన్సిల్ వెల్లడించింది. దేశాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ విడదీయలేని భాగమని, భవిష్యత్తులో హరిత భవన నిర్మాణాలను మరింత ప్రోత్సహించడమే తమ లక్ష్యమని శేఖర్‌రెడ్డి తెలిపారు. 2001లో ప్రారంభమైన ఐజీబీసీ... దేశంలో స్థిరమైన నిర్మాణ రంగ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 18,850కి పైగా ప్రాజెక్టులు ఐజీబీసీ కింద నమోదయ్యాయని కౌన్సిల్ పేర్కొంది.

బీసీ సింహ గర్జనకు అనుమతిచ్చేలా ఆదేశించండి

హైకోర్టులో రామచంద్రయాదవ్ పిటిషన్

ఈనాడు, అమరావతి: బీసీ సింహ గర్జన పేరుతో ఈ నెల 22న ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగా నిర్వహించతలపెట్టిన బహిరంగ సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ హైకోర్టులో సోమవారం వ్యాజ్యం వేశారు. సభ నిర్వహణకు అనుమతి కోరుతూ వినతులు ఇచ్చినా పోలీసులు స్పందించలేదని పేర్కొన్నారు.



వైభవంగా మల్లన్న 'పెద్ద పట్నం'

తెలంగాణలోని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున 'పెద్ద పట్నం' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. లింగోద్భవ కాలంలో గర్భగుడిలో స్వామికి అభిషేకం, పూజల అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఆవరణలో పంచ రంగుల ముగ్గు పొడితో పట్నం వేశారు. మొదట ఉత్సవ విగ్రహాలతో అర్చకులు పట్నం దాటగా.. తర్వాత భక్తులు పూనకాలతో ఊగుతూ దాటారు. అనంతరం ముగ్గు పొడిని సేకరించుకున్నారు. కార్యక్రమంలో సుమారు 40 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారని కార్యనిర్వాహణ అధికారి వెంకటేశ్, ప్రధాన అర్చకుడు మల్లికార్జున్ తెలిపారు. - న్యూస్‌టుడే, చేర్యాల